

'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17

సంచిక: 303

శుక్రవారం 24-1-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆస్కార్ సంబరం ఆరంభం

13 నామినేషన్లతో నాన్ ఇంగ్లిష్ మూవీ 'ఎమిలియా పెరెజ్' రికార్డ్

-సినిమాలో




సబలెంకా X కీస్

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ

– స్పోర్ట్స్‌లో


SAMSUNG
Now Brief
Get today's highlight
Galaxy S25 Series
Galaxy AI


'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద
గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 303

శుక్రవారం 24-1-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కంటిపాపలకు కనురెప్పలా..
నేడు జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు -10లో



మెరిసిన త్రిష, షబ్నమ్
అండర్–19 టి20 మహిళల ప్రపంచకప్ టోర్నీలో శ్రీలంకపై భారత్ గెలుపు -11లో




లాస్‌ఏంజెలెస్‌లో మళ్లీ కార్చిచ్చు
అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో మళ్లీ కార్చిచ్చు అంటుకుంది. 10 వేల ఎకరాల్లోని అటవీ ప్రాంతం బూడిద అయ్యింది.
వివరాలు 6లో ▸



రెండు సెషన్లూ క్లిష్టంగానే..!
జేఈఈ మెయిన్ రెండో రోజు రెండు సెషన్ల పరీక్షలూ మొదటి రోజుతో పోలిస్తే క్లిష్టంగా ఉన్నాయని సబ్జెక్ట్ నిపుణులు తెలిపారు.
వివరాలు 2లో ▸



స్వలింగ వివాహాలకు చట్టబద్ధత
థాయ్‌లాండ్‌లో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించే చట్టం అమల్లోకి రావడంతో తొలిరోజే వందలాది జంటలు ఒక్కటయ్యాయి.
వివరాలు 6లో ▸



చట్టసభలో ట్రంప్ తొలి విజయం
అక్రమంగా ప్రవేశించి, నేరాలకు పాల్పడిన వలసదారులను బహిష్కరించే బిల్లును అమెరికా దిగువ సభ ఆమోదించింది.
వివరాలు 6లో ▸

దారి ఖర్చులు దండగ!

ఒక్క రూపాయి ఒప్పందాలు లేకుండానే ఒట్టి చేతులతో వెనక్కి

చంద్రబాబు బృందం దావోస్ పర్యటన దారుణంగా విఫలం

- రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల విముఖత
- 'ఎంఓయూ'లకు ఏ ఒక్కరూ ముందుకు రాని వైనం
- ప్రసంగాలు, ప్రెస్‌మీట్‌లు, స్వీయ గొప్పలకే బాబు పరిమితం
- మహారాష్ట్రకు రూ.16 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల వరద
- 2022లో దావోస్‌లో రూ.1.26 లక్షల కోట్లతో వైఎస్ జగన్ పెట్టుబడుల ఒప్పందాలు



సాక్షి, అమరావతి:

దాదాపు ఆరు నెలల ముందే దావోస్ పర్యటనపై హడావుడి.. విమానం దిగకముందే జాతీయ మీడియాలో పబ్లిసిటీ.. వరుస భేటీలు..
తన పుట్టిన రోజును కూడా పట్టించుకోకుండా ఎముకలు కొరికే చలిలో 'చినబాబు పాదయాత్ర'!
అప్పుడు ఐటీ ఇప్పుడు ఏఐ.. బిల్‌గేట్స్‌తో బాబు ఫొటోలంటూ ప్రచారం.. !!

ఇవన్నీ చూస్తే సీఎం చంద్రబాబు బృందం విదేశాల నుంచి రూ.లక్షల కోట్ల పెట్టుబడులను రప్పించిందనుకుంటారు! కనీసం కీలక ఒప్పందాలైనా కుదిరాయనుకుంటారు!! కానీ దావోస్ పర్యటనకు రూ.80 కోట్లకు పైగా ప్రజాధనాన్ని వెచ్చించిన సీఎం చంద్రబాబు ఒక్క రూపాయి ఒప్పందాలు లేకుండానే ఒట్టి చేతులతో వెనుదిరిగారు. పారిశ్రామికవేత్తలను మెప్పించలేక

మిగతా 2వ పేజీలో ▶

ముగిసిన సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన 2లో

పోలవరానికి ఉరేసి..

బనకచర్లకు గోదారెలా?

గోదావరి–బనకచర్ల అనుసంధానంపై కేంద్రానికి రాష్ట్రం పంపిన నివేదికపై నిపుణుల విస్మయం

- పోలవరం ప్రాజెక్టులో 42 మీటర్ల నుంచి బనకచర్లకు నీటిని తరలించేలా ప్రతిపాదన
- కానీ.. ప్రాజెక్టులో నీటి మట్టం 41.15 మీటర్లకే అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆ స్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఆయకట్టుకే నీళ్లందవంటున్న నిపుణులు
- ఇక బనకచర్లకు జలాల తరలింపు అసాధ్యమని స్పష్టీకరణ
- 45.72 మీటర్లలో నీటిని నిల్వ చేస్తేనే వరదను గరిష్ఠంగా ఒడిసిపట్టే అవకాశం



సాక్షి, అమరావతి: గోదావరి ట్రిబ్యునల్ పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో 194.6 టీఎంసీలు నిల్వ చేసేలా నిర్మించుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఆ మేరకే ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేసేలా 55 మీటర్ల ఎత్తుతో స్పిల్ వేను 2021 జూన్ 11 నాటికే ప్రభుత్వం పూర్తి చేసింది. కానీ.. కేంద్ర కేబినెట్ గతేడాది ఆగస్టులో 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటి నిల్వకు ఆమోదం తెలిపింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించలేదు. అంటే.. 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేందుకు

మిగతా 2వ పేజీలో ▶



36% పెరిగిన ఫీజు

▶ ఎవరెస్ట్ అధిరోహకులకు షాక్

రూ. 13 లక్షలు
హిమాలయ శిఖరాన్ని దక్షిణం దిశ నుంచి మార్చి– మే మధ్య అధిరోహించాలనుకునే విదేశీయులు చెల్లించాల్సిన ఫీజు

రూ.6.48 లక్షలు
సెప్టెంబర్–నవంబర్ (శరదృతువు) మధ్య అధిరోహించాలంటే చెల్లించాల్సి మొత్తం

రూ.3.24 లక్షలు
డిసెంబర్–ఫిబ్రవరి (శీతాకాలం) మధ్య, జూన్–ఆగస్టు సీజన్లలో అధిరోహించాలనుకునే వారికి నిర్ణయించిన ఫీజు

రూ.1.50 లక్షలు
నేపాలీ అధిరోహకులకు నిర్ణయించిన మొత్తం

వివరాలు 6లో



ట్రంప్ దెబ్బకు మనోళ్లకు కడుపు'కోత'!

డెడ్‌లైన్ డెలి'వరీ'లు

జన్మతః పౌరసత్వం రద్దయ్యే ఫిబ్రవరి 20లోపు పిల్లల్ని కనాలని ఆరాటం

➤ అమెరికాలో.. ఏడో నెల గర్భిణి అయిన ఓ భారతీయ మహిళ ముందస్తు ప్రసవం కోసం సిజేరియన్ ఆపరేషన్ చేయాలంటూ వైద్యుడిని సంప్రదించింది. వాస్తవానికి ఆమె మార్చి నెలలో ప్రసవించాల్సి ఉంది.

అమెరికాలో జన్మతః పౌరసత్వ హక్కును రద్దుచేస్తూ ట్రంప్ చేసిన ప్రకటనతో ఈ పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి 20న ఈ ఉత్తర్వు అమల్లోకి రానుంది.

పౌరసత్వం ఉత్తర్వుకు కోర్టులో చుక్కెదురు
అమలు తాత్కాలిక నిలుపుదల

వివరాలు 6లో

ఇదంజగత్





నేతాజీని స్ఫూర్తిగా తీసుకోండి
విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన 6లో

ఢిల్లీలోని పార్లమెంట్ పాత భవనంలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

మెడికల్ కలపై కత్తి!

2025–26లో కొత్త కాలేజీల కోసం ఎన్‌ఎంసీకి దరఖాస్తు చేయడం లేదని కూటమి సర్కారు వెల్లడి

- నూతన కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు సన్నద్ధం
- ఇప్పటికే 700 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయిన విద్యార్థులు
- ఈసారైనా కొత్త కాలేజీలు వస్తాయనే ఆశతో లాంగ్‌టర్మ్ శిక్షణతో సిద్ధం
- రెండేళ్లలో ఏకంగా 2,450 సీట్లు నష్టపోతున్న వైనం



8లో

కొత్త వైద్య కళాశాలల సేఫ్ క్లోజ్‌కు కమిటీ

- పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు కొత్త వైద్య కళాశాలలు
- నిలిపేసిన నిర్మాణాల పరిరక్షణకు కమిటీ నియామకం
- పార్వతీపురం వైద్య కళాశాల టెండర్లు రద్దు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

8లో

కష్టం.. అయినా 'సాగు' ఇష్టం!




- గ్రామాల్లో పెరుగుతున్న వ్యవసాయ కుటుంబాలు
- ఏపీ సహా వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయంపై పెరుగుతున్న మక్కువ
- 2016–17తో పోల్చితే 2021–22లో దేశంలో 9 శాతం పెరుగుదల
- రాష్ట్రంలో 19 శాతం కుటుంబాల పెరుగుదల.. గోవా, కేరళలలో అత్యల్పంగా వ్యవసాయ కుటుంబాలు 18 శాతమే
- నాబార్డు రూరల్ ఫైనాన్షియల్ సర్వే వెల్లడి

2లో



సౌర శక్తిని సద్వినియోగం చేసుకుని.. ప్రతి ఒక్కరూ తమకుతాముగా విద్యుదుత్పత్తి చేసుకునేలా కేంద్రం ప్రారంభించిన పథకమే పీఎం సూర్య ఘర్. రూ.75,021 కోట్లతో దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లల్లో సౌర విద్యుత్ వెలుగులు నిలపాలన్నది ఈ పథక లక్ష్యం. ఇప్పటివరకు అత్యధిక సోలర్ ప్యానళ్ల ఏర్పాటుచేసిన రాష్ట్రం గుజరాత్.



కష్టం.. అయినా 'సాగు' ఇష్టం!

- 2016–17తో పోల్చితే 2021–22లో దేశంలో వ్యవసాయ కుటుంబాలు 9 శాతం పెరుగుదల
- రాష్ట్రంలో 19 శాతం కుటుంబాల పెరుగుదల



సాక్షి, అమరావతి: దేశంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలు పెరుగుతున్నాయి. కరువు, వరదలు వంటి వాతావరణ ప్రతికూలతలు జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నప్పటికీ గ్రామాల్లో అత్యధిక కుటుంబాలకు వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా కొనసాగుతోంది. 2016–17 సంవత్సరంలో నిర్వహించిన నాబార్డు రూరల్ ఫైనాన్సియల్ సర్వే ప్రకారం దేశంలో వ్యవపసాయ కుటుంబాలు 48 శాతం ఉండగా, 2021–22లో అది 57 శాతానికి పెరిగింది. అంటే దేశం మొత్తం మీద వ్యవసాయ కుటుంబాలు 9 శాతం మేర పెరిగినట్లు సర్వే స్పష్టం చేసింది. ఏపీతో సహా 20 రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. 2016–17లో నిర్వహించిన సర్వేలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కుటుంబాలు 34 శాతం ఉంటే, 2021–22లో 53 శాతానికి పెరిగాయి. అంటే రాష్ట్రంలో వ్యవసాయ కుటుంబాలు 19 శాతం మేర పెరిగినట్లు స్పష్టం అవుతోంది. కేరళ, గోవా రాష్ట్రాల్లో అత్యధిక కుటుంబాలు వ్యవసాయేతర కార్యకలాపాలపై ఆధారపడి జీవిస్తున్నట్లు సర్వే పేర్కొంది. కేరళ, గోవా రాష్ట్రాల్లో అత్యధికంగా 82 శాతం వ్యవసాయేతర కుటుంబాలే ఉన్నాయి. కేవలం 18 శాతం కుటుంబాలే ఈ రెండు రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాలున్నట్లు సర్వే వెల్లడించింది.

దేశంలోనూ, వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర కుటుంబాల శాతం ఇలా...

రాష్ట్రం	వ్యవసాయ కుటుంబాల శాతం	వ్యవసాయేతర కుటుంబాల శాతం
ఇండియా	57	43
ఆంధ్రప్రదేశ్	53	47
అరుణాచల్‌ప్రదేశ్	51	49
అసోం	67	33
బిహార్	45	55
ఛత్తీస్‌గఢ్	66	34
గోవా	18	82
గుజరాత్	54	46
హరియాణ	58	42
హిమాచల్‌ప్రదేశ్	63	37
జమ్మూ-కాశ్మీర్(యూటీ)	73	27
జార్ఖండ్	69	31
కర్ణాటక	55	45
కేరళ	18	82
లడక్ (యూటీ)	75	25
మధ్యప్రదేశ్	64	36
మహారాష్ట్ర	59	41
మణిపూర్	26	74
మేఘాలయ	48	52
మిజోరాం	35	65
నాగాలాండ్	67	33
ఒడిశా	60	40
పంజాబ్	36	64
రాజస్థాన్	66	34
సిక్కిం	43	57
తమిళనాడు	57	43
తెలంగాణ	55	45
త్రిపుర	40	60
ఉత్తరప్రదేశ్	66	34
పశ్చిమ బెంగాల్	49	51

క్లుప్తంగా...

నేతాజీ పోరాటం నేటి యువతకు ఆదర్శనీయం
వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. 'భారతదేశ స్వాతంత్య్రం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శనీయం. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి భారతీయుల్లో పోరాట స్ఫూర్తిని నింపిన యోధుడు ఆయన. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా నివాళులు' అంటూ వైఎస్ జగన్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేశారు.

నేతాజీకి సీఎస్, సీఎంవో అధికారుల నివాళి



నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని గురువారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఎం ముఖ్య కార్యదర్శి ఎం.రవిచంద్ర, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, సీఎం కార్యదర్శులు ఏవీ రాజమౌళి, ప్రద్యుమ్న తదితరులు నివాళులు అర్పించారు.


వెబ్‌సైట్‌లో డీపీఆర్వో పరీక్ష ఫలితాలు

సాక్షి, అమరావతి: ఏపీ సమాచార శాఖలోని జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల ఫలితాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను ఈ నెల 30న పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www. psc. ap. gov. inలో చూడవచ్చు.

6న కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వచ్చే నెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి తీసుకెళ్లాల్సిన ప్రతిపాదనలను 4వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా సాధారణ పరిపాలన శాఖ(కేబినెట్ విభాగం)కు పంపించాలని అన్ని శాఖలను సీఎస్ ఆదేశించారు. కాగా, రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కలెక్టర్ల సదస్సు తేదీతోపాటు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఎప్పటి నుంచి నిర్వహించాలనే అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి.

నేడు సచివాలయంలో ఓటర్ల దినోత్సవం



సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా వెల్లడించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం అయిన శనివారం రాష్ట్ర సచివాలయానికి సెలవు కావడంతో ముందుగానే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పోలవరానికి ఉరేసి.. బనకచర్లకు గోదారెలా?

In accordance with the decisions taken in the meeting of the Cabinet held on 28.08.2024, the undersigned is directed to convey the approval for revised cost of the Polavaram Irrigation Project (PIP) for completion of project with water storage up to EL +41.15 metres i.e. Minimum Draw Down level (MDDL).

41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం రాసిన లేఖ

b. To Provide 38000 Cusecs discharge at the start point of Right main canal with an FSL around +42.0 m.

పోలవరం ప్రాజెక్టులో 42 మీటర్ల ఎత్తు నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలిస్తామంటూ కేంద్ర జల్ శక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదన



గోదావరి-బనకచర్ల అనుసంధానం మూడో దశలో బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌లోకి గోదావరి జలాల తరలించే మార్గం

▶ మొదటి పేజీ తరువాయి

అంగీకరించిందన్న మాట. అయితే.. ప్రాజెక్టులో 42 మీటర్ల స్థాయి నుంచి గోదావరి జలాలను బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించేలా గోదావరి–బనకచర్ల అనుసంధానం చేపడతామని కేంద్ర జల్ శక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపింది. ఇదెలా సాధ్యమని నీటిపారుదల రంగ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో 41.15 మీటర్ల వరకే నీటిని నిల్వ చేస్తే.. 42 మీటర్ల నుంచి జలాలను తరలించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టులో 45.72 మీటర్ల ఎత్తు వరకూ నీటిని నిల్వ చేయగలిగితేనే.. జలాలను గరిష్ఠంగా ఒడిసిపట్టి, ఇటు గోదావరి–బనకచర్ల, అటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయవచ్చునని చెబుతున్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించి, జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు ఉరేసి జీవం తీసి.. బనకచర్లకు తరలిస్తామనడం చూస్తే ఆ అనుసంధానంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి లేదని అర్థం చేసుకోవచ్చని నిపుణులు దెప్పిపొడుస్తున్నారు.

కుడి కాలువ ఆయకట్టు, కృష్ణా డెల్టాకే చాలవు..

పోలవరం ప్రాజెక్టు కనీస నీటి మట్టం 41.15 మీటర్లు. ఆ స్థాయిలో 119.4 టీఎంసీలనే నిల్వ చేయవచ్చు. పోలవరం కుడి కాలువకు 35.5 మీటర్ల నుంచి 40.23 మీటర్ల వరకూ నీటిని తరలించవచ్చు. ప్రాజెక్టులో 41.15 మీటర్ల వరకే నీటిని నిల్వ చేస్తే.. కుడి కాలువ కింద 3 లక్షల ఎకరాలు, కృష్ణా డెల్టాలో 13.08 లక్షల ఎకరాలకు నీళ్లందించడానికే సరిపోవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇక ప్రాజెక్టులో 42 మీటర్ల ఎత్తులో నీటిని ఎలా నిల్వ చేస్తారని, బనకచర్లకు నీటి తరలింపు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.

బనకచర్లకు గోదావరి ఇలా..

గోదావరి నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీలను కృష్ణా నది, నాగార్జునసాగర్ కుడి కాలువ, కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్, నల్లమల అభయారణ్యంలో 26.8 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలిస్తామని కేంద్ర జల్ శక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. తద్వారా 80 లక్షల మందికి తాగునీరు, కొత్తగా 3 లక్షల హెక్టార్లకు సాగునీటిని అందిస్తామని, నాగార్జున సాగర్ కుడి కాలువ, వెలిగొండ, ఎస్సార్బీసీ, తెలుగుగంగ, గాలేరు–నగరి, కేసీ కెనాల్ కింద 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు 20 టీఎంసీలను పారిశ్రామిక అవసరాల కోసం సరఫరా చేస్తామని తెలిపింది. ఈ ప్రాజెక్టుకు ప్రాథమికంగా రూ.80,112 కోట్ల వ్యయం అవుతుందని, ఇంట్రా స్టేట్ లింక్ (రాష్ట్ర పరిధిలో అనుసంధానం) ప్రాజెక్టు కింద నిధులివ్వాలని కోరింది. ఆ నివేదికలో పేర్కొన్న మేరకు గోదావరి–బనకచర్ల అనుసంధానం ఇలా..

తొలి దశ

- పోలవరం ప్రాజెక్టులో 42 మీటర్ల ఎత్తు నుంచి రోజుకు 38 వేల క్యూసెక్కులు తరలిస్తారు. ఇందుకు వీలుగా శ్యాడిల్ డ్యాం, ఎఫ్–శ్యాడిల్ డ్యాం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచుతారు. కుడి కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 38 వేల క్యూసెక్కులకు పెంచుతారు.
- తాడిపూడి ఎత్తిపోతల సామర్థ్యం 1,400 నుంచి 10 వేల క్యూసెక్కులకు పెంచుతారు. తాడిపూడి కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచి, 178 కిలోమీటర్ల వరకూ పొడగిస్తారు. ఇందులో 5 వేల క్యూసెక్కులను ఆయకట్టుకు, మిగతా 5 వేల క్యూసెక్కులను భలేరావు చెరువులోకి తరలిస్తారు.
- బుడమేరు డైవర్షన్ ఛానల్ ద్వారా నీటి తరలింపులో సమస్యలను నివారించడానికి బుడమేరులో పులివాగు కలిసే ప్రాంతం నుంచి కొత్తగా మళ్లింపు కాలువ తవ్వి కృష్ణా నదిలోకి తరలిస్తారు.
- తొలి దశ పనులకు 560 హెక్టార్ల ప్రైవేటు, 32 హెక్టార్ల అటవీ భూమి సేకరించాలి. ఈ పనులకు రూ.13,511 కోట్లు వ్యయం అవుతుంది.

రెండో దశ

- కృష్ణా నదిలో 12.5 మీటర్లు (సముద్ర మట్టానికి) ఎత్తు నుంచి 144.5 మీటర్ల ఎత్తుకు ఐదు దశల్లో రోజూ 2 టీఎంసీలను లిఫ్ట్ చేసి.. నాగార్జున సాగర్ కుడి కాలువలో 80వ కిలోమీటర్ వద్ద కలుపుతారు. ఈ కాలువను 80 కిలోమీటర్ల నుంచి 96.5 కిలోమీటర్ల వరకూ సామర్థ్యాన్ని పెంచి గోదావరి జలాలను తరలిస్తారు.
- సాగర్ కుడి కాలువలో 96.5 కిలోమీటర్ల ప్రాంతం నుంచి జలాలను 142 మీటర్ల నుంచి 221 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్ చేసి, పల్నాడులో బొల్లాపల్లి వద్ద కొండల్లో నిర్మించే రిజర్వాయర్‌లోకి తరలిస్తారు. ఆ రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తే 150 టీఎంసీల నుంచి 400 టీఎంసీల వరకూ నిల్వ చేసుకోవచ్చు. ఈ రిజర్వాయర్‌లో ప్రస్తుతానికి 150 టీఎంసీలు నిల్వ చేయాలంటే బొల్లాపల్లి మండలంలో 15 గ్రామాలకు పునరావాసం కల్పించాలి.
- రెండో దశ పనులకు 28,560 కోట్లు వ్యయం అవుతుంది.

మూడో దశ

- బొల్లాపల్లి రిజర్వాయర్‌లో 172 మీటర్ల నుంచి మూడు దశల్లో 300.4 మీటర్లకు ఎత్తిపోసి.. నల్లమలలో తవ్వే సొరంగం ద్వారా తరలించి, అక్కడి నుంచి 118.21 కిలోమీటర్ల పొడవున కాలువ ద్వారా బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలిస్తారు. మూడో దశ పనులకు 38,041 కోట్లు వ్యయం అవుతుంది.
- ఈ ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోయడానికి 4,125 మెగావాట్ల విద్యుత్ అవసరం. బొల్లాపల్లి రిజర్వాయర్, కాలువల తవ్వకానికి 40,500 ఎకరాల భూమి సేకరించాలి. ఇందులో 17 వేల ఎకరాలు అటవీ భూమి.

రెండు సెషన్లూ క్లిష్టంగానే..!

- జేఈఈ మెయిన్ రెండోరోజు పరీక్షల్లో కఠిన ప్రశ్నలు
- మ్యాథమెటిక్స్ మొదటిరోజు మాదిరిగానే సుదీర్ఘం, క్లిష్టం
- ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రశ్నలు ఓ మోస్తరు కఠినంగా..
- అన్ని ప్రశ్నలూ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే..

సాక్షి ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ రెండోరోజు గురువారం రెండు సెషన్ల పరీక్షలూ మొదటి రోజుతో పోల్చితే క్లిష్టంగా ఉన్నాయని సబ్జెక్ట్ నిపుణులు తెలిపారు. మొదటిరోజు మాదిరిగానే రెండోరోజు కూడా మ్యాథమెటిక్స్ ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండడంతో అభ్యర్థులకు సమయం సరిపోలేదు. తొలి సెషన్‌లో విద్యార్థులు 55 నుంచి 60 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వగలిగారు. ఫిజిక్స్‌లో కొన్ని సులభంగా, మరికొన్ని ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి. కెమిస్ట్రీలో ప్రశ్నలన్నీ ఓ మోస్తరు క్లిష్టతతో అడిగారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌లో ద్వితీయ సంవత్సరం సిలబస్‌కు ఎక్కువ ప్రాధాన్యం కల్పించారు.

కొన్ని టాపిక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత

రెండు సెషన్లలోనూ.. మూడు సబ్జెక్టుల ప్రశ్నలను పరిశీలిస్తే కొన్ని టాపిక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత కనిపించింది. మ్యాథమెటిక్స్‌లో సిరీస్ (2 ప్రశ్నలు), ఇంటిగ్రెల్ కాలిక్యులస్ (4 ప్రశ్నలు), 3–డి వెక్టార్ అల్జీబ్రా (3 ప్రశ్నలు), కానిక్స్ (3 ప్రశ్నలు)కు ప్రాధాన్యత ఇచ్చారు. సిరీస్, కానిక్స్, పెర్ముటేషన్, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, ఇన్వర్స్ ట్రిగనోమెట్రీ ప్రశ్నలు సులభంగా ఉన్నాయి. అయితే ఈ సబ్జెక్టులో దాదాపు ఏడు ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఎక్కువ సమయం పట్టింది. కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ (9 ప్రశ్నలు), పిరియాడిక్ టేబుల్ (2 ప్రశ్నలు), అటామిక్ స్ట్రక్చర్ (2 ప్రశ్నలు), కెమికల్ బాండింగ్ (2 ప్రశ్నలు)కు ఎక్కువ ప్రాధాన్యత కల్పించారు. ఫిజిక్స్‌లో హీట్ అండ్ థర్మో డైనమిక్స్ (2 ప్రశ్నలు), ఎలక్ట్రిసిటీ (3 ప్రశ్నలు), ఏసీ సర్క్యూట్ (2 ప్రశ్నలు)కు వెయిటేజీ లభించింది.

50% ప్రశ్నలు ఫార్ములా, కాన్సెప్ట్ ఆధారంగానే..

ఫిజిక్స్, కెమిస్ట్రీలలో దాదాపు 50 శాతం ప్రశ్నలు డైరెక్ట్ ఫార్ములా, కాన్సెప్ట్ ఆధారంగా సమాధానం ఇవ్వాల్సినవే ఉన్నాయి. దీంతో సబ్జెక్టును పూర్తిగా చదివిన వారికే సమాధానం ఇచ్చే నేర్పు ఉంటుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. రెండోరోజు కూడా 2021, 2022 జేఈఈ మెయిన్ పేపర్స్ నుంచే ఎక్కువ ప్రశ్నలు అడగడం గమనార్హం. అదే విధంగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే అన్ని ప్రశ్నలు ఉన్నాయని సబ్జెక్ట్ నిపుణులు ఎం ఎన్ రావు తెలిపారు. పరీక్షకు సాధారణ స్థాయిలో ప్రిపరేషన్ సాగించిన విద్యార్థులకు 120 మార్కులు, పూర్తి స్థాయి పట్టు సాధించిన వారికి 270కు పైగా మార్కులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

బెంగళూరు సెంటర్‌లో రీ షెడ్యూల్

ఈ నెల 22న బెంగళూరులోని ఒక పరీక్షా కేంద్రంలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా మొదటి సెషన్ పరీక్ష నిలిచిపోయింది. ఆ సెంటర్‌లోని 114 మంది విద్యార్థులకు ఈ నెల 28 లేదా 29న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది.

ముగిసిన దావోస్ పర్యటన

నేడు రాష్ట్రానికి సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు 4 రోజుల దావోస్ పర్యటన ముగిసింది. వివిధ రంగాలకు చెందిన దాదాపు 15 మంది అత్యున్నత వాణిజ్య సంస్థల అధిపతులతో ఆయన సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. గూగుల్ క్లౌడ్, మార్క్స్, మైక్రోసాఫ్ట్, పెట్రోనాస్, యూనిలీవర్, ఎల్జీకెమ్ తదితర సంస్థల ప్రతినిధులతో చర్చించి పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య, విద్య, ఆవిష్కరణల కేంద్రంగా మార్చేందుకు సహకరించాలని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ఫౌండర్ బిల్ గేట్స్‌ను కోరారు. దావోస్ నుంచి జ్యూరిచ్‌కు రోడ్డు మార్గంలో చేరుకున్న చంద్రబాబు బృందం అక్కడి నుంచి గురువారం అర్ధరాత్రి తరువాత ఢిల్లీ రానుంది. నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత తాను చేపట్టిన తొలి విదేశీ పర్యటన సంతృప్తినిచ్చిందని, రానున్న రోజుల్లో ఈ చర్చలు మంచి ఫలితాలను ఇస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ మాత్రం శుక్రవారం బయలుదేరుతారు.

దారి ఖర్చులు దండగ!

▶ మొదటి పేజీ తరువాయి

తెల్లమొహం వేశారు! కూటమి పాలనలో ఏపీలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని గమనించిన పారిశ్రామికవేత్తలు ఏ ఒక్కరూ ఎంవోయూలకు ముందుకు రాలేదు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు మొహం చాటేశారు. సమావేశాలకు వారం ముందే జాతీయ మీడియాలో ప్రచారం, ఇంటర్వ్యూల కోసం రూ.కోట్లలో చెల్లించిన ప్రభుత్వ పెద్దలు తీరా అక్కడకు వెళ్లాక పెట్టుబడులు ఆకర్షించటాన్ని పక్కనపెట్టేసి స్వీయ ప్రచారంలో మునిగిపోయారు. ఐటీకి ఆద్యుడిని తానేనని, సత్య నాదెళ్ల మైక్రోసాఫ్ట్ సీఈవో అయ్యారంటే తన ఘనతేనని చెప్పుకుని సీఎం చంద్రబాబు మురిసిపోయారు. దీంతో సింగడు అద్దంకి పోనూ పోయాడు.. రానూ వచ్చాడు.. అన్నట్లుగా ఆయన పర్యటన ముగిసింది. 'ఇంత కష్టపడినందుకు బిల్‌గేట్స్‌తో ఫొటో మిగిలింది.. సంతోషం' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. మనదేశం నుంచి అక్కడకు వెళ్లిన చిన్నా చితకా వ్యాపారులు బిల్‌గేట్స్, ఇతర ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలతో ఫొటోలు తీసుకొని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసుకున్నారు. కాకపోతే వారు సోషల్ మీడియాలో సొంత వాల్స్ మీద పోస్ట్ చేసుకుంటే.. చంద్రబాబు ఫొటోలను ఐ అండ్ పీఆర్ అధికారులు అందరికీ పంపించి ప్రచారం చేయించారు.

ఇతర రాష్ట్రాలకు రూ.లక్షల కోట్లు.. ఏపీకి శూన్యం..

దావోస్ పర్యటనకు ఈసారి మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. చంద్రబాబుతోపాటు మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుల్లో పాల్గొన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ రూ.లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగా ఎటువంటి పెట్టుబడుల ఒప్పందాలు లేకుండా ఏపీ బృందం రిక్త హస్తాలతో వెనుదిరిగింది. మహారాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.16 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించింది. రిలయన్స్, ఎల్ అండ్ టీ, అమెజాన్, వర్ధన్ లిథియం, జేఎస్‌డబ్ల్యూ, టాటా తదితర దిగ్గజ సంస్థలు మహారాష్ట్రలో పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం రూ.1.78 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించింది. రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం ఉందని, నాలుగోసారి ముఖ్యమంత్రిని అయ్యానని, 1995 నుంచి దావోస్‌కు వెళుతున్నానని గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు మాత్రం ఒక్క పెట్టుబడిని కూడా ఆకర్షించలేకపోయారు. మైక్రోసాఫ్ట్ నుంచి వైదొలిగి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బిల్‌గేట్స్‌తో సమావేశమై ఆ ఫొటోను ఎల్లో మీడియాలో గొప్పగా ప్రచారం చేసుకున్నారు. అసలు మైక్రోసాఫ్ట్ పెట్టుబడులకు, బిల్‌గేట్స్‌కు ఇప్పుడు సంబంధం లేదన్న విషయాన్ని కూడా పట్టించుకోకుండా ఆ పత్రికలు బాకాలూదాయి.

రాష్ట్రం గురించి చెప్పకుండా రాజకీయ ప్రసంగాలు..

దావోస్ మ్యాన్‌గా తనకు తాను కీర్తించుకునే సీఎం చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో ఘోరంగా విఫలమయ్యారు. రెడీ.. యాక్షన్.. కెమెరా అంటూ ఫొటోలు, వీడియోలతో ప్రచారం చేయడమే గానీ కనీసం కోటి రూపాయల పెట్టుబడిని తీసుకురాలేకపోయారు. తన తనయుడు, లోకేశ్‌ను ప్రమోట్ చేయడం కోసం సీఎన్‌బీసీ, టీవీ 18, ఎన్డీటీవీ, బిజినెస్ టుడే లాంటి జాతీయ చానళ్లకు రూ.కోట్ల కొద్దీ ప్రజాధనాన్ని వెచ్చించి ప్రచారం చేయించారు. అయితే లోకేశ్ రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వివరించడానికి బదులు రాజకీయ ప్రసంగాలు చేయడంతో పారిశ్రామికవేత్తలు విస్తుపోయారు. రాష్ట్రం వెనుకబడిపోయిందని, విద్యారంగం సర్వ నాశనం అయిందని, పునర్నిర్మాణ పనిలో ఉన్నామంటూ రాజకీయ దురుద్దేశాలతో ఏపీ పరువును అంతర్జాతీయ వేదికలపై దిగజార్చారు. దీన్ని గమనించిన పారిశ్రామికవేత్తలు ఎవరూ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రాలేదు. ఇక పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తాను వచ్చిన పని మర్చిపోయి కాబోయే సీఎం లోకేశ్ అని ఒకసారి.. చంద్రబాబు రాజకీయాల్లోకి రాకపోతే మరో ఎలన్ మస్క్ అయ్యేవారని చాట్ జీపీటీ చెప్పిందంటూ వ్యాఖ్యలు చేయడంతో పారిశ్రామికవేత్తలు ముక్కున వేలేసుకున్నారు.

రూ.80 కోట్లకుపైగా ఖర్చు..

తొలిసారి సీఎం అయ్యాక వైఎస్ జగన్ 2022లో దావోస్ పర్యటనకు వెళ్లి రూ.1.26 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రప్పిస్తే సీఎం చంద్రబాబు మాత్రం ఒక్క పెట్టుబడిని కూడా తీసుకురాలేకపోయారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమావేశాల కోసం పెవిలియన్, ప్రచార ఖర్చుల దగ్గర నుంచి ప్రయాణం, వసతి వరకు సుమారు రూ.80 కోట్లకుపైన వ్యయం చేస్తే దారి ఖర్చులు కూడా రాలేదని మరో అధికారి వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాలకు రూ.లక్షల కోట్ల పెట్టుబడులు దక్కితే మనకు ఫొటోలు – వీడియోలే మిగిలాయని పేర్కొన్నారు.

దావోస్ పర్యటన తుస్

- పెట్టుబడులు లేకుండానే చంద్రబాబు, లోకేశ్ తిరిగొస్తున్నారు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం



సాక్షి, విశాఖపట్నం: ఏపీకి భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని దావోస్ వెళ్లిన సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన తుస్సుమందని.. చంద్రబాబు, లోకేశ్ ఉత్త చేతులతో తిరిగి వస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. గురువారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ పబ్లిసిటీ కోసం, రాజకీయ ప్రసంగాలు, విమర్శలు తప్పితే ఈ పర్యటనలో సాధించిందేమీ లేదని మండిపడ్డారు. చివరకు లోకేశ్ భజనతో దావోస్ పర్యటన ముగిసిందన్నారు. ఏపీ ప్రభుత్వంతో ఒక్క ఎంవోయూ కూడా చేసుకోవడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపలేదని విమర్శించారు. జాతీయ మీడియాకు ఇంటర్వ్యూల పేరిట రూ.3 కోట్లతో ఖర్చుచేసి పబ్లిసిటీకే చంద్రబాబు దావోస్ పర్యటన పరిమితమైందని మండిపడ్డారు. దావోస్ పర్యటనలో కూడా రెడ్‌బుక్ ప్రస్తావన తెచ్చి పారిశ్రామికవేత్తలకు చెడు సందేశం తీసుకొచ్చి, వారు పారిపోయేలా చేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో గ్రీన్ ఎనర్జీ పేరిట రూ.3.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టిన జిందాల్‌ను కూడా మహారాష్ట్రకు తరిమేశారని విమర్శించారు. 2014–19లో కూడా వివిధ పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొచ్చామంటూ.. ఎయిర్‌బస్, అలీబాబా.. అంటూ ప్రచారం చేసుకున్నారని, వాటిలో ఒక్కటి కూడా తీసుకొచ్చిన దాఖలాలు లేవన్నారు.

తలసరి ఆదాయంలో ఏపీ 15వ స్థానం

వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చే సమయానికి 2019లో ఏపీ తలసరి ఆదాయంలో 18వ స్థానంలో ఉండేదని, 2019–24 మధ్య తమ ప్రభుత్వంలో 15వ స్థానానికి తీసుకొచ్చామని అమర్‌నాథ్ గుర్తుచేశారు. పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణలో 11 స్థానంలో ఉన్న ఏపీని 9 స్థానంలోకి తీసుకొచ్చామన్నారు. దావోస్ పర్యటనలో చంద్రబాబు కూడా గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన పోర్టుల గురించే ప్రస్తావన చేశారని పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కును కూడా తామే గత ప్రభుత్వంలో 14 రాష్ట్రాలతో పోటీపడి మరీ సాధించుకొచ్చామని గుర్తుచేశారు.

ఖైదీలకు ఖైనీ ప్యాకెట్ సరఫరా చేస్తూ..

విశాఖ కేంద్ర కారాగారంలో పట్టుబడిన ఉద్యోగి!

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు ఖైనీ ప్యాకెట్ సరఫరా చేస్తూ ఓ ఉద్యోగి అధికారులకు పట్టుబడి సస్పెన్షన్‌కు గురయ్యాడు. జైలు పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు తెలిపిన వివరాలు..జైలులో ఖైదీలు పనిచేసే పలు పరిశ్రమలున్నాయి. వాటిలో కార్పెంటరీ విభాగంలో పదేళ్లుగా నాగేశ్వరరావు ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గురువారం డ్యూటీకి వస్తూ ఖైనీ ప్యాకెట్ అండర్‌వేర్‌లో పెట్టుకుని సిబ్బంది కళ్లుగప్పి లోపలికి ప్రవేశించాడు. లోపల ఇద్దరు ఖైదీలకు ఆ ఖైనీ ప్యాకెట్ అందించాడు. ఇది గమనించిన మరికొందరు ఖైదీలు తమకు కూడా ఇవ్వాలని అడిగారు. వారికి ఇవ్వకపోవడంతో ఆ ఖైదీలే జైలు అధికారులకు సమాచారం అందించారు. ఇంతలో తిరిగి ఆ ఖైనీ ప్యాకెట్ తీసుకుని ఎవ్వరికీ తెలియకుండా అండర్‌వేర్‌లో దాచేశాడు. జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరరావును నిలదీయగా ఖైనీ ప్యాకెట్ తీసి అధికారులకు ఇచ్చాడు. దీంతో ఆ ఉద్యోగిని జైల్ అధికారులు సస్పెండ్ చేశారు.

రూ.4.5 కోట్ల విలువైన ఎర్రచందనం పట్టివేత

- ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్
- కంటైనర్ లారీ స్వాధీనం

తిరుపతి మంగళం: అక్రమంగా తరలిస్తున్న రూ.4.5 కోట్ల విలువైన ఏడు టన్నుల ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గురువారం తిరుపతిలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద పట్టుబడిన ఎర్రచందనాన్ని టాస్క్‌ఫోర్స్ ఎస్పీలు సుబ్బరాయుడు, శ్రీనివాస్‌లు పరిశీలించారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం చిత్తూరు–వేలూరు రోడ్డులో పానాటూర్ సమీపంలోని అండర్ బ్రిడ్జ్ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా వాహనాలను తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి కంటైనర్ లారీని కొద్ది దూరంలో ఆపి ముగ్గురు స్మగ్లర్లు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని కంటైనర్‌లో పరిశీలిస్తే ఎర్రచందనం ఉన్నట్టు గుర్తించారు. ఎర్రచందనాన్ని తమిళనాడు రాష్ట్రం సేలం సమీపంలోని గోడౌన్‌కు తరలించి అక్కడి నుంచి అసోంకు తరలిస్తున్నట్లు విచారణలో స్మగ్లర్లు చెప్పారు. నిందితుల్లో తమిళనాడుకు చెందిన నరేంద్రకుమార్, అసోంకు చెందిన బినోయ్ కుమార్‌భగత్, రాజస్తాన్‌కు చెందిన విజయ్‌జోషి ఉన్నారు.



ఎర్రచందనంతో పాటు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రూ1.76 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

సాక్షి, అమరావతి/లక్ష్మీపురం (గుంటూరువెస్ట్): అక్రమంగా నిల్వ చేసిన రూ. కోటి 76 లక్షల విలువైన విదేశీ సిగరెట్లను కస్టమ్స్ అధికారులు విజయవాడలో స్వాధీనం చేసుకున్నారు. గురువారం గుంటూరులోని జీఎస్టీ కార్యాలయంలో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి వివరాలను వెల్లడించారు. విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ (ప్రివెంటివ్) అధికారులు, గుంటూరు సీజీఎస్టీ కమిషనరేట్ అధికారులు విజయవాడలోని రామవరప్పాడులోని ఓ గోదాములో సోదాలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన రూ. 1.76 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విదేశీ సిగరెట్లు స్మగ్లింగ్ చేసిన ఇద్దర్ని అరెస్ట్ చేసి విశాఖలోని న్యాయస్థానంలో బుధవారం హాజరు పరిచారు. న్యాయస్థానం వారికి రెండు వారాల రిమాండ్ విధించింది.



స్వాధీనం చేసుకున్న విదేశీ సిగరెట్లు

54 కేజీల గంజాయి స్వాధీనం

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు జిల్లా వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారులు గురువారం వాహన తనిఖీలు నిర్వహించి.. గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న నలుగురు నిందితులను పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.అనిత తన సిబ్బందితో కలిసి గురువారం వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీ చేపట్టారు. విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీలో బస్సులో అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడుకి చెందిన వనిత, చెన్నై ఇందిరానగర్‌కు చెందిన లత, కోయంబేడుకు చెందిన వేలు, గుంటూరుజిల్లా రేపల్లెకు చెందిన ఇమ్మానుయేల్‌రాజును అదుపులోకి తీసుకుని 54.470 కేజీల గంజాయిని, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, వైజాగ్ గాజువాకకు చెందిన గంజాయి వ్యాపారి కుమరేశన్ గంజాయిని తిరుపతిలోని తన బంధువు ముత్తులక్ష్మికి అప్పజెబితే మనిషికి రూ.5 వేల చొప్పున కమీషన్ ఇస్తానని ఆశ చూపించడంతో తిరుపతికి గంజాయిని తీసుకెళ్తున్నట్లు నిందితులు వెల్లడించారు.



నిందితులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

నిశ్చయంగా, మానవుడు నష్టంలో ఉన్నాడు!
విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు,
ఒకరికొకరు సత్యాన్ని బోధించుకునేవారు తప్ప!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 24 జనవరి 2025

రసవత్తరంగా ఢిల్లీ రణం

శీతలగాలులు కమ్మేసిన సమయంలోనూ దేశ రాజధాని ఎన్నికల హంగామాతో వేడెక్కుతోంది. ఫిబ్రవరి 5న జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమరంలో రాజకీయ పక్షాల 'ఉచిత హామీల' వ్యూహం ఊపందుకుంది. మహిళా ఓటర్లను కేంద్రంగా చేసుకొని ఎన్నికల మేనిఫెస్టోలలో పార్టీలు పోటా పోటీగా వాగ్దానాల వర్షం కురిపిస్తున్నాయి. 2012 నుంచి ఢిల్లీలో ఆధిపత్యం చూపుతున్న అధికార ఆప్, దాని ప్రధాన ప్రత్యర్థి బీజేపీలు రెండూ ఏక తీరున ఎడాపెడా హామీలిస్తుంటే, పోగొట్టుకున్న పట్టును వెతుక్కుంటూ కాంగ్రెస్ కొత్త ఉచితాల ప్రకటనలతో ఊపిరి పీల్చుకోవాలని చూస్తోంది. ఆప్ తన మేనిఫెస్టోలో సీనియర్ సిటిజన్లందరికీ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యచికిత్స, ఆటోడ్రైవర్లకు 5 గ్యారెంటీలు, అద్దెకున్నవారికి సైతం ఉచిత విద్యుత్, నీటి పథకం వర్తింపు లాంటివి ప్రకటించింది. బీజేపీ తన మేనిఫెస్టోలో హోలీ, దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లతో పాటు, గర్భిణులకు రూ. 21 వేలు, ప్రతి నెలా మహిళలకు రూ. 2.5 వేలు సహా పలు హామీలిచ్చింది. ఇప్పటికే తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని బీజేపీ తోసిపుచ్చకపోవడం ఢిల్లీ నమూనాను సమర్థించడమేనని ఆప్ ఎద్దేవా చేస్తుంటే... బీజేపీ మాత్రం ఆప్ మాటలు ధయాధర్మం చేస్తున్నామన్నట్లున్నాయనీ, తమది మాత్రం సమాజ సమగ్రాభివృద్ధికై సాగిస్తున్న సంక్షేమ వాగ్దానమనీ వాదిస్తోంది. వెరసి, మాటల యుద్ధంతో 70 స్థానాల ఢిల్లీ పీఠానికి పోటీ రసవత్తరంగా మారింది.

1993 నవంబర్‌లో తొలి ఢిల్లీ శాసనసభ ఏర్పాటైంది. అప్పటి నుంచి గమనిస్తే, ప్రజా ఉద్యమాలు పెల్లుబికిన ప్రతిసారీ జాతీయ రాజధానిలో అధికారం చేతులు మారిందని విశ్లేషణ. 1998లో షీలా దీక్షిత్ అధికారంలోకి వచ్చినా, 2013లో ఆమెను గద్దె దింపి అరవింద్ కేజ్రీవాల్ పీఠమెక్కినా... ప్రతి అసెంబ్లీ ఎన్నిక ముందు ఏదో ఒక ప్రజాందోళన జరిగిందని విశ్లేషకులు గుర్తు చేస్తుంటారు. 1998 నవంబర్‌లో ఎన్నికలైనప్పుడు అంతకంతకూ పెరుగుతున్న ధరలు సహా ప్రజల కోపకారణాలే ఊతంగా షీలా అధికారంలోకొచ్చారు. అంతకు కొద్దినెలల ముందు లోక్‌సభ ఎన్నికల్లో మంచి విజయం సాధించిన బీజేపీ తీరా ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. అలాగే, 2013లో నిర్భయ కేసులో ప్రజ్వరిల్లిన ప్రజాగ్రహం, అవినీతి అంశాల ఆసరాతో, ఉచిత విద్యుత్, నీటి సరఫరా హామీలు అండగా కేజ్రీవాల్ జయకేతనం ఎగరేశారు. సంక్షేమ పథకాలతో 2015, 2020లోనూ గట్టెక్కారు.

పదేళ్ళ పైగా 'ఆప్' అధికారంలో ఉన్నందున ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత సహజమే. దాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీజేపీ అన్ని అస్త్రాలూ వాడుతోంది. కాంగ్రెస్ సైతం తానేమీ తక్కువ కాదన్నట్టు వ్యవహరిస్తోంది. చిత్రమేమిటంటే ప్రభుత్వ వ్యతిరేకత ఎంతున్నా అదేమీ పట్టనట్టు ఆప్, దాని అధినాయకత్వం ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఢిల్లీ ఓటర్ల మనసెరిగి ప్రవర్తించడంలో ఆరితేరిన అధికార పక్షం గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ సంక్షేమ పథకాలు, తాయిలాలతో వారిని ఆకట్టుకోగలిగింది. ఈసారి కూడా పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య బీమా అందిస్తామంటూ ఆప్ భారీ వాగ్దానమే చేసింది. నిజం చెప్పాలంటే, ఇతర పార్టీలు సైతం తన దోవ తొక్కక తప్పని పరిస్థితిని కల్పించడంలో కేజ్రీవాల్ విజయం సాధించారు. ఒకప్పుడు 'ఎన్నికల ఉచిత మిఠాయిలు' అంటూ ఈసడించిన ప్రధాని మోదీ సైతం చివరకు ఢిల్లీలో వాటికే జై కొట్టడం గమనార్హం. ఆప్ మళ్ళీ పగ్గాలు పడుతుందా, లేక పొరుగున హర్యానాలో అనూహ్య విజయంతో ఆశ్చర్యపరిచిన బీజేపీ ఢిల్లీలోనూ ఆ మ్యాజిక్ చేస్తుందా అన్నది ఆసక్తికరం.

చిరకాలంగా లోక్‌సభలో బీజేపీకీ, అసెంబ్లీలో ఆప్‌కూ అనుకూలంగా వ్యవహరిస్తూ వస్తున్న ఓటర్లు ఈసారీ అలాగే చేస్తారా అన్నది ప్రశ్న. ఆప్‌కు ఒకప్పుడున్న అవినీతి రహిత ఇమేజ్, సామాన్యులకు సానుకూలమనే పేరు ఇప్పుడు దెబ్బతిన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల వలలో పార్టీ నేతలు చిక్కగా, కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్‌తో ఘర్షణతోనే పుణ్యకాలం హరించుకు పోవడం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. ప్రతి ఎన్నికనూ జీవన్మరణ సమస్యగానే భావించే బీజేపీ ఎప్పటిలానే డబుల్ ఇంజన్ సర్కార్ నినాదంతో ముందుకొచ్చింది. నిరుటి లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి భాగస్వాములుగా సీట్ల పంపిణీతో చెట్టపట్టాలేసుకున్న ఆప్, కాంగ్రెస్‌లు ఈసారి పరస్పరం కత్తులు దూసుకోవడమూ విడ్డూరమే. మరోపక్క భుజాలపై పార్టీ కండువాలు మార్చిన నేతలు పలువురు కొత్త జెండాతో బరిలో అభ్యర్థులుగా నిలవడం కార్యకర్తలకూ, పార్టీ నేతలకే కాదు... ఓటర్లకూ చీకాకు వ్యవహారమే. ఇలాంటి 20 మంది నేతల భవితవ్యం ఢిల్లీ కొత్త పీఠాధిపతిని నిర్ణయిస్తుందని అంచనా. అవన్నీ ఎలా ఉన్నా ప్రధాన చర్చనీయాంశం మాత్రం ఉచిత హామీలే.

సమాజంలో అంతరాలు అంతకంతకూ అధికమవుతున్న పరిస్థితుల్లో అణగారిన వర్గాల సముద్ధరణకు చేయూత నివ్వడం సమంజసం. అయితే, విద్య, వైద్యం, వ్యవసాయం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెంచి, అట్టడుగు వర్గాలను పైకి తీసుకురావడం దూరదృష్టి గల పాలకులు చేయాల్సిన పని. అవసరం లేని ఉచితాలపై మాత్రం అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల జాతరలో తాత్కాలికంగా పైచేయి అనుచితమైన ఉచితాలను పార్టీలు ప్రకటిస్తే, ఆ మాటలు నీటి మీది రాతలుగా మిగిలిపోతాయి. అథవా అమలు చేసినా, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై, పాలనారథం తలకిందులయ్యే ప్రమాదమూ ఉంటుంది. అభివృద్ధి మంత్రానికీ, అధికారం కోసం పప్పుబెల్లాలు పంచాలనుకొనే ఉచితాల తంత్రానికీ నడుమ పోటీలో ఢిల్లీ జనం ఎటు మొగ్గుతారన్నది ఓట్ల లెక్కింపు జరిగే ఫిబ్రవరి 8న చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.దశమి సా.5.11 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** అనూరాధ తె.5.36 వరకు (తెల్లవారితే శనివారం) తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** ఉ.7.52 నుండి 9.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.53 నుండి 9.41 వరకు, తదుపరి ప.12.38 నుండి 1.26 వరకు, **అమృతఘడియలు:** సా.6.07 నుండి 7.51 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

పాకిస్తాన్ ముంగిట తాలిబన్ సవాళ్లు

విశ్లేషణ



గద్దె ఓంప్రసాద్

అమెరికా నాయకత్వంలోని సంకీర్ణ దళాలు 2021లో అఫ్గానిస్తాన్‌ను వీడిన తర్వాత ఆ దేశాన్ని రెండోసారి హస్తగతం చేసుకున్న తాలిబన్... ప్రస్తుతం భద్రతా పరంగా పాకిస్తాన్‌కు అత్యంత ముప్పుగా మారింది. ఒకప్పుడు అఫ్గానిస్తాన్‌లో తమ వ్యూహాత్మక ప్రయోజనాల కోసం పాకిస్తాన్ మిలిటరీ, నిఘా సంస్థలు తాలిబన్లకు శిక్షణ ఇచ్చి వారిని మరింత బలపడేలా చేశాయి. సోవియట్ యూనియన్ దళాల ఉపసంహరణ తర్వాత రాజకీయ అనిశ్చితి మధ్య అఫ్గానిస్తాన్‌ను పాలిస్తున్న బుర్హనుద్దీన్ రబ్బానీ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసి 1996లో తాలిబన్లు ఆ దేశాన్ని హస్తగతం చేసుకున్నారు. అప్పటినుండి 2001లో అమెరికాలోని ట్విన్ టవర్స్‌పై దాడి తర్వాత అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు అఫ్గానిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని కూలదోసి హమీద్ కర్జాయ్ ప్రభుత్వం ఏర్పడే దాకా, తాలిబన్లతో పాకిస్తాన్ సత్సంబంధాలు నెరిపింది.

వివాదాలు కూడా పట్టనంతగా...

ఈ కాలంలో తాలిబన్ ప్రభుత్వం, పాకిస్తాన్ మధ్య సంబంధాలు ఎంతలా పెనవేసుకు పోయాయంటే, రెండు దేశాల మధ్య 1947 నుండి ఉన్న సరిహద్దు వివాదాలను పక్కన పెట్టేంతగా. ముఖ్యంగా 1893లో అప్పటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఏక పక్షంగా నిర్ణయించిన 2,640 కిలోమీటర్ల పొడవైన డ్యూరాండ్ లైన్ వల్ల దశాబ్దాలుగా ఏర్పడిన సంఘర్షణాత్మక వైఖరులను కూడా మరిచిపోయేంతగా. తాలిబన్‌తో సహా అఫ్గానిస్తాన్‌లో ఏర్పడిన అన్ని ప్రభుత్వాలదీ డ్యూరాండ్ లైన్ మీద ఒకే వైఖరి. వాటి వాదన ప్రకారం, ఇది సరిహద్దులకు ఇరువైపులా ఉన్న పష్తూ జాతి ప్రజలను వేరుచేయడమే కాకుండా, శతాబ్దాలుగా ఉన్న సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలను దెబ్బతీస్తోంది.

పాకిస్తాన్ మాత్రం ఈ లైన్ చట్టబద్ధత కలిగిన అధికారిక సరిహద్దుగా భావిస్తోంది. తాలిబన్ తన మొదటి దశ పాలనలో ఎక్కువగా అఫ్గానిస్తాన్‌ను ఏకీకృతం చేయడంపై, తన అధికార పరిధిని విస్తరించడంపై దృష్టి కేంద్రీకరించింది. తాలిబన్‌కు కావలసిన కీలకమైన సైనిక, ఆర్థిక, దౌత్య సహాయాలను పాక్ చేస్తుండటంతో సరిహద్దు సమస్యలను లేవనెత్తి పాకిస్తాన్ ఆగ్రహానికి గురికాకూడదనే భయంతో తాలిబన్ కూడా సరిహద్దు విషయాన్ని పక్కన పెట్టింది. సరిహద్దులకు ఇరువైపులా ఉన్న పష్తూన్లు ఏకమైతే పష్తూన్ జాతీయ వాదం తమను ముక్కలు చేస్తుందన్న భయం పాకిస్తాన్‌ను మొదటి నుండి వెంటాడుతోంది. ఆ విషయం తాలిబన్‌కు తెలిసినప్పటికీ తనకున్న అవసరాల దృష్ట్యా పష్తూన్ల ఐక్యత ఒక రాజకీయ కోణంలా రూపాంతరం చెందకుండా చూసుకుంది.

ఎక్కడ చెడింది?

ఇంతటి బలమైన సంబంధాలు నెరపిన పాకిస్తాన్, తాలిబన్ మధ్య 2021 తర్వాత దూరం పెరగడానికి ముఖ్యంగా రెండు కారణాలు కనబడతాయి. ఒకటి, 2001లో అమెరికా చేపట్టిన తీవ్రవాదంపై యుద్ధంలో పాకిస్తాన్ పోషించిన ముఖ్యపాత్ర. 1999లో నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వాన్ని కూలదోసి జనరల్ ముషారఫ్ అధికారాన్ని చేజిక్కించుకున్నప్పుడు, పాకిస్తాన్ ఆర్థిక



వ్యవస్థ అత్యంత దుర్భర స్థితిలో వుంది. ఆ దేశ విదేశీ అప్పులు సుమారు 39 బిలియన్ డాలర్లు ఉంటే, వడ్డీల చెల్లింపులకే బడ్జెట్‌లో సుమారు 56 శాతం కేటాయించాల్సిన పరిస్థితి! ఆ సమయంలో అమెరికాతో జట్టు కట్టడం వలన, అనేక బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం పొందడమే కాకుండా, పారిస్ క్లబ్ రుణదాతల నుండి కొత్త రుణాలు పొందగలిగింది. పాత రుణ బకాయిల చెల్లింపుల్లో సైతం అనేక వెసులుబాట్లు పొందగలిగింది. 1998లో అణు పరీక్షల తర్వాత ఎదుర్కొన్న అనేక ఆర్థిక ఆంక్షల నుండి విముక్తి పొందగలిగింది. వీటన్నిటి ఫలితంగా పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిలో పడటమే కాకుండా, 2003 నాటికి పారిశ్రామిక రంగం సుమారు 8 శాతం వృద్ధి నమోదు చేసింది. అదే సమయంలో 2001లో అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ ప్రభుత్వం కూలిపోవడంతో అనేక మంది తాలిబన్ ఫైటర్లు పాకిస్తాన్‌లోని ట్రైబల్ ఏరియాల్లోకి పారిపోయి ప్రజల్లో కలిసిపోయారు. మరి కొంతమంది, 2007లో పాకిస్తాన్‌లో కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, ఇస్లామిక్ సిద్ధాంతాలను వ్యాపింప జేయడానికి 'తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్తాన్'(టీటీపీ) స్థాపించారు.

రెండో కారణానికి వస్తే, పాకిస్తాన్ 2017–2022 మధ్య ఏకపక్షంగా తన, అఫ్గానిస్తాన్ మధ్యన ఉన్న సరిహద్దుల్లో కంచె వేసి సరిహద్దులకిరువైపులా ఉన్న అనేక సంబంధాలను దెబ్బ తీసింది. ఈ కంచె తనకు సరిహద్దులపై పట్టును కల్పించి తీవ్రవాదాన్ని, మాదక ద్రవ్యాల, ఆయుధాల, మానవ, ఇతర అక్రమ రవాణాను అరికట్టేందుకు తోడ్పడుతుందని భావించింది. అష్రాఫ్ ఘనీ నేతృత్వంలోని అప్పటి అఫ్గాన్ ప్రభుత్వం ఎంత వ్యతిరేకించినప్పటికీ అత్యాధునిక వసతులతో సరిహద్దు కంచెను పూర్తిచేసింది. ఇది అఫ్గానిసాన్‌లోని అన్ని వర్గాలను, ముఖ్యంగా తాలిబన్లకు తీవ్ర ఆగ్రహం కలిగించింది. ఈ సరిహద్దు వలన, సుమారు పదిహేను వేలమంది అఫ్గాన్లు తమ ఉపాధి కోల్పోవడమే కాకుండా, పాకిస్తాన్ నుండి వచ్చే సరుకుల్లో సుమారు 40 శాతం వస్తువులపై కోత పడటంతో అవి స్థానిక మార్కెట్లలో లభ్యం కాక అఫ్గాన్ ప్రజలు తీవ్ర అవస్థలు పడటానికీ, వస్తువుల ధరలు పెరగడానికీ దారితీసింది.

టీటీపీ డిసెంబర్ 31, 2022న మరింత ముందుకెళ్లి ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా, గిల్గిట్ బాల్టిస్తాన్ ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇది ఏకంగా పాకిస్తాన్ సార్వభౌమత్వాన్ని సవాలు చేయడమే. అప్పటి నుండి పాకిస్తాన్‌లో తీవ్రవాద దాడులు పెరగడం చూడవచ్చు. ఇస్లామాబాద్‌లోని 'సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సెక్యూరిటీ స్టడీస్' ఇటీవల ప్రచురించిన నివేదిక ప్రకారం, పాకిస్తాన్ గతేడాది 1,166 తీవ్రవాద దాడులు ఎదుర్కొంది. అందులో 2,546 మంది చనిపోతే, 2,267 మంది గాయపడ్డారు. ఈ లెక్కలు అంతకుముందు ఏడాది (2023)తో పోలిస్తే 66 శాతం ఎక్కువ. ఒక్క గత నవంబర్‌లోనే 444 (రోజుకు సుమారు 15) దాడులు జరిగితే అందులో సుమారు 685 మంది చనిపోయారు. అంటే పరిస్థితి ఎంత తీవ్రత సంతరించుకుందో అర్థం చేసుకోవచ్చు.

ఒక వైపు టీటీపీ, మరోవైపు బలోచిస్తాన్ ప్రాంత స్వతంత్రం కోసం కొట్లాడుతున్న తీవ్రవాద గ్రూపుల దాడుల మధ్య పాకిస్తాన్ చిక్కుకుంది. అయితే, ఆ రెండు ప్రాంతాల తీవ్రవాద గ్రూపుల మధ్య ఉన్న భావజాల విభేదాల వల్ల వాటికి సన్నిహిత సంబంధాలు ఉండకపోవచ్చు. కానీ సరిహద్దుల్లో తాలిబన్ దాడులు చేస్తోంటే, పాకిస్తాన్ లోపల టీటీపీ రక్తపాతాన్ని సృష్టిస్తోంది.

ఇండియాకూ కీలకమే!

ఇలాంటి పరిస్థితుల మధ్య గత డిసెంబర్ 30న పాకిస్తాన్ ఐఎస్ఐ అధినేత... తాలిబన్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే అఫ్గాన్ నేషనల్ ఫ్రంట్‌కు ఆశ్రయమిచ్చిన తజికిస్తాన్ అధ్యక్షుడు ఏమోమాలి రహెమాన్‌ను కలిశారు. అది జరిగిన కొద్ది రోజులకు, జనవరి 8న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తాలిబన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముట్టకీని దుబాయ్‌లో కలిశారు. ఇవి కొత్త చర్చలకు దారి తీయడమే కాకుండా, ఈ ప్రాంతంలో మారుతున్న వ్యూహాత్మక సమీకరణాలను, ఏర్పడుతున్న కొత్త సంబంధాలను, ఆవిష్కృతమవుతున్న నూతన ప్రాంతీయ ముఖచిత్రాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రానున్న రోజులలో వివిధ అవసరాల దృష్ట్యా తాలిబన్లతో సత్సంబంధాలు అటు రష్యాకూ, ఇటు చైనాకూ, వాటితో పాటే భారత్‌కూ అత్యంత కీలకం.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్,
దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన కేంద్రం, జేఎన్‌యూ,
న్యూఢిల్లీ | opgadde2@gmail.com

◆ ఇస్లామాబాద్‌లోని 'సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సెక్యూరిటీ స్టడీస్' నివేదిక ప్రకారం, పాకిస్తాన్ గతేడాది 1,166 తీవ్రవాద దాడులను ఎదుర్కొంది. కాగా, తమ దేశంలో జరిగిన దాడుల్లో పాక్ హస్తం ఉందని అఫ్గానిస్తాన్ బుధవారం ఆరోపించింది.

◆ డ్యూరాండ్ లైన్ సరిహద్దులకు ఇరువైపులా ఉన్న పష్తూ జాతి ప్రజలను వేరుచేస్తోందన్నది అఫ్గానిస్తాన్ వాదన. పాకిస్తాన్ మాత్రం దీన్ని చట్టబద్ధత కలిగిన అధికారిక సరిహద్దుగా భావిస్తోంది. పష్తూన్ జాతీయవాదం తమను ముక్కలు చేస్తుందన్న భయం పాక్‌ను వెంటాడుతోంది.

◆ 2001లో అమెరికా చేపట్టిన తీవ్రవాదంపై యుద్ధంలో పాకిస్తాన్ ముఖ్యపాత్ర పోషించింది. ఆర్థికంగా చితికిపోయిన ఆ సమయంలో అమెరికాతో జట్టు కట్టడం వలన, అనేక బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం పొందింది.

సోషల్ మీడియా

నిజమైన నేత



అక్టోబర్ 23, 1943: మా నాన్న అప్పుడు ఇంజినీరింగ్ విద్యార్థి. రేడియోకు అతుక్కుపోయి, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నేతాజీ యుద్ధం ప్రకటించడాన్ని విన్నాడు. ఆ స్ఫూర్తితో సైన్యంలో చేరాడు. దేశ స్వేచ్ఛ కోసం ఎందరో తమ ప్రాణాలు ఇచ్చేలా ప్రభావితం చేసిన నేతాజీని ఆయన జయంతి (జనవరి 23) సందర్భంగా తలుచుకుంటున్నాను.

– జాయ్ భట్టాచార్య, క్విజ్ మాస్టర్

మనుషుల మాదిరే!



కృత్రిమ మేధ(ఏఐ)కి నిస్సంశయంగా హృదయం లేదు. నేను (సుమారు 80 మంది చనిపోయిన) టర్కీలోని స్కీ హోటల్ ప్రమాదం గురించి చదువుతున్నాను; వెను వెంటనే నా టైమ్‌లైన్‌లో స్కీ హోటల్ యాడ్స్ వస్తున్నాయి. మనుషులకు పెద్ద మనసు లేనట్టే, మనుషులను అనుసరించే ఏఐకి కూడా లేదు.

– ఎజె తెమెల్‌కురాన్, టర్కీ రచయిత్రి

పోయినవెన్నో!



హిందీ సంస్కృతి అనేది లేదు. మైథిలీ సంస్కృతి, బ్రజ్ సంస్కృతి, అవధి సంస్కృతి, మేవాడీ సంస్కృతి, మార్వాడీ సంస్కృతి, బుందేల్‌ఖండ్ సంస్కృతి ఉండేవి. స్థానిక తను ద్వేషించే కాషాయ సనాతనీలు వాటన్నింటినీ తుడిచి పెట్టారు.

– దేవ్‌దత్ పట్నాయక్, పురాణశాస్త్ర నిపుణుడు

అక్కడికెందుకు?



ఇండియా వ్యాపారవేత్తలతో ఒప్పందాలు చేసుకోవడానికి ఇండియా ముఖ్యమంత్రులు దావోస్ (స్విట్జర్లాండ్) వెళ్లడం విచిత్రం. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో ఏడాదికోసారి చేసుకునే విహారయాత్రా?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

రెడ్‌లైన్



ఇండియా కచ్చితంగా బంగ్లాదేశ్‌కు తన హద్దులేమిటో తెలియజెప్పాలి. గీత దాటితే శత్రుదేశంగా పరిగణిస్తామనీ, దానికి తగిన చర్యలుంటాయనీ గుర్తుచేయాలి. ఇండియాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ భద్రతా విధానాన్ని కూడా రూపొందిస్తోంది.

– యూసుఫ్ టి. ఉంర్ఘూవాలా, రక్షణాంశాల వ్యాఖ్యాత

ఆందోళనకరం



రైతుల నిరసన ఉద్యమం తర్వాత, ఆందోళనకర స్థాయిలో ఖలిస్తానీ ప్రచారం పెరిగింది; సిక్కుల మార్గం ఇస్లామీకరణ చెందుతోంది. అయినా ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది. బుజ్జగింపు ధోరణి సమస్యను మరింత పెంచుతుంది. రక్తపుటేరులు పారిన 1982 దిశగా నేటి పంజాబ్ జారుతోంది.

– పునీత్ సహానీ, వ్యాఖ్యాత

ఇలా ఉంటే చాలు!



మీరు వారంలో 3–5 రోజులు వ్యాయామం చేస్తూ, సమయానికి నిద్ర పోతూ, బయటి తిండికి వెంపర్లాడకుండా ఎప్పుడోసారి మాత్రమే తింటూ ఉంటే మీరు బాగున్నట్టే లెక్క. మీ బరువు ఎంత అని లెక్కలు అవీ మోసుకుంటూ తిరగనక్కర్లేదు.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఇన్ బాక్స్

సమాన అవకాశాలేవీ?

స్త్రీని ఆదిశక్తిగా, చదువుల తల్లిగా, అన్నపూర్ణగా పేర్కొనే భారతీయ సంస్కృతికి భిన్నంగా ఆమె శక్తిహీనురాలిగా, నిస్సహాయురాలిగా అణిగిమణిగి సర్దుకుపోయే జీవితం గడపవలసిన దుర్భర పరిస్థితి కొనసాగుతోంది. ఈ వివక్ష పుట్టుకతోనే ఆరంభమవుతుంది. వివక్ష, హింస, లైంగిక వేధింపులు, సరైన విద్య, వైద్య సదుపాయాలు అందుకోలేకపోవడం వంటి సవాళ్ల–ఇబ్బందులను బాలికలు ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సమాజంలో ఉన్న బాలికలకు సాధికారత కల్పించడం, వారిని రక్షించడం ప్రధాన అంశాలుగా జాతీయ బాలికా దినోత్సవాన్ని 2008 నుంచి మన దేశంలో జరుపుతున్నారు.



బాలికల స్థితిని మెరుగుపరచడంలో దేశం పురోగతి సాధించిన మాట నిజమే. కాని, అది తగినంత కాదు. ఇప్పటికీ విద్య, పోషకాహారం, ఆరోగ్యం వంటి రంగాలలో అసమానతలు కొనసాగుతున్నాయి. భారత ప్రభుత్వం కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను సాధించే విధంగా జాతీయ బాలికా దినోత్సవ సందర్భాన్ని వినియోగిస్తోంది. లింగ వివక్షకు సంబంధించిన సమస్యలపై పని చేయడం, బాలికల ఆరోగ్యం, పోషకాహారం, లింగ నిష్పత్తి అంతరాన్ని తగ్గించడం వంటి ముఖ్యమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం; అవకాశాల పరంగా అసమానతలను తొలగించడం; ఆడపిల్లలందరికీ వారి హక్కులు, అర్థమైన గౌరవం, విలువలు లభిస్తాయని నిర్ధారించడం; కొత్త అవకాశాలను అందించడం, ఎదగడానికి వీలు కల్పించడం వంటివి ఈ లక్ష్యాలు.

'బేటీ బచావో బేటీ పఢావో', 'సుకన్య సమృద్ధి యోజన', 'బాలికా సమృద్ధి యోజన, 'లాడ్లీ' పథకం, మాధ్యమిక విద్య కోసం బాలికలకు జాతీయ ప్రోత్సాహకాల వంటి పథకాలను ప్రభుత్వాలు ఎన్ని తీసుకొస్తున్నా... ఆడపిల్లలు తగినంతగా అభివృద్ధి చెందకపోవడం వెనుక ఉన్న కారణాలను అన్వేషించాలి.

– డా॥ హెచ్. అఖ్తర్ బాను | సిల్వర్ జూబ్లీ గవర్నమెంట్ కాలేజ్, కర్నూలు
(నేడు జాతీయ బాలికా దినోత్సవం)

నివాళులు అర్పించడం ఇలాగేనా?

అభిప్రాయం



పి. విజయబాబు

పల్లెపట్టు శ్రామిక జీవన సౌందర్యాన్ని, సంస్కృతిని రక్తనిష్ఠ మొనర్చుకున్న జానపద కవి బ్రహ్మ కొసరాజు రాఘవయ్య. యక్షగానాలు, వీధి భాగవతాలు, హరికథలు, జముకుల కథలు, బుర్రకథలు, భజన గీతాలు, పగటి వేషగాళ్ల పాటలు, రజకుల పాటలు, గంగిరెద్దుల గీతాలు... ఇలా అట్టడుగు వర్గాల జీవితాలు ప్రతిబింబించే ఎన్నో పాటలు రాశారు. 'ప్రతిభ ఉన్నా దానికి పదును పెట్టేవారు, ప్రోత్సహించేవారు లేకపోతే ఏం ఉపయోగం?' అనేవారు ఆయన తనను ఆ స్థాయికి ప్రోత్సహించిన వారిని తలుచుకుంటూ.

కొసరాజు రాఘవయ్య నాలుగో తరగతి వరకు చదివారు. పైచదువులకు వెళ్లలేకపోయారు. అదృష్టవశాత్తు ఆయన కొండముది నరసింహ పంతులు దృష్టిలో పడ్డారు. ఆయన శిష్యరికంలో రాటుతేలారు. ఆ తర్వాత కవిత్వం రాస్తూ, రైతులు, వివిధ జానపదుల జీవితాలను అధ్యయనం చేశారు. తన పేరు చివర ఉన్న 'చౌదరి' తొలగించుకున్నారు. మొదటగా 'రైతుబిడ్డ' చిత్రానికి పాటలు రాసి ఆ తర్వాత ప్రోత్సాహం లేక మద్రాసు నుంచి స్వగ్రామం వెళ్లిపోయి వ్యవసాయం చేసుకున్నారు. అయితే ఆయన కలం పదును గురించి కేవీ రెడ్డికి డీవీ నరసరాజు చెప్పడంతో ఆయన్ని మద్రాసుకు పిలిపించి 1954లో విడుదలైన పెద్దమనుషుల చిత్రానికి పాటలు రాయించారు. ఆ విధంగా 13 ఏళ్ల తర్వాత రెడ్డిగారి ప్రోత్సాహంతో సినిమాలలో బిజీ కవి అయిపోయారు కొసరాజు. మొత్తం 350 చిత్రాలకు గాను 3 వేల పాటలు రాశారు. అటువంటి గొప్ప కవిని ఆ ఇంటి పేరు గలవారు 'కొసరాజు వారి వంశవృక్ష సేవా సమితి' పేరుతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నిజానికి గొప్ప వ్యక్తులను స్మరించుకోవడానికి ఏ పేరుతో ఎవరు సమావేశాలు నిర్వహించినా హర్షణీయమే. అయితే ఆ సభల్లో ప్రసంగాలు స్ఫూర్తిదాయకంగా ఉండాలి. అలాంటి సభల్ని 'సభాకల్పతరుర్భాతి' అంటారు. ధర్మసభల్లో మాట్లాడవలసిన రీతిని, భారతంలో పూరునికి యయాతి బోధించే విధానం నన్నయ ఇలా చెప్తాడు:



కొసరాజు రాఘవయ్య

'మనమునకు ప్రియంబును, హితమును పద్యము దద్యమును సమోఘ మధురంబును, పరిమితమును నగు పలుకొనరగా పలుకునది ధర్మయుతముగా సభలన్. ధర్మయుతమైన సభల్లో మనం మాట్లాడే మాటలు తోటి వారికి ప్రియం కలిగించాలి. హితంగా, మితంగా, ఇంపుగా, ఎదుటివారు నొచ్చుకోని విధంగా, మెచ్చుకునే విధంగా ఉండాలి అంటాడు.

'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియం హితం చయాత్ / స్వాధ్యాయభ్యాసనం చైవ వాంగ్మయం తప ఉచ్యతే! 'మాటలు ఉద్వేగం కలిగించనవి, ఆగ్రహం పుట్టించనవి, ప్రయోజనకరంగా ఉండేవి, వాక్ సంబంధమైన తపస్సు లాంటివి' అని భగవద్గీత ప్రబోధిస్తోంది. కానీ జనవరి 19న విజయవాడలో నిర్వహించిన కొసరాజు స్మృతి సభలో జరిగిందేమిటి? ఓ మాజీ పోలీసు ఉన్నతాధికారి మాట్లాడిందేమిటి?

విషతుల్యమైన మస్తిష్కంతో, ఛద్మ వేషధారణతో కనీసం సాహితీ పరిజ్ఞానం లేని కుల నాగులను పిలిపించి మాట్లాడితే ఏం జరుగుతుందో అదే ఆ సభలో జరిగింది. ఆ సభ ఔచిత్యం ఏమైపోయింది? చివరికి బాకా పత్రికల్లో సైతం విషవాక్యాలే వార్తగా వచ్చాయి తప్ప కొసరాజు గురించి కొసరు వార్త కూడా లేదు. కొసరాజు వంశస్థులు ఒక్కసారి ఈ విషయంలో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఒక గొప్ప కవికి కుల పంకిలం అంటించడం నిజమైన నివాళి అవుతుందా? ఆ సభను తమ ఆక్రోశం, కుళ్ళు వెళ్ళబుచ్చుకోవడానికి, కుసంస్కార భాషను ఉపయోగించటం అంటే సభ రభస అయినట్టు కాదా? ఇది కొసరాజుకి నివాళి అవుతుందా? రాజకీయ ప్రత్యర్థుల్ని తమ పోలీసు భాషతోనో, తమ కుల దురహంకార భాషతోనో తిట్టాలనుకుంటే డైరెక్ట్‌గా కులసభలే పెట్టుకోవచ్చు. కొసరాజు పేరు ఎందుకు?

నార్ల వెంకటేశ్వరరావు, దేవరకొండ బాలగంగాధర తిలక్, వాసిరెడ్డి సీతాదేవి, కొసరాజు రాఘవయ్య వంటి సాహితీ మూర్తులను కుల దృక్కోణం నుంచి చూడటం వారి సభలకు కులనాగులను పిలిపించి ఆ సభకు సంబంధం లేని వ్యక్తుల మీద విషం చిమ్మించటం సబబేనా? ఒక పరి ఆలోచించండి!

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు, ఆంధ్రప్రదేశ్
అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు

సాంస్కృతిక వారధి

ఆకాశవాణి నిర్వహించే 'సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం' భిన్న భాషల సాహిత్యకారుల సాహితీ సౌరభా లను దేశం మొత్తం వెదజల్లే కార్యక్రమంగా పేరొందింది. దీనిని 1956 నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇది కవులకు ఒక జాతీయ వేదిక. ఎంపికైన కవి కవిత 22 భాషల్లోకి అనువాదమై ప్రసారమవుతుంది. దేశంలోనే ఒక సాంస్కృతిక వారధిగా దీనిని భావిస్తారు. అందువల్ల ప్రతి కవి దీనిలో భాగస్వామ్యం కావాలని ఆరాట పడతారు. గౌరవంగా భావిస్తారు. కాలం గడిచే కొద్ది ఈ సమ్మేళన సాంద్రత తగ్గితే కొంత తగ్గి ఉండవచ్చు. కానీ స్ఫూర్తి మాత్రం కొండంత. ఈ కార్యక్రమాన్ని జనవరి 25 రాత్రి పది గంటలకు దేశంలోని అన్ని కేంద్రాలు ప్రసారం చేస్తాయి.

మరుసటి రోజు అంటే గణతంత్ర దినోత్సవం నాడు మరోసారి అన్ని కేంద్రాల వారూ వీలును బట్టి ప్రసారం చేస్తారు. సంస్కృతం, ఉర్దూ, కశ్మీరీ, నేపాలీ, అస్సామీ, బోడో, మణిపురి, పంజాబీ, గుజరాతీ, మైథిలీ, డోగ్రీ, మరాఠీ, కొంకణి, కన్నడ, మలయాళీ, తమిళం, తెలుగు, ఒరియా, బెంగాలీ, హిందీ, సంతాలీ భాషల కవులతో ఆకాశవాణి 2025 ఏడాదికి సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం ముంబై ఆకాశవాణి కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు భాష నుంచి ఏనుగు నరసింహారెడ్డి పాల్గొన్నారు. పలువురు తెలుగు కవులు వివిధ భాషల కవితలను తెలుగులోకి అనువాదం చేశారు. వీరి అనువాదాలను వీరితోనే చదివించి రికార్డు చేసి, ప్రసారం చేసే క్రతువు నిర్వహణ తీరు ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ ప్రశంసలు కూడా అందుకోవడం విశేషం. అయితే ఆకాశవాణిని ఎక్కువమంది నిర్దేశకులు ఒక యాంత్రిక వ్యవస్థగానే చూస్తుండటం బాధాకరం. ఈ తీరు కొనసాగితే ఆకాశవాణి చరిత మసకబారుతుంది.

– ఈలప్రోలు లక్ష్మీనారాయణ | ఆకాశవాణి కేంద్రం
హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ (విశ్రాంత)

పదివేలమందితో సూర్య నమస్కార్



స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి వివేకానంద కేంద్రం, ఎస్వీయూ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తిరుపతిలోని ఎన్టీఆర్ స్టేడియంలో 'సామూహిక సూర్య నమస్కార్–2025' నిర్వహించారు. ఈ సందర్భంగా 10వేల మందితో సూర్య నమస్కార ఆసనాలు చేయించారు. పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – తిరుపతి సిటీ

గుక్కెడు నీటి కోసం తంటాలు



'మా గ్రామంలో తాగేందుకు గుక్కెడు మంచినీళ్లు లేవు. నెల రోజులుగా అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు' అంటూ చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలంలోని పెరుమాళ్లపల్లె ఎస్సీ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలంటూ ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. గుక్కెడు నీటి కోసం తంటాలుపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌ని అడిగితే ఎమ్మెల్యేను అడగండి అని చేతిలెత్తేసినట్లు తెలిపారు. – వెదురుకుప్పం

మాచ్‌ఖండ్‌లో ఇటలీ దేశస్తుల సందడి

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, ఒనకఢిల్లీ వారపు సంతలో గురువారం ఇటలీ దేశస్తులు సందడి చేశారు. 170 మంది ప్రత్యేక బస్సుల్లో వచ్చారు. ఒనకఢిల్లీ వారపు సంతలో బోండా జాతి ఆదివాసీలతో మమేకం అయ్యారు. వారి వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నారు. వారి నుంచి పూసలు, రింగులు కొనుగోలు చేసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. వించ్ హౌస్‌లో ప్రయాణించిన వారు ప్రత్యేక అనుభూతి పొందారు. డుడుమ జలపాతం, జలాశయాన్ని కూడా సందర్శించారు.

– ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా)



అప్పన్న సన్నిధిలో 'సుప్రీం' విశ్రాంత న్యాయమూర్తి



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వెంకటరామరెడ్డి గురువారం దర్శించుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

– సింహాచలం

మీటర్లలో 'సర్వీస్' మాయ

విద్యుత్ మీటర్లు బిగించి సర్వీస్ నంబర్లు ఇవ్వని డిస్కంలు

- ఆరేళ్లుగా బిల్లులు లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా
- అమలాపురంలో బయటపడ్డ అధికారుల భాగోతం
- రాష్ట్రవ్యాప్తంగా అనేక సెంటర్లలో ఇదే పరిస్థితి
- మీటర్లనూ ప్రమాదకర స్థాయిలో బిగించిన వైనం



ప్రమాదకరంగా విద్యుత్ మీటర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ మీటర్లు అమర్చిన విద్యుత్ పంపిణీ సంస్థలు వాటికి సర్వీస్ నంబర్లు లేవనే విషయాన్ని చాలా ఆలస్యంగా గుర్తించాయి. ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్కిల్ పరిధిలో ఈ భాగోతం వెలుగు చూసింది. దీనిపై నివేదిక సమర్పించాలని ఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీ తేజ్ అధికారులను ఆదేశించగా.. వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో అమలాపురం ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు అమలాపురం సర్కిల్ ఎస్ఈ ఎస్.రాజబాబు మెమో జారీ చేశారు. ఇప్పటికైనా 'మోస్ట్ అర్జంట్ మేటర్'గా పరిగణించి ఏడు రోజుల్లోగా మీటర్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని అందులో స్పష్టం చేశారు. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా వేలాది అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్వీస్ నంబర్ లేకుండా మీటర్లు అమర్చి, బిల్లులు ఇవ్వకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. మరికొన్ని సర్వీసులకు బిల్లులు జారీ చేసినా వాటిని వినియోగదారులకు ఇవ్వలేదు. దీని వెనుక భారీ కుంభకోణం ఉందని తెలుస్తోంది.

మొత్తం బిల్లు ఇప్పుడు ఇస్తాం

"కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు బిల్లులు కూడా రూపొందించాం. కానీ.. ఆ బిల్లులను ఎవరికీ ఇవ్వలేదు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు మీటర్లు ఇచ్చినప్పటికీ సర్వీసు నంబర్ ఇవ్వలేదు. కొన్నేళ్లుగా రీడింగ్ తీయకపోయినా ఆ సమాచారం మీటర్‌లో నిక్షిప్తమై ఉంటుంది. దాని ఆధారంగా మొత్తం బిల్లును ఇప్పుడు జారీ చేస్తాం.

– రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అమలాపురం ఆపరేషన్ డివిజన్

ప్రాణాలతోనూ చెలగాటం

రాష్ట్రవ్యాప్తంగా 55,605 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. దాదాపు 35 లక్షల మంది ఆరేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఈ కేంద్రాలకు వస్తుంటారు. దాదాపు 1.30 లక్షల మంది అంగన్‌వాడీ సిబ్బంది నిత్యం ఈ కేంద్రాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు. అలాంటిచోట విద్యుత్ మీటర్లు 6 అడుగులకు పైగా ఎత్తులో అమర్చాలి. కా..నీ చిన్న పిల్లలుంటారనే కనీస ఇంగితం కూడా లేకుండా ఈ కేంద్రాల్లో కేవలం 3 అడుగులు ఎత్తులోనే మీటర్లు ఏర్పాటు చేశారు.

మీ భోజనానికో దండం.. మిర్చికి మంచి ధర ఇప్పించండి

మార్కెటింగ్ కమిషనర్, జాయింట్ కలెక్టర్‌ను వేడుకున్న రైతులు

గుంటూరు మిర్చి యార్డులో ఉచిత భోజన పథకం ప్రారంభం



కమిషనర్ విజయ సునీత, జేసీ భార్గవ్ తేజకు గోడు వెళ్లబోసుకుంటున్న మిర్చి రైతులు

కొరిటిపాడు (గుంటూరు): 'అయ్యా..! మీ భోజనానికో దండం. మాకు ఉచిత భోజనం అవసరం లేదు. మెరుగైన ధర ఇప్పించేలా చూడండి మహాప్రభో' అని మిర్చి రైతులు మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత, గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.భార్గవ్‌తేజను వేడుకున్నారు. మిర్చి యార్డులో రైతులకు ఉచిత భోజన పథకాన్ని మార్కెటింగ్ శాఖ కమిషనర్, జాయింట్ కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్డుకు వచ్చిన రైతులంతా వారిద్దరినీ కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మిర్చి యార్డులో ధరలు రోజురోజుకు పతనమవుతున్నాయని వాపోయారు. వారం క్రితం రూ.16 వేలు పలికిన క్వింటాల్ మిర్చి ప్రస్తుతం రూ.10 వేలు–రూ.13 వేల మధ్య ఊగిసలాడుతున్నాయని తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో క్వింటాల్‌కు రూ.21 వేల నుంచి రూ.26 వేల వరకు ధరలు లభించాయని గుర్తు చేశారు. ఉదయం పూట బేరం అయిన కాయలు కూడా మధ్యాహ్నానికి ధరలు మారిపోతున్నాయని వివరించారు. కౌలు ధరలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటను యార్డుకు తీసుకొస్తే కనీసం ఖర్చులు కూడా దక్కడం లేదని రైతులు వాపోయారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు సాగు ఖర్చులయ్యాయని, దిగుబడి మాత్రం ఎకరాకు సగటున 10 క్వింటాళ్లు (తాలు, ఎరుపు కలిపి) కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇవే ధరలు కొనసాగితే ఎకరాకు సుమారు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మేమే ఎంతో మందికి అన్నం పెడుతున్నాం. మాకు కావాల్సింది ఉచిత భోజనం కాదు. మెరుగైన ధర కల్పించి మా ప్రాణాలు, మా కుటుంబ సభ్యుల ప్రాణాలు కాపాడండి' అంటూ చేతులు జోడించి రైతులంతా వేడుకున్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ రైతులకు మెరుగైన ధర వచ్చేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పుట్టిన రోజే కబళించిన మృత్యువు

- కానిస్టేబుల్ ఉద్యోగాల దేహదారుఢ్య పరీక్షల్లో యువకుడి మృతి
- ఒక పరుగు పందెంలో నెగ్గిన శ్రావణ్‌కుమార్



ఆరిలోవ: ఉద్యోగ సాధనలో విజయం సాధించి సాయంత్రం పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలన్న ఆ యువకుడి జీవనయానం హఠాత్తుగా ముగిసింది. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం జరిగిన పరుగు పోటీలో పాల్గొన్న ఆ యువకుడు అనూహ్యంగా తనువు చాలించాడు. ఓ దశ పరుగు పందెం నెగ్గి, రెండో దశ కోసం వేచి ఉన్న సమయంలో కుప్పకూలిపోయాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. విశాఖ నగరంలోని కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో గురువారం ఈ విషాద ఘటన జరిగింది. గురువారమే అతని పుట్టిన రోజు కూడా. కానిస్టేబుల్ నియామక పరీక్షలకు వెళ్లి వచ్చి సాయంత్రం స్నేహితులు, కుటుంబ సభ్యులతో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలనుకున్న యువకుడి ఆశల్ని మృత్యువు చిదిమేసింది.

పోలీసులు, బంధువు కథనం ప్రకారం.. విశాఖ నగరం పదో వార్డు రవీంద్రనగర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కె.ఎ.శ్రావణ్‌కుమార్ (24) పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలకు శ్రావణ్‌కుమార్ గురువారం హాజరయ్యాడు. మొదట జరిగిన 1,600 మీటర్ల పరుగులో పాల్గొన్నాడు. 8 నిమిషాలలో పూర్తి చేయాల్సిన పరుగును 7.1 నిముషాల్లోనే పూర్తి చేసి తదుపరి పరీక్షలకు అర్హత సాధించాడు. మరికొద్ది సమయంలో తదుపరి పరీక్షల్లో పాల్గొనాల్సి ఉంది. ఇంతలో కూర్చున్న చోటే అస్వస్థతకు గురై కుప్పకూలిపోయి, అపస్మారకస్థితికి చేరాడు. దీన్ని గమనించిన పోలీసులు అంబులెన్స్‌లో విమ్స్‌కు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా ప్రాణాలు విడిచాడు. విషయం తెలుసుకున్న శ్రావణ్‌కుమార్ తల్లి, కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. శ్రావణ్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

8 నెలల క్రితం తండ్రి మృతి

శ్రావణ్‌కుమార్ తండ్రి కె.అర్జునరావు ప్రైవేట్ ఉద్యోగం చేసేవారు. ఆయన 8 నెలల క్రితం అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆ కుటుంబానికి ఇంజినీరింగ్ చదువుతున్న శ్రవణ్‌కుమారే పెద్ద దిక్కుగా నిలుస్తాడని తల్లి కనకమహాలక్ష్మి ఆశలు పెట్టుకుంది. ఇప్పుడు అతను కూడా మరణించడంతో తల్లి, చెల్లికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది.

మరో మహిళతో అక్రమ సంబంధంతోనే?

'భార్యను చంపి, ఉడికించిన' కేసులో కొత్త కోణం

అడ్డు తొలగించుకునేందుకే భార్యను హత్యచేసిన గురుమూర్తి



గురుమూర్తి, మాధవి (ఫైల్)

మీర్‌పేట/రాచర్ల : 'మహిళను చంపి, ఉడికించిన' కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. మరో మహిళతో అక్రమ సంబంధం నేపథ్యంలో అడ్డు తొలగించుకునేందుకే గురుమూర్తి తన భార్య మాధవిని హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గురుమూర్తి సెల్‌ఫోన్‌లో మరో మహిళతో ఉన్న ఫోటోలు లభించడంతో ఈ దిశగా దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది. అయితే విచారణ సందర్భంగా అతడు పొంతన లేని సమాధానాలు చెబుతుండటం, ఇంకా ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో... అసలేం జరిగింది? అతను చెప్పేది నిజమా, అబద్ధమా? అనేది మిస్టరీగా మారిందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కేసులో అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి వివరాలనూ పోలీసులు వెల్లడించకపోవడం గమనార్హం.

ఏమాత్రం ఆనవాళ్లు, ఆధారాలు దొరక్క: తనతో గొడవ పడి భార్య బయటికి వెళ్లిపోయిందని గురుమూర్తి బంధువులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మిస్సింగ్ కేసు పెట్టించాడు. దీనితో పోలీసులు ఆ కాలనీలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. 14న మాధవి బయటి నుంచి ఇంట్లోకి వెళ్లినట్టుగా సీసీ కెమెరా వీడియోల్లో ఉంది. తర్వాత ఆమె బయటికి రాలేదు. గురుమూర్తి ఒక్కడే ఇంటి నుంచి బయటకు వెళ్లిరావడాన్ని పోలీసులు గుర్తించారు. దీనికితోడు గురుమూర్తి ప్రవర్తనపై సందేహంతో.. మాధవిని ఇంట్లోనే హత్య చేసి ఉండవచ్చని భావించి, ఇంట్లో, పరిసరాలను పరిశీలించారు. తర్వాత అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. భార్య తలపై ఆయుధంతో మోది హత్య చేసి, శరీరాన్ని ముక్కలు చేశానని.. బకెట్‌లో వేసి వాటర్ హీటర్‌తో ఉడికించి, రోకలితో దంచి చెరువులో పడేశానని నిందితుడు పోలీసుల విచారణలో చెప్పినట్టు తెలిసింది. పోలీసులు చెరువులో గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినా ఎలాంటి ఆధారమూ లభించలేదని.. ఇంట్లోని బాత్రూమ్, వీధిలోని అన్ని మ్యాన్‌హోళ్లను పరిశీలించినా స్పష్టతా రాలేదు.

బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్లు జైలు శిక్ష

కర్నూలు: బాలికను బెదిరించి నాలుగుసార్లు అత్యాచారం చేసిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు గురువారం తీర్పు చెప్పింది. గోనెగండ్ల మండలం గంజిహల్లి గ్రామానికి చెందిన దర్గా షేక్‌షావలి (30) జేసీబీకి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కర్నూలు మహవీర్‌నగర్‌లో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లి శాంత ఫిర్యాదు మేరకు 2021 ఆగస్టు 12న కర్నూలు మహిళా పోలీస్‌స్టేషన్‌లో పోక్సో యాక్ట్ 2012 కింద కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి భూపాల్ రెడ్డి తీర్పు వెలువరించారు. బాధితురాలికి ప్రభుత్వం తరఫున రూ.2 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు.

గిరిజన మహిళకు న్యాయం చేయండి: శంకర్‌నాయక్

సాక్షి, అమరావతి: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆయన అనుచరుల దాడికి గురైన గిరిజన మహిళ భూక్యా చంటికి న్యాయం చేయాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గం, గోపాలపురం గ్రామానికి వెళ్లి బాధితురాలు భూక్యా చంటిని కలిసి వివరాలు తెలుసుకున్న శంకర్‌నాయక్ ఈ విషయమై గురువారం గవర్నర్‌కు లేఖ రాశారు.

శ్మశానంలోనూ రెచ్చిపోయిన టీడీపీ నేతలు

అధికారుల జోక్యం చేసుకున్నా కొలిక్కి రాని సమస్య

పొదిలి రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార పార్టీ నాయకులు శ్మశానాల్లోనూ ఇష్టారీతిన రెచ్చిపోతున్నారు. ప్రకాశం జిల్లా పొదిలి మండలం ఏలూరు పంచాయతీలోని టి – సల్లూరు గ్రామ శ్మశానంలో గురువారం ఓ మృతదేహానికి కర్మకాండలకు కూడా అనుమతివ్వకుండా అడ్డుకున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెలగాల వెంకటేశ్వర్లు (40) కొంత కాలం నుంచి విజయవాడలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. దీంతో బంధువులు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని స్వగ్రామమైన టి – సల్లూరు తీసుకొచ్చారు. గురువారం అంత్యక్రియలకు సిద్ధమయ్యారు. గ్రామంలోని హిందూ శ్మశానంలో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా అధికార టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ఆ శ్మశాన వాటికలో కర్మకాండలకు ఒప్పుకోలేదు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో ఉన్న శ్మశాన వాటికలో ఎన్నో ఏళ్లుగా అన్ని కులాల వారు కర్మకాండలు చేసుకుంటున్నారు. ప్రధానంగా గ్రామంలో రెండు కులాలు బలంగా ఉన్నాయి. గత ఎన్నికల నుంచి కమ్మ సామాజిక వర్గం వారు టీడీపీకి, యాదవ వర్గీయులు వైఎస్సార్‌సీపీకి మద్దతుదారులుగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో గ్రామంలో అన్నింట్లోనూ టీడీపీ నేతలు పెత్తనం చలాయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్వర్లు కర్మకాండలను అడ్డుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సమాచారం అందుకున్న తహసీల్దారు ఎంవీ కృష్ణారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. గురువారం రాత్రి కూడా సమస్య కొలిక్కి రాకపోవడంతో మృతదేహాన్ని శ్మశానం వద్ద రోడ్డుపైనే ఉంచారు.



మృతదేహం వద్ద కాపలాగా ఉన్న పోలీసులు

నోటీసు పేరుతో హైడ్రామా

ఈ వివాదంలో నోటీసుల పేరుతో హైడ్రామా నడిచింది. 'మృతదేహాన్ని వేరే స్థలంలో ఖననం చేసుకునేందుకు స్థలం చూపిస్తాం. లేదంటే మృతదేహాన్ని తీసుకెళ్తాం' అని మృతుడి బంధువులకు అధికారులు నోటీసులిచ్చారు. వారు అక్కడే ఖననం చేయాలని భీష్మించడంతో అధికారులు మృతదేహాన్ని ఓ వాహనంలో పక్కకు తరలించారు. కాసేపటి తర్వాత మృతదేహాన్ని తీసుకొచ్చి వివాదాస్పద స్థలంలోనే ఉంచారు. విషయం అక్కడికి చేరుకున్న బంధువులను పోలీసులు దగ్గరకు రానివ్వలేదు. రాత్రి 10.30 గంటలకు కూడా మృతదేహం శ్మశానంలోనే ఉంది.

రైతుల దీక్షా శిబిరానికి నిప్పు

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

గురువారం కొనసాగిన నిరసన దీక్షలు



దీక్షలు చేస్తున్న స్థానిక రైతులు

కుప్పం రూరల్: చిత్తూరు జిల్లా కుప్పం మండలం, ఆవుల నత్తం జెల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా గత పదిహేను రోజులుగా రైతులు నిరసన దీక్షలు చేపడుతున్నారు. కాగా ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి దీక్షా శిబిరానికి ఓ వైపు నిప్పుపెట్టారు. ఉదయానికల్లా ఎలాంటి ఆనవాళ్లు లేకుండా దుండగులు తొలగించారు. గురువారం ఉదయం వచ్చిన రైతులు శిబిరాన్ని చూడగానే నిప్పుపెట్టిన ఆనవాళ్లు కనిపించాయి. దీనిపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం దీక్షలను కొనసాగించారు. రైతులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్వహణ వల్ల తమ పొలాలు, ఇళ్లు నాశనమవుతున్నాయని, ఫ్యాక్టరీని మూసివేసే వరకు దీక్షలు విరమించేది లేదని అన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం శిబిరానికి నిప్పు పెట్టినా తమ నిరసనను కొనసాగిస్తామని, తమకు న్యాయం జరిగే వరకు నిరవధిక దీక్షలు చేస్తామని పేర్కొన్నారు.



డెడ్‌లైన్ డెలివరీలు

ట్రంప్ దెబ్బకు మనోళ్లకు కడుపు 'కోత'!

- అమెరికాలో హఠాత్తుగా పెరిగిన కడుపు'కోత'లు
- నెలలు నిండకముందే సిజేరియన్లు

ఎన్నో కలలతో అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన భారతీయులకు ఒక్కకలంపోటుతో వారి కలలను ట్రంప్ కకావికలు చేసిన ఉదంతంలో మరో విషాద కోణం తాజాగా ఆవిష్కృతమైంది. భారతీయ అమెరికన్లు ఎలాగో ఏదో ఒక వీసా మీద వచ్చి అమెరికాలో తాత్కాలికంగా స్థిరపడి జీవిస్తుండగా తమ సంతానానికైనా జన్మతః అమెరికా పౌరసత్వం వస్తుందన్న ఆశ ఇన్నాళ్లూ ఉండేది. భారతీయ అమెరికన్ గర్భిణీలు అక్కడే ప్రసవించడం చాన్నాళ్లుగా జరుగుతోంది. గ్రీన్ కార్డ్, పౌరసత్వం కోసం ఏళ్ల తరబడి వేచిఉండాల్సిన శ్రమ తప్పుతుందని మనవాళ్ల ఆలోచన. జన్మతః పౌరసత్వం దక్కుతుందన్న ఆశలకు కాలం చెల్లిందంటూ ట్రంప్ చేసిన తాజా ప్రకటన అక్కడి భారతీయుల ఆశలపై నీళ్లు చల్లింది. అయి నాసరే చివరి ప్రయత్నంగానైనా, ఏలాగైనా సరే తమ సంతానానికి పౌరసత్వం సాధించాలనే పట్టుదలతో అక్కడి భారతీయ గర్భిణీలు ముందస్తు డెలీవరీలకు సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 20లోపు పుట్టిన పిల్లలకే జన్మతః పౌరసత్వం వస్తుందని ట్రంప్ తన కార్యనిర్వాహక ఉత్తర్వులో పేర్కొనడంతో ఆలోపు పిల్లల్ని కనేయాలని భారతీయ దంపతులు ఆరాటపడుతున్నారు. ఇందుకు నిదర్శనంగా అక్కడి ఆస్పత్రుల వద్ద భారతీయ గర్భిణుల క్యూ లైన్లు కనిపిస్తున్నాయి.

అందరి మదిలో అదే డేటు

అమెరికా 47వ అధ్యక్షుడిగా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన ట్రంప్... మరుక్షణమే తమ దేశంలో జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేయడం తెల్సిందే. అమెరికాలో శాశ్వత నివాసితులు కాని వారికి జన్మించే పిల్లలకు జన్మతః పౌరసత్వం దక్కదంటూ ట్రంప్ తేల్చేశారు. ఉత్తర్వు జారీ అయిన నెల రోజుల తర్వాత సంబంధిత ఉత్తర్వు అమల్లోకొస్తుంది. అంటే ఫిబ్రవరి 20వ తేదీన ఆ ఉత్తర్వు అమల్లోకి వస్తుంది. ఈ తేదీ ఇప్పుడు అమెరికాలో ఉంటున్న భారతీయ దంపతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. ట్రంప్ ఉత్తర్వు నేపథ్యంలో ఫిబ్రవరి 20లోపే గర్భిణులకు నెలలు నిండక మునుపే సిజేరియన్ విధానంలో పిల్లల్ని కనేందుకు భారతీయ దంపతులు తొందరపడుతున్నారు. డెలి'వర్రీ'తో ఆస్పత్రుల వద్ద క్యూలు పెరిగిపోయాయి. అమెరికాలోని ఓ రాష్ట్రంలో ప్రసూతి ఆస్పత్రి నడుపుతున్న ఒక భారతీయ వైద్యుడికి గత రెండు రోజులుగా భారతీయ దంపతుల నుంచి 'ముందస్తు డెలివరీ' అభ్యర్థనలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా 8వ నెల, 9వ నెల గర్భిణులు 'సి–సెక్షన్' (సిజేరియన్ ఆపరేషన్) కోసం ఆసక్తి కనబరుస్తున్నారు. 'డెడ్‌లైన్' ఫిబ్రవరి 20వ తేదీ తర్వాత పుడితే ఆ చిన్నారులకు అమెరికా పౌరసత్వం లభించదన్న భయం త్వరలో తల్లిదండ్రులు కాబోయే జంటలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

ఎంక్వైరీలు బాగా పెరిగాయి

ఏడో నెల గర్భిణి అయిన ఓ భారతీయ మహిళ ముందస్తు ప్రసవం కోసం సిజేరియన్ ఆపరేషన్ చేయాలంటూ భర్తతో కలసి తనను సంప్రదించినట్టు ఆ భారతీయ వైద్యుడు వెల్లడించారు. వాస్తవానికి ఆమె మార్చి నెలలో ప్రసవించాల్సి ఉంది. ఇలా నెలలు నిండకుండానే జరిగే కాన్పుల కారణంగా తల్లికి, బిడ్డకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని గైనకాలజిస్టు వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ''నెలలు నిండకుండా పుట్టే చిన్నారిలో ఊపిరితిత్తులు పూర్తిస్థాయిలో రూపొందవు. పోషణతోపాటు నాడీ సంబంధ సమస్యలు తలెత్తుతాయి'' అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అంశాలన్నిటినీ తమ వద్దకు వస్తున్న భారతీయ జంటలకు వైద్యులు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయమై ఒక భారతీయ వైద్యుడు గత రెండు రోజుల్లో సుమారు 20 మంది భారతీయ దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జన్మతః పౌరసత్వం చట్టం అమలు విధానం ఒక్కసారిగా మారిపోవడంపై భారతీయ దంపతులు తెగ ఆందోళన వ్యక్తంచేశారు. ''మేం భారత్ నుంచి అమెరికాకు రావడానికి ఎంతో త్యాగం చేశాం. ప్రస్తుతం నా భార్య గర్భంతో ఉంది. మాకు తొలి బిడ్డ పుట్టబోతోంది. కానీ మా ఎదుటే పౌరసత్వ తలుపులు మూసుకుపోవడం చూస్తుంటే ఎంతో బాధగా ఉంది'' అని కాలిఫోర్నియాలో నివసిస్తున్న 28 ఏళ్ల ఒక భారతీయుడు బాధపడ్డాడు.

– సాక్షి, నేషనల్‌డెస్క్

పౌరసత్వం ఉత్తర్వుకు కోర్టులో చుక్కెదురు

అమలు తాత్కాలిక నిలుపుదల

సియాటెల్: అత్యంత ఆర్భాటంగా ట్రంప్ ఇచ్చిన 'జన్మతః పౌరసత్వం రద్దు' కార్యనిర్వాహక ఉత్తర్వు అమల్లోకి రాకమునుపే అమెరికా కోర్టులో అవరోధాన్ని ఎదుర్కొంది. ఉత్తర్వు అమల్లోకి రాకుండా ఆపాలంటూ 4 రాష్ట్రాలు చేసిన అభ్యర్థనను అమెరికా డిస్ట్రిక్ట్ జడ్జి జాన్ సి. కఫెనర్ ఆలకించారు. ''ట్రంప్ ఉత్తర్వు అమల్లోకిరాకుండా తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఆదేశాలిస్తున్నా. ట్రంప్ ఇచ్చిన ఉత్తర్వు పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం'' అని కేసు విచారణ సందర్భంగా జడ్జి కఫెన్ వ్యాఖ్యానించారు. వాషింగ్టన్, అరిజోనా, ఇల్లినాయిస్, ఒరేగాన్ రాష్ట్రాలు సంయుక్తంగా వేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన జడ్జి ఆ తర్వాత ఈ ఉత్తర్వులిచ్చారు. ఉత్తర్వును వ్యతిరేకిస్తూ విపక్షపార్టీపాలిత 22 రాష్ట్రాలు విడిగా వేసిన ఐదు పిటిషన్లలో ఈ నాలుగు రాష్ట్రాలు కలిపివేసిన సియాటెల్ కోర్టులో వేసిన ఈ పిటిషన్ కూడా ఉంది. ''కేసులో ప్రాథమిక విజయం సాధించాం'' అని వాషింగ్టన్ అటార్నీ జనరల్ నికొలస్ బ్రౌన్ వ్యాఖ్యానించారు.



కాస్టేయిక్ సరస్సు వెంబడి ప్రాంతాలను దహిస్తున్న మంటలు



కాస్టేయిక్ సరస్సు సమీపంలో మంటలను పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లాస్ ఏంజెలెస్‌లో మళ్లీ కార్చిచ్చు

10 వేల ఎకరాల్లో అటవీప్రాంతాన్ని బూడిదచేసిన అగ్నికీలలు

కాస్టేయిక్: రెండువారాల క్రితం అమెరికాలో లాస్ ఏంజెలెస్ సిటీ, కౌంటీ పరిధిలో వేల ఎకరాల్లో అటవీప్రాంతాలను బూడిదగా మార్చేసిన కార్చిచ్చు ఘటనను మరువక ముందే అక్కడికి కేవలం 64 కిలోమీటర్ల దూరంలో కొత్త కార్చిచ్చు అంటుకుంది. విపరీతంగా వీస్తున్న గాలులు తోడవడంతో అగ్నికీలలు వేగంగా కొన్ని గంటల్లోనే 10,000 ఎకరాలకు వ్యాపించి అడవిని కాల్చేశాయి. జనవరి ఏడున మొదలై లాస్ ఏంజెలెస్‌లో విధ్వంసం సృష్టించిన కార్చిచ్చు పూర్తిగా ఆరిపోకముందే బుధవారం తెల్లవారుజామున మరోచోట మంటలు మొదలవడంతో స్థానికుల్లో భయాందోళనలు ఒక్కసారిగా ఎక్కువయ్యాయి. లాస్ ఏంజెలెస్ సిటీకి వాయవ్యంగా 72 కిలోమీటర్ల దూరంలో ఈ మంటలు మొదలయ్యాయి. కాస్టేయిక్ సరస్సు సమీపంలోని కొండ ప్రాంతాల్లో ఇవి అంటుకున్నాయి. హ్యూస్ ఫైర్‌గా పిలిచే ఈ మంటలు కొన్ని గంటల్లోనే బలమైన, వేడి శాంటా అనా గాలుల ధాటికి శరవేగంగా విస్తరిస్తున్నాయి. శాంటా క్లారిటా నగరానికి సమీపంలో ఉన్న ఈ సరస్సు చుట్టూ 31,000 మంది స్థానికులు వెంటనే ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. మంటలు ఇంకా వ్యాపిస్తే మీరు కూడా ఖాళీచేయాల్సి ఉంటుందని కాస్తదూరంగా ఉంటున్న మరో 23,000 మందికి సమాచారం ఇచ్చారు. లాస్ ఏంజెలెస్ కౌంటీ అగ్నిమాపక శాఖ తన వైమానిక దళాన్ని రంగంలోకి దింపింది. హ్యూస్‌ఫైర్ ఘటనలో ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. మూడు వారాలుగా మండుతున్న ఈటన్, పాలిసేడ్స్ మంటలకు 64 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ షాపింగ్ మాల్‌ను ఖాళీ చేయించారు. డిటెన్షన్ సెంటర్‌లో ఉన్న ఖైదీలను తరలించారు. ఈ ప్రాంతంలోని ఇతర జైళ్లలో ఉన్న సుమారు 4,600 మంది ఖైదీలు ఆశ్రయం పొందుతున్నారని, పరిస్థితులు మారితే వారిని తరలించడానికి బస్సులు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెప్పారు. మంటల కారణంగా ఐ5 రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలిఫోర్నియా హైవే పెట్రోలింగ్ విభాగం తెలిపింది. లాస్ ఏంజెలెస్ నుంచి సెంట్రల్ కాలిఫోర్నియాకు వెళ్లే కీలక మార్గమైన ఇంటర్‌స్టేట్ 5లో 30 మైళ్ల ప్రాంతాన్ని మూసేశారు. కొత్త అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతంలోని ప్రతి ఒక్కరూ వెంటనే వెళ్లిపోవాలని లాస్ ఏంజెలెస్ కౌంటీ షెరీఫ్ విభాగ అధికారి రాబర్ట్ జెన్సన్ హెచ్చరించారు. పాలిసేడ్స్, ఈటన్ అగ్నిప్రమాదాల్లో ప్రజలు ఆ ఆదేశాలను పాటించలేదని, ఈసారైనా పాటించాలని కోరారు. తరలింపు ఉత్తర్వులు జారీ చేసిన ప్రతి ఒక్కరూ ఇళ్లనుంచి వెళ్లిపోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎవరెస్ట్ అధిరోహకులకు షాక్ ఫీజు 36 శాతం పెంపు

కాఠ్మండు: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వత శిఖరం ఎవరెస్టు అధిరోహించాలనుకునే వారికి నేపాల్ ప్రభుత్వం పెద్ద షాక్ ఇచ్చింది. హిమాలయ శిఖరాన్ని దక్షిణం దిశ నుంచి మార్చి– మే మధ్య వసంత రుతువులో అధిరోహించాలనుకునే విదేశీయులు ఒక్కొక్కరి నుంచి వసూలు చేస్తున్న ఫీజు మొత్తాన్ని రూ.9.50 లక్షల నుంచి ఏకంగా రూ.13 లక్షలకు పెంచేసింది. సెప్టెంబర్–నవంబర్ మధ్యన ఫీజును రూ.4.75 లక్షల నుంచి రూ.6.48 లక్షలకు పెంచింది. శీతాకాలంలో డిసెంబర్–ఫిబ్రవరి మధ్య, వర్షాకాలం జూన్–ఆగస్టు సీజన్లలో ఒక్కో వ్యక్తి చెల్లించే ఫీజును రూ.2.37 లక్షల నుంచి రూ.3.24 లక్షలకు పెంచామని గురువారం ప్రకటించింది. నేపాలీవ్యక్తులైతే వసంత రుతువులో చెల్లిస్తున్న రూ.75 వేల ఫీజును రూ.1.50 లక్షలకు పెంచినట్లు తెలిపింది. నూతన షరతులు ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయని స్పష్టం చేసింది. పర్వతారోహణ పూర్తయిన వారు తమ వెంట తీసుకెళ్లిన మల విసర్జన బ్యాగ్‌ను తిరిగి బేస్ క్యాంపునకు వచ్చి, సక్రమంగా వదిలివేయాల్సి ఉంటుంది. 8 వేల మీటర్లకు పైగా శిఖరాలను అధిరోహించే వారు వ్యర్థాలను సేకరించేందుకు బయో డీగ్రేడబుల్ బ్యాగ్‌లను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని తెలిపింది. అంతేకాదు, పర్యాటక శాఖ అనుమతించిన వస్తువులనే వెంట తీసుకెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

అమెరికాలో ఉత్పత్తి చేయండి లేదంటే టారిఫ్ కట్టండి

పారిశ్రామికవేత్తలకు ట్రంప్ సూచన



దావోస్: అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చోగానే డజన్ల కొద్దీ కార్యనిర్వాహక ఉత్తర్వులతో అమెరికన్లనేకాదు ప్రపంచదేశాలనూ విస్మయపరిచిన వివాదాస్పద నేత డొనాల్డ్ ట్రంప్ తన హెచ్చరికల ఖడ్గాన్ని ఈసారి పారిశ్రామికవేత్తలపై ఝుళిపించారు. ఏకంగా ప్రపంచ వాణిజ్య సదస్సు వార్షిక సమావేశం సాక్షిగా అంతర్జాతీయ వాణిజ్యవేత్తలకు తనదైన శైలిలో 'సూచనలు' చేశారు. అమెరికాలో వస్తూత్పత్తిని పెంచాలని, ఈ మేరకు తమ కర్మాగారాలను అమెరికాకు తరలించాలని పిలుపునిచ్చారు. అమెరికాలో తయారు చేయకపోతే దిగుమతిచేసుకునే వస్తువులపై మరింత టారిఫ్ భారం మోపుతామని పరోక్షంగా హెచ్చరించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ వాణిజ్య సదస్సు(డబ్ల్యూఈఎఫ్)లో గురువారం ట్రంప్ వర్చువల్‌గా ప్రసంగించారు. ''ప్రపంచంలోనే ప్రతి వస్తూత్పత్తి సంస్థకు నేను చాలా సులభమైన సలహా ఇస్తున్నా. అమెరికాకు వచ్చి ఇక్కడే ఉత్పత్తి మొదలెట్టండి. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత అత్యల్ప పన్నులను విధిస్తాం. అయితే తమ ఉత్పత్తులను ఏ దేశంలో తయారు చేయాలనే పూర్తి స్వేచ్ఛ ఆయా కంపెనీలకు ఉంది. అయితే అమెరికా ఆవల తయారయ్యే ఉత్పత్తుల విషయంలో, వాటి ఆర్థికఅంశాలపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, వాటి పర్యావసానాలు ఎలా ఉంటాయి అనేది అమెరికానే నిర్ణయిస్తుంది. నేను ఇంతచెప్పినా మీరు అమెరికాలో తయారుచేయబోమని భీష్మించుకుని కూర్చుంటే, మీరు అధిక టారిఫ్ చెల్లించక తప్పదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

సౌదీ.. రేట్లు తగ్గించుకో..

''చమురు ధరలను సౌదీ అరేబియా తగ్గించాలి. సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ చెప్పినట్లు 600 బిలియన్ డాలర్లుకాకుండా సౌదీ మా దేశంలో ఒక ట్రిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలి. హాస్యాస్పదమైన, ఏకపక్షంగా ఉన్న పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికాను ఉపసంహరించా. అమెరికాలో మొత్తం వాహనాల్లో నిష్పత్తిలో కొంతమేరకు అత్యంత ఖరీదైన విద్యుత్ వాహనాలనే తప్పకుండా వాడాలనే నిబంధనను రద్దుచేశా. అధిక చమురు ధరలను సౌదీ అరేబియా తగ్గించాల్సిందే. చమురు ధరలు తగ్గితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కూడా ఒక ముగింపునకు వస్తుంది'' అని ట్రంప్ అన్నారు.

చట్ట సభలో ట్రంప్ తొలి విజయం

నేరాలకు పాల్పడ్డ అక్రమవలసదారుల నిర్బంధ బిల్లుకు దిగువసభ ఆమోదం

వాషింగ్టన్: అనుమతి లేకుండా దేశంలోకి ప్రవేశించి, నేరాలకు పాల్పడిన వలసదారులను నిర్బంధించి, బహిష్కరించేందుకు వీలు కల్పించే బిల్లుకు అమెరికా పార్లమెంట్ దిగువ సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. దీంతో ఈ వారంలో అధికారపగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్‌కు పార్లమెంట్‌లో బిల్లు నెగ్గించుకుని తొలి విజయం దక్కింది. బిల్లు ఆమోదంపొందటంతో అధ్యక్షుడిగా ట్రంప్ సంతకం చేసే తొలి బిల్లు ఇదే అయ్యే అవకాశముంది. గతేడాది ఉదయపు నడకకు వెళ్లి హత్యకు గురైన జార్జియాకు చెందిన 22 ఏళ్ల నర్సింగ్ విద్యార్థి లేకెన్ రైలీ పేరు మీద ఈ బిల్లును రూపొందించారు. ఈ బిల్లులోని నిబంధనల ప్రకారం చట్టవిరుద్ధంగా లేదా చట్టపరమైన హోదా లేకుండా అమెరికాలో ఉన్న డాక్యుమెంట్లు లేని వలసదారులు దొంగతనం సహా కొన్ని క్రిమినల్ నేరాలకు పాల్పడితే, అరెస్టయినా, దోషులుగా తేలినా వారిని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం నిర్బంధంలోకి తీసుకుంటుంది. అధికారులపై దాడి, తీవ్ర గాయాలు, మరణానికి కారణమైతే క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు. ఈ సవరణలను సెనేట్ గత వారం చర్చించిన తర్వాత తాజాగా బిల్లును ప్రతినిధుల సభ ఆమోదించింది. ఈ బిల్లుకు ఓటింగ్ చేపట్టగా 263 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 156 మంది బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. 46 మంది విపక్ష డెమొక్రాట్లు సైతం బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడం విశేషం. చట్టవిరుద్ధంగా దేశంలోకి వచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న ధోరణి విపక్ష పార్టీలోనూ కనిపిస్తుందనడానికి ఈ 46 మంది డెమొక్రాట్ల ఓట్లు అద్దంపడుతున్నాయి.



బ్యాంకాక్‌లోని పారగోన్ షాపింగ్ మాల్‌లో స్వలింగ దంపతుల సెల్ఫీ ముచ్చట

స్వలింగ వివాహాలకు చట్ట బద్ధత

- థాయ్‌లాండ్‌లో అమల్లోకి వచ్చిన చట్టం
- మొదటి రోజే ఒక్కటైన వందలాది జంటలు

బ్యాంకాక్: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించే చట్టం థాయిలాండ్‌లో గురువారం అమల్లోకి వచ్చింది. దీంతో, మొదటిరోజే వందలాదిగా జంటలు ఒక్కటయ్యాయి. రాజధాని బ్యాంకాక్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో ఏర్పాటైన ఈ వివాహ వేడుకలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెళ్లికి నిర్వచనం మారుస్తూ థాయ్ ప్రభుత్వం పౌర స్మృతిలోని కీలకమైన 1448 నిబంధనను ఆమోదించగా, దేశవ్యాప్తంగా ఒక్క రోజే నమోదైన వివాహాలు 1,448 మార్కును దాటే అవకాశముందని అధికారులు తెలిపారు. దావోస్‌లో ఉన్న ప్రధానమంత్రి షినవత్రా ఈ సందర్భంగా స్వలింగ జంటలకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఎల్జీబీటీక్యూ వర్గం ఇంద్ర ధనస్సు జెండా థాయ్‌లాండ్‌పై రెపరెపలాడుతోంది' అంటూ ఫేస్‌బుక్ పేజీలో కామెంట్ పెట్టారు. జిల్లా మ్యారేజీ కార్యాలయాల్లో అధికారులు కొత్త జంటల కోసం పార్టీలు, ఫొటో బూత్‌లను ఏర్పాటు చేశారు. కప్ కేక్‌లను పంచిపెట్టారు. మొదటిగా పెళ్లి రిజిస్టర్ చేసుకున్న వారికి విమాన ప్రయాణ టిక్కెట్లను సైతం ఆఫర్ చేశాయి కొన్ని కంపెనీలు. ఇలాంటి మధుర క్షణాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నట్లు కొన్ని జంటలు సంతోషం వ్యక్తం చేశాయి. స్వలింగ వివాహం చట్టం ద్వారా ఏకమయ్యే వారు ఇకపై ఆస్తులను నిర్వహించుకోవచ్చు, వారసత్వంగా పొందొచ్చు పిల్లల్ని దత్తత తీసుకోవచ్చు. తమ జీవిత భాగస్వామి అనారోగ్య పాలైతే వైద్య సదుపాయాలను వర్తింప జేసుకోవచ్చు, ఆర్థిక ప్రయోజనాలను పంచుకోవచ్చు. గతేడాది జూన్‌లో ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో ఉభయ సభలు దాదాపు ఏకగ్రీవంగా ఆమోదించాయి. సెప్టెంబర్‌లో థాయ్ రాజు దీనిపై సంతకం చేశారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించిన మూడో ఆసియా దేశం థాయ్‌ల్యాండ్. ఇప్పటి వరకు ఇలాంటి వివాహాలను నేపాల్, తైవాన్ చట్టాలు మాత్రమే గుర్తించాయి. థాయ్ పౌరస్మృతిలోని 70 సెక్షన్లు మార్చారు. మగ, ఆడ, భర్త, భార్య వంటి లింగ సూచక పదాలకు బదులుగా వ్యక్తి, భాగస్వామి అనే వాటిని చేర్చారు. అయితే, స్వలింగ జంటలు సరోగసీ ద్వారా కుటుంబాలను కలిగి ఉండాలంటే చట్టాల్లో మరో డజను వరకు మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

ఫోన్ మోడల్‌ను బట్టి క్యాబ్ చార్జీలా?

- రెండు రకాల చార్జీలపై వివరణ ఇవ్వండి
- ఓలా, ఉబర్‌కు సీసీపీఏ నోటీసులు

న్యూఢిల్లీ: నగరాలు, పట్టణాల్లో క్యాబ్‌ల కోసం ఓలా లేదా ఉబర్‌లో బుక్ చేసుకోవడం పరిపాటిగా మారింది. ఇందుకోసం స్మార్ట్‌ఫోన్‌లో సంబంధిత యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. క్యాబ్ బుకింగ్ కోసం ఉపయోగించిన ఫోన్ మోడల్‌ను బట్టి చార్జీలు మారుతుంటాయా? మారుతున్నాయనే చెబుతున్నారు. ఖరీదైన ఫోన్ నుంచి బుక్ చేస్తే ఎక్కువ చార్జీ, చౌకరకం ఫోన్ నుంచి బుక్ చేస్తే తక్కువ చార్జీ వసూలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సంబంధిత యాప్‌ల్లో ఈ మేరకు మార్పులు చేర్పులు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఓలా, ఉబర్‌ల నిర్వాకంపై చాలామంది ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ(సీసీపీఏ) స్పందించింది. ఓలా, ఉబర్‌లకు గురువారం నోటీసులు జారీ చేసింది. ఫోన్ మోడల్‌ను బట్టి క్యాబ్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు వెల్లువెత్తుతున్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఐఫోన్ నుంచి బుక్ చేస్తే ఒకరకంగా, ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ నుంచి బుక్ చేస్తే మరోరకంగా చార్జీలు విధిస్తుండడం నిజమేనా? అని ప్రశ్నించింది. ఒకే రకమైన సేవకు రెండు భిన్నమైన చార్జీలా? అని నిలదీసింది. చార్జీల విధిస్తున్న విధానం ఏమిటో చెప్పాలని పేర్కొంది. వినియోగదారుల నుంచి చార్జీల వసూలులో పూర్తి పారదర్శకత ఉండాలని సీసీపీఏ స్పష్టంచేసింది. ఒకేచోటు నుంచి ఒకే గమ్యస్థానానికి రెండు రకాల ఫోన్ల నుంచి రెండు క్యాబ్‌లు బుక్ చేస్తే రెండు రకాల చార్జీలు వసూలు చేసినట్లు ఢిల్లీకి ఓ వ్యాపారవేత్త బయటపెట్టడంతో ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందించారు. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్‌లపై విచారణ జరపాలని సీసీపీఏను ఆదేశించారు.



సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

నేతాజీని స్ఫూర్తిగా తీసుకోండి

- విద్యార్థులకు ప్రధాని మోదీ పిలుపు
- పార్లమెంట్ పాత భవనంలో చర్చ

న్యూఢిల్లీ: భావిభారత పౌరులైన విద్యార్థులు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని పరాక్రమ్ దివస్ కార్యక్రమంలో భాగంగా పాత పార్లమెంట్ భవంతిలో నేతాజీ చిత్రపటం వద్ద మోదీ నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులనుద్దేశించి తర్వాత మోదీ ప్రసంగించారు. 'నాడు స్వరాజ్యం కోసం ప్రజలు ఐక్యంగా మెలిగారు. నేడు ప్రజల మధ్య అదే ఐక్యత సాధిస్తే అది వికసిత భారత్‌కు బాటలు వేస్తుంది. దేశాన్ని బలహీనపరిచే, దేశ ఐక్యతను నీరుగార్చే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. నేతాజీ నుంచి స్ఫూర్తి పొందాలి. అభివృద్ధి చెందిన భారత్‌ను సాధించాలన్న లక్ష్యంగా ముందుకుసాగే మనందరికీ నేతాజీ సదా స్ఫూర్తినందిస్తూనే ఉంటారు.

కంఫర్ట్ జోన్‌ను వీడదాం

తర్వాత మోదీ కటక్‌లో జరిగిన పరాక్రమ్ దివస్ కార్యక్రమంలోనూ వర్చువల్‌గా మాట్లాడారు. ''నేతాజీ ఎప్పుడూ తాను సౌకర్యవంతమైన జీవితం (కంఫర్ట్‌జోన్‌లో) గడపాలనుకోలేదు. దేశ స్వాతంత్ర్య కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ సాకారం కావాలంటే మనందరం కంఫర్ట్ జోన్‌ను వీడి కష్టించి పనిచేయాలి. ప్రపంచస్థాయి అత్యుత్తమ పనితీరు కనబరచాలి. మెరుగైన పనితీరు మీద దృష్టిపెట్టాలి. అభివృద్ధి చెందిన భారత్‌నే సుభాష్ చంద్రబోస్ కలలుగన్నారు. వికసిత్ భారత్‌ను సాక్ష్యాత్కారింపజేసుకుని నేతాజీకి నిజమైన నివాళులు అర్పిద్దాం'' అని అన్నారు.

నిజమైన నేత

చర్చలో పాల్గొన్న విద్యార్థులతో మోదీ మాట్లాడారు. నేతాజీ బోధనల్లో నీకేం ఇష్టం? అని ఒక అమ్మాయిని అడగ్గా.. ''నాకు మీ రక్తం ఇవ్వండి. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తా.. అనే మాటలు ఎంతో స్ఫూర్తివంతంగా ఉంటాయి. అన్నింటికన్నా ఆయనకు దేశమే ముఖ్యం. దేశంలో కర్బన ఉద్గారాల వెల్లడిని తగ్గించాలి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలి. ఇందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు, బస్సులు వాడాలి'' అని అమ్మాయి చెప్పింది. దీంతో మోదీ కల్పించుకుని.. ''మా ప్రభుత్వం అదే బాటలో పయనిస్తోందికదా. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం 1,200 విద్యుత్ బస్సులను సమకూర్చింది. మరిన్ని అందుబాటులోకి తేనుంది. పీఎం సురక్షా యోజన సైతం తెచ్చాం. ఇంటి పైకప్పుపై సౌరఫలకాల వ్యవస్థ ఏర్పాటుచేసుకుంటే నెలనెలా విద్యుత్ బిల్లుల బాధ ఉండదు'' అని మోదీ అన్నారు.

గణతంత్ర పరేడ్‌లో తొలిసారిగా సంజయ్, ప్రళయ్!

అలరించనున్న వ్యూహాత్మక క్షిపణి, యుద్ధ నిఘా వ్యవస్థ,

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీన కర్తవ్యపథ్‌లో జరిగే పరేడ్‌లో బ్రహ్మోస్, పినాక, ఆకాశ్ వంటి అత్యాధునిక రక్షణ వ్యవస్థలతోపాటు తొలిసారిగా యుద్ధ నిఘా వ్యవస్థ 'సంజయ్', వ్యూహాత్మక క్షిపణి 'ప్రళయ్' కనిపించనున్నాయి. ఐఏఎఫ్‌కు చెందిన 40 యుద్ధ విమానాలు, తీరరక్షక దళంలోని 3 డోర్నియర్ విమానాలు ఆకాశంలో విన్యాసాలతో వైమానిక దళ పాటవాన్ని ప్రదర్శించనున్నాయి. పరేడ్ కమాండర్‌గా ఢిల్లీలోని జనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ భవ్నీశ్, పరేడ్ సెకండ్–ఇన్–కమాండ్‌గా ఢిల్లీ ప్రాంత చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ సుమిత్ మెహతా వ్యవహరిస్తారు. టి–90 భీష్మ ట్యాంకులు, బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణి వ్యవస్థలు, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, నాగ్ క్షిపణి వ్యవస్థ ఇందులో పాలుపంచుకుంటాయి. పరేడ్‌లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 16 శకటాలు, కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, సంస్థలకు చెందిన 15 శకటాలు పాల్గొంటాయి. ఇందులో డీఆర్‌డీవోకు చెందిన పలు అంచల రక్షణ వ్యవస్థ 'రక్షా కవచ్' కూడా ఉంటుందని రక్షణ శాఖ గురువారం వివరించింది. మొట్టమొదటిసారిగా త్రివిధ దళాల శకటం కూడా ఇందులో ఉంటుందన్నారు. ఈ వేడుకల ప్రధాన అతిథి ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంతో కాగా, ఆదేశం నుంచి కూడా ఒక బ్యాండ్ జట్టు పరేడ్‌లో కలిసి నడుస్తుందన్నారు. కార్గిల్ యుద్ధ వీరులైన ఇద్దరు పరమ వీర చక్ర గ్రహీతలు, ఒక అశోక చక్ర గ్రహీత కూడా పరేడ్‌లో భాగస్వాములవనున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే పరేడ్ 90 నిమిషాలు కొనసాగి, దేశ వారసత్వం, అభివృద్ధి పయనాన్ని కళ్లకు కడుతుందని అధికారులు తెలిపారు.

సైఫ్ పూర్వీకుల రూ.15 వేల కోట్ల ఆస్తుల పరిస్థితేంటి?


భోపాల్: బ్రిటిషర్లకాలంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో పటౌడీ సంస్థానాన్ని పాలించిన హమీదుల్లాహ్ రాజకుటుంబానికి చెందిన రూ.15,000 కోట్ల విలువైన ఆస్తులు ఎవరి పరం కానున్నాయనే ప్రశ్న తలెత్తింది. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ పూర్వీకులకు చెందిన ఈ ఆస్తులు ఇప్పుడు ఎవరికి చెందుతాయనే అంశం మరోసారి తెరమీదకొచ్చింది. సైఫ్ వాళ్ల నానమ్మ.. పటౌడీ సంస్థానానికి అసలైన వారసురాలని సీనియర్ న్యాయవాది జగదీశ్ ఛవానీ వాదిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ వాదన దీనికి భిన్నంగా ఉంది. ''స్వాతంత్ర్యం వచ్చేనాటికి భోపాల్ కేంద్రంగా పాలిస్తున్న పటౌడీ సంస్థానానికి ముహమ్మద్ హమీదుల్లాహ్ చివరి నవాబ్‌గా ఉన్నారు. ఆయన తదనంతరం ఆయన పెద్దకుమార్తె అబీదా సుల్తాన్ బేగమ్‌కు ఈ ఆస్తులు దక్కుతాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చాక విభజన సమయంలో ఆమె పాకిస్తాన్‌కు వలసవెళ్లారు. ఈ లెక్కన ఇప్పుడు వారసులు భారత్‌లో లేరు. అందుకే శత్రు ఆస్తుల చట్టం కింద ఆ ఆస్తులన్నీ ఇప్పుడు కేంద్ర హోం శాఖ పరిధిలోని భారత శత్రు ఆస్తుల సంరక్షణ సంస్థ(సీఈపీఐ) పర్యవేక్షణలోకి వస్తాయి'' అని మోదీ సర్కార్ చెబుతోంది. ప్రభుత్వ వాదనను లాయర్ ఛవానీ కొట్టిపారేశారు. ''పెద్దకుమార్తె అబీదా పాకిస్తాన్‌కు వెళ్లిన తర్వాత 1960లో హమీదుల్లాహ్ మరణించారు. దాంతో ఆస్తి వారసత్వంగా తనకే వస్తుందని రెండో కుమార్తె సాజిదా సుల్తాన్ బేగమ్ భారత ప్రభుత్వాన్ని కోరారు. అందుకు సమ్మతిస్తూ 1962 జనవరి 10న కేంద్రం ఒక ఉత్తర్వు జారీచేసింది. ఈ లెక్కన సాజిదా అసలైన వారసురాలు. ఆమె నుంచి వారసత్వంగా సాజిదా కుమారుడు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ(టైగర్ పటౌడీ) ఆయన తదనంతరం సైఫ్ అలీ ఖాన్ ఆ ఆస్తులకు హక్కుదారు అవు తారు'' అని ఛవానీ వాదించారు. తమ ఆస్తులను శత్రు ఆస్తులుగా లెక్కకట్టొద్దని, మోదీ ప్రభుత్వం తెచ్చిన శత్రు ఆస్తుల(సవరణ, ధృవీకరణ) చట్టాన్ని సవాల్ చేస్తూ టైగర్ పటౌడీ భార్య, అలనాటి బాలీవుడ్ నటి షర్మిలా ఠాకూర్ 2015లో మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గత ఏడాది డిసెంబర్ 13న జస్టిస్ వివేక్ అగ్రావాల్ విచారణ చేపట్టారు. సైఫ్ తల్లి షర్మిలా వేసిన పిటిషన్‌ను ప్రభుత్వ న్యాయవాది తప్పుబట్టారు. ఇప్పుడు శత్రు ఆస్తుల చట్టం,1968 లేదు. దాని స్థానంలో 2017లో కొత్త చట్టమొచ్చింది. ఏమైనా ఫిర్యాదులుంటే సంబంధిత అప్పీలేట్ అథారిటీ ముందు గోడు వెళ్లబోసుకోండి'' అని సూచించారు. దీనిపై జడ్జీ స్పందిస్తూ.. ''వాస్తవాలను పరిగణించాక సైఫ్ కుటుంబం ముంబైలోని సీఈపీఐ ఆఫీస్‌లో అప్పీల్ చేసుకునేందుకు 30 రోజుల గడువు ఇస్తున్నాం'' అని జడ్జి వ్యాఖ్యానించారు. ఆరోజు జడ్జి ఇచ్చిన గడువు ఇప్పుడు ముగిసిపోయింది. గడువులోపు సైఫ్ కుటుంబం ముంబై సీఈపీఐ ఆఫీస్‌లో అప్పీల్ చేయలేదు. జనవరి 16వ తేదీన కత్తిపోట్లకు గురై ఆస్పత్రి పాలైన సైఫ్ బాగోగులు చూడటంలోనే వాళ్ల కుటుంబానికి ఉన్న పుణ్యకాలం గడిచిపోయింది. ఇప్పుడు వాళ్లకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందా? లేదా అనేదే అసలు ప్రశ్న. ''దాడి జరిగిందన్న కారణం చూపి హైకోర్టు గడువు పొడిగించాలని కోరతాం'' అని న్యాయవాది చెప్పారు.

ఆ వెబ్‌సైట్లపై నిషేధం



దేశ భద్రతకు, సమగ్రతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించే సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, వెబ్‌సైట్లను (యూఆర్‌ఎల్) నిషేధించేందుకు ఐటీ చట్టంలోని సెక్షన్ 69 అనుమతిస్తోంది.

దీని ప్రకారం గత మూడేళ్లలో 28,079 యూఆర్‌ఎల్స్‌ని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఇందులో ఖలిస్థాన్ రిఫరెండానికి అనుకూలంగా ఉన్నవి 10,500 కాగా, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాకు సంబంధించినవి 2,100. మొత్తం యూఆర్‌ఎల్స్‌లో ఫేస్‌బుక్‌కి సంబంధించినవే 10,976. ఎక్స్ (ట్విటర్)కి సంబంధించినవి 10,139.



ఆర్థిక వృద్ధితో మహిళల్లో
రాజకీయ చైతన్యం

- 2014 లోక్‌సభ ఎన్నికల కన్నా 2024లో ఎక్కువ మంది ఓటింగ్
- ఎన్నికల్లో పోటీ చేసే వారి సంఖ్యా పెరుగుదల..
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక

సాక్షి, అమరావతి: మహిళలు ఆర్థిక సాధికారత సాధించడం ద్వారా రాజకీయాల్లోనూ తమ భాగస్వామ్యాన్ని పెంచుకుంటున్నారు. గత పదేళ్లలో ఓట్లేసిన మహిళలు పెరగడం.. గత మూడు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన మహిళల సంఖ్య పెరగడం ఇందుకు నిదర్శనం. ఈ విషయాలను ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో 2014 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే.. 2024 ఎన్నికల్లో ఎక్కువ మంది మహిళలు ఓట్లు వేశారని తెలిపింది. అదేవిధంగా అసోం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో కూడా మహిళలు ఎక్కువగా ఓట్లు వేశారని వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లోని మహిళల్లో అత్యధిక మంది ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎం జేడీవై), మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్సింగ్ ఏజెన్సీ (ముద్ర) ఖాతాలు కలిగి ఉన్నారని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక విశ్లేషించింది. అందువల్ల వారు ఆర్థిక సాధికారత సాధించారని, దాని ఫలితంగానే రాజకీయాలపైనా అవగాహన పెరిగిందని తెలిపింది. మరోవైపు ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, హరియాణ రాష్ట్రాల్లో 2014 ఎన్నికలతో పోల్చితే 2024 ఎన్నికల్లో ఓట్లు వేసిన మహిళల సంఖ్య తగ్గిందని ఆ నివేదిక తెలిపింది.



2014, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన మహిళల శాతం, పీఎంజేడీవై, ముద్ర ఖాతాలు కలిగిన మహిళల సంఖ్య

రాష్ట్రం	2014	2024	మార్పు (శాతం)	పీఎంజేడీవై ఖాతాలు (లక్షల్లో)	ముద్ర ఖాతాలు (లక్షల్లో)
ఆంధ్రప్రదేశ్	74.6	81.8	7.1	88	6
అసోం	80.1	81.9	1.8	143	4
బీహార్	56.3	56.3	0.0	345	69
ఛత్తీస్‌గఢ్	69.4	72.9	3.6	101	7
హిమాచల్‌ప్రదేశ్	64.5	71.5	7.0	10	1
జార్ఖండ్	63.8	66.8	3.0	108	16
కర్ణాటక	67.2	70.9	3.7	112	44
మధ్యప్రదేశ్	61.6	67.0	5.4	247	24
మహారాష్ట్ర	60.3	61.5	1.2	201	42
ఒడిశా	73.8	74.8	1.0	127	30
తెలంగాణ	62.6	66.3	3.7	71	5

దేశంలో 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల ముఖ్యాంశాలు ఇలా..

వివరం	2014	2019	2024
మొత్తం ఓటర్లు	83.4 కోట్లు	91.2 కోట్లు	97.8 కోట్లు
పోటీ చేసిన అభ్యర్థులు	8,251	8,054	8,359
పోటీ చేసిన మహిళలు	668	726	800


దాతల భవనాలకు ఆధ్యాత్మిక, ధార్మిక పేర్లు

- మొదటగా లక్ష్మీ భవన్‌గా మారిన వీపీఆర్ భవన్

తిరుమల: తిరుమలలో దాతల సహకారంతో నిర్మించిన అతిథి గృహాలకు గతంలో ఆయా సంస్థలు, వ్యక్తుల పేర్లు ఉండగా వాటిని మార్చాలని గతంలో టీటీడీ ధర్మకర్తల మండలిలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీన్లో భాగంగా మొదటగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతుల విరాళంతో నిర్మించిన లక్ష్మీ వీపీఆర్ భవనం పేరును లక్ష్మీ భవన్‌గా మార్చారు. ఇదే విధంగా తిరుమలలో దాతల సహకారంతో నిర్మించిన 45 అతిథి గృహాలకు ఆధ్యాత్మిక, ధార్మిక పేర్లు పెట్టనున్నారు. దీనికి దాతలు కూడా అంగీకరించినట్లు ఈవో తెలిపారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు

శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గతేడాది డిసెంబరు 30 నుంచి నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారిని వేంచేపు చేసి దివ్యప్రబంధ గోష్ఠి నిర్వహించారు.



ఘనంగా తన్నీరముదు ఉత్సవం

శ్రీ వైష్ణవ భక్తాగ్రేసరుడు, శ్రీవేంకటేశ్వరుని సేవలో తన జీవితాన్ని అర్పించిన మహనీయుడు తిరుమలనంబి స్మృత్యర్థం ఏటా నిర్వహించే 'తన్నీర ముదు' ఉత్సవం తిరుమలలో గురువారం ఘనంగా జరిగింది. సహస్ర దీపాలంకార సేవ అనంతరం మలయప్పస్వామివారు తిరుమాడ వీధి ఆలయ ప్రదక్షిణగా వాహన మండపానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్టు పాదాలపై అమరి ఉన్న బంగారు తొడుగునకు పవిత్ర ఆకాశగంగ జలంతో అభిషేకం చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న అపోలో చైర్మన్



అపోలో చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

జీవో 117 రద్దు మార్గదర్శకాలతో
ప్రయోజనం లేదు

ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆక్షేపణ

సాక్షి, అమరావతి: పాఠశాల విద్య బలోపేతం కోసం ప్రభుత్వం జీవో 117 ఉపసంహరణ, అనంతరం చేపట్టే చర్యలపై ఇచ్చిన ప్రత్యామ్నాయ మార్గదర్శకాలతో ఎలాంటి ప్రయోజనం లేదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆక్షేపించింది. గురువారం ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ అధ్యక్షతన విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఇటీవల ఇచ్చిన ప్రత్యామ్నాయ మార్గదర్శకాలను సవరించాలని, నాణ్యమైన విద్యా బోధన కోసం విద్యార్థి–ఉపాధ్యాయుల నిష్పత్తిని ఉన్నత పాఠశాలల్లో 1:30గా పరిగణించాలన్నారు. 45 మంది విద్యార్థులు దాటినచోట రెండో సెక్షన్ ప్రారంభించాలని, ప్రాథమిక పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు మించి ఎన్‌రోల్ ఉన్న స్కూళ్లను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చాలన్నారు. 30 నుంచి 60 మంది విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను అదే స్థాయిలో కొనసాగిస్తూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల యాజమాన్యాల్లో కరోనా కాలం నుంచి కారుణ్య నియామకాలు చేపట్టలేదని, వెంటనే స్పెషల్ డ్రైవ్ ద్వారా కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలని ఫ్యాప్టో కోరింది. ఈ సందర్భంగా ఆర్థిక ప్రయోజనాలు, పెండింగ్ డిమాండ్ల సాధన కోసం జేఏసీతో కలిసి ఉద్యమించాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 12వ పీఆర్సీని నియమించాలని, డీఏ, పీఎఫ్ బకాయిలు, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలన్నారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఫిషరీస్ కమిషనర్‌పై వేటు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అమరావతి: రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్‌పై ప్రభుత్వం వేటు వేసింది. 6 నెలల క్రితం మంత్రి కొల్లు రవీంద్ర సిఫారసుతో మత్స్యశాఖ కమిషనర్‌గా నియమితులైన డోలా శంకర్ కమిషనర్‌గా వచ్చినప్పటి నుంచి అనేక వివాదాలకు కేంద్రంగా మారారు. 6 నెలలుగా మత్స్యశాఖకు సంబంధించి ఒక్క యూనిట్ ఏర్పాటు చేయకపోగా, ఏటా జూలై–ఆగస్టులో రిజర్వాయర్లలో వదిలే చేప పిల్లల సరఫరా టెండర్లను జనవరి వచ్చినా ఖరారు చేయలేదు. మరోవైపు మహేశ్ అనే ప్రైవేట్ వ్యక్తిని ఎలాంటి పోస్టింగ్ లేకుండా కమిషనరేట్‌లో నియమించి పెత్తనం అప్పగించారు. గంగాధర్ అనే మరో సీడ్ కాంట్రాక్టర్‌ను స్టేట్ కో–ఆర్డినేటర్ పోస్టులో నియమించి వసూళ్లకు పాల్పడుతున్నట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. డోలాశంకర్ అక్రమాలపై 3 రోజుల క్రితం 'సాక్షి'లో వచ్చిన కథనంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రక్షణశాఖ ఉద్యోగి అయిన డోలాశంకర్‌ను గురువారం మాతృశాఖకు సరెండర్ చేస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులిచ్చారు.

విభిన్న తీర్పులపై విస్తృత ధర్మాసనానికి నివేదించండి

- వంశీ కేసులో హైకోర్టుకు సీనియర్ న్యాయవాది వేములపాటి పట్టాభి అభ్యర్థన
- కౌంటర్ దాఖలు చేస్తామన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్
- విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా



సాక్షి, అమరావతి: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడితో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు వల్లభనేని వంశీకి ఎలాంటి సంబంధంలేదని, అందువల్ల ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చెల్లదని సీనియర్ న్యాయవాది వేములపాటి పట్టాభి హైకోర్టుకు నివేదించారు. ఎస్సీ, ఎస్టీ చట్టం వర్తించదని కోర్టు ప్రాథమిక అభిప్రాయానికి వస్తే, నిందితునికి ముందస్తు బెయిల్ మంజూరు చేయవచ్చునన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్ట నిబంధనల కింద కేసు నమోదైనప్పుడు ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు మాత్రమే విచారణ జరపాలని, అక్కడ బెయిల్ రాకుంటే అప్పుడు మాత్రమే హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకోవాలని ఇదే హైకోర్టు ఓ బెంచ్.. ఎస్సీ, ఎస్టీ చట్టం వర్తించదని ప్రాథమిక ఆధారాలున్నప్పుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నేరుగా హైకోర్టే విచారణ జరపవచ్చునంటూ మరో బెంచ్ వేర్వేరు తీర్పులు వెలువరించాయని ఆయన వివరించారు. ఈ రెండింటిలో ఏది సరైన తీర్పో నిర్ణయించేందుకు ఈ వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. ఈ మేర ఓ అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేశామని చెప్పారు. ఈ సమయంలో పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. వంశీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, అందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి డాక్టర్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ అంగీకరిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేశారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వల్లభనేని వంశీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గురువారం జస్టిస్ కృపాసాగర్ విచారణ జరిపారు.

డ్రోన్ రంగంలో పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు

ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ సీఎండీ దినేష్‌కుమార్

సాక్షి, అమరావతి: డ్రోన్‌ల తయారీ రంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అత్యుత్తమ కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ డ్రోన్స్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా డ్రోన్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి, పరిశ్రమలు నెలకొల్పడానికి వచ్చే ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ పరిశ్రమకున్న అనుకూల వాతావరణంపై పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో గురువారం విజయవాడ నోవాటెల్ హోటల్‌లో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దినేష్ కుమార్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో దేశంలోనే మొట్టమొదటి డ్రోన్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఏపీ ఆయిల్‌ఫెడ్ ఎండీగా బాలాజీనాయక్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కో–ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆయిల్‌ఫెడ్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాలాజీ నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ ఆయిల్‌ఫెడ్ ఎండీగా ఏడాది పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

'నారాయణ' ఫీ'జులుం'కి
విద్యార్థి బలి..

ఫీజు చెల్లించలేదని గంటలు తరబడి బయటే నిలబెట్టిన యాజమాన్యం

- అవమానంగా భావించి కళాశాల మూడో అంతస్తు పైనుంచి దూకిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి
- అక్కడికక్కడే మృతి
- అనంతపురంలో ఘటన



మూడో అంతస్తు నుంచి కిందకు దూకుతున్న చరణ్



చరణ్ (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్/సాక్షి, అమరావతి: నారాయణ కళాశాలల ధన దాహానికి మరో విద్యార్థి బలయ్యాడు. ఫీజులు చెల్లించకపోతే కళాశాలలోకి అనుమతించకుండా గంటల తరబడి బయటే నిలబెట్టడంతో అవమానంగా భావించిన ఆ విద్యార్థి ఆ తర్వాత కళాశాలలోని మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం అనంతపురంలో చోటుచేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన చరణ్ అనంతపురం నగర శివారు సోములదొడ్డి సమీపంలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల అనంతరం గురువారం చరణ్‌ను తన సోదరుడు కళాశాలలో విడిచి పెట్టాడు. ఈ సమయంలో ఫీజు బకాయి మొత్తం చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి చేసినట్లు కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. చరణ్ సోదరుడు సర్దిచెప్పి వెళ్లాడు. తర్వాత ఏం జరిగిందో ఏమో.. మూడో అంతస్తులోని తరగతి గదిలో ఉన్న చరణ్ అధ్యాపకుడి ముందునుంచే ఒక్కసారిగా బయటకొచ్చి కిందకు దూకేశాడు. తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం చరణ్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. రక్తమోడిన ప్రాంతమంతా ఎవరూ రాకుండానే హడావుడిగా శుభ్రం చేసేశారు. కాలేజీ యాజమాన్యం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్, నగర అధ్యక్షుడు కైలాష్‌తో పాటు ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ తదితర విద్యార్థి సంఘాల నేతలు కాలేజీ వద్ద ఆందోళన చేశారు. అలాగే, ఈ ఘటనపై విచారణ చేయాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ కూడా డిమాండ్ చేసింది.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద టీడీపీ శ్రేణుల ఓవరాక్షన్

- కార్లు, బైకులపై వచ్చి హడావుడి

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద గురువారం టీడీపీ శ్రేణులు ఓవరాక్షన్‌కు దిగాయి. మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు కార్యక్రమాన్ని తాడేపల్లి టీడీపీ కార్యాలయంలో నిర్వహించి అనంతరం అక్కడ నుంచి నేరుగా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్దకు దూసుకొచ్చారు. సైరన్లు వేసుకుంటూ పెద్ద పెద్దగా కేకలు పెడుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. బైక్‌లకు ఉన్న సైలెన్సర్లను తీసేసి నానా హడావుడి చేశారు. కాబోయే సీఎం లోకేశ్ అని, తమకు ఎదురే లేదంటూ పెద్దపెట్టున కేకలు వేశారు. మరికొందరు బాణసంచా కాల్చారు. ఈ లోగా లోపల ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బయటకు రాగానే టీడీపీ కార్యకర్తలు అక్కడ నుంచి వెళ్లిపోయారు. మరి కొద్దిసేపటికి మళ్లీ వచ్చేందుకు ప్రయత్నించగా ఒకరిద్దరు పోలీసులు అక్కడికి చేరుకుని వారిని వారించారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

రెండేళ్లపాటు ఫీజు రాబడి ప్రైవేటు ఏజెన్సీలకే!

- ఏటీసీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ

సాక్షి, అమరావతి: వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటు చేయనున్న ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల (ఏటీసీ)లు వసూలు చేసే ఫీజులను రెండేళ్లపాటు ప్రైవేటు ఆపరేటర్లే పూర్తిగా తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఏటీసీల ఏర్పాటుకు టెండర్ల ద్వారా ఎంపికైన ప్రైవేటు ఏజెన్సీలు తాము బిడ్డింగ్‌లో కోట్ చేసిన మొత్తాన్ని మూడో ఏడాది నుంచి ప్రభుత్వానికి చెల్లిస్తాయి. వాహనదారుల నుంచి వసూలు చేసే ఫీజులో తాము కోట్ చేసిన శాతాన్ని ప్రభుత్వానికి చెల్లించేందుకు అనుమతిస్తూ రవాణా శాఖ గురువారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున 'ఏటీసీ'ని ఏర్పాటు చేయనున్నారు.

మత్స్యకారుల ఉపాధికి గండి

రిజర్వాయర్లలో చేప పిల్లల్ని వదలని సర్కారు
జనవరి పూర్తవుతున్నా ఖరారు కాని టెండర్లు

ప్రభుత్వ నిర్వాకంతో మురిగిపోయిన రూ.12 కోట్లు
కూటమి గద్దెనెక్కగానే జీవో 217 రద్దు
సొసైటీ మత్స్యకారుల కడుపుకొట్టిన రాష్ట్ర ప్రభుత్వం



గతేడాది ఏలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న దృశ్యం(ఫైల్)

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వం మరోసారి మత్స్యకారుల కడుపు కొట్టింది. గద్దెనెక్కిన మరుక్షణమే జీవో 217 రద్దు చేసి మత్స్యకార సొసైటీల్లోని సభ్యుల జీవనోపాధికి గండికొట్టింది. రిజర్వాయర్లలో చేప పిల్లలు విడుదల చేయకుండా చేతులెత్తేసి వారికి ఉపాధిని దూరం చేసింది. సహజ మత్స్య సంపదను వృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా మంచినీటి వనరుల్లో పెద్దఎత్తున చేప పిల్లలను వదులుతుంటుంది. రాష్ట్రంలో 2.22 లక్షల ఎకరాల్లో భారీ రిజర్వాయర్లు, 70 వేల ఎకరాల్లో మధ్య తరహా రిజర్వాయర్లు, 3.75 లక్షల ఎకరాల్లో చిన్నతరహా రిజర్వాయర్లు ఉన్నాయి. వీటితో పాటు 2.25 లక్షల ఎకరాల్లో కొల్లేరు మంచినీటి సరస్సుతో పాటు 11,514 కిలో మీటర్ల మేర నదులు, కెనాల్స్ ఉన్నాయి. వీటిపై ఆధారపడి రాష్ట్రంలో 2,536 మత్స్యకార సొసైటీల్లోని 3.10 లక్షల మంది జీవనోపాధి పొందుతారు. రూ.7–10 కోట్ల ఖర్చుతో 6–9 కోట్ల చేప పిల్లలను ప్రధాన రిజర్వాయర్లలో ఏటా జూలై–ఆగస్టు నెలల్లో వదులుతుంటారు. 3–6 నెలల తర్వాత ఈ మత్స్యసంపదను పట్టుకుని మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి పొందుతుంటారు.

మంచినీటి వనరుల నుంచే 55 శాతం మత్స్య దిగుబడులు

రాష్ట్రంలో మత్స్య దిగుబడులు 51.58 లక్షల టన్నులు వస్తుండగా.. వాటిలో 55 శాతం మంచినీటి వనరుల నుంచి లభిస్తున్నాయి. 'ఇన్‌ల్యాండ్ క్యాచ్‌మెంట్ వాటర్ రిసోర్సెస్'లో చేపల్ని పెంచడం ద్వారా మత్స్యకార సొసైటీల పరిధిలోని మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా గడచిన ఐదేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. ఏటా క్రమం తప్పకుండా ప్రధాన రిజర్వాయర్లలో బొచ్చులు, రాగండి, మోసు చేప పిల్లలను వదులుతూ సహజ మత్స్యసంపద వృద్ధికి ఇతోధికంగా కృషి చేసింది. గిరిజన ప్రాంత మత్స్యకారులకు సైతం చేప పిల్లలను అందజేసేది. 2022–23 నుంచి చేప పిల్లలతో పాటు రొయ్య పిల్లలను కూడా ఈ రిజర్వాయర్లలో వదలడం మొదలుపెట్టింది. ఫలితంగా 2018–19లో 13.42 లక్షల టన్నులున్న ఈ దిగుబడులు గడచిన ఐదేళ్లలో గరిష్ఠంగా 29.32 లక్షల టన్నులకు పెరిగింది.

ఈ ఏడాదంతా అస్తవ్యస్తం

చేప పిల్లల కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని డీపీసీ (జిల్లా కొనుగోలు కమిటీ) ద్వారా మే, జూన్‌లలో టెండర్లు పిలిచే వారు. తక్కువ ధరకు చేప పిల్లలను సరఫరా చేసే వారిని ఎంపిక చేసి చేప పిల్లల్ని కొనుగోలు చేసేవారు. వాటిని ఎంపిక చేసిన రిజర్వాయర్లు, మంచినీటి చెరువుల్లో క్రమం తప్పకుండా ఆగస్టులో వదిలేవారు. ఈ ఏడాది చేప పిల్లల్ని కొనుగోలు చేసే కార్యక్రమాన్ని ప్రహసనంగా మార్చారు. ఇందుకోసం కేంద్రం మంజూరు చేసిన రూ.12 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించగా.. చేపపిల్లల సరఫరాపై కనీస అవగాహన లేని మత్స్య శాఖ కమిషనర్ తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు మత్స్యకారుల కడుపు కొడుతున్నాయి. తనకు పదవి కట్టబెట్టిన మంత్రి అనుచరులకు మేలు చేయడమే లక్ష్యంగా జిల్లాస్థాయి టెండరింగ్ విధానం స్థానంలో రాష్ట్రస్థాయి టెండరింగ్, ఈ ప్రొక్యూర్‌మెంట్ అంటూ హడావుడి చేశారు. చివరకు కొటేషన్ పద్ధతిలో అప్పగించాలనే యోచన కూడా చేశారు. పైగా గతంలో రూ.1.20కే చేప పిల్లను సరఫరా చేయగా, ఈసారి రూ.2వరకు సరఫరా చేసేలా మార్గదర్శకాల్లో మార్పు తీసుకొచ్చారు. ఇదంతా అడ్డగోలు దోపిడీ కోసమేనన్న విమర్శలొచ్చాయి. ఇలా తరచూ నిబంధనలు మారుస్తూ 45 రోజుల పాటు కాలయాపన చేశారు. ఈలోగా కేంద్రం మంజూరు చేసిన రూ.12 కోట్ల నిధులు మురిగిపోయాయి. దీంతో ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ కార్యక్రమం అర్ధంతరంగా నిలిచిపోయే పరిస్థితి తలెత్తింది.


ఆశగా ఎదురు చూశాం



సోమశిల ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని నిల్వ చేసే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌పై ఆధారపడి మా సొసైటీ సభ్యులు జీవనోపాధి పొందుతుంటాం. 1,200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ రిజర్వాయర్‌లో చేపల పట్టుబడి ద్వారా ఏటా రూ.30–40లక్షల ఆదాయం వస్తుంది. ఈ ఏడాది మత్స్యశాఖ చేప పిల్లలు విడుదల చేస్తుందని ఆశగా ఎదురు చూశాం. ఇప్పటివరకు రాష్ట్రంలో ఏ ఒక్క రిజర్వాయర్‌లోనూ ఒక్క పిల్ల కూడా వదలలేదు.

– వట్టికాల బాలయ్య, ప్రధాన కార్యదర్శి, మత్స్యకార సొసైటీ, సోమశిల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నెల్లూరు జిల్లా

మత్స్యకారులకు తీరని నష్టం



సొసైటీ మత్స్యకారులకు మేలు చేకూర్చేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 217పై ఎన్నికల్లో కూటమి నేతలు లేనిపోని దుష్ప్రచారం చేశారు. అధికారంలో రాగానే ఈ జీవోను రద్దుచేసి మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీశారు. మంచినీటి వనరుల్లో చేప పిల్లలు వదిలే విషయంలో చేతులెత్తేయడంతో మత్స్యకారులకు అపార నష్టం వాటిల్లే అవకాశం ఉంది.


– కొండూరు అనిల్‌బాబు, కో–ఫిషర్‌మెన్ ఫెడరేషన్, మాజీ చైర్మన్


కేంద్ర ప్రత్యేక రుణం పెరిగిందిలా..

ఆధారం : కేంద్ర ఆర్థిక శాఖ



కోవిడ్ సంక్షోభం తరవాత రాష్ట్రాలకు మూలధన వ్యయం కింద కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు (రుణం)విడుదల చేస్తోంది. వడ్డీ లేని ఈ రుణాలను 50 ఏళ్ల లోపు తిరిగి చెల్లించవచ్చు. ఇలా 2024-25 ఆర్థిక సంవత్సరంలో నవంబరు 30 వరకు మంజూరు చేసిన మొత్తం రూ.85,718 కోట్లు కాగా, విడుదల చేసింది రూ.60,121 కోట్లు. 2023-24లో అత్యధిక మొత్తంలో నిధులు పొందిన రాష్ట్రాలు.. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్.





వాయిదా పద్ధతుంది.. ఫోనుకైనా!

రుణ సదుపాయంతో దూసుకెళ్తున్న మొబైల్ ఫోన్ల విక్రయాలు

- రాష్ట్రంలో నెలకు సగటున 60 వేల ఫోన్లకు పైగా అమ్మకం
- ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి ఇబ్బడిముబ్బడిగా రుణాలు
- రుణాల ద్వారానే 7 లక్షలకు పైగా కొనుగోళ్లు
- ఏటా రూ.వెయ్యి కోట్లకు పైగానే మొబైల్ ఫోన్లపై రుణాలిస్తున్న వైనం
- క్రెడిట్ కార్డులు, నగదు ద్వారా తీసుకునే ఫోన్లు వీటికి అదనం
- ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు ఆర్బీఐకి ఇచ్చిన రుణ వ్యయ పరిమితి నివేదికలో వెల్లడి



రాష్ట్రంలో ఫోన్లపై రుణాల లెక్క ఇదీ

రాష్ట్రంలో నెలకు రుణాల ద్వారా కొంటున్న ఫోన్ల సంఖ్య 60,000	గరిష్ట ఫోన్ విలువ రూ.1,20,000
రుణ సదుపాయంపై నెలకు ఫోన్ల కొనుగోళ్ల విలువ రూ.90 కోట్లు	ఈఎంఐ కాలపరిమితి 10-20 నెలలు
ఈఎంఐ ద్వారా తీసుకునే కనిష్ట ఫోన్ విలువ రూ.12,500	



వాయిదా పద్ధతుల్లో కొనుగోలు చేస్తున్న వస్తువుల్లో ఇన్నాళ్లూ టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లదే అగ్రస్థానం. ఇప్పుడు వాటిని వెనక్కి నెట్టేసి మొబైల్ ఫోన్లు దూసుకెళుతున్నాయి. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా రుణసదుపాయం కల్పిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల వారు సైతం ఈఎంఐ (ఈక్వేటెడ్ మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్) పద్ధతిలో ఫోన్లు కొనుక్కోవడం రివాజుగా మారింది. గతంలో రుణం కావాలంటే బ్యాంకులకు వెళ్లి స్థిర, చరాస్తుల తనఖా వంటివి చేస్తేగానీ వచ్చేది కాదు. ఇప్పుడు అలాంటివేమీ లేకుండా 15 నిమిషాల్లోనే రుణం ఇవ్వడం, ఫోన్ కొనుక్కోవడం అన్నీ జరిగిపోతున్నాయి. ఈ వ్యాపారం రాష్ట్రంలో ఇప్పుడు ఏటా వందల కోట్ల రూపాయలకు చేరినట్టు ప్రైవేట్ రుణ సంస్థలు తాజాగా ఆర్బీఐకి ఇచ్చిన రుణ వ్యయ పరిమితి నివేదికలో వెల్లడించాయి. – సాక్షి ప్రతినిధి, అనంతపురం

ఏటా 7 లక్షలకు పైగా ఫోన్లు రుణ సదుపాయంతోనే..

రాష్ట్రవ్యాప్తంగా క్యాష్, క్రెడిట్ కార్డు ద్వారా కాకుండా కేవలం రుణ సదుపాయంతో కొనుగోలు చేస్తున్న మొబైల్ ఫోన్లు నెలకు సగటున 60 వేలకు పైగా ఉన్నట్టు తేలింది. ఏటా 7 లక్షలకు పైగా ఫోన్లు ఈఎంఐ సదుపాయంపై విక్రయాలు జరుగుతున్నాయన్న మాట. ఇలా రుణ సదుపాయం కల్పిస్తున్న వాటిలో బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, టీవీఎస్, హెచ్‌బీ తదితర సంస్థలు అగ్రభాగాన నిలిచాయి. ఏపీలో నెలకు రూ.90 కోట్ల వరకూ మొబైల్ ఫోన్లకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు తేలింది. మొబైల్ కొనుగోళ్లలో 55 శాతం వాటాను గ్రామీణ ప్రాంతాలే కలిగి ఉన్నట్టు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు.

సిబిల్ స్కోరు ఆధారంగా..

పాన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా ఉంటే చాలు సులభంగా రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రధానంగా సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) స్కోర్ ఆధారంగా రుణాలిస్తున్నారు. స్కోర్ 730 పాయింట్లకు తగ్గకుండా ఉంటే రుణానికి అర్హులు. గతంలో ఏదైనా వస్తువు తీసుకుని క్రమం తప్పకుండా వాయిదాలు కట్టిన వారికి తర్వాత రెట్టింపు రుణ సదుపాయం కల్పిస్తున్నారు. దీనిని అదునుగా చేసుకుంటున్న వినియోగదారులు ఖరీదైన మొబైల్ ఫోన్లను కొనుగోలు చేస్తున్నారు. ఏ పల్లెలో చూసినా ఆండ్రాయిడ్ 4జీ, 5జీ మొబైల్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. ఇలా ఈఎంఐ సదుపాయంపై మొబైల్ ఫోన్ల కొనుగోలు చేయడం వేలాది కుటుంబాల ఆర్థిక స్థితిగతులపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నట్టు నిపుణులు భావిస్తున్నారు.

రికవరీ మామూలుగా ఉండదు మరి

జీరో వడ్డీ పేరుతో చాలామంది వినియోగదారులు ఈఎంఐ విధానంలో ఫోన్లు కొనుగోలు చేసి ఇరుక్కుంటున్నారు. కానీ.. అలాంటివేమీ ఉండవు. ప్రాసెసింగ్ ఫీజులు, ఇతరత్రా కలిపి రూ.1,500 వరకూ వినియోగదారులపై భారం పడుతుంది. పైగా.. ఫైనాన్స్‌లో కొంటున్నారంటే డిస్కౌంట్లు తక్కువ. ఎంఆర్‌పీకే కొనాల్సి ఉంటుంది. రికవరీ సైతం అలాగే ఉంటుంది. రుణ సదుపాయంపై ఫోన్ కొనుగోలు చేసిన వారి ఖాతా నుంచి ఫైనాన్స్ సంస్థకు ఆటో డెబిట్ ద్వారా సొమ్ము వెళుతుంది. ఈఎంఐ తేదీ నాటికి చెల్లించాల్సిన సొమ్ము కంటే బ్యాంకులో రూ.10 తక్కువ బ్యాలెన్స్ ఉన్నా రూ.500 నుంచి రూ.800 వరకూ ఫైన్ పడుతుంది. రెండు నెలలు సరిగా ఈఎంఐ చెల్లించకపోతే రికవరీ ఏజెంట్లు వెంటనే కొనుగోలుదారు ఇంటికి వెళతారు. ఫైనాన్స్ పైన తీసుకున్న మొబైల్ ఫోన్‌కు సంబంధించి అప్పు చెల్లించకపోతే ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేసి ఫోన్ పనిచేయకుండా చేసే సదుపాయం ఫైనాన్స్ సంస్థ చేతిలో ఉంటుంది.

జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డికి సీనియర్ న్యాయవాది హోదా

నిర్ణయం తీసుకున్న సీజేఐ నేతృత్వంలోని ఫుల్‌కోర్టు



సాక్షి, అమరావతి: ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చింతల వెంకట నాగార్జున రెడ్డికి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హోదానిచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నేతృత్వంలో సమావేశమైన న్యాయమూర్తులందరితో కూడిన ఫుల్‌కోర్టు ఈ మేరకు బుధవారం నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదుల మార్గదర్శకాలను అనుసరించి ఆయనకు సీనియర్ హోదాను కట్టబెట్టింది. ఈ నిర్ణయాన్ని ఆ కోర్టు రిజిస్ట్రార్ గురువారం జస్టిస్ నాగార్జునరెడ్డికి అధికారిక ప్రొసీడింగ్స్ ద్వారా తెలియచేశారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తరువాత జస్టిస్ నాగార్జున రెడ్డి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్‌గా వ్యవహరించారు. హైకోర్టు న్యాయమూర్తిగా పలు సంచలన తీర్పులిచ్చిన ఆయన ఈఆర్‌సీ చైర్మన్‌గా పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రజల సంక్షేమం కోసం పలు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్‌గా ఇటీవల ఆయన పదవీ కాలం ముగియడంతో తిరిగి న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టారు. అందుకు అనుగుణంగా సుప్రీంకోర్టు ఆయనకు సీనియర్ న్యాయవాది హోదానిచ్చింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేసేందుకు వీలుగా వారి వారి సమర్థత ఆధారంగా వారికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన ఫుల్‌కోర్టు సీనియర్ న్యాయవాది హోదానిస్తుంది. దీన్లోభాగంగానే జస్టిస్ నాగార్జునరెడ్డి సమర్థతను పరిగణనలోకి తీసుకుని ఆయనకు సీనియర్ హోదానిచ్చింది.

కృష్ణపట్నంలో అనిల్ అంబానీ పర్యటన

ముత్తుకూరు: నెల్లూరు జిల్లా, ముత్తుకూరు మండలం, కృష్ణపట్నం గ్రామంలో 16 ఏళ్ల క్రితం రిలయన్స్ అల్ట్రామెగా థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం సేకరించిన భూముల్లో యజమాని అనిల్ అంబానీ గురువారం పర్యటించారు. పవర్ ప్రాజెక్టు పనులు జరిగే క్రమంలో 16 ఏళ్ల క్రితం ఇక్కడకు వచ్చిన అంబానీ, రెండోసారి జిల్లా రెవెన్యూ అధికారులతో కలిసి ప్రాజెక్టు భూములను పరిశీలించారు. సుమారు 2,700 ఎకరాలున్న ఈ ప్రాంతంలో గ్రీన్ అమ్మోనియం-గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించేందుకు అంబానీ వచ్చినట్టు సమాచారం. ప్రాజెక్టులోని భూములను రికార్డుల ద్వారా జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్, తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు.



కృష్ణపట్నం రిలయన్స్ భూముల్లో పర్యటిస్తున్న అనిల్ అంబానీ, తదితరులు

భూముల స్థితిగతుల గురించి సమీక్షించారు. గతంలో నిర్మించి, దుమ్ముపట్టిన భవనాలు, యంత్రాలను కూడా ఆయన పరిశీలించారు. ఈ నూతన ప్రాజెక్టు పూర్తి సమాచారం త్వరలో జిల్లా యంత్రాంగం వెల్లడిస్తుందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

మార్చిలో గోపాలమిత్రల ఆందోళన

సాక్షి, అమరావతి: సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల మూడో వారంలో జిల్లా స్థాయిల్లో, మార్చి రెండో వారంలో విజయవాడలో రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర గోపాలమిత్ర సర్వీసెస్ అసోసియేషన్ తీర్మానించింది. గురువారం విజయవాడలోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో సంఘం నూతన కార్యవర్గానికి నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎ.వి.నాగేశ్వరరావు, అధ్యక్షులుగా సీహెచ్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఐజాక్ ఎన్నికయినట్టు ఒక ప్రకటనలో వెల్లడించారు.

క్లుప్తంగా...

సైద్ధాంతిక పరిశోధనలపై దృష్టి పెట్టాలి



సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన శాస్త్రవేత్తలతో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ

రేణిగుంట: దేశం గర్వించే నూతన ఆవిష్కరణల రూపకల్పనకు వనరులు సమృద్ధిగా ఉన్నాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో గురువారం విద్యా, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలకు చెందిన నిపుణులు, ఆవిష్కర్తలను ఒకచోట చేర్చి ప్రతిష్టాత్మకమైన పాన్-ఐఐటీ వరల్డ్ ఆఫ్ టెక్నాలజీ (పీవోట్) శాటిలైట్ ఈవెంట్ నిర్వహించారు. వీల్స్ గ్లోబల్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు, ఐఐటీ పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, అధ్యాపకులు సహా 100 మందికి పైగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణం కోసం సైద్ధాంతిక పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.మురళీకృష్ణ, వీల్స్ ఫౌండేషన్‌కు చెందిన శాస్త్రవేత్త యాదవ్ మూర్తి, ఐఐటీ డీన్ శశిధర్ గుమ్మా, శ్రీ సిటీ ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్ తదితరులు పాల్గొన్నారు.

'తిరుమల కొండపై ఉచితంగా ఫైబర్‌నెట్'

సాక్షి, అమరావతి: ఏప్రిల్ నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సెట్‌టాప్ బాక్సులను ఏపీ ఫైబర్ నెట్ వినియోగదారులకు అందిస్తామని ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. గురువారం విజయవాడ ఫైబర్ నెట్ కార్యాలయంలో విలేకరులతో జీవీ రెడ్డి మాట్లాడుతూ.. తిరుమల కొండపై ఉన్న అన్ని కార్యాలయాలు, దుకాణాలు, ఇళ్లకు ఉచితంగా ఏపీ ఎస్ఎఫ్ఎల్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఫైబర్‌నెట్‌లో ఇప్పటికే 400 మందిని తొలగించామని, త్వరలో మరో 200 మందిని తొలగిస్తామన్నారు. ఏపీఎస్ఎఫ్ఎల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు రూ. 2,500 కోట్ల పెట్టుబడులు కావాలన్నారు. బిడ్స్ ద్వారా సెట్ టాప్ బాక్సుల సప్లైకి ఎవరైనా ముందుకు రావచ్చన్నారు. ఏపీఎస్ఎఫ్ఎల్ ప్లాన్లను రివైజ్ చేస్తామన్నారు. వీలైనంత తక్కువ ధరకు ఫైబర్‌నెట్‌ను ప్రజలకు అందిస్తామన్నారు. ప్రైవేటు ఆపరేటర్ల కంటే తక్కువ ధరకే ఇంటర్నెట్‌తో కూడిన కేబుల్ సేవలు అందిస్తామన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల

మంత్రి ఫరూక్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనార్టీ విద్యార్థులకు 2024-2025 విద్యా సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా రూ.40.22 కోట్ల ట్యూషన్ ఫీజు మొత్తాన్ని ప్రభుత్వం గురువారం విడుదల చేసిందని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.37.88కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ.2.34కోట్లు మంజూరు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు.

కొత్త వైద్య కళాశాలల సేఫ్ క్లోజ్‌కు కమిటీ

పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు కొత్త వైద్య కళాశాలలు

- నిలిపేసిన నిర్మాణాల పరిరక్షణకు కమిటీ నియామకం
- పార్వతీపురం వైద్య కళాశాల టెండర్లు రద్దు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టే వరకూ వాటి నిర్మాణాలు దెబ్బతినకుండా పరిరక్షించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో రూ.8 వేల కోట్లకుపైగా నిధులతో 17 వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో ఐదు కళాశాలలు 2023-24 విద్యా సంవత్సరంలోనే ప్రారంభమయ్యాయి. మరో ఐదు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావాల్సి ఉండగా, నాలుగింటికి చంద్రబాబు కూటమి ప్రభుత్వం మోకాలడ్డి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసింది. కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు కట్టబెట్టేందుకు నిర్ణయించింది. వాటి నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసింది. ఈ క్రమంలో మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ వైద్య కళాశాలల నిర్మాణాలను సేఫ్ క్లోజ్ చేయడానికి ఏపీఎంఎస్ఐడీ ఎండీ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో కమిటీని నియమిస్తూ వైద్య శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ ఈఎన్‌సీలు, విద్యుత్, ఏపీఐఐసీ, ఏపీఎంఎస్ఐడీసీ సీఈలు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ అన్ని వైద్య కళాశాలలను సందర్శించి నిర్మాణాలను పరిశీలించి, వీడియోలు, ఫోటోగ్రాఫ్‌లతో సమగ్ర నివేదికను అందించాలని ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. అదే విధంగా పార్వతీపురం మన్యం వైద్య కళాశాల నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో రూ.600 కోట్లతో పిలిచిన టెండర్లను రద్దు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

దాదాపు నిర్మాణాలు పూర్తి

పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె వైద్య కళాశాలల్లో తరగతి గదులు, హాస్టళ్లు, ల్యాబ్‌ల నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే దాదాపు పూర్తయ్యాయి. ఇక్కడి ఏపీవీవీపీ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను మంజూరు చేసి, భర్తీ చేపట్టారు. గత ఏడాదే తొలి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించడానికి సర్వం సిద్ధం చేశారు. గతేడాది జూన్ నెలలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్ఎంసీ నుంచి అనుమతులు రాకుండా ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకుంది. పులివెందులకు 50 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసినప్పటికీ అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వమే ఎన్ఎంసీకి లేఖ రాసింది. దీంతో మంజూరైన కళాశాల కూడా రద్దయిపోయింది. ఇప్పుడీ కళాశాలలన్నింటినీ ప్రైవేటుకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు సర్కారు షాక్

- ఫెర్రో అల్లాయ్స్‌కు మార్చి వరకే రాయితీ కొనసాగింపు
- ఆగస్టు వరకూ ఇమ్మని అడిగినా ఒప్పుకోని ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈ ఏడాది ఆగస్టు వరకూ ప్రస్తుత రాయితీలు కొనసాగించాల్సిందిగా ఫెర్రో అల్లాయ్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ చేసిన అభ్యర్థనకు పాక్షికంగానే అంగీకరించింది. కేవలం రెండు నెలలు మాత్రమే (మార్చి 31 వరకే) విద్యుత్ టారిఫ్, విద్యుత్ సుంకంలో ప్రస్తుత తగ్గింపును కొనసాగించేందుకు అంగీకరించింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన విధంగానే విద్యుత్ సుంకం యూనిట్‌కు 6 పైసలకు, డిమాండ్ చార్జీలు 90 శాతం వరకూ తగ్గిస్తారు. 10 శాతం మాత్రమే వసూలు చేస్తారు. ఇదే ప్రతిపాదనకు ఇటీవల రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది.


ఇక మూతపడటం ఖాయం

ఫెర్రో అల్లాయ్స్‌లో పని చేస్తున్న దాదాపు 30 వేల మంది ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహకాలను మరో ఏడాది పాటు కొనసాగించాల్సిందిగా ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పాలకులు కరగకుండా రెండు నెలలే ఇవ్వడంతో ఆ పరిశ్రమల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. పైగా అవి తమ అవసరాలకు కేవలం డిస్కంల నుంచి మాత్రమే విద్యుత్‌ను కొనుగోలు చేయాలనే నిబంధన విధించారు. దీనివల్ల మార్చి తరువాత వేసవిలో ఉష్ణోగ్రతల కారణంగా ఏర్పడే విద్యుత్ కొరత వల్ల అధిక ధరలకు డిస్కంలు విద్యుత్‌ను కొనుగోలు చేస్తాయి. దానిని సరఫరా చేసి ఎక్కువ చార్జీలు వసూలు చేయడం వల్ల అది ఫెర్రో పరిశ్రమలకు మరింత భారంగా మారుతుంది. దానికి తోడు ఈ రాయితీలు కూడా మార్చితో ముగిసిపోతే అవీ, ఇవీ కలిపి ఫెర్రో అల్లాయ్స్ మూతపడే పరిస్థితిని తీసుకుస్తాయి.

మెడికల్ కలపై కత్తి!

2025-26లో కొత్త కాలేజీల కోసం ఎన్ఎంసీకి దరఖాస్తు చేయడం లేదని కూటమి సర్కారు వెల్లడి

- నూతన కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు సన్నద్ధం
- ఇప్పటికే 700 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయిన విద్యార్థులు
- ఈసారైనా కొత్త కాలేజీలు వస్తాయనే ఆశతో లాంగ్‌టర్మ్ శిక్షణతో సిద్ధం
- రెండేళ్లలో ఏకంగా 2,450 సీట్లు నష్టపోతున్న వైనం



సాక్షి, అమరావతి: రెండేళ్లలో ఏకంగా 2,450 ఎంబీబీఎస్ సీట్లు..! కూటమి సర్కారు కక్షపూరిత విధానాలతో మన రాష్ట్రం నష్టపోతున్న వైద్య సీట్ల సంఖ్య ఇదీ! ఎన్ఎంసీని ఒప్పించి ఒక్కో మెడికల్ సీటు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వ ప్రయత్నాలు చేస్తుంటాయి. అలాంటిది.. ఇచ్చిన సీట్లను సైతం కాలదన్నే సర్కారును ఏమనాలి? సీఎం చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాలు మన విద్యార్థుల వైద్య విద్య కలలను ఛిద్రం చేస్తున్నాయి. ఇప్పటికే దాదాపుగా సిద్ధమైన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమైన కూటమి సర్కారు 'పీపీపీ' పాట పాడుతూ మన విద్యార్థులకు తీరని ద్రోహం తలపెడుతోంది. కూటమి ప్రభుత్వం నిర్వాకాలతో ఈ విద్యా సంవత్సరంలో అదనంగా సమకూరాల్సిన 700 ఎంబీబీఎస్ సీట్లను మన రాష్ట్రం కోల్పోయింది. దీంతో నీట్ యూజీలో ఉత్తమ స్కోర్ చేసినప్పటికీ సీటు దక్కక బీసీ, ఎస్సీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త వైద్య కళాశాలల కోసం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి దరఖాస్తు చేయడం లేదని ఇప్పటికే ప్రకటించింది. నూతన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు అప్పగించడం కోసం ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌ను నియమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి కళాశాలల నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆ నిర్మాణాలు దెబ్బ తినకుండా సేఫ్‌గా క్లోజ్ చేసేందుకు రూ.100 కోట్ల వ్యయం అవుతుందని అంచనా .

700 సీట్లకు మోకాలడ్డు..

పేదలకు చేరువలో ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యంతోపాటు మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటిలో ఐదు వైద్య కళాశాలలు వైఎస్సార్ సీపీ హయాంలోనే 2023-24లో ప్రారంభం కాగా 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా సమకూరాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరో ఐదు మెడికల్ కాలేజీలను ప్రారంభించి 750 సీట్లు సమకూరాల్సి ఉండగా చంద్రబాబు సర్కారు నిర్వాకాలతో కేవలం 50 సీట్లతో ఒక కళాశాల మాత్రమే అందుబాటులోకి వచ్చింది. పులివెందుల మెడికల్ కాలేజీకి 50 ఎంబీబీఎస్ సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేసినప్పటికీ కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా లేఖ రాసి అనుమతులు రద్దు చేయించింది. దీంతో ఈ విద్యా సంవత్సరం 700 ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్రం కోల్పోయింది.

నీట్‌లో మంచి స్కోర్ సాధించినా

వైద్య విద్యలో ఏటా పెరుగుతున్న పోటీకి అనుగుణంగా రాష్ట్రంలో సీట్లు పెరగలేదు. దీంతో ఈ విద్యా సంవత్సరం నీట్‌లో 600 వరకూ స్కోర్ చేసినప్పటికీ ఓసీ విద్యార్థులు, 500 పైబడి మార్కులు సాధించినా బీసీ, ఎస్సీ విద్యార్థులు మెడిసిన్ చదివే అవకాశం లభించక అన్యాయానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో 2025-26లో అయినా కొత్త మెడికల్ కళాశాలలు ప్రారంభమైతే సీట్లు పెరుగుతాయని ఆశలు పెట్టుకుని ప్రత్యామ్నాయ కోర్సుల్లో చేరకుండా చాలా మంది విద్యార్థులు నీట్-2025కు సన్నద్ధం అవుతున్నారు. కానీ కూటమి ప్రభుత్వం కొత్త వైద్య కళాశాలలు ప్రారంభించేలా చర్యలు తీసుకోకుండా ఇప్పటికే దాదాపుగా సిద్ధమైన వాటిని సైతం ప్రైవేట్ పరం చేసేలా అడుగులు వేయటాన్ని విద్యా రంగ నిపుణులు తీవ్రంగా తప్పుబడుతున్నారు.

మరో ఏడు కాలేజీల్లో

మరోవైపు ముందస్తు ప్రణాళిక ప్రకారం 2025-26 విద్యా సంవత్సరంలో పిడుగురాళ్ల, బాపట్ల, పార్వతీపురం, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లు, అమలాపురంలో నూతన వైద్య కళాశాలలు ప్రారంభమై వీటి ద్వారా మరో 1,050 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా సమకూరాల్సి ఉంది. వీటితో పాటు ఈ ఏడాది నిలిచిపోయిన మిగిలిన నాలుగు మెడికల్ కళాశాలలు, పాడేరులో సీట్లు పెంపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. దీంతో 2024-25లో 700 ఎంబీబీఎస్ సీట్లు, 2025-26లో ఏకంగా 1,750 సీట్లు చొప్పున మొత్తంగా రెండేళ్లలో మొత్తం 2,450 సీట్లను మన విద్యార్థులు కోల్పోనున్నారు.

ఏడు నెలల్లో అస్తవ్యస్థం..



వైద్య కళాశాలల్లో సౌకర్యాలు లేకుంటే వాటిని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. అదనపు బడ్జెట్ కేటాయించి ఎంబీబీఎస్ సీట్లు రాబట్టేలా చర్యలు తీసుకోవాలి. అలాకాకుండా వచ్చిన సీట్లు సైతం వద్దంటూ చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించింది. విజనరీ అని చెప్పుకునే నాయకుడు భవిష్యత్తు తరాలకు ఏం కావాలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. అలా కాకుండా పీపీపీ అంటూ పేద, మధ్య తరగతి పిల్లలకు తీవ్ర అన్యాయం తలపెడుతున్నారు. పీజీ ఫీజులపై స్పష్టత లేకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. సీట్ లభించి కళాశాలల్లో చేరిన వారిని ఎంత ఫీజు కట్టాలోననే ఆందోళన వెంటాడుతోంది. ఏడు నెలల పాలనలో రాష్ట్రంలో వైద్య విద్యను అస్తవ్యస్థంగా మార్చారు.

– ఈశ్వరయ్య, పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి


ఉద్యోగులను నట్టేట ముంచారు

ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి ఫైర్

సాక్షి, అమరావతి :ఎన్నికలకు ముందు ఉద్యోగులకు మాయ మాటలు చెప్పిన కూటమి పార్టీల నాయకులు అధికారంలోకి నట్టేట ముంచారని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడునెలలైనా ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఏమన్నారంటే.. ఉద్యోగులకు రూ.26 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి. సంక్రాంతికి ఇస్తామన్న రూ.1,300 కోట్లు పండగ ముగిసి వారమైనా విడుదల చేయలేదు. వెంటనే అవన్నీ చెల్లించాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఏదైనా బెనిఫిట్స్ అమలుచేయాలంటే సీఎస్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి మంత్రులను పిలిచి వారి సమక్షంలోనే ఫలానా బెనిఫిట్స్ కింద ఇంత మొత్తం ఇస్తామని తేదీలు ప్రకటించి విడుదల చేసేవారు. కానీ, కూటమి ప్రభుత్వంలో ఈ పారదర్శకత కొరవడింది. సీపీఎస్, జీపీఎస్, ఓపీఎస్‌లో.. ఏ విధానంలో కొనసాగుతున్నామో ఉద్యోగులకు అర్థంకాని పరిస్థితి నెలకొంది. అలాగే, మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 1.07.2023 నుంచి పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నా కనీసం పే రివిజన్ కమిషన్ ఏర్పాటుచేయలేదు.

అలవెన్సులు, ఐఆర్‌లోనూ భంగపాటే..

ఇక అలవెన్సులు పెంచుతారని ఆశించిన ఉద్యోగులకు భంగపాటూ తప్పలేదు. అలాగే, ఐఆర్ ఇస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారు. 30 శాతం తగ్గకుండా ఐఆర్ ఇవ్వాలి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయలేదు. ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్ పెట్టిన రెండు డీఏ బకాయిలు చెల్లించాలి. ప్రభుత్వ వాటా ఎప్పటికప్పుడు చెల్లించి క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ అమలు జరిగేలా చూడాలి.



మ్యూజిక్‌తో మనీ మ్యాజిక్

ప్రపంచ రికార్డెడ్ మ్యూజిక్ పరిశ్రమ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2023లో దీని విలువ 28.6 బిలియన్ డాలర్లు. ఇది గతేడాదితో పోలిస్తే 10.2 శాతం ఎక్కువ. మనదేశంలో ఈ పరిశ్రమ రెవెన్యూ గతేడాదితో పోలిస్తే 15.3 శాతం పెరిగింది. అంతర్జాతీయ ఫోనోగ్రఫిక్ పరిశ్రమ సమాఖ్య (ఐఎఫ్‌పీఐ) రూపొందించిన గ్లోబల్ మ్యూజిక్ రిపోర్ట్ 2024 ప్రకారం ప్రపంచంలో పెయిడ్ వినియోగదారుల అకౌంట్ల సంఖ్య 66.7 కోట్లు. 2023లో ప్రపంచంలోని రికార్డెడ్ మ్యూజిక్ పరిశ్రమ రెవెన్యూ పరంగా చూస్తే అమెరికా, కెనడాలది సంయుక్తంగా 41 శాతం. మనదేశం 14వ స్థానంలో ఉంది. టాప్ 10 మార్కెట్లు

1. అమెరికా
2. జపాన్
3. యూకే
4. జర్మనీ
5. చైనా
6. ఫ్రాన్స్
7. దక్షిణ కొరియా
8. కెనడా
9. బ్రెజిల్
10. ఆస్ట్రేలియా

గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ కొలువుల తివాచీ

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ప్రముఖ కంపెనీల నుంచి రూ.లక్షల్లో ప్యాకేజీల ఆఫర్

- క్యాంపస్ సెలక్షన్లలో 2018–24 బ్యాచ్‌కు చెందిన 473 మంది ఎంపిక
- ఆరుగురికి అత్యధికంగా రూ.27.6 లక్షల వార్షిక వేతనం



నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలు ఎర్రతివాచీతో ఆహ్వానం పలుకుతున్నాయి. రూ.లక్షల్లో ప్యాకేజీలు ఆఫర్ చేస్తూ.. తమ సంస్థల్లో ఉద్యోగాలిస్తున్నాయి. ఈసారి నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి ఏకంగా 473 మంది విద్యార్థులను క్యాంపస్ సెలక్షన్లలో వివిధ కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి. కొందరు విద్యార్థులైతే రూ.27.6 లక్షల వార్షిక వేతనానికి సైతం ఎంపికయ్యారు.

సాకారమవుతున్న వైఎస్సార్ ఆశయం..

పేదల పిల్లలకు ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించిన ట్రిపుల్ ఐటీల ఆశయం నెరవేరుతోంది. ట్రిపుల్ ఐటీల్లో చదివే వారంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు, కూలీలు, చిరుద్యోగుల పిల్లలే. వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపించి ట్రిపుల్ ఐటీల్లో సీట్లు దక్కించుకున్నారు. ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించి చదువు పూర్తికాకముందే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇప్పటివరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో 11 బ్యాచ్‌లు చదువు పూర్తిచేసుకొని వెళ్లగా.. దాదాపు ఏడు వేల మందికి పైగా విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అలాగే చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో, మరికొందరు విదేశాల్లో స్థిరపడ్డారు. ఈసారి 2018–24 బ్యాచ్‌కు చెందిన 473 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఉద్యోగ అవకాశాలు లభించేలా శిక్షణ..

విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం నూజివీడు ట్రిపుల్ ఐటీలోని కెరీర్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ సెల్ ఎంతో కృషి చేస్తోంది. విద్యార్థులకు నిరంతరం మాక్ టెస్ట్‌లు, మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించడంతో పాటు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో క్యాంపస్ సెలెక్షన్లు నిర్వహింపజేస్తోంది. ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్, థాట్ వర్క్స్, ఎఫ్‌ట్రానిక్స్, అచల ఐటీ సొల్యూషన్స్, పర్పుల్ టాక్, పర్పుల్ డాట్‌కామ్, ఈజ్ సాఫ్ట్, ఎన్‌సీఆర్, ఏడీపీ, అన్‌లాగ్ డివైజస్, టెక్ మహీంద్రా తదితర ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ క్యాంపస్ సెలెక్షన్లు నిర్వహించేలా ప్రత్యేక కృషి చేస్తోంది. దీంతో గత విద్యా సంవత్సరంలో నూజివీడు ట్రిపుల్ ఐటీలో 56 కంపెనీలు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించాయి.

ఆరుగురికి అత్యధిక ప్యాకేజీ..

క్యాంపస్ సెలక్షన్లకు 746 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 473 మంది విద్యార్థులు రూ.4.5 లక్షల నుంచి రూ.27.6 లక్షల వార్షిక వేతనానికి ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన అన్‌లాగ్ డివైసెస్ కంపెనీ రూ.27.6 లక్షల వార్షిక వేతనానికి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసుకుంది. వీరికి ఏడాది పాటు ఇచ్చే ట్రైనింగ్‌లో సైతం నెలకు రూ.40 వేల స్టైఫండ్ ఇవ్వనుంది. అలాగే సినాప్సిస్ కంపెనీ రూ.20 లక్షల వార్షిక వేతనంతో ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మైక్రాన్ కంపెనీ రూ.16 లక్షల వార్షిక వేతనంతో ఇద్దరిని, బెంగళూరుకు చెందిన వేదాంతు కంపెనీ రూ.15 లక్షల వార్షిక వేతనంతో నలుగురిని, బెంగళూరుకు చెందిన బీఈఎల్ కంపెనీ రూ.12.45 లక్షల వార్షిక వేతనానికి నలుగురిని, హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ ఫౌండేషన్ రూ.11 లక్షల వార్షిక వేతనానికి 10 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి.

క్యాంపస్ సెలక్షన్స్‌పై ప్రత్యేక తర్ఫీదు



విద్యార్థులకు ఇంజనీరింగ్ మూడో సంవత్సరం నుంచే క్యాంపస్ సెలక్షన్ల కోసం నిరంతరం శిక్షణ అందిస్తుంటాం. మాక్ టెస్ట్‌లు, మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం. దీంతో విద్యార్థులు ఎలాంటి భయం, బెరుకు లేకుండా క్యాంపస్ సెలక్షన్లలో అన్ని దశలను ఎదుర్కొని.. సులభంగా ఉద్యోగాలు సాధిస్తున్నారు.

– బి.లక్ష్మణరావు,
ఏఓ, నూజివీడు ట్రిపుల్ ఐటీ

చెక్ బౌన్స్ కేసులో రామ్‌గోపాల్ వర్మకు 3 నెలల జైలు



ముంబై: చెక్ బౌన్స్ కేసులో సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ముంబై కోర్టు మూడు నెలల జైలు శిక్ష విధించింది. అలాగే ఆయనపై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అంధేరీలోని ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైపీ పూజారి ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ఆదేశాలు అందిన మూడు నెలల్లోగా ఫిర్యాదుదారుడికి పరిహారం కింద రూ.3,72,219 చెల్లించాలని స్పష్టం చేశారు. చెక్ బౌన్స్ అయిందంటూ బాధితుడు 2018లో చేసిన ఫిర్యాదు మేరకు వర్మకు చెందిన సంస్థపై కేసు నమోదైంది. దీనిపై వర్మకు కోర్టు 2022లో బెయిల్ ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో వర్మ హాజరు కాకపోవడంతో కోర్టు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ చేసింది. వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించింది. తాజా పరిణామంపై వర్మ స్పందిస్తూ, 'అంధేరీ కోర్టు ఆదేశాల విషయం తెలిసింది. నా లాయర్లు ఈ విషయం పరిశీలిస్తున్నారు. ఏడేళ్ల క్రితం నాటి నా మాజీ ఉద్యోగికి సంబంధించిన రూ.2.38 లక్షల వ్యవహారమిది'అని 'ఎక్స్'లో వివరించారు. 'అయితే, ఇది రూ.2.38 లక్షల సెటిల్మెంట్ సమస్య కాదు. మోసపూరితంగా నా నుంచి డబ్బులు వసూలు చేసేందుకు సంబంధించిన వివాదమిది. ఇప్పటికి ఇది మాత్రమే చెప్పగలను' అని ఆయన వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

ఎంట్రన్స్‌ల నిర్వహణకు టెండర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ కామన్ ఎంట్రన్స్ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహించేందుకు ఉన్నత విద్యామండలి స్వల్పకాలిక టెండర్లు ఆహ్వానించింది. అర్హత ఉన్న కంపెనీలు 29వ తేదీ సాయంత్రం 5.30 గంటల్లో టెండర్లు దాఖలు చేయాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. వివరాలను https://tender. apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపింది.

ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఏపీ వైద్యసేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఎండీగా పి.ఎస్.గిరీశా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ఎం.ఎం.నాయక్‌కు అదనపు బాధ్యతలు

సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్‌కు ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ) వైస్ చైర్మన్, ఎండీగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

త్వరితగతిన డయాఫ్రమ్ వాల్ పనులు

మంత్రి నిమ్మల రామానాయుడు



డయాఫ్రమ్ వాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల, అధికారులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టులో ప్రధానమైన డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను గురువారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రెండో కట్టరు పని ప్రారంభిస్తుందని, మూడో కట్టర్ ఏప్రిల్ నాటికి వస్తుందని తెలిపారు. మూడు కట్టర్ల ద్వారా త్వరితగతిన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్వాసితులకు న్యాయం చేసి 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామన్నారు. వచ్చే వారం పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనకు సీఎం చంద్రబాబు వచ్చే అవకాశముందని, అప్పటికి అన్ని వివరాలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ గౌరవ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఏపీ ట్రికార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పోలవరం ప్రాజెక్ట్ సీఈ కె.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ పీజీ కోర్సుల దరఖాస్తు గడువు ఫిబ్రవరి 2

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2025–26 విద్యాసంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఫిబ్రవరి 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశాల కోసం కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) -పోస్టుగాడ్యుయేషన్ కోర్సులు–2025కు దరఖాస్తులను కోరుతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల్లోని పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఈ ఏడాది మార్చి 13 నుంచి మార్చి 31 వరకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 312 పరీక్ష కేంద్రాలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హెచ్‌సీయూలోని 41 పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు అధికారులు తెలిపారు.

పులివెందుల 'ఐజీజీఏఈఎల్'కు జైవిక్ అవార్డు

ఐదు విభాగాల్లో రాష్ట్రానికి పురస్కారాలు



ఐదు విభాగాల్లో జైవిక్ అవార్డులు అందుకున్న సేంద్రియ రైతులు, రైతు ఉత్పత్తి దారుల సంఘాలు

సాక్షి, అమరావతి: పులివెందులలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రోఎకోలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (ఐజీజీఏఈఎల్)కు పరిశోధనా విభాగంలో ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా అవార్డు లభించింది. రాష్ట్రంలో సేంద్రియ సాగును ప్రోత్సహించాలన్న సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 2022లో పులివెందులలో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రకృతి సాగు విధానాలపై శిక్షణ ఇస్తున్నారు. దేశంలో తొలి పరిశోధన సంస్థగా ఏర్పాటైన ఈ ఐజీజీఏఈఎల్ సంస్థకు ఉత్తమ సేంద్రియ వ్యవసాయ పరిశోధన సంస్థ విభాగంలో జైవిక్ అవార్డు వరించింది. 2024కు సంబంధించి రాష్ట్రానికి వివిధ విభాగాల్లో ఐదు అవార్డులొచ్చాయి. ప్రకృతి వ్యవసాయ విధానాలపై బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన బయో ఫెస్ట్–2025 వర్క్‌షాపులో ప్రతిష్టాత్మక అవార్డులను ఇంటర్‌నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ అధ్యక్షుడు సునీల్ సురేంద్రన్ చేతుల మీదుగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు అందుకున్నారు. జాతీయ స్థాయిలో 12 కేటగిరిల్లో అవార్డులు ఇవ్వగా ఐదు అవార్డులు ఏపీకే రావడం గమనార్హం. ఉత్తమ సేంద్రియ రైతు విభాగంలో రవీంద్ర, లత, ఉత్తమ సేంద్రియ రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో) కేటగిరిలో క్షేత్ర ప్రకృతి ఉత్పత్తిదారుల సంఘం(బాపట్ల జిల్లా), ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక విధానాల రూపకల్పన విభాగంలో రైతు సాధికార సంస్థకు, బయో ఇన్‌పుట్–జీవ వనరుల తయారీ విభాగంలో సుబ్రమణ్యేశ్వర ప్రకృతి వనరుల శిక్షణ కేంద్రాలకు అవార్డులు వరించాయి.

కృష్ణా జలాల పిటిషన్‌పై విచారణ వాయిదా

- ఫిబ్రవరి 13న వాదనలు వింటామన్న సుప్రీంకోర్టు
- తెలంగాణ, కేంద్రం కూడా వాదనలు వినిపించాలని ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల కేటాయింపునకు సంబంధించిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మళ్లీ వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారణ చేపడతామని స్పష్టం చేసింది. కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఏపీ ప్రభుత్వం 2023 అక్టోబర్ 17న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వంతోపాటు తెలంగాణ ప్రభుత్వాన్ని కూడా ప్రతివాదిగా చేర్చింది. తాజాగా.. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ చేపట్టాల్సి ఉంది. అయితే.. పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం లేనందున ఏపీ ప్రభుత్వం ధర్మాసనం ఎదుట స్పెషల్ మెన్షన్ చేసింది. సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతుండగానే కృష్ణా ట్రిబ్యునల్ ఇటీవలే నిర్ణయం తీసుకుందని, ఫిబ్రవరి 19 నుంచి కృష్ణా ట్రిబ్యునల్ విచారణ ప్రారంభం కానున్నదని ఏపీ ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. ఆ విచారణ కంటే ముందే తాము దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు విని, తీర్పు ఇవ్వాలని కోరింది. ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 2 గంటలకు వాదనలు వింటామన్న ధర్మాసనం.. ఏపీ, తెలంగాణతో పాటు కేంద్రం కూడా వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించింది.

ఆత్మరక్షణపై బాలికలకు శిక్షణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల ఆత్మరక్షణకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాణీ లక్ష్మీబాయి ఆత్మ రక్షా శిక్షణ పేరుతో శిక్షణ ఇచ్చేందుకు సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం ఏర్పాట్లు చేసింది. 10,421 పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు 8,55,498 మందికి వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మార్చి 15 వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మార్గదర్శకాలు జారీ చేశారు.

శిక్షకులుగా మహిళలనే నియమించాలి

బాలికలకు ఇచ్చే ఆత్మరక్షణ శిక్షణకు మహిళలనే ట్రైనర్లుగా నియమించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యాశాఖను కోరారు. ప్రతిరోజూ ఉదయం నాలుగో పీరియడ్‌ను శిక్షణకు కేటాయించాలని సూచించారు.

కమలంలో కలకలం!

- పురందేశ్వరి, సోము వీర్రాజు మధ్య భగ్గుమన్న విభేదాలు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడి నియామకంలో తలోదారి
- ప్రమాణ స్వీకార సమయంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం
- పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలన్న వీర్రాజు
- బలంగా ఉంది కాబట్టే ఎన్నికల్లో గెలిచామన్న చిన్నమ్మ



పురందేశ్వరి



సోము వీర్రాజు



ఎస్.హారిక



పిక్కి నాగేంద్ర

సాక్షి, రాజమహేంద్రవరం: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు మధ్య తూర్పుగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షుడి నియామకం అంశంలో విభేదాలు భగ్గుమన్నాయి. ఎవరికి వారు పార్టీ అధిష్టానంపై ఒత్తిడి పెంచేశారు. తన మాట నెగ్గాలంటే.. తన మాట నెగ్గాలంటూ పావులు కదిపారు. చివరకు వీర్రాజు జాతీయ నేతలను ఒప్పించి తన అనుచరుడైన కొవ్వూరుకు చెందిన పక్కి నాగేంద్రకు జిల్లా అధ్యక్షుడి పగ్గాలు అప్పగించడం.. పురందేశ్వరి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా, రాజమహేంద్రవరం సిట్టింగ్ ఎంపీగా ఉండీ కూడా తన అనుచరురాలైన ఎస్.హారికను జిల్లా అధ్యక్షురాలిగా నియమించలేక పోవడం చర్చనీయాంశమైంది. అధిష్టానం వద్ద పురందేశ్వరి మాట చెల్లుబాటు కాకపోవడం పార్టీ శ్రేణులను ఆశ్చర్యపరుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం తూర్పుగోదావరి జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా పిక్కి నాగేంద్ర ఉత్తర్వులు స్వీకరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి సోము వీర్రాజు, పురందేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడచినట్లు సమాచారం. బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని నూతన అధ్యక్షుడికి సోము వీర్రాజు సూచించారు. ఇదే విషయమై పురందేశ్వరి స్పందిస్తూ.. పార్టీ ఇప్పటికే క్షేత్ర స్థాయిలో బలంగా ఉంది కాబట్టే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించారని స్పష్టం చేశారు. ఈ పరిణామంతో పార్టీ శ్రేణులు విస్మయానికి గురైనట్లు సమాచారం.

టీడీపీతో అంటకాగుతున్నందుకేనా?

పురందేశ్వరి బీజేపీలో ఉన్నా, ఆమె మనసంతా టీడీపీలోనే ఉందన్న ఆరోపణలున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయం నుంచి టీడీపీ బలోపేతం, అధికారంలోకి తీసుకురావడానికి సొంత పార్టీ ప్రయోజనాలను సైతం తాకట్టు పెట్టారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల సమయంలో అనపర్తి ఎమ్మెల్యే స్థానానికి కూటమి అభ్యర్థిగా బీజేపీ నేత శివరామకృష్ణంరాజును బీజేపీ అధిష్టానం ప్రకటించింది. ఈ నిర్ణయంతో టీడీపీ ప్రస్తుత ఎమ్మెల్యే నల్లమిల్లి వర్గంలో అప్పట్లో అలజడి రేగింది. నల్లమిల్లి ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సమయంలో సొంత పార్టీ అభ్యర్థి శివరామకృష్ణంరాజుకు మద్దతు ఇవ్వాల్సింది పోయి.. నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పక్షాన పురందేశ్వరి నిలబడటం అప్పట్లో ఆశ్చర్యానికి గురి చేసింది. ఇలా తన మరిది (సీఎం చంద్రబాబు) ప్రయోజనాల కోసమే చేశారని అప్పట్లో చర్చ జరిగింది. అందువల్లే ఆమె సిఫారసులను కమలం పెద్దలు పట్టించుకోవడం లేదని తెలిసింది. పురందేశ్వరి, సోము వీర్రాజుల మధ్య ఆది నుంచి సయోధ్య కుదరడం లేదు. ఎన్నికల సమయంలో రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్‌లో ఏ స్థానం ఇచ్చినా పర్వాలేదని వీర్రాజు కోరారు. ఇందుకు టీడీపీ అధినేత నిరాకరించారు. ఈ నిర్ణయం వెనుక చిన్నమ్మ ఉన్నట్లు భావించిన సోము వర్గం అప్పటి నుంచి ఆమెను విభేదిస్తోంది.

బాలికల గోడు పట్టదా?

- హోంమంత్రి అనితపై ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆగ్రహం
- విశాఖలోని బాలికల ప్రత్యేక గృహంలో రెండో రోజూ ఆందోళన
- ముగ్గురిని వారి ఇళ్లకు పంపిన అధికారులు



బాలికలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కళ్యాణి

ఆరిలోవ: విశాఖ నగరంలోని ప్రభుత్వ బాలికల ప్రత్యేక గృహంలో ఉన్న ఐదుగురు తమను ఇళ్లకు పంపాలని రెండు రోజులుగా గొడవ చేస్తున్నా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పట్టించుకోకపోవడం దారుణమని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆగ్రహం వ్యక్తంచేశారు. తమను ఇళ్లకు పంపాలని విశాఖలోని ప్రభుత్వ బాలికల ప్రత్యేక గృహానికి చెందిన ఐదుగురు బాలికలు గురువారం ఉదయం కూడా గొడవ చేశారు. గోడలు ఎక్కి రోడ్డుపైకి రాళ్లు, పెంకులు విసిరారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, 9వ డివిజన్ కార్పొరేటర్ స్వాతి, వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు పి.రమణికుమారి, పద్మావతి తదితరులు ప్రభుత్వ బాలికల ప్రత్యేక గృహాన్ని సందర్శించి ఆందోళన చేస్తున్న బాలికలతోపాటు ఆ గృహం పర్యవేక్షణాధికారి ఏవీ సునీతతో మాట్లాడారు. అనంతరం కళ్యాణి మీడియాతో మాట్లాడుతూ ఐదుగురు బాలికలు రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నా... విశాఖలోనే ఉంటున్న హోం మంత్రి కనీసం ఈ దరిదాపులకు రాలేదని విమర్శించారు. ఆమె వెంటనే గృహాన్ని సందర్శించి ఈ వ్యవహారంపై మహిళా ఐపీఎస్ అధికారితో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ అప్పారావు, సభ్యుడు సీతారాం, ఐద్వా, ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ ప్రతినిధులు కూడా బాలికలతో మాట్లాడారు.

ముగ్గురు బాలికలు ఇళ్లకు తరలింపు

ఆందోళన చేసిన ఐదుగురు బాలికల్లో ముగ్గురిని ఇళ్లకు పంపించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. వారిలో కృష్ణా జిల్లా బాలికను ఆమె తల్లికి అప్పగించామని, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరిని పోలీస్ ఎస్కార్ట్‌తో అక్కడి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వద్దకు పంపామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా బాలికను ఆమె తల్లికి అప్పగిస్తామన్నారు. అనంతపురానికి చెందిన మరో బాలిక వ్యవహారం హైకోర్టులో ఉందని, కోర్టు నిర్ణయాన్ని బట్టి ఆ బాలికను ఇంటికి పంపించాలా? లేదా? అనేది సీడబ్ల్యూసీ సభ్యులు నిర్ణయిస్తారని తెలిపారు.

బాలికలకు ఏదీ భరోసా!?

ఎన్నికల హామీ 'తల్లికి వందనం' కూడా అమలుచేయని కూటమి ప్రభుత్వం

'నవరత్నాల'తోపాటు అనేక కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాలికలకు ఎంతో భరోసా కల్పించింది. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలతోపాటు అనేక వినూత్న పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలుచేసి తద్వారా బాలికా వికాసానికి వైఎస్ జగన్ సర్కారు ఎంతో తోడ్పాటునందించింది. విద్య, వైద్యం, రక్షణ, సంక్షేమం తదితర విషయాల్లో వారి కోసం ఆయన అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టారు. కానీ, రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా కనీసం ఎన్నికల్లో హామీ ఇచ్చిన తల్లికి వందనం పథకాన్ని సైతం అమలుచేయక పోగా ఉన్న పథకాలను కూడా నీరుగారుస్తోంది. నేడు జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

- అటకెక్కిన బాలికలకు న్యాప్‌కిన్స్ పంపిణీ
- బాలికా విద్య, ఆరోగ్యం, రక్షణ గాలికి..
- ఆడపిల్లల కోసం ఒక్క పథకాన్ని కూడా ప్రవేశపెట్టని చంద్రబాబు
- గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలకూ మంగళం
- నేడు జాతీయ బాలికల దినోత్సవం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బాలికలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనమామగా కొండంత అండగా నిలిచారు. తన హయాంలో వారికి అనేక పథకాలను అందించి పెద్ద మనస్సు చాటుకునే వారు. సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్), సమగ్ర బాలల సంరక్షణ పథకం (ఐసీపీఎస్)ను సమర్థవంతంగా అమలుచేశారు. మైదాన ప్రాంతంలో 47,287 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, గిరిజన ప్రాంతంలోని 8,320 అంగన్‌వాడీల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌ను పటిష్టంగా అమలుచేశారు. రాష్ట్రంలో మొత్తం 55,605 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని, వైద్య సేవలను, నర్సరీ విద్యను అందించడంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఒక్క బాలికలకే కాకుండా బాలురు, గర్భిణులు, బాలింతలు కలిపి 35 లక్షల మందికి క్రమం తప్పకుండా పౌష్టికాహార కిట్‌లను అందించి వారిలో రక్తహీనత లేకుండా చర్యలు చేపట్టారు.

'దిశ'తో ఆడబిడ్డలకు రక్షణ..

దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో దిశ బిల్లును తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆడబిడ్డలకు రక్షణ కల్పించడంతోపాటు దోషులకు త్వరితగతిన శిక్షపడేలా చేసింది. ఈ యాప్ ద్వారా ఆపదలో ఉన్న ఆడపిల్లలు సమాచారం అందించిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులు వచ్చి ఆదుకున్న ఘటనలు కోకొల్లలు. దిశ పోలీస్‌స్టేషన్‌లు, ప్రత్యేక న్యాయస్థానాలు, వన్‌స్టాప్ కేంద్రాలు సైతం ఏర్పాటుచేసింది. సైబర్ నేరాల కట్టడికి 9121211100 వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఏపీ సీఐడీ ఆధ్వర్యంలో 9071666667 వాట్సాప్ నెంబర్‌నూ ప్రారంభించారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 5,651 మంది బాలికలను రక్షించారు.

బాల్య వివాహాలకు చెక్..

పేద తల్లిదండ్రులకు తమ బిడ్డ పెళ్లి భారం కాకూడదనే పెద్ద మనస్సుతో అందించిన వైఎస్సార్ కళ్యాణమస్తు పథకంలో ఆడపిల్లకు కనీసం 18 ఏళ్లు ఉండాలనే నిబంధన పెట్టింది బాల్య వివాహాలను నిరోధించేందుకే. దీంతోపాటు.. కనీసం పదవ తరగతి చదివి ఉండాలనే నిబంధనవల్ల బాలికలను ఉన్నత విద్య చదువుకునేందుకు ప్రోత్సహించినట్లైంది. దీంతోపాటు బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక కార్యాచరణ కూడా అమలుచేశారు.

విద్యలో బాలికలకు ప్రాధాన్యం..

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల విద్యను ప్రోత్సహించి వారి డ్రాపౌట్స్‌ను నిరోధించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా..

- అమ్మఒడి పథకం ప్రవేశపెట్టి విద్యా వ్యవస్థలోనే నూతనోధ్యయాన్ని సృష్టించింది. పేద పిల్లల చదువు కోసం ఏటా రూ.15 వేలు అందించి బాలికల విద్యను ప్రోత్సహించింది.
- నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి వారి ఇబ్బందులను తొలగించింది.
- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే 7వ తరగతి నుంచి 12వ తరగతి (ఇంటర్) చదివే యుక్తవయస్సు బాలికలు దాదాపు 10 లక్షల మందికి 'స్వేచ్ఛ' పథకంలో ఏడాదికి 120 శానిటరీ నాప్‌కిన్స్‌ను ఉచితంగా అందించింది.

సమర్థంగా జువెనైల్ జస్టిస్ యాక్ట్ అమలు..

కేంద్ర ప్రభుత్వం అందించిన మిషన్ వాత్సల్య పథకంలో పిల్లల సమగ్రాభివృద్ధికి, వారి రక్షణ, మౌలిక సదుపాయాల కోసం జువెనైల్ జస్టిస్ (కేర్–ప్రొటెక్షన్) యాక్ట్‌ను సమర్థవంతంగా అమలుచేసింది. వారి సహాయానికి 1981, 1098 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ సెంటర్లు సేవలు అందించాయి. భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమం ద్వారా ఆడ శిశువుల హత్యలను నివారించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది.

ఆడపిల్లల పట్ల కూటమి నిర్లక్ష్యం..

రాష్ట్రంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, గత ప్రభుత్వం అమలుచేసిన కొన్ని పథకాలు అమలుచేయడం మినహా కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పథకం కూడా అమలుచేయలేదు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పుడా ఊసే ఎత్తడంలేదు. నాప్‌కిన్స్ పంపిణీని అటకెక్కించింది. ఒక్క అంగన్‌వాడీ కేంద్రాల్లో గత ప్రభుత్వం అందించిన పథకాలను అరకొరగానే కొనసాగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం బాలికా విద్యను, ఆరోగ్యాన్ని, రక్షణను గాలికొదిలేసింది.

రాష్ట్రంలో బాలబాలికల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం (2019 జూన్ నుంచి 2024 మార్చి వరకు) అందించిన లబ్ధి ఇలా.. (రూ.కోట్లలో)

పథకం	ఎంతమందికి	ఎంత లబ్ధి
అమ్మఒడి	44,48,685	26,067.30
జగనన్న వసతిదీవెన	25,17,245	4,275.76
జగనన్న విద్యాదీవెన	29,65,930	12,609.68
జగనన్న విద్యాకానుక	47,40,421	3,366.53
జగనన్న గోరుముద్ద	43,26,782	6,568.41
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	35,70,675	9,894.11

(వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆరేళ్లలోపు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు)

ఘనమైన త్రివర్ణం

ఫ్యాషన్

త్రివర్ణ పతాకాన్ని గర్వంగా ప్రదర్శించే రోజున ఆ రంగులనే పోలి ఉండే దుస్తులను ధరిస్తే ..? ఈ ఆలోచన జనవరి 26ను మరింత వేడుకగా మార్చుతోంది.

తెలుపు, నారింజ, ఆకుపచ్చ రంగుల కాంబినేషన్‌తో కూడిన మనదైన సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి గణతంత్రదినోత్సవం సరైన అవకాశాన్ని అందిస్తుంది. చీరలు, లెహంగా, దుపట్టాలు, ఫ్రాక్‌లు, సల్వార్ సూట్‌లతో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శిస్తూనే దేశాభివృద్ధి, విజయాలపై దృష్టి పెట్టాలనే స్ఫూర్తినీ మది నిండా నింపుతుంది.

ట్రెండీ, స్టైలిష్, సౌకర్యవంతమైన సంప్రదాయ దుస్తులను గణతంత్ర దినోత్సవ స్ఫూర్తిని నింపేలా ధరించవచ్చు.

- త్రివర్ణ శోభ నింపుకున్న కాటన్, చేనేత చీరలు సౌకర్యంగానూ, మన జాతి వైభవాన్ని కళ్లకు కడతాయి.
- తెల్లటి కుర్తా ప్యాంట్ సెట్ కి దేశీయ ప్రింట్లు గల త్రివర్ణ రంగుల దుపట్టా మనదైన హస్తకళా ప్రాధాన్యతను తెలియజేస్తుంది.
- ఆఫీస్ లేదా పరిసరాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు త్రివర్ణ చీర లేదా డ్రెస్ ధరించి దేశభక్తిని చాటుకోవచ్చు.
- త్రివర్ణంలో ఉన్న ఎంబ్రాయిడరీ డిజైన్లు, ప్రింట్లు ఉన్న డ్రెస్సులను ఎంచుకోవచ్చు
- చల్లని వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రై కలర్ శాలువాతో లుక్‌ను మెరుగు పరచవచ్చు.
- పిల్లలకు త్రివర్ణంలో ఉన్న ఫ్రాక్స్ సల్వార్ సూట్స్, హ్యాండ్ బ్యాండ్స్, థ్రెడ్ ఇయర్ హ్యాంగింగ్స్, బ్యాంగిల్స్‌తోనూ ముస్తాబు చేయవచ్చు. వారిలోనూ గణతంత్ర వేడుక స్ఫూర్తిని నింపడానికి ట్రై కలర్ డ్రెస్సింగ్ సరైన ఎంపిక అవుతుంది.



సెల్ఫ్-డిఫెన్స్


రాప్తాడులోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

నీ ధైర్యమే.. నీ సైన్యమై...

కరాటే అనేది మార్షల్ ఆర్ట్ మాత్రమే కాదు... మహత్తరమైన ఫిలాసఫీ కూడా. ఆ తత్వంలో... మనల్ని చీకటి నుంచి వెలుగులోకి తీసుకువచ్చే... సాహసంతో దూసుకెళ్లే స్ఫూర్తి దాగుంది. అందుకే కరాటే అనే ఆత్మరక్షణ విద్య అత్యవసరం అయింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న వంద విద్యాసంస్థల్లో 30 రోజుల పాటు 50 వేల మంది అమ్మాయిలకు కరాటే క్లాసుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు...



నేడు జాతీయ బాలికల దినోత్సవం!

అక్షరక్రమంలోనే కాదు, ఆత్మరక్షణలోనూ అనంతపురం జిల్లాను ముందు వరుసలో ఉంచే లక్ష్యంగా అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న పాఠశాలల నుంచి కాలేజీల వరకు కరాటే క్లాసుల నిర్వహణకు చొరవ తీసుకున్నారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సహకారంతో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆర్డీటీ సంస్థ ప్రతినిధులతో కలసి అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యతోపాటు యోగా, మానసిక వికాస తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 3న సామాజిక ఉద్యమకారిణి, తొలి తరం ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాలలు, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల పరిధిలోని బాలికల పాఠశాలలు, కళాశాలల్లో శిక్షణ ఇస్తున్నారు.

'నిజం చెప్పాలంటే కొన్నిరోజుల ముందువరకు ఇల్లు దాటి ఒంటరిగా బయటికి రావాలంటే భయంగా ఉండేది. ఎవరైనా కామెంట్ చేస్తారేమో అనే భయమే దీనికి కారణం. ఒకరోజు మా అక్క ను ఎవరో అసభ్యంగా కామెంట్ చేస్తే ఇంట్లో చెప్పి ఏడ్చింది. అప్పటినుంచి నాకు కూడా అలాంటి అనుభవం ఎదురవుతుందేమోననే భయం ఏర్పడింది. కరాటే క్లాసులకు హాజరు కావడం వల్ల నాలో ఉన్న ఆ భయం పోయింది. ఇప్పుడు నేను నిశ్చింతగా బయటికి వెళుతున్నాను. ఎవరైనా కామెంట్ చేస్తే వారిని ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌కు ఈడ్చుకు వెళ్లగలననే నమ్మకం వచ్చింది' అంటుంది పల్లవి.

'కరాటే నేర్చుకోవడం అనేది ఎవరినో భయపెట్టడానికి కాదు. మనం ధైర్యంగా ఉండడానికి. కరాటేలాంటి ఆత్మరక్షణ విద్యల వల్ల క్రమశిక్షణ, ఆరోగ్య స్పృహ పెరుగుతుందనేది అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను' అంటుంది శ్రీలత.

'మా అమ్మాయికి ఎంసెట్ కోచింగ్ ఇప్పటి నుంచే ఇప్పిస్తున్నాం' అని ఘనంగా చెప్పుకునే తల్లిదండ్రులను, 'అమ్మాయిలకు మార్షల్ ఆర్ట్స్ ఎందుకు!' అని ఆశ్చర్యపడేవాళ్లను ఎందరినో చూస్తుంటాం. పల్లవి, శ్రీలత, అఫ్రోజ, భార్గవి.. లాంటి అమ్మాయిల మనసులో మాట విన్నప్పుడు కరాటే నుంచి యోగా వరకు శిక్షణ తరగతులు నిర్వహణ అనేది ఎంత ముఖ్యమో అర్థమవుతుంది.

– ఖాజీ హిదాయతుల్లా, సాక్షి, అనంతపురం సిటీ

ఎప్పుడు ఏ ఆపద వచ్చినా...



జిల్లా వ్యాప్తంగా 50 వేల మంది అమ్మాయిలను ఆత్మరక్షణ విద్యలో ఆరితేరేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు ప్రతి మండలంలో కార్యక్రమాన్ని నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించి అమలు చేస్తున్నాం. నాలుగు రిసోర్స్ టీమ్‌లు అందుబాటులో ఉంటాయి. వాటికి వీర వాహిని, బలప్రభ, సురసేన, శక్తిసేనగా నామకరణం చేశాం. సంక్షేమ శాఖ, కరాటే అసోసియేషన్, ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు చెందిన వారు ప్రతి టీమ్‌ను పర్యవేక్షిస్తారు. ఎప్పుడు ఎటువంటి ఆపద వచ్చినా సమర్థంగా తిప్పికొట్టేలా అమ్మాయిలను తీర్చిదిద్దుతున్నాం. పది నుంచి పద్దెనిమిది ఏళ్ల లోపు టీనేజ్ అమ్మాయిలకు వచ్చే సమస్యలపైన అవగాహన కల్పిస్తున్నాం.

– బొల్లిపల్లి వినూత్న, అసిస్టెంట్ కలెక్టర్, అనంతపురం

సైనిక తరహాలో...



సైనిక తరహాలో కరాటే, యోగా, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ తరహా శిక్షణ అమ్మాయిలకు ఎంతో అవసరం. అందుకే క్రమశిక్షణ, పట్టుదలతో నేర్చుకుంటున్నాం. దీనివల్ల మాలో ఆత్మస్థైర్యం పెరుగుతోంది. ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కోగలమనే భరోసా కలుగుతోంది.

– ఇనగలూరు అఫ్రోజ, లా విద్యార్థిని, అనంతపురం

అదృష్టంగా భావిస్తున్నా...



కరాటే, యోగా, మానసిక వికాసం, ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఉచితంగా శిక్షణ పొందడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఎవరైనా ఆకతాయిలు నా జోలికి వస్తే తోక ముడిచి పరుగెత్తేలా చేయగలననే నమ్మకం వచ్చింది. అన్ని పాఠశాలల్లోనూ ప్రాథమిక స్థాయి నుంచే ఇటువంటి శిక్షణ ఇస్తే మరింత బాగుంటుంది.

– జి. భార్గవి, ఇంటర్ విద్యార్థిని, రాప్తాడు

కంటిపాపలకు కనురెప్పలా...

'స్వావలంబన దిశగా భవిష్యత్' అనే థీమ్‌ను నిర్ణయించారు. నేటి బాలికలు భద్రంగా ఉంటేనే భవిష్యత్ సాధికారత సాధ్యమవుతుంది! ఆ భద్రతే నేడు అతి పెద్ద సమస్య! సమస్య ఆలోచనలను రేకెత్తిస్తుంది.. వినూత్న ఆవిష్కరణలు ఆకారం దాల్చేలా చేస్తుంది! అలాంటి యువ ఆవిష్కర్తలనే ఇక్కడ పరిచయం చేయబోతున్నాం.. ఆడపిల్లల భద్రత కోసం వారు రూపొందించిన డివైజెస్‌తో!


సంస్కార్ టాయ్‌తో యాకర గణేశ్

సంస్కార్ టాయ్

ఆవిష్కర్త: యాకర గణేశ్, **వయసు:** 25 ఏళ్లు,
ఊరు: వరంగల్ జిల్లా, నందనం గ్రామం, తెలంగాణ!
తల్లిదండ్రులు: స్వరూప, చంద్రయ్య. వ్యవసాయ కూలీలు.

గణేశ్ రూరల్ ఇన్నోవేటర్. సైన్స్ అండ్ టెక్నాలజీలో అయిదు ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్‌ను సాధించాడు. గణేశ్ ఘనత గురించి తన 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ కూడా ప్రస్తావించారు. కట్టెలపొయ్యి మీద వంట చేస్తున్నప్పుడు ఆ పొగను తట్టుకోలేకపోతున్న అమ్మ అవస్థను చూసి ఆమె కోసం తన పదకొండేళ్ల వయసులోనే హ్యాండ్ ఫ్యాన్ తయారు చేసి ఇచ్చాడు. ఆనాడు మొదలైన ఆ ప్రస్థానం నేడు 30కి పైగా ఆవిష్కరణలకు చేరుకుంది. అందులోదే బాలికల భద్రత కోసం రూపొందించిన సంస్కార్ టాయ్. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పాలంటే వారిని ముట్టుకునే చెప్పాల్సి వస్తోంది. వారిని తాకకుండా.. దూరంగానే ఉంటూ చెప్పడమెలా అన్న అతని ఆలోచనకు పరిష్కారమే 'సంస్కార్ టాయ్'. దీనిపేరు ఆద్య. ఇది మాట్లాడే బొమ్మ. ఆద్యను ఛాతీ ప్రాంతంలో తాకామనుకో.. 'అక్కడ తాకకూడదు' అంటూ హెచ్చరిస్తుంది. ఇలా శరీరంలో ఏ స్పర్శ తప్పో.. ఏ స్పర్శ భద్రమో.. ఆద్యను టచ్ చేస్తూ తెలుసుకోవచ్చన్నమాట. భద్రమైన చోట కూడా తాకడం నచ్చకపోతే ఐ మే నాట్ లైక్ అని చెప్పచ్చని చెబుతుంది. అంతేకాదు ఆపదలో ఉన్నప్పుడు ఏం చేయాలో కూడా చెబుతుంది. హెల్ప్‌లైన్ నంబర్లను వల్లె వేస్తుంది. సైబర్ క్రైమ్ గురించి, డ్రగ్స్ హాని గురించీ హెచ్చరిస్తుంది. 'సంస్కార్ టాయ్'లో బాయ్ వర్షన్ కూడా ఉంది. పేరు ఆదిత్య. అబ్బాయిలకూ అవన్నీ చెబుతుంది. అదనంగా ఆడపిల్లలతో ఎలా మెసలుకోవాలో కూడా చెబుతుంది. అంతేకాదు చూపు, వినికిడి లోపాలున్న పిల్లలకూ సంస్కార్ టాయ్ ఉంది. చూపు లోపం ఉన్న వారికి వైబ్రేట్ అవుతూ టీచ్ చేస్తే, వినికిడి లోపం ఉన్న వాళ్లకు రెడ్, గ్రీన్, ఆరెంజ్ లైట్స్‌తో బోధిస్తుంది. గణేశ్ ఈ బొమ్మను రూపొందించిన (2021) నాటి నుంచి నేటి వరకు తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణాది, ఉత్తరాది కలుపుకుని మొత్తం అయిదు రాష్ట్రాల్లో, 65 వేల మంది విద్యార్థులకు భద్రత మీద అవగాహన కల్పించే ప్రయత్నం చేశాడు. కొన్ని స్కూల్స్‌కి ఉచితంగానే సేవలందించాడు. త్వరలోనే ఎల్ఎల్ఎమ్ మాడ్యూల్స్‌తో అప్‌డేట్ అవుతూ 'సంస్కార్ 2.0'పేరుతో హ్యూమనాయిడ్ రోబోను తయారు చేస్తున్నాడు. ఇది పిల్లలతో ఇంటరాక్ట్ అవుతుంది.

'చిన్నప్పటి నుంచీ నాకు సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్వెన్షన్స్ అంటే ఇష్టం. దీనికి సంబంధించి నాకు ఫార్మల్ ఎడ్యుకేషన్ ఏమీ లేదు. యూట్యూబ్ చూసే నేర్చుకున్నాను. ఇన్నోవేటివ్ మైండ్‌సెట్ ఉన్నవాళ్లకు ఓ ప్లాట్‌ఫామ్ తయారు చేయాలన్నదే నా లక్ష్యం. అందుకే 'సంస్కార్ ఎలక్ట్రానిక్స్' అనే స్టార్టప్ పెట్టాను. సామాజిక బాధ్యతే నా ప్రధాన ఆశయం! ఆసక్తి ఉన్న విద్యార్థులకి ఫ్రీగానే ట్రైనింగ్ ఇస్తున్నాం. సంస్కార్ టాయ్ తయారు చేయడానికి సైకాలజిస్ట్స్, సైకియాట్రిస్ట్స్, పిల్లల హక్కులు – భద్రత కోసం పనిచేస్తున్న ఎన్‌జీవోలు వంటి వాళ్లందరినీ కలిసి, రీసెర్చ్ చేసి ఒక కాన్సెప్ట్‌ను తయారు చేసుకున్నాం. మళ్లీ దాన్ని వాళ్లందరికీ చూపించి.. ఓకే అనుకున్నాకే టాయ్‌ని డెవలప్ చేశాం' అని సంస్కార్ టాయ్ వెనకున్న తన శ్రమను వివరించాడు గణేశ్.

ఇంకా..


సానియా అంజుమ్

తెలంగాణ, వికారాబాద్‌కు చెందిన సానియా అంజుమ్.. ఆడపిల్లల భద్రతకు 'షీ (ఫర్ అజ్)' అనే వినూత్న ఆలోచన చేసింది. పీరియడ్స్ టైమ్‌లో ఆడపిల్లల అవసరాలను తీర్చే అన్ని ఎక్విప్‌మెంట్స్‌తో ప్రతి స్కూల్లో ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేయాలనేదే 'షీ' కాన్సెప్ట్. మంచిచెడులను గైడ్ చేయడానికి, ధైర్యం కోల్పోకుండా అమ్మాయిలను మోటివేట్ చేయడానికి కొంతమంది స్టూడెంట్స్, టీచర్స్‌తో కలిపిన ఒక బృందం, అలాగే క్రమం తప్పకుండా గైనకాలజిస్ట్ విజిట్స్‌ను ఏర్పాటుచేయాలనేది 'షీ' ఉద్దేశం!


ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ బ్యాంగిల్

హైదరాబాద్‌కు చెందిన హరీష్ గాడీ అనే అబ్బాయి.. ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ బ్యాంగిల్‌ని తయారుచేశాడు. ఇది మామూలు గాజునే పోలి ఉంటుంది. దీన్ని వేసుకుంటే.. దాడి చేసిన వాళ్లకు ఆ గాజు తగిలి షాక్‌నిస్తుంది. అంతేకాదు అందులో ఫీడ్ అయి ఉన్న నంబర్లకు మీరున్న లోకేషన్ కూడా వెళ్తుంది. దీన్ని కనిపెట్టినందుకు హరీష్‌కి ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ ఫెయిర్ (2019)లో గోల్డ్ మెడల్ వచ్చింది. ఆదిలాబాద్‌కు చెందిన ఎ. సాయి తేజస్వి 'గర్ల్ సేఫ్టీ డివైస్'ను కనిపెట్టింది. చాలా తేలికగా ఉండే ఈ పరికరాన్ని కాలికి కట్టుకొని స్టార్ట్ బటన్ నొక్కేయాలి. ఎమర్జెన్సీ టైమ్‌లో యాక్టివేట్ అయ్యి మిమ్మల్ని టచ్ చేసిన వాళ్లకు షాక్‌నిస్తుంది. దాంతో దుండగులు మిమ్మల్ని ముట్టుకునే సాహసం చేయరు. సికింద్రాబాద్‌కు చెందిన వైష్ణవి చౌదరీ, మనోజ్ఞ సిద్ధాంతపు, నక్షత్ర పసుమర్తి.. ఈ ముగ్గురూ కలిసి 'మహిళా సురక్షా బ్యాండ్'ను తయారుచేశారు. ఇది కూడా ఎవరైనా మీ మీద దాడికి పాల్పడితే వాళ్లకు షాక్‌నిస్తుంది. పెద్దగా డేంజర్ అలారమ్‌ని మోగిస్తుంది. మీరు ఆపదలో ఉన్న సందేశంతోపాటు మీ లొకేషన్నీ అందులో ఫీడైన నంబర్లకు షేర్ చేస్తుంది. ఈ డివైస్ చూడ్డానికి స్టయిలిష్‌గానూ ఉంటుంది.

ఇలా అమ్మాయిల భద్రత కోసం యువత తమ వంతు ప్రయత్నాలు చేస్తోంది. మహిళల సాధికారతకు మద్దతునిస్తోంది.

– సరస్వతి రమ

విమెన్ సేఫ్టీ హెయిర్ రబ్బర్ బ్యాండ్

ఆవిష్కర్త: ఎస్. పూజ, **చదువు:** బీటెక్ సెకండియర్,
ఊరు: కరీంనగర్ జిల్లా, మానకొండూరు, తెలంగాణ.
తల్లిదండ్రులు: సుమిత్ర (గృహిణి), రమేశ్ (బైక్ మెకానిక్).


విమెన్ సేఫ్టీ హెయిర్ రబ్బర్ బ్యాండ్ చూపుతున్న పూజ

వయసుతో సంబంధం లేకుండా స్త్రీల మీద జరుగుతున్న దాడులు, వాళ్లకు భద్రత, రక్షణ లేకపోవడం వల్ల చాలామంది అమ్మాయిలు చదువుకు దూరమవడం వంటివన్నీ వినీ, చూసీ చలించిపోయింది పూజ. తనకు చేతనైనంతలో ఆ సమస్యకో పరిష్కారం కనిపెట్టాలనుకుంది. అదే 'విమెన్ సేఫ్టీ హెయిర్ రబ్బర్ బ్యాండ్!' ఇదెలా పనిచేస్తుందంటే.. జడకు మామూలు రబ్బర్ బ్యాండ్‌ని ఎలా పెట్టుకుంటారో దీన్నీ అలాగే పెట్టుకోవాలి. ఆపద ఎదురైనప్పుడు ఆ రబ్బర్ బ్యాండ్‌ను నొక్కితే చాలు.. వెంటనే పోలీస్ హార్న్ సౌండ్ వస్తుంది. ఆ శబ్దానికి భయపడి ఈవ్ టీజర్స్, దుండగులు పారిపోతారు. ఒకవేళ వాళ్లు వెళ్లకుండా ఇంకా ఇబ్బంది పెడుతుంటే.. ఆ బ్యాండ్ ను మరొకసారి నొక్కాలి. అప్పుడు ఆ ప్రదేశానికి దగ్గరలో ఉన్న షీ టీమ్ ఆఫీస్‌కి 'ఆపదలో ఉన్నాను.. రక్షించండి..'అన్న వాయిస్ మెసేజ్ వెళ్తుంది. అంతేకాదు, మీరున్న లైవ్ లొకేషన్‌నూ చూపిస్తుంది. వాటి ఆధారంగా షీ టీమ్ అలర్ట్ అయ్యి రక్షిస్తారు. 'సమాజంలో అమ్మాయిలకు భద్రత, రక్షణ లేక వాళ్లు చాలా రంగాల్లోకి అడుగుపెట్టలేక పోతున్నారు. శక్తిసామర్థ్యాలున్నా రాణించలేకపోతున్నారు. ఆమె లక్ష్యానికి భద్రత, రక్షణలేములు ఆటంకాలు కాకూడదు అని పించి ఈ హెయిర్ రబ్బర్ బ్యాండ్‌ను తయారు చేశాను' అని చెబుతుంది పూజ.

బాలికలకు మన దగ్గరున్న న్యాయపరమైన హక్కులు

- గర్భస్థ పిండం ఆడ, మగ అని తెలుసుకోవడం నేరం. తెలుసుకుని ఆడ శిశువును గర్భంలోనే చంపేయడం మరింత నేరం.
- అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు చదువుకునే హక్కుంది. ద రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్, 2009.. ఆరు నుంచి పద్నాలుగేళ్ల పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య హక్కును కల్పిస్తోంది. ఇది పిల్లలందరికీ వర్తిస్తున్నా.. బాలికా విద్యనూ ప్రోత్సహిస్తోంది.
- ఆడపిల్లలు సహా పిల్లలందరికీ సురక్షిత వాతావరణంలో పెరిగే హక్కుంది.
- గృహ హింస చట్టం మహిళలకే కాదు బాలికలకూ వర్తిస్తుంది. ఆడపిల్లల మీద కుటుంబ సభ్యులు ఎలాంటి శారీరక, భావోద్వేగ, లైంగిక, ఆర్థిక వేధింపులు, హింసకు పాల్పడినా అది నేరమే!
- 'స్త్రీ ధన్' పేరుతో అమ్మాయిలకు స్థిర, చరాస్తుల్లో హక్కుంటుంది. అంతేకాదు వారసత్వంగా వచ్చే ఆస్తిలోనూ అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు హక్కు ఉంటుంది.
- బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం.. పద్దెనిమిదేళ్లు నిండని అమ్మాయిలకు పెళ్లి చేయడం నేరం.
- ఇంటా.. బయటా.. ఎక్కడైనా అమ్మాయిలను లైంగిక వేధింపులకు గురిచేయడం, లైంగిక దాడితోపాటు వారి మీద అసభ్యపదజాలాన్ని ఉపయోగించడం, అసభ్యకరమైన సంజ్ఞలు చేయడం, అసభ్యకరమైన చిత్రాలు చూపించడం, ప్రైవేట్ పార్ట్స్ తాకడం వంటివన్నీ నేరాలే! ఇలాంటి వాటిని అరికట్టేందుకు పిల్లలందరి (బాలికలు సహా) కోసం పోక్సో అనే ప్రత్యేక చట్టమే ఉంది.


* పోషకాహారం

అమ్మాయిలకు హెల్తీ ప్లేట్!

భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే నేడు బాలికల ఎదుగుదల బాగుండాలి. అందుకు తగిన పోషకాహారాన్ని అందించడంతో పాటు, అవగాహన కలిగించడం ముఖ్యమని యునిసెఫ్ తన నివేదికల ద్వారా స్పష్టం చేస్తోంది. 2025లో పిల్లల్లో ఎదుగుదల లోపాలను 60 శాతానికి పైగా తగ్గించాలన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యం. అందుకు అనుగుణంగా మనం పని చేయడానికి కొన్ని మార్గదర్శకాలు...



ఎదిగే వయసులో అమ్మాయిల ఎముకల బలానికి క్యాల్షియం, రక్తవృద్ధికి ఐరన్, ప్రోటీన్లు, విటమిన్లు ఉండే ఆహారం అవసరం. ఎదుగుదల ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. చంటిపిల్లల వయసులో, ప్యూబర్టీకి ముందు, ప్యూబర్టీ తర్వాత అంటూ దశలను విభజించుకోవాలి. 21 సంవత్సరాల వరకు ఐరన్, ప్రొటీన్లు, విటమిన్లు గల సమతుల ఆహారం ఉండాలి. అయితే, అమ్మాయిలు సన్నగా ఉండాలనే ఆలోచన ప్యూబర్టీకి ముందు నుంచే ఆలోచన చేస్తున్నారు. చాలా సన్నగా ఉండటమే ఆరోగ్యం, అందం అని కూడా అనుకుంటున్నారు. దీంతో ఆహారాన్ని సరిగా తీసుకోకపోవడం వల్ల శారీరకంగా, మానసికంగా కూడా అనారోగ్యానికి గురవుతున్నారు. ఇలాంటప్పుడు అమ్మాయిలను వారి తల్లిదండ్రులు గైడ్ చేయాలి.


డా.జానకి, న్యూట్రిషనిస్ట్

అవగాహన పాఠాలు...

- వయసుకు తగిన విధంగా ఎలాంటి ఫుడ్ ఇవ్వాలనేదానిపై తల్లిదండ్రులు దృష్టి పెట్టి, పిల్లల ఆలోచనలను ఉన్నతంగా మార్చగలగాలి.
- చైల్డ్ ఫుడ్‌కు సంబంధించిన క్యాంపెయిన్స్ జరుగుతుంటాయి. అవి పిల్లలను ఆకట్టుకునేలా వినోదంగా కూడా పిల్లలకు పరిచయం చేయవచ్చు.
- పిల్లల ప్రపంచంలోకి సోషల్ మీడియా అమితంగా వచ్చేసింది. వీడియోల్లో వచ్చే జంక్ ఫుడ్, యాడ్స్, ఇతర ఫుడ్స్‌కు సంబంధించిన సమాచారం కూడా వారిని ఇన్‌ఫ్లూయెన్స్ చేస్తుంది. ఇలాంటప్పుడు మంచి-చెడులను ఇంట్లో వారు, స్కూల్‌లో టీచర్లూ చెబుతూ ఉండాలి.
- ఆహారంలో ఐరన్, విటమిన్లు, ప్రొటీన్లు సమృద్ధిగా లభించే నువ్వులు, నట్స్, గుడ్లు, ఆకుకూరలు, బొప్పాయి, పప్పుదినుసులు, చేపలు, మాంసం వంటివి చేర్చాలి.
- గ్రోత్ చార్ట్స్ మార్కెట్లో లభిస్తాయి. పుట్టిన నాటి నుంచి వయసును బట్టి ఎత్తుకు తగిన బరువు ఎలా ఉందో చెక్ చేసుకుని ఈ గ్రోత్ చార్ట్‌ను అనుసరిస్తూ వారి ఆహారపు అలవాట్లలో మార్పులు తీసుకురావచ్చు.

– నిర్మలారెడ్డి

స్త్రీ శక్తి

ఎత్తే సత్తా


భవధరణి

సాహసానికి జెండర్ భేదం లేదు. అయితే కొన్ని ఆటలు మాత్రం 'పురుషులకు మాత్రమే' కోట గోడలలో బందీలైపోయాయి. ఇప్పుడు ఆ కోటలు బ్రద్దలవుతున్నాయి. తమిళనాడులో 'ఇలవట్ట కల్' అనేది పురాతన ఆట. పెద్ద పెద్ద గుండ్రాళ్లను ఎత్తి పడేసే ఈ ఆటలో పురుషులు మాత్రమే పాల్గొనేవారు. మహిళలు ప్రేక్షకపాత్రకే పరిమితం అయ్యేవారు. ఈసారి మాత్రం మేము సైతం అంటూ 'ఇలవట్ట కల్'లో మహిళలు సత్తా చాటారు. భవిష్యత్ తరాలకు తరగని ఉత్సాహాన్ని ఇచ్చారు. నామక్కల్ జిల్లా తిరుచెంగోడులో ఈసారి మహిళల కోసం 'ఇలవట్ట కల్' ప్రత్యేకంగా నిర్వహించారు. 47 కేజీలు, 67 కేజీల విభాగంలో మహిళలు సత్తా చాటారు.

'ఇలవట్ట కల్' పోటీలలో పాల్గొన్న భవధరణి 67 కేజీల బరువు ఉన్న రాతిగుండును ఏకంగా రెండు సార్లు అలవోకగా ఎత్తిపడేసి మొదటి బహుమతిని గెలుచుకుంది. 'ఈ పోటీలలో పాల్గొనడం వల్ల రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి... సంప్రదాయంగా వస్తున్న ఆటలను కాపాడుకోవడం. రెండు... ఇలవట్ట కల్‌లో మహిళలు కూడా సత్తా చాటగలరు అని నిరూపించడం' అంటుంది భవధరణి.

– అస్మతీన్ మైదీన్, సాక్షి, చెన్నై

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	115	76,520
నిఫ్టీ ▲	50	23,205

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,939	▲ 69
డోజోన్స్	44,445	▲ 288
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,565	▲ 20
డాక్స్	21,412	▲ 157
షాంఘై	3,230	▲ 17
నికాయ్	39,959	▲ 303

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	80,039	▽ 155
బంగారం (22 క్యారట్)	79,719	▽ 154
వెండి (కేజీ)	90,633	▲ 615

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.20	108.00
€	యూరో	ఒకటి	88.77	91.39
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.62	55.98
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.19	55.39
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.95	65.62
SAR	సౌదీ రియాల్	బదులుగా	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	బదులుగా	22.19	23.74
¥	చైనా యువాన్	బదులుగా	11.01	12.83

డాక్టర్ రెడ్డీస్ లాభం 1,413 కోట్లు



- క్యూ3లో 2 శాతం అప్
- ఆదాయం రూ.8,359 కోట్లు; 16 శాతం వృద్ధి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ నికర లాభం రూ.1,413 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ3లో నమోదైన రూ. 1,379 కోట్లతో పోలిస్తే రెండు శాతం వృద్ధి చెందింది. మరోవైపు, ఆదాయం రూ. 7,215 కోట్ల నుంచి 16 శాతం వృద్ధి చెంది రూ. 8,359 కోట్లకు చేరింది. కొత్తగా కొనుగోలు చేసిన ఎన్ఆర్‌టీ (నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ) వ్యాపార విభాగం, కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం తదితర అంశాల దన్నుతో రెండంకెల స్థాయిలో ఆదాయ వృద్ధిని సాధించినట్లు సంస్థ సహ–చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు. కొత్త ఆవిష్కరణలతో అధునాతన ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. క్యూ3లో కంపెనీ వివిధ దేశాల్లో మొత్తం 20 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టింది.

మరిన్ని విశేషాలు..

- క్యూ3లో గ్లోబల్ జనరిక్స్ వ్యాపార విభాగం ఆదాయం 17 శాతం వృద్ధి చెంది రూ. 7,380 కోట్లుగా నమోదైంది. కీలకమైన ఉత్తర అమెరికాలో ఆదాయాలు 1 శాతం పెరిగి రూ. 3,380 కోట్లకు చేరింది. కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, సానుకూల ఫారెక్స్ ధోరణులనేవి ధరల క్షీణతపరమైన ప్రతికూల ప్రభావాన్ని భర్తీ చేసినట్లు సంస్థ వివరించింది.
- యూరప్‌లో ఆదాయాలు 143% పెరిగి రూ. 1,210 కోట్లకు, భారత్‌లో 14% వృద్ధితో రూ. 1,350 కోట్లకు పెరిగాయి. క్యూ3లో భారత్‌లో ఆరు కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టింది.
- వర్ధమాన మార్కెట్లలో ఆదాయం 12 శాతం వృద్ధి చెంది రూ. 1,440 కోట్లకు చేరింది.

గురువారం బీఎస్ఈలో డాక్టర్ రెడ్డీస్ షేరు స్వల్పంగా క్షీణించి రూ. 1,289 వద్ద క్లోజయ్యింది.

మళ్లీ రిలయన్స్ 'డిజిటల్ ఇండియా సేల్'



హైదరాబాద్: ఆకర్షణీయమైన ఆఫర్లతో రిలయన్స్ డిజిటల్ మరోసారి 'డిజిటల్ ఇండియా సేల్' ప్రకటించింది. స్మార్ట్ టీవీలు, ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఐపాడ్, ఏసీలు... తదితర ఎన్నో రకాలైన ఎలక్ట్రానిక్, డిజిటల్ వస్తువులను తక్కువ ధరలకే అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. కన్జూమర్ డ్యూరబుల్ రుణాలపై రూ.26,000 వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. ఎంపిక చేసిన బ్యాంకుల కార్డులతో చెల్లింపులు చేస్తే 15,000 వరకు, యూపీఐ ఐడీ ద్వారా చెల్లింపులతో రూ.1,000 వరకు డిస్కౌంటు పొందవచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఈ సేల్ జనవరి 26 తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఆఫర్లు అన్ని రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్లతో పాటు ఆన్‌లైన్‌లో www. reliancedigital. in లో లభిస్తాయి.

వ్యవసాయానికి పెద్ద పీట!

- 15 శాతం అధిక కేటాయింపులు
- రూ.1.75 లక్షల కోట్లకు చేరే అవకాశం
- డైయిరీ, ఫిషరీస్‌కూ ప్రాధాన్యం
- సహజసిద్ధ సాగుకు మద్దతు

రైతుల ఆదాయాన్ని పెంచాలన్న లక్ష్యంతో ఉన్న నరేంద్ర మోదీ సర్కారు రానున్న బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించనుంది. గత బడ్జెట్‌తో పోల్చితే కేటాయింపులు ఏకంగా 15 శాతం మేర పెరగనున్నట్టు విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం ఆధారంగా తెలుస్తోంది. ఎరువుల సబ్సిడీల్లో ప్రధానంగా పోషకాధారిత సబ్సిడీకి ప్రాధాన్యం ఇవ్వనుంది. మరిన్ని దిగుబడిని ఇచ్చే వంగడాల అభివృద్ధి, ప్రకృతి అనుకూల వ్యవసాయానికి మరింత మద్దతు అందించనుంది. కేవలం వ్యవసాయమే కాకుండా, అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, ఫిషరీస్ (మత్స్య)కు సైతం ప్రోత్సాహాన్ని కల్పించనుంది. దేశంలో 45 శాతం ఉపాధికి వ్యవసాయం, అనుబంధ రంగాలే ఆధారంగా ఉండడం గమనార్హం. దేశ జీడీపీలో ఈ రంగం 15 శాతం వాటా సమకూరుస్తోంది. కనుక వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు సమాచారం.

నానో, ఆర్గానిక్ ఎరువులకు ప్రోత్సాహం

ఎరువుల సబ్సిడీలో పోషకాధారిత ఎరువులకు కేటాయింపులు పెరుగుతూ వస్తున్నాయి. నేలలోని పోషకాలను కాపాడడం, యూరియా వినియోగాన్ని తగ్గించడం మధ్య సమతుల్యతను తీసుకువచ్చే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉంది. ఇందులో భాగంగా సాయిల్ హెల్త్ కార్డ్ (ఎస్‌హెచ్‌సీ/భూసారం వివరాలు)ను రైతులకు అందించనుంది. ప్రతి ప్రాంతంలోనూ నేల సారం ఎలా ఉంది, ఆ నేలకు తగ్గట్టు ఎలాంటి పోషకాలు అవసరం అన్న సమాచారం ఈ కార్డుల్లో ఉంటుంది. నానో, ఆర్గానిక్ ఎరువులకు ప్రోత్సాహం దిశగా మరిన్ని చర్యలు బడ్జెట్‌లో ఉండనున్నాయి. దీని ద్వారా పంటల దిగుబడిని పెంచడంతోపాటు, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించొచ్చు. ఫలితంగా దిగుమతులపై ఆధారపడడం తగ్గుతుంది. ప్రభుత్వానికి సబ్సిడీ భారం కూడా తగ్గిపోతుంది.

అంచనాలు..

- 2024-25 బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రభుత్వం 1.52 లక్షల కోట్లు కేటాయించింది. 2025-26 బడ్జెట్‌లో 1.75 లక్షల కోట్లకు కేటాయింపులు పెరగనున్నాయి. ఇందులో ఒక్క వ్యవసాయానికి రూ.1.23 లక్షల కోట్లు దక్కనున్నాయి.
- సబ్సిడీ సాగు రుణం ఒక్కో రైతుకు రూ.3 లక్షల పరిమితి ఉండగా, దీన్ని రూ.5లక్షలకు పెంచే అవకాశాలు ఉన్నాయి. దీనికి అదనంగా పంటల బీమాను సైతం పెంచనుంది.
- దేశీయంగా దిగుబడిని పెంచడం ద్వారా ధరల పెరుగుదలను కట్టడి చేయడానికి కూడా ప్రాధాన్యం ఇవ్వనుంది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ప్రస్తుతమున్న 50 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 80 బిలియన్ డాలర్లకు (రూ.6.88 లక్షల కోట్లు) పెంచాలన్న లక్ష్యంతో కేంద్రం ఉంది.
- 2030 నాటికి పప్పు ధాన్యాల ఉత్పత్తిని 30 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా చర్యలు ప్రకటించనుంది.



- నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకం కింద కోటి మంది రైతులను సహజ సిద్ధ సాగులోకి తీసుకురానున్నట్టు కేంద్ర ప్రభుత్వం గతేడాది లక్ష్యాన్ని ప్రకటించింది. వచ్చే బడ్జెట్‌లో ఈ దిశగా మరిన్ని ప్రోత్సాహకాలు ఉంటాయన్న అంచనా ఉంది.
- వచ్చే ఐదేళ్లలో మత్స్యకార రంగానికి 9 బిలియన్ డాలర్ల నిధుల సాయాన్ని అందించనుంది.
- ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలకు 2027 నాటికి రూ.10,900 కోట్ల రాయితీలను కూడా అందించనుంది.

5 లక్షలు: ఒక్కో రైతుకు రాయితీతో కూడిన పంట రుణం

2030 నాటికి వ్యవసాయ ఎగుమతుల లక్ష్యం 80 బిలియన్ డాలర్లు

10,900 కోట్లు: ఫుడ్ ప్రాసెసింగ్‌కు రాయితీలు

రైతులకు భూసారం కార్డులు

రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించే చర్యలు

అనుబంధ రంగాలకూ ప్రాధాన్యం

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్య సాధనలో మోదీ సర్కారు సఫలీకృతం కాలేదు. నాబార్డ్ నివేదిక ప్రకారం.. గ్రామీణ కుటుంబాల నెలవారీ సగటు ఆదాయం 2016–17 నుంచి 2021–22 మధ్య ఏటా 9.5% కాంపౌండెడ్ (సీఏజీఆర్) వృద్ధి చెందింది. అంటే మొత్తం మీద చూస్తే ఈ కాలంలో ఆదాయ వృద్ధి 57 శాతమే పెరిగినట్టు తెలుస్తోంది. ఈ దృష్ట్యా వ్యవసాయేతర రంగాలైన ఫిషరీస్, డైయిరీస్, తేనెటీగల పెంపకం తదితర విభాగాలకు మద్దతు ఇవ్వడం ద్వారా గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని పెంచే ప్రణాళికలతో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. వ్యవసాయ సరఫరా వ్యవస్థను (కోల్డ్ స్టోరేజ్, లాజిస్టిక్స్ తదితర) పటిష్టం చేయడం, వ్యవసాయ ఉత్పాదక మార్కెట్ల బలోపేతంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టనుంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఎన్‌కోర్–ఆల్కమ్ కొత్త ప్లాంట్



అవుతు శివ కోటి రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అల్యూమినియం డోర్స్, విండోస్ తయారీ కంపెనీ ఎన్‌కోర్–ఆల్కమ్ గుజరాత్‌లో నెలకొల్పిన అత్యాధునిక ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభించింది. సూరత్ వద్ద 1,84,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది ఏర్పాటైంది. అల్యూమినియం డోర్స్, విండోస్ విభాగంలో భారత్‌లో అతిపెద్ద, తొలి ఆటో రోబోటిక్ ఫెసిలిటీ ఇదేనని ఎన్‌కోర్ ఉడ్‌క్రాఫ్ట్స్ ఫౌండర్ అవుతు శివ కోటి రెడ్డి తెలిపారు. ప్లాంటుకు దశలవారీగా రూ.60 కోట్లు వెచ్చిస్తున్నట్టు చెప్పారు. 'హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నేటి నుంచి జరిగే ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్‌లో అత్యాధునిక, వినూత్న ఉత్పత్తులను ప్రదర్శిస్తాం. భారత్‌తోపాటు యూఎస్ఏ, యూకే, దుబాయ్, ఈయూలో 3,500లకుపైగా ప్రాజెక్టులు పూర్తి చేశాం. విదేశీ కంపెనీలకు ధీటుగా సొంత ఆర్‌అండ్‌డీతో, ఇటలీ డిజైనర్ల భాగస్వామ్యంతో ఉత్పత్తులు తయారు చేస్తున్నాం. కంపెనీ రూపొందించిన 20 అడుగుల స్లైడింగ్ డోర్ భారత్‌లో అతిపెద్దది' అని వివరించారు.

మారుతీ సుజుకీ కార్లు ప్రియం



న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా అన్ని మోడళ్ల ధరలను రూ.32,500 వరకు పెంచుతున్నట్టు గురువారం ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయి. పెరుగుతున్న ముడిసరుకు వ్యయాలు, నిర్వహణ ఖర్చుల కారణంగా ధరలను అధికం చేస్తున్నట్టు కంపెనీ తెలిపింది. ధరలు సెలెరియో రూ.32,500, ఇన్విక్టో రూ.30 వేలు, వేగన్–ఆర్ 15 వేలు, స్విఫ్ట్, ఎస్–ప్రెస్సో రూ.5 వేలు, బ్రెజ్జా, గ్రాండ్ విటారా రూ.20 వేలు, ఆల్టో కె10 రూ.19,500, బలేనో 9 వేలు, ఫ్రాంక్స్ రూ.5,500, డిజైర్ రూ.10 వేల వరకు దూసుకెళ్లనుంది.

పడి పెరిగిన మార్కెట్లు

స్వల్ప లాభాల ముగింపు



ముంబై: ఆరంభ నష్టాల నుంచి తేరుకున్న స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 115 పాయింట్లు పెరిగి 76,520 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 పాయింట్లు బలపడి 23,205 వద్ద నిలిచింది. సూచీలకిది రెండో రోజూ లాభాల ముగింపు. ఐటీ, ఫార్మా, కన్జూమర్ డ్యూరబుల్స్, కమోడిటీ షేర్లు రాణించడంతో సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ అయ్యాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.67%, 1.78% లాభపడ్డాయి. ఇంధన, బ్యాంకులు, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

- స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్ లిస్టింగ్ రోజే 40% లాభాలు పంచింది. ఇష్యూ ధర (రూ.90)తో పోలిస్తే బీఎస్ఈలో 33.33% ప్రీమియంతో రూ.120 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో కొనుగోళ్ల మద్దతుతో 40% ర్యాలీ చేసి అప్పర్ సర్క్యూట్ రూ.126 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఏఐకి కీలక మార్కెట్‌గా భారత్ : శాంసంగ్ ప్రెసిడెంట్ | సైయెంట్ లాభం రూ. 122 కోట్లు

భారత నంబర్‌వన్‌గా గుకేశ్



అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) క్లాసికల్ ఫార్మాట్ లైవ్ ర్యాంకింగ్స్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ ఒక స్థానం మెరుగుపర్చుకున్నాడు. గురువారం లైవ్ ర్యాంకింగ్స్‌లో గుకేశ్ 2784 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకొని భారత నంబర్‌వన్‌గా అవతరించాడు. కొన్నాళ్లుగా నాలుగో ర్యాంక్‌లో నిలిచి, భారత నంబర్‌వన్‌గా ఉన్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 2779.5 రేటింగ్ పాయింట్లతో ఐదో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో జరుగుతున్న టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీలో గుకేశ్, అర్జున్, ప్రజ్ఞానంద పోటీపడుతున్నారు. ఐదో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద నాలుగు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 3.5 పాయింట్లతో గుకేశ్ రెండో స్థానంలో ఉన్నాడు. 14 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో అర్జున్ ఒక పాయింట్‌తో 13వ స్థానంలో ఉన్నాడు.

వెల్‌డన్... సుదర్శన్

బహామస్ గ్రేట్ అబాకో క్లాసిక్ గోల్ఫ్ టైటిల్ నెగ్గిన తెలుగు సంతతి కెనడా గోల్ఫర్



అబాకో క్లబ్ (బహామస్): కెనడాకు చెందిన తెలుగు సంతతి గోల్ఫర్ ఎల్లమరాజు సుదర్శన్ తన కెరీర్‌లో గొప్ప విజయం అందుకున్నాడు. ప్రొఫెషనల్ గోల్ఫ్ అసోసియేషన్ (పీజీఏ)లో ద్వితీయ శ్రేణి ఈవెంట్‌గా పరిగణించబడే కోర్న్ ఫెర్రీ టూర్‌లో భాగంగా జరిగిన బహామస్ గ్రేట్ అబాకో క్లాసిక్ టోర్నమెంట్‌లో సుదర్శన్ విజేతగా నిలిచాడు. 23 ఏళ్ల సుదర్శన్ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాలో జన్మించాడు. నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అతను కెనడాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. కాగా బహామస్ టోర్నీలో అసామాన ప్రదర్శనతో సుదర్శన్ ఆకట్టుకున్నాడు. కచ్చితత్వంతో కూడిన షాట్లతో విజయం సాధించాడు. కేవలం ఐదే ఐదు షాట్లలో విజేతగా నిలిచాడు. 8–అండర్–64లో 263 పాయింట్ల స్కోరుతో టైటిల్ నెగ్గాడు. ద్వితీయ శ్రేణి ఈవెంట్ అయినప్పటికీ అనామక ఆటగాళ్లు బరిలోకి దిగారనుకుంటే తప్పులో కాలేసినట్లే! ఎందుకంటే రెండు సార్లు పీజీఏ టూర్ విజేత, జపాన్ స్టార్ గోల్ఫర్ కెన్సెయ్ హిరాత ఇక్కడ టైటిల్ కోసం శ్రమించినప్పటికీ సుదర్శన్ ప్రదర్శనతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. 'కాలక్షేపం కోసం నాన్న టీవీలో గోల్ఫ్ పోటీలను చూసేవాడు. పక్కనే నేను కూర్చునేవాణ్ని. అలా చిరుప్రాయంలో చూసిన ఆటలో ఇప్పుడు విజేతగా నిలువడం... అది కూడా నాన్న పుట్టిన రోజు (జనవరి 22)న టైటిల్ అందుకోవడం ఆనందంగా ఉంది. అప్పట్లో మేం కెనడాకు వలస వెళ్లినపుడు చాలా కష్టపడాల్సి వచ్చింది. తర్వాత పరిస్థితులు చక్కబడ్డాక అమ్మానాన్నలిద్దరూ నన్ను ప్రోత్సహించారు' అని సుదర్శన్ అన్నాడు.



సబలెంకా · మాడిసన్ కీస్

సబలెంకా X కీస్

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ

మెల్‌బోర్న్: 'హ్యాట్రిక్' ఘనత సాధించేందుకు సబలెంకా... కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం చేసుకునేందుకు మాడిసన్ కీస్... ఒక్క విజయం దూరంలో నిలిచారు. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బెలారస్ స్టార్ సబలెంకా వరుసగా మూడో ఏడాది ఫైనల్లోకి దూసుకెళ్లగా... అమెరికా ప్లేయర్ మాడిసన్ కీస్ తొలిసారి టైటిల్ పోరుకు అర్హత పొందింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో టాప్ సీడ్ సబలెంకా 6–4, 6–2తో 11వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్)పై నెగ్గగా... 19వ సీడ్ మాడిసన్ కీస్ 5–7, 6–1, 7–6 (10/8)తో రెండో సీడ్, ఐదు సార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను బోల్తా కొట్టించింది. శనివారం జరిగే ఫైనల్లో సబలెంకా, కీస్ అమీతుమీ తేల్చుకుంటారు.

2023, 2024లలో ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన సబలెంకాకు సెమీఫైనల్లో తన ప్రత్యర్థి బడోసా నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా 32 విన్నర్స్ కొట్టి, బడోసా సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు బడోసా నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 15 అనవసర తప్పిదాలు చేసిన ఈ స్పెయిన్ ప్లేయర్ కేవలం ఒకసారి మాత్రమే సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసింది.

స్వియాటెక్‌తో 2 గంటల 35 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో కీస్ నిర్ణాయక మూడో సెట్‌లోని 12వ గేమ్‌లో మ్యాచ్ పాయింట్ కాపాడుకుంది. 6–5తో ఆధిక్యంలో నిలిచిన స్వియాటెక్ తన సర్వీస్‌లో 40–30తో విజయం అంచుల్లో నిలిచింది. అయితే స్వియాటెక్ వరుసగా మూడు తప్పిదాలు చేసి తన సర్వీస్‌ను కోల్పోయింది. దాంతో స్కోరు 6–6తో సమమైంది. ఫలితంగా విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్ అనివార్యమైంది. తొలుత 10 పాయింట్లు సాధించిన వారికి విజయం ఖరారయ్యే ఆఖరి సెట్ టైబ్రేక్‌లో రెండుసార్లు స్వియాటెక్ 5–3తో, 7–5తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ కీస్ పట్టుదల కోల్పోకుండా పోరాడి చివరకు 10–8తో టైబ్రేక్‌లో నెగ్గి సెట్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. 2017లో యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచిన కీస్ రెండో 'గ్రాండ్' అవకాశంలోనైనా విజేతగా నిలుస్తుందో లేదో వేచి చూడాలి. **నేడు జరిగే పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో జ్వెరెవ్ (జర్మనీ)తో జొకోవిచ్ (సెర్బియా); బెన్‌షెల్టన్ (అమెరికా)తో యానిక్ సినెర్ (ఇటలీ) తలపడతారు.**

మెరిసిన త్రిష, షబ్నమ్

డిఫెండింగ్ చాంపియన్... ఈ హోదాకు మరింత హుందాగా న్యాయం చేస్తూ భారత అమ్మాయిల జట్టు అండర్–19 టి20 ప్రపంచకప్‌లో దూసుకెళుతోంది. ఇది వరకే 'సూపర్ సిక్స్'కు చేరిన అమ్మాయిలు ఇప్పుడు అజేయంగా లీగ్ దశను ముగించారు. తెలుగమ్మాయిలు గొంగడి త్రిష, షబ్నమ్ రాణించారు. దీంతో గ్రూప్ 'ఎ'లో ఆడిన మూడు మ్యాచ్‌లు గెలిచి భారత్ గ్రూప్ టాపర్‌గా నిలిచింది.

- అజేయంగా నిలిచిన యువ భారత్
- చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై 60 పరుగులతో విజయం
- గ్రూప్ 'ఎ'లో టాపర్‌గా నిలిచిన డిఫెండింగ్ చాంపియన్
- 'సూపర్ సిక్స్' దశకూ అర్హత
- మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్



త్రిష



షబ్నమ్

కౌలాలంపూర్: ఈ ప్రపంచకప్‌లోనూ మనమ్మాయిల జైత్రయాత్ర కొనసాగుతోంది. దుర్భేద్యమైన భారత జట్టుతో మ్యాచ్ అంటేనే ప్రత్యర్థి జట్లు హడలెత్తేలా టీమిండియా తడాఖా చూపిస్తోంది. గ్రూప్ 'ఎ'లో గురువారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 60 పరుగుల తేడాతో శ్రీలంకపై జయభేరి మోగించింది. ఈ గ్రూపులో ఇదివరకే మలేసియా, వెస్టిండీస్ జట్లను ఓడించి తాజాగా విజయాల 'హ్యాట్రిక్'ను నమోదు చేసింది. రేపటి నుంచి రెండు గ్రూపు (1, 2)ల మధ్య 'సూపర్ సిక్స్' దశ మొదలవుతుండగా... 'గ్రూప్–1'లో ఉన్న భారత్ తమ తొలి మ్యాచ్‌లో ఆదివారం (26న) బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.

త్రిష... భారత బ్యాటింగ్‌కు దిశ

మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత యువతుల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. తెలుగమ్మాయి, ఓపెనర్ గొంగడి త్రిష భారత ఇన్నింగ్స్‌కు పెద్ద దిక్కయింది. టాపార్డర్ సహా టెయిలెండర్ల వరకు ఎవరూ కనీసం రెండు పదుల స్కోరైనా చేయలేకపోతుంటే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' త్రిష (44 బంతుల్లో 49; 5 ఫోర్లు, 1 సిక్స్) మాత్రం బ్యాటింగ్‌కు దిశను చూపింది. టాపార్డర్‌లో ఆమె నిలబడగా... ఓపెనర్ కమలిని (5), సానిక (0) చేతులెత్తేయడంతో 17 పరుగులకే 2 కీలక వికెట్లను కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ నికీ ప్రసాద్ (11; 2 ఫోర్లు) అండతో చకచకా పరుగులు సాధించింది. మిగతా వారిలో జోషిత (9 బంతుల్లో 14; 1 ఫోర్, 1 సిక్స్), మిథిలా (10 బంతుల్లో 16; 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా పరుగులు జతచేశారు. లంక బౌలర్లలో అసెని తలగుణె, లిమాన్స తిలకరత్న, ప్రముది మిత్సర తలా 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక జట్టు... భారత బౌలింగ్‌ను ఎదుర్కోలేక ఆపసోపాలు పడి చివరకు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 58 పరుగులకే పరిమితమైంది. మొత్తం ఇన్నింగ్స్‌లో ఒక్కరంటే ఒక్కరే రష్మిక సెవాండి (12 బంతుల్లో 15; 2 ఫోర్లు) రెండంకెల స్కోరు చేశారు. ఇక మిగతా పది మంది బ్యాటర్లు భారత బౌలింగ్‌కు దాసోహమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షబ్నమ్ (2/9), జోషిత (2/17) నిప్పులు చెరగడంతో లంక టాపార్డర్ 3.2 ఓవర్లకే 9/4 స్కోరు వద్ద కుదేలైంది. ఈ పేస్ ధాటికి తేరుకోకముందే కెప్టెన్ మనుడి ననయక్కర (2) రనౌట్ కావడంతో 12 పరుగులకే లంక సగం వికెట్లను కోల్పోయింది. దాంతో లక్ష్యఛేదన అసాధ్యమైంది. స్పిన్నర్లలో పారుణిక 2 వికెట్లు తీయగా, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ చెరో వికెట్ తీశారు.

సాత్విక్–చిరాగ్ జోడీ అవుట్



జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ జంట సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. సాత్విక్–చిరాగ్ జంట 20–22, 21–23తో కిట్టినపాంగ్ కెడ్రెన్–డెచాపోల్ (థాయ్‌లాండ్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత నంబర్‌వన్ లక్ష్యసేన్ 16–21, 21–12, 21–23తో నిషిమోటో (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో, మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తనీషా–అశ్విని జోడీలు ఓటమి పాలయ్యాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సర్కారు మోసం.. చదువులకు దూరం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- లేదంటే ఫిబ్రవరి 5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు
- ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు విజ్ఞప్తులు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక పోవడంతో పేద విద్యార్థులు అర్థంతరంగా చదువులకు దూరమవుతున్నారని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే దాదాపు రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులు,



మాట్లాడుతున్న అప్పిరెడ్డి. చిత్రంలో పార్టీ నేతలు

విద్యార్థుల తల్లిదండ్రుల పక్షాన ఫిబ్రవరి 5న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ రోజు వారితో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. గురువారం ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఏనాడూ పిల్లల చదువులపై శ్రద్ధ చూపలేదని, విద్య ప్రభుత్వ బాధ్యత కాదని చెప్పిన పెద్దమనిషి ఈయనే అని ధ్వజమెత్తారు. ఏడు నెలల్లో విద్యార్థులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ నేతలు కె.కనకారావు, ఎ.నారాయణ మూర్తి, ఎ.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాగర్ విమానాశ్రయ భూముల పరిశీలన

విజయపురిసౌత్: న్యూఢిల్లీకి చెందిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని జాయింట్ జనరల్ మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం గురువారం నాగార్జున సాగర్‌లో గతంలో ఏర్పాటు చేసిన విమానాశ్రయంతో పాటు ప్రస్తుతం నూతన విమానాశ్రయం ఏర్పాటుకు భూములను పరిశీలించారు. గురజాల ఆర్డీవో వి.మురళీకృష్ణతో కలిసి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పల్నాడు జిల్లా, మాచర్ల మండలంలోని విజయపురిసౌత్, పసువేముల, చింతలతండా, నాగులవరం గ్రామాల్లో విమానాశ్రయానికి ప్రతిపాదించిన భూములను పరిశీలించి నివేదికను సిద్ధం చేసుకున్నారు. సాగర్‌లో నూతన ఎయిర్‌పోర్ట్‌కు కావాల్సిన సౌకర్యాలు, వాతావరణ పరిస్థితులను అంచనా వేశారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన అధికారులు ప్రవీంద్ర తివారి, అరుణ్‌కుమార్, అమాన్ చిప్ప, సాజిజ్ అభిలాజ్, ఉస్మాన్ తదితరులు ఉన్నారు.

వీఆర్ఎస్‌కు ఒప్పుకోలేదని టీచర్లకు వేధింపులు

- పాఠశాలలోకి రాకుండా గేటు బయటే నిలిపివేత
- బాపట్ల జిల్లాలో ఓ ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం దుర్మార్గం



పాఠశాల గేటు వద్ద వెంకటేశ్వర్లు, పద్మావతమ్మ

సాక్షి, అమరావతి: తమ పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు వలంటరీ రిటైర్‌మెంట్ (వీఆర్ఎస్)కు ఒప్పుకోలేదని కొద్ది రోజులుగా వేధిస్తోంది ఓ ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యం. అప్పటి నుంచి వారికి వేతనాలు సైతం రాకుండా చేసింది. చివరికి గురువారం పాఠశాలకు వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులను గేటు వద్దే అడ్డుకుని లోపలికి రావొద్దని హుకుం జారీచేసింది. ఈ ఘటన బాపట్ల జిల్లా పర్చూరు మండలం చెరుకూరులోని ఆంధ్ర కేసరి మెమోరియల్ రెసిడెన్సీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. ఈ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా సీహెచ్ వెంకటేశ్వర్లు, తెలుగు పండిట్‌గా కె.పద్మావతమ్మ 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వీరిలో ఒకరికి మూడేళ్లు, మరొకరికి రెండున్నరేళ్ల సర్వీసు మిగిలి ఉంది. అయితే, వీరిద్దరినీ వలంటరీ రిటైర్‌మెంట్ ఇవ్వాలని యాజమాన్యం ఏడాది నుంచి ఒత్తిడి చేస్తోంది. ఈ విషయమై గత ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు ఉపాధ్యాయులను స్కూల్లోకి రాకుండా అడ్డుకుంది. అప్పట్లో ఈ వ్యవహారం మీడియాకి చేరడంతో నాటి బాపట్ల డీఈవో ఆదేశాల మేరకు వారిద్దరినీ స్కూల్లోకి అనుమతించింది. అయితే, నాటి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు వేతనాలు రాకుండా యాజమాన్యం అడ్డుపడుతోంది. వీఆర్ఎస్ ఇస్తేనే స్కూల్లోకి రావాలని గురువారం మరోసారి గేటు బయట నిలబెట్టింది. తమకు 2024 ఫిబ్రవరి నుంచి జీతాలు బిల్లులు మంజూరు చేయకుండా యాజమాన్యం వేధిస్తోందని ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పద్మావతమ్మ వాపోయారు. కాగా, ఉపాధ్యాయులన వేధించిన ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏపీ టీచర్స్ గిల్డ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., **Editor: Dhananjaya Reddy Rakkasi,** (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 24 । జనవరి । 2025



నేటి నుంచి 'సెపక్‌తక్రా'

ఎస్‌జీఎఫ్‌ఐ, ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు సెపక్‌తక్రా పోటీలు జరుగుతాయి. -IIలో▸



నిత్యాన్నదానానికి విరాళం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి నిత్యాన్నదానానికి పెనుమాకకు చెందిన కళ్ళం శివారెడ్డి కుటుంబ సభ్యులు రూ.5,05,510 విరాళమిచ్చారు.



'హంసలదీవి'కి నూతన శోభ

హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణు గోపాలస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు నూతన శోభతో కళకళలాడుతోంది. వివిధ వర్ణాలతో ముస్తాబు చేస్తున్నారు. -IIలో▸

న్యూస్‌రీల్

కృష్ణా కలెక్టర్ బాలాజీకి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీకి 2024 సంవత్సరానికి బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతేడాది కృష్ణా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిగా 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనపరిచినందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు డీకే బాలాజీని ఎంపిక చేసింది. ఈ నెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవం రోజు అవార్డును ఆయనకు ప్రదానం చేయనున్నారు.

'పది' స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డెమోక్రటిక్ పీఆర్టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యాన రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఏపీ పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు ఆవిష్కరించారు. విజయవాడలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. దీన్ని రూపొందించిన డీపీఆర్టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి. శ్రీను మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని మెటీరియల్ రూపొందించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి కూడిన మోడల్ క్వశ్చన్ పేపర్లతో మెటీరియల్ రూపొందించామన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్-23 బాస్కెట్‌బాల్ స్త్రీ, పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఎంపిక చేసినట్లు కృష్ణా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీలో ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జట్లకు ఎంపిక చేశామన్నారు. పురుషుల జట్టుకు నగేష్‌బాబు, రాహుల్, నరేంద్రవర్మ, తేజ, సాయిరామ్, యాసీన్, వర్ధన్, దేవదానం, ఆస్టిన్, సతీష్, నిరంజన్, శ్యామ్‌సుందర్, కేదర్, మస్తాన్, మహిళల జట్టుకు మౌనిక, ప్రసన్నకుమారి, హఫ్సా, కీర్తన, ప్రశాంతి, పూర్ణ, రోహిత, వాహిని, వర్షిణి, కావ్యశ్రీ, నాగసుధ, శశిశ్రీ, విద్యాలక్ష్మి, ధనలక్ష్మి ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ 28 నుంచి 31వ తేదీ వరకు విజయవాడలోని స్టెల్లా కాలేజీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు.

హోంగార్డులకు మెటీరియల్ అందజేత



కోనేరుసెంటర్: జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన పోలీస్ సెలక్షన్స్‌లో మెయిన్స్‌కు అర్హత సాధించిన జిల్లాలోని ఏడుగురు హోంగార్డులకు ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం పరీక్షకు అవసరమైన మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో హోంగార్డులుగా పనిచేస్తున్న ఏడుగురు.. కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన సెలక్షన్స్‌లో అర్హత సాధించినట్లు ఎస్పీ తెలుసుకున్నారు. ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని కాకినాడలోని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ వారితో మాట్లాడి మెటీరియల్‌ను తెప్పించి మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన ఏడుగురికి స్వయంగా అందజేశారు. వీరు త్వరలోనే పోలీసు కానిస్టేబుళ్లుగా తన ముందుకు రావాలని కోరుకుంటూ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఆర్‌ఐలు వై.రవికిరణ్, ఎం. సతీష్‌కుమార్, డి.రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మకు డ్రెడ్జింగ్ పోటు

- కృష్ణా నదిలో ఇసుక రవాణాకు 'కూటమి' భారీ ప్రణాళిక!
- డ్రెడ్జింగ్ యంత్రాలతో కూడిన ఇసుక తవ్వే పడవల తయారీ
- పరిశ్రమలా బోట్ల నిర్మాణం
- ప్రభుత్వ స్థలం ఆక్రమించి రూ.కోట్లలో వ్యాపారం
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

టీడీపీ హయాంలో 2014–19 మధ్య రాష్ట్రంలో డ్రెడ్జింగ్ ద్వారా యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేశారు. ఇప్పుడు కూడా అలాంటి ప్రణాళికే కూటమి నేతలు రచించారు. దీనిలో భాగంగా ఎలాంటి అనుమతులు లేకపోయినా కూటమి నేతల కనుసన్నల్లో ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద డ్రెడ్జింగ్ యంత్రాలతో కూడిన భారీ స్థాయి పడవలను తయారుచేస్తున్నారని తెలుస్తోంది. ఇతర జిల్లాలకు కూడా వీటిని రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



ఇబ్రహీంపట్నం వద్ద ఇసుక రవాణాకు సిద్ధంగా ఉన్న డ్రెడ్జింగ్ యంత్రాలతో కూడిన బోట్లు

ఇబ్రహీంపట్నం: ఉచితం మాటున కృష్ణా నదిలో యంత్రాలతో ఇసుక తోడకానికి కూటమి నాయకులు భారీ ప్రణాళికలు రచించారు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో జరిగిన ఇసుక చీకటి సామ్రాజ్యాన్ని పునరావృతం చేయడానికి కూటమి నేతలు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమించి ప్రైవేట్ వ్యక్తులతో భారీ స్థాయిలో డ్రెడ్జింగ్ యంత్రాలతో కూడిన పడవలు తయారు చేయిస్తున్నారు. ఐదారు నెలలుగా పాత పడవలకు మరమ్మతులు చేయిస్తున్నారు. ప్రస్తుతం లక్షలు ఖర్చుపెట్టి భారీ స్థాయిలో ఇసుక తవ్వే బోట్లు తయారు చేయిస్తున్నారు. తయారు చేసిన కొన్నింటిని నదిలో వదిలి ఇసుక రవాణాకు సిద్ధమయ్యారు. ఇంత జరుగుతున్నా ఇసుక పడవల తయారీని అధికారులు అడ్డుకోలేక పోతున్నారు.

గతంలో మాదిరి దోపిడీకి..

2014–19లో టీడీపీ పాలనలో కృష్ణానదిలో డ్రెడ్జింగ్ యంత్రాల ద్వారా ఇసుక తరలింపు చేసేవారు. అప్పట్లో ఉండవల్లి కరకట్ట సమీపంలో కృష్ణానది ఒడ్డున ఉన్న అప్పటి, ప్రస్తుత సీఎం చంద్రబాబు నివాసం సమీపంతో పాటు ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, తుమ్మలపాలెం, సూరాయపాలెం, జిల్లాలోని వివిధ ప్రాంతాల ఇసుక రీచ్‌లలో కృష్ణానది గర్భం నుంచి యంత్రాల ద్వారా ఇసుక తవ్వి చీకటి వేళల్లో తరలించారు. ఆ ఐదేళ్లలో టీడీపీ నాయకులు రూ.కోట్లు వెనకేసుకున్నారు. దీనిపై స్పందించిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) నాటి టీడీపీ ప్రభుత్వానికి రూ.100 కోట్లు పెనాల్టీ విధించింది.

పడవల తయారీకి అనుమతులు నిల్

కృష్ణా నదిలో ఇసుక తోడకానికి ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద భారీస్థాయి డ్రెడ్జింగ్ యంత్రాలతో పడవల తయారీ అనధికారికంగా జరుగుతోంది. నిబంధనల మేరకు బోట్ల తయారీకి జలవనరులు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు ఉండాలి. అయితే బోటు పరిమాణం, డిజైన్.. నిబంధనలకు అనుగుణంగా లేవు. ఒక్కొక్క పడవ సుమారు 20 నుంచి 25 లారీల ఇసుక తోడుకొచ్చే సామర్థ్యం కలిగి ఉన్నాయి. పడవల సైజును బట్టి ఒక్కొక్కటి సుమారు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ధర పలుకుతున్నాయి. ఇక్కడ తయారు చేసిన బోట్లు ఈప్రాంత నేతలతో పాటు ఇతర జిల్లాలకు సైతం ట్రాలీలపై రవాణా చేస్తున్నారు. కూటమి నాయకుల కనుసన్నల్లోనే ఇసుక బోట్ల తయారీ జరుగుతోందని జోరుగా ప్రచారం సాగుతోంది. నిర్మాణ లోపాలతో పడవలు ప్రమాదాలకు గురైతే బాధ్యత ఎవరు వహిస్తారనే ప్రశ్న ఎదురవుతోంది. 2017 నవంబర్‌లో ప్రభుత్వ శాఖల అనుమతి లేకుండా విజయవాడ నుంచి పర్యాటకులను ఫెర్రీకి తీసుకొచ్చిన ఓ బోటు పవిత్ర సంగమం వద్దే ప్రమాదానికి గురైంది. నాడు 22మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు. అనుమతులు లేకుండా పడవలు తయారుచేస్తున్నా రెవెన్యూ, పోలీస్, మున్సిపాల్టీ, మైనింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.



పవిత్రసంగమం వద్ద నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తున్న నదిలో ఇసుక తవ్వే పడవలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా తయారవుతున్న ఇసుక రవాణా పడవలపై తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లును 'సాక్షి' వివరణ కోరింది. పడవల తయారీ విషయం ఇప్పుడే తన దృష్టికి వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్తానన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైఎస్సార్ సీపీ హయాంలో పారదర్శకం

2019–24 మధ్య కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకంగా ఇసుక పాలసీ తీసుకొచ్చింది. ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా సక్రమంగా నిర్వహించింది. వర్షా కాలంలో సైతం స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు చేసి అన్ని నియోజకవర్గాల్లో ఆన్‌లైన్ విధానంతో సామాన్యుడికి సైతం అందుబాటు ధరల్లో అవకాశం కల్పించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు మూలనపడిన ఇసుక పడవలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మరమ్మతులు చేయించారు. ఇప్పటికే కొన్ని పడవలు కృష్ణానదిలోకి దించి ఇసుక తవ్వకానికి సిద్ధంగా ఉంచారు. అధికారికంగా ఇసుక రేవులు లేని మండలాల్లో సైతం బెదిరింపులతో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకతవ్వే పడవలు, ఇసుక రవాణా నిలువరించాలని ప్రజా సంఘాలు, ప్రజలు అధికారులను కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): అంగన్‌వాడీ సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.బేబిరాణి అధ్యక్షతన గురువారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగినది. ముఖ్యఅతిథి నరసింగరావు యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్, విశాఖ స్టీల్ ప్లాంట్, ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. గత ప్రభుత్వ సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. సమ్మె కాలంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొన్ని జిల్లాల్లో రాజకీయ వేధింపులు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ 42 రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన మినిట్స్ అమలుచేయాలని కోరుతూ ఫిబ్రవరి 17,18,19 తేదీల్లో ప్రాజెక్టు స్థాయిలో ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలుచేయాలని, వచ్చే నెల 13న ఢిల్లీలో జరిగే అఖిల భారత కమిటీ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల జీతాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లు గా మార్చుతూ జీవో విడుదల చేయాలని ఇలా పలు అంశాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర నేతలు చంద్రావతి, సుప్రజ, సుధ, రాజేశ్వరి, లక్ష్మీదేవి, రమాదేవి, దుర్గరాణి తదితరులు పాల్గొన్నారు.

'సహకారం'లో కలకలం

పోరుబాటకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

- ప్రభుత్వం ముందు పలు రకాల డిమాండ్లు
- పరిష్కరించాలని మంత్రి లోకేష్, అచ్చెంనాయుడికి ఇప్పటికే వినతులు
- వారు పట్టించుకోకపోవడంతో ఆందోళన
- ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో 425 సంఘాలు



విజయవాడలో జరిగిన డిమాండ్ల సాధన సమావేశంలో 'సహకార' ఉద్యోగులు(ఫైల్)

గుడ్లవల్లేరు: రైతులకు సేవలను అందించే వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారు. తమ జీతాల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒక్క పైసాకు కూడా ఆధారపడని ఈ ఉద్యోగులకు అనేక కష్టాలు వచ్చి పడ్డాయి. ముఖ్యంగా ఉద్యోగులకు 2019నుంచి పీఆర్సీ, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో భారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని వారు విన్నవిస్తున్నారు.

రాష్ట్రంలో 2,051 సంఘాలు..

రాష్ట్రంలో 2,051 సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 6,500 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 4,500 మంది తాత్కాలిక ఉద్యోగులుగా వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. అలాగే ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో 425 సంఘాలు ఉంటే.. అందులో 880 మంది పర్మినెంట్, 922 మంది తాత్కాలిక ఉద్యోగులు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రంలోని సంఘాల్లో ఉద్యోగులు వెయ్యి మంది తక్కువ ఉండటంతో పని భారం అధికమవుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో రిక్రూట్ చేసిన ఉద్యోగులను పర్మినెంట్ చేయడం లేదు. అలాగే జీవో నంబర్ 19, 36లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆలిండియా బ్యాంక్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి పిలుపు మేరకు ఐటీ మంత్రి నారా లోకేష్, వ్యవసాయ, సహకార మంత్రి అచ్చెంనాయుడిని అసోసియేషన్ నాయకులు కలిసి తమ డిమాండ్లపై వినతులు అందించారు. ఇప్పటివరకు వారు స్పందించలేదు.



కేడీసీసీ కృష్ణా జిల్లా కార్యాలయం

రూ. 60 కోట్ల టర్నోవర్..

రూ.60 కోట్ల టర్నోవర్ ఉన్న ప్రతి సంఘానికి ఆరుగురు ఉద్యోగులు ఉండాల్సిందే. కానీ అరకొరగా ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్రంలోని ఒక్కో సహకార సంఘం సుమారు రూ.60కోట్ల పంట రుణాలను రైతులకు అందిస్తోంది. అలా రాష్ట్రంలో ఎక్కువ సంఘాలే ఉన్నాయి. రైతులకు కావలసిన ఎరువులు, పురుగు మందుల పంపిణీతో పాటు రైతు పండించిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయవలసిన బాధ్యత పీఏసీఎస్‌లోని ఉద్యోగులదే. కాని తమ డిమాండ్లను ప్రభుత్వం తీర్చటం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

రైతుల సేవలోనే సంఘాలు..



వ్యవసాయ రంగం అంతటికీ మా సహకార సంఘాల ఉద్యోగులే సేవలు అందిస్తున్నారు. తక్కువ మందితో పని చేయాలంటే పని భారం అధికంగా ఉంది. సంఘాల్లో ఎంతమంది ఉద్యోగులు పని చేయాలో అంతమందిని వెంటనే భర్తీ చేయాలి. గతంలో రిక్రూట్ చేసిన వారిని పర్మినెంట్ చేయాలి.

– ముువ్వా వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు, ఆలిండియా బ్యాంక్ అసోసియేషన్

ప్రతి పైసా మా సంఘాలవే..



మా సహకార ఉద్యోగుల జీతాల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వంపై ఏ మాత్రం ఒక్క పైసాకు కూడా ఆధారపడే అవకాశం లేదు. మా సహకార సంఘాల ద్వారా ఆదాయం వస్తోంది. 2019నుంచి పీఆర్సీని వెంటనే విడుదల చేయాలి. మా డిమాండ్లను మంత్రులు లోకేష్, అచ్చెంనాయుడికి అందించాం.

– బొల్లినేని రఘురాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆలిండియా బ్యాంక్ అసోసియేషన్

'కృష్ణా' దీవుల్లో మువ్వన్నెల రెపరెపలు

కేంద్ర ఆదేశాలతో ముందస్తుగా రిపబ్లిక్ డే




ఎదురుమొండి దీవిలో జాతీయ జెండా ఎగరేసిన తహసీల్దార్ హరనాథ్, ఇతర అధికారులు

ఎదురుమొండి(నాగాయలంక): కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ధ్రువీకరించిన దీవుల జాబితా ప్రకారం కృష్ణా జిల్లా పరిధిలోని నాగాయలంక మండలంలో ఉన్న రెండు దీవులు ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బల్లో గురువారం రిపబ్లిక్ డేను ముందస్తు వేడుకగా నిర్వహించారు. గత నెల 24న హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (బోర్డర్ మేనేజ్ మెంట్) అధ్యక్షతన జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేశ వ్యాప్తంగా అన్ని దీవుల్లో జాతీయ జెండా ఎగురవేయడం, డ్రోన్ ఫొటోగ్రఫీ, పేర్లు లేని ద్వీపాలకు పేర్లు, క్రమ సందర్శనలకు జారీ చేయబడిన సూచనలు లాంటి నిర్ణయాలు అనుసరించి కృష్ణాజిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నోడల్ అధికారిగా పోలీసు, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్ శాఖలు, కోస్టల్ సెక్యూరిటీ పోలీసుల సమన్వయంతో బృందంగా జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని మండలంలోని ఎదురుమొండి తర్వాత ఈలచెట్లదిబ్బ దీవిలో వేడుకగా నిర్వహించారు. నాగాయలంక ఎస్‌ఐ కె.రాజేష్, ఎంపీడీఓ జె.కె.సీతారామ్‌కుమార్, డీటీ అబ్దుల్ రఫీ, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డ్ పోలీసులు, పాఠశాలల విద్యార్థులు, వీఆర్వోలు, కార్యదర్శులు హాజరయ్యారు.

పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దుదాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ఎనికేపాడులో సూర్యఘర్ సోలార్ ప్యానల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రామవరప్పాడు: ఎన్టీఆర్ జిల్లాను పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో గురువారం విద్యుత్ శాఖ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన జనజాగృతి ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామ నివాసి ఆర్.వీరరాఘవయ్య ఇటీవల ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్ వ్యవస్థను లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఇంటి పైకప్పుపై అధిక రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టంను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఈ పథకం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానల్‌ను రూ.78వేలు రాయితీతో ఇంటిపై కప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. 3 కేవీ వ్యవస్థతో నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని, మన అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చునని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 60వేల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. సౌరశక్తి ద్వారా కాలుష్యం లేని పర్యావరణ హిత ఇంధనాన్ని పొందవచ్చని, ఈ పథకం అమలులో జిల్లాను నంబర్-1గా నిలపడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ మురళీమోహన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, నోడల్ అధికారి ఎం.భాస్కర్, ఎంపీడీవో బి.విగ్గిన్స్, సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గుడివాడ ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: జిల్లా ఎన్జీఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 టేబుల్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం ఆవిష్కరించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ అధ్యక్షుడు కె.పి.రావు, ప్రధాన కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఫరీద్‌బాషా, మహిళా ఉపాధ్యక్షురాలు నిర్మల, సంయుక్త కార్యదర్శులు వెంకటాద్రి, మనోజ్, కోశాధికారి పి.వి.ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





'గణతంత్ర' ముస్తాబు

రిపబ్లిక్ డే వేడుకలకు ఇందిరాగాంధీ స్టేడియాన్ని గురువారం జాతీయ జెండాలతో అలంకరించారు. గణతంత్ర దినోత్సవానికి శకటాలను సిద్ధం చేస్తున్నారు. పోలీసులు కవాతు రిహార్సల్స్ చేశారు. వేడుకలకు స్టేడియం ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తున్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

ఏషియన్ యోగాలో శ్రీకృష్ణకు బంగారు పతకం



గుంటూరుఎడ్యుకేషన్: భాష్యం విద్యార్థులు చదువుతో పాటు తాము ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూ, అంతర్జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడం గర్వకారణంగా ఉందని విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ అశోక్‌నగర్‌లోని భాష్యం స్కూల్లో తొమ్మిదో తరగతి (ఐఐటీ) చదువుతున్న దేవరాజుగట్టు ధీరజ్ శ్రీకృష్ణ సింగపూర్‌లో ఈనెల 6 నుంచి మూడు రోజులపాటు జరిగిన ఏషియన్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ఒక బంగారు పతకంతో పాటు రెండు రజత, కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఏషియన్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో 47 ఏళ్ల తరువాత ఏపీ విద్యార్థికి బంగారు పతకం వచ్చిందన్నారు. బాలుర జూనియర్ విభాగంలో తలపడిన ధీరజ్ ఆర్టిస్టిక్ యోగాలో బంగారు పతకం, యోగాసన, ఆర్టిస్టిక్ పెయిర్ యోగాసనలో రజతం, రిథమిక్ యోగాలో కాంస్య పతకాలు గెలుపొంది సత్తా చాటాడన్నారు. గతంలో భాష్యం తరఫున రూ.లక్ష నగదు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ధీరజ్ శ్రీకృష్ణ తల్లిదండ్రులు శశికళ, నాగరాజు, విజయవాడ భాష్యం జెడ్‌ఈవో జోషి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలకు కొర్రీలు

- ఉపాధి పని దినాలను ఇవ్వని కూటమి ప్రభుత్వం
- చతికిలబడిన గృహ నిర్మాణాలు
- కృష్ణా జిల్లాలో వైఎస్సార్ సీపీ పాలనలో 88,438 ఇళ్ల మంజూరు
- 28,283 ఇళ్లు పూర్తి



ఇంటి శ్లాబ్ వేస్తున్న కూలీలు (ఫైల్)

గుడ్లవల్లేరు: పేదల సొంతింటి కలకు కూటమి ప్రభుత్వం వివిధ రకాల కొర్రీలను పెట్టి ఆ గృహ నిర్మాణాలను ముందుకు సాగనివ్వకుండా మోకాలడ్డుతోంది. ఆ కొర్రీల్లో మరొకటి ఉపాధి పని దినాలు. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకం కింద పక్కా గృహాలను నిర్మించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఇంటి నిర్మాణానికి 90 రోజుల పని దినాలను కూడా వైఎస్ జగన్ కేటాయించి అప్పట్లో అందించారు. ఒక్కో పని దినానికి రూ.300 చొప్పున గతంలో మంజూరు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, స్టీలు, సామగ్రిని ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతోంది. దీనితో గృహ నిర్మాణాలకు కేటాయించిన ఉపాధి పని దినాలు ఇవ్వకుండా వాటి సంఖ్య గణనీయంగా పడిపోయాయి. గృహ నిర్మాణాల చెల్లింపులకు ఈ ప్రభుత్వం కూడా వచ్చే మార్చి నెల వరకు మాత్రమే తుది గడువు విధించింది. ఇదంతా కేవలం గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రవేశపెట్టిన పేదలందరికీ పక్కా ఇళ్ల నిర్మాణాల పథకాన్ని నీరు గార్చేందుకేనని బాధిత లబ్ధిదారులు వాపోతున్నారు.

కూటమిలో దిగజారిన ఇళ్ల నిర్మాణం..

గత వైఎస్సార్ సీపీ పాలనలో జిల్లాలో 88,438 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 28,283 ఇళ్లు పూర్తయ్యాయి. బిల్లులు సరిగా రాకపోవటమే కాకుండా కనీసం మెటీరియల్ ఇవ్వటం లేదని గమనించిన లబ్ధిదారులు ఇంకా 31,479 ఇళ్లకు భూమిపూజ కూడా చేయలేదు. బేస్‌మెంట్ లెవల్, కిటికీలు, రూఫ్ లెవల్‌కు సంబంధించి వివిధ దశల్లో 28,676 ఇళ్లు నిలిచిపోయాయి.

గత జగన్ హయాంలో పని దినాలు ఇలా...

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జిల్లాలోని 25 మండలాల్లోని లబ్ధిదారులందరికీ ప్రతి ఇంటికి 90 పని దినాలు కేటాయించారు. 2021 నుంచి 2023 వరకు మూడేళ్ల వరకు పని దినాలను గత ప్రభుత్వం అప్పట్లో అందించింది. కానీ ఎన్నికల కోడ్ తర్వాత కూటమి పాలన వచ్చేసరికి 2024–25లో పని దినాలకు సంబంధించి పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టాయి.

గృహ నిర్మాణాలను బాబు నీరుగారుస్తున్నారు..



పేదలందరికీ గృహ నిర్మాణ పథకాన్ని నీరుగార్చేందుకే చంద్రబాబు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారు. స్టీల్, సిమెంట్‌తో పాటు గృహ నిర్మాణ మెటీరియల్‌ను దిగుమతి చేయకపోతే పేద కుటుంబాల వారు ఇళ్లను ఎలా నిర్మించుకుంటారు. అందుకే ఇళ్లను కట్టుకునేందుకు పేదలు ముందుకు రావటం లేదు.

– పదమటి సుజాత, వైఎస్సార్ సీపీ గుడ్లవల్లేరు మహిళా అధ్యక్షురాలు

సెపక్‌తక్రా జాతీయ టోర్నీకి పగడ్బందీ ఏర్పాట్లు



పటమటలో వివరాలు వెల్లడిస్తున్న భానుమూర్తిరాజు తదితరులు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) అండర్–14 సెపక్‌తక్రా బాల, బాలికల 68వ జాతీయ టోర్నమెంట్ ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. ఈ టోర్నీకి ప్రాతినిధ్యం వహించే 12 రాష్ట్రాల జట్లు విజయవాడకు చేరుకున్నాయని, నగరంలోని పటమట బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ టోర్నీకి సంబంధించిన వివరాలను పటమట జెడ్పీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం వెల్లడించారు. ఎస్‌జీఎఫ్ఐ, ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ పోటీల కోసం పాఠశాలలో నాలుగు కోర్టులను సిద్ధం చేశామని, ఫ్లడ్ లైట్‌ల వెలుగులో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బిహార్, విద్యాభారతి, గుజరాత్, మణిపూర్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పంజాబ్ జట్ల నుంచి 120 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. 24, 25 తేదీల్లో లీగ్ పోటీలు, 26వ తేదీన ప్రీ క్వార్టర్స్, క్వార్టర్స్ నాక్ అవుట్ పోటీలు, 27న సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు.

నేటి సాయంత్రం నుంచి పోటీల ప్రారంభం

పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, వారి వెంట వచ్చే 47 మంది కోచ్, మేనేజర్లకు పూర్తి భద్రత నడుమ వసతి ఏర్పాట్లు చేశామని భానుమూర్తిరాజు తెలిపారు. క్రీడాకారులు బస చేసే ప్రాంతాలు, క్రీడా ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులను నియమిస్తున్నామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ప్రత్యేక చొరవతో క్రీడా ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని, నిరంతర పర్యవేక్షణ నిమిత్తం 100 మంది పీఈటీలతో 17 ఆర్గనైజింగ్ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేందుకు ప్రత్యేకంగా కోర్టులను సిద్ధం చేశామని తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ప్రజాప్రతినిధులు, జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఈ పోటీలు అధికారికంగా ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. సమావేశంలో సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శులు రాధాకృష్ణ, రాజు, జాతీయ స్కూల్ గేమ్స్ పరిశీలకులు గౌతమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఎస్తేర్‌రాణి, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి ఎస్.రమేష్ పాల్గొన్నారు.



అండర్ - 14 బాలబాలికల టోర్నమెంట్‌కు ప్రాక్టీస్ చేస్తున్న ఏపీ క్రీడాకారులు

జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) కె.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం ఏర్పాట్లపై ఆయన కార్యాలయంలో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 25వ తేదీన జిల్లా కేంద్రం మచిలీపట్నంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. 25వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద నుంచి జిల్లా పరిషత్ సెంటర్ వరకు పాఠశాలల, కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించాలని చెప్పారు. ర్యాలీలో ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలు చేస్తూ ఓటు యొక్క ప్రాముఖ్యత తెలియజేస్తూ ర్యాలీ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమాలలో ఎన్‌సీసీ, నెహ్రూ యువ కేంద్రం, యువజన సంఘాలను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జాతీయ ఓటర్ల దినోత్సవ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో తొలుత ప్రతిజ్ఞ చేయిస్తారని, కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం, అనంతరం వృద్ధ ఓటర్లకు సత్కారం, యంగ్ ఓటర్లకు ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం వివిధ కళాశాలలో పాఠశాల విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో బందరు ఆర్డీవో కె.స్వాతి, బందరు డీఎస్పీ చప్పిడి రాజా, డీఈవో పి.వి.జె.రామారావు, డీఎస్‌డీవో ఝాన్సీలక్ష్మి, జిల్లా పరిషత్ డెప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, తహసీల్దార్ నార్త్ వి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

హంసలదీవి క్షేత్రానికి నూతన శోభ



త్రీడీ కలర్స్‌తో హంసలదీవి క్షేత్రం



ఆలయ రాజగోపురం

కోడూరు: హంసలదీవి క్షేత్రం నూతన శోభతో కళకళలాడుతుంది. రాష్ట్రంలో వైష్ణవాలయాల్లో ప్రసిద్ధిగాంచిన హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయాన్ని బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న హంసలదీవి క్షేత్రాన్ని గతేడాది కర్నాటకలోని శృంగేరీ పీఠం దత్తత తీసుకుంది. ప్రస్తుతం శృంగేరీ పీఠం తరుపున తిరుమల తిరుపతి వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని ఆలయ ధర్మాధికారిగా బాధ్యతలు తీసుకొని అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ఆలయంలో స్వామివార్ల బ్రహ్మోత్సవాలు జరగనుండగా, అందుకు సంబంధించిన ఏర్పాట్లను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఆలయంతో పాటు రాజగోపురం, కల్యాణవేదిక, దేవతామూర్తుల విగ్రహాలను నూతన రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ధ్వజస్తంభానికి కూడా మెరుగు పట్టే పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయానికి త్రీడీ కలర్స్‌లో రంగులను వేయడంతో మరింత జీవకళ ఉట్టిపడుతుంది. ఆలయ ప్రాంగణంలో నూతనంగా వాహనశాల, ఆఫీస్ రూమ్‌ను నిర్మిస్తున్నారు. రాత్రి వేళ ఆలయంలో నిద్ర చేసే వారి కోసం ప్రత్యేక గదులను కూడా సమకూరుస్తున్నారు. ఆలయం ముందు భాగంలో షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఆలయం పక్కనే ఉన్న కోనేరు (చెరువు)ను కూడా అభివృద్ధి చేస్తున్నారు.

మురళీనగర్‌లో ఇంటి తాళాలు పగులకొట్టి చోరీ

రూ. 11.5 లక్షలు నగదు, 18 గ్రాముల బంగారం అపహరణ



రామ్మోహన్‌రావు ఇంటిలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులకొట్టి చోరీ చేసిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేరళకు చెందిన తానికాటిల్ రామ్మోహన్‌రావు తన అక్కతో కలిసి మురళీనగర్‌లో నివసిస్తున్నారు. ఈయన బల్లెంవారి వీధిలోని ఆర్ఆర్ దర్బార్ వర్క్‌షాప్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 20న రాత్రి వైజాగ్‌లో ఉండే బావ చనిపోయారంటూ ఫోన్ రావటంతో రామ్మోహన్‌రావు అక్కతో కలిసి వైజాగ్‌కు వెళ్లారు. అక్కడ నుంచి గురువారం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు, తాళాలు పగులకొట్టి ఉండటంతో పాటు బీరువాలో ఉండాల్సిన రూ.11 లక్షల 50 వేల నగదు, 18 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో రామ్మోహన్‌రావు గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏసీపీ దామోదర్, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో చోరీ జరగటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

వెబ్‌సైట్‌లో ఫార్మసిస్టుల వివరాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్యశాఖ జోన్ – 2 పరిధిలో ఫార్మసిస్ట్ గ్రేడ్–2 పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు గతేడాది ఫిబ్రవరి 20న ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి ఎంపికైన వారి వివరాలు జిల్లా వెబ్‌సైట్‌లలో పొందుపరిచినట్లు రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మశశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు ntr.ap.gov.in జిల్లా వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

యార్డుకు 1,01,210 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,01,210 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 96,802 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,500, ఏసీ కామన్ రకం రూ.8,000 నుంచి రూ.13,300, ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,200 నుంచి రూ.15 వేలు, తాలు రకం మిర్చికి రూ.4 వేల నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 63,895 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని హోంగార్డు మృతి

- ఇటీవల కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరిక
- మంగళాపురం గ్రామలో విషాదఛాయలు



హోంగార్డు యశ్వంత్(ఫైల్)



జీలగలగండి హైవేపై రక్తపు మడుగులో యశ్వంత్

యండకుదురు (ఘంటసాల): మచిలీపట్నం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని హోంగార్డు మృతి చెందిన సంఘటన ఘంటసాల మండలం యండకుదురు శివారు జీలగలగండి కాలనీ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామానికి చెందిన గొరిపర్తి యశ్వంత్(20) నెల రోజుల క్రితం కారుణ్య నియామకం కింద హోంగార్డుగా ఉద్యోగం పొందాడు. మచిలీపట్నం హెడ్ క్వార్టర్స్‌లో ఉద్యోగం చేస్తున్న యశ్వంత్ గురువారం ఉదయం స్వగ్రామమైన మంగళాపురం వస్తుండగా జీలగలగండి సమీపంలోని దెయ్యపు కాలువ వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గుర్తించి 108 వాహనం ద్వారా మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ వెళ్లాలని సూచించగా విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు యశ్వంత్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న యశ్వంత్ తండ్రి శ్రీనివాసరావు ఏడాది క్రితం గుండెపోటుతో మరణించగా ఆ ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద యశ్వంత్ ఇచ్చారు. కుటుంబాన్ని పోషిస్తున్న భర్త చనిపోవడం.. ఉద్యోగం పొందిన ఏకైక కుమారుడు కుటుంబానికి అండగా ఉంటుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో యశ్వంత్ తల్లి, ఇద్దరు సోదరీమణులు శోకసంద్రంలో మునిగిపోయారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. యశ్వంత్ తల్లి నాగ కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘంటసాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వడ్డీతో అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారునికి వడ్డీతో అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయల గురువారం తీర్పు చెప్పారు. విజయవాడకు చెందిన వి.సుధాకర్, ఏ టు జెడ్ ప్రాపర్టీస్ ద్వారా మేడపాటి సూర్యప్రకాష్‌రెడ్డి, ఇతరులు రూ.26 లక్షల విలువైన ప్లాట్లను 2014లో రూ.6.52 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించి సేల్ అగ్రిమెంట్ చేసుకున్నారు. 45 రోజుల్లో ఇంటికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్‌లు అప్పజెప్పిన తరువాత మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని అగ్రిమెంట్‌లో నమోదు చేసుకున్నారు. 45 రోజులు అయినప్పటికీ ఇంటి డాక్యుమెంట్స్ ఇవ్వకపోవడంతో బ్యాలెన్స్ అమౌంట్ చెల్లించలేదు. డాక్యుమెంట్‌లు అప్పజెప్పకపోవడం వలన తాను కట్టిన అడ్వాన్స్‌మొత్తాన్ని తిరిగి చెల్లించాలని సూర్యప్రకాష్‌రెడ్డి అడిగినప్పటికీ ఇవ్వకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో కమిషన్ సభ్యులు విచారణ జరిపిన అనంతరం సూర్యప్రకాష్‌రెడ్డికి, ఇతరులకు 2014 సెప్టెంబర్ 25వ తేదీ నుంచి తొమ్మిది శాతం వడ్డీతో అడ్వాన్స్‌గా చెల్లించిన రూ.6.52 లక్షలు చెల్లించాలని, మానసిక వేదన కలిగించినందుకు రూ.25 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు 30 రోజుల్లోగా ఫిర్యాదుదారుడికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

సెంట్రింగ్ బల్ల తగిలి చిన్నారి మృతి


కంకిపాడు: సెంట్రింగ్ బల్ల తగిలి చిన్నారి మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన చిన్నారి(4) ఈ నెల 22న బీసీ కాలనీలోని తన ఇంటి నుంచి బయట రోడ్డు మీదకు వచ్చింది. అదే సమయంలో అక్కడ రోడ్డు పనులకు వినియోగించే సెంట్రింగ్ ఇనుప బల్ల తీసుకుని వచ్చిన కార్మికుడు రోడ్డు మార్జిన్‌లో పడేశాడు. పడేసిన ఇనుప బల్ల రోడ్డు మీదకు వచ్చిన చిన్నారి తలకు బలంగా తగిలి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. మృతురాలి తల్లి దాసరి భవాని బుధవారం అర్ధరాత్రి సమయంలో కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాద స్థలిలో పడి ఉన్న క్రాంతికుమార్ మృతదేహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం పమిడికుంట గ్రామానికి చెందిన నక్కా క్రాంతికుమార్ (25), తన మిత్రుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనానికి లారీ తగలటంతో అదుపు తప్పి ఇద్దరు యువకులు రోడ్డుపై పడిపోయారు. ఈ క్రమంలో క్రాంతికుమార్ తలపై లారీ వెనుక టైర్లు ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు బైక్ హుషారుగా నడిపిన క్రాంతి కుమార్ క్షణాల్లో కళ్ల ముందే విగతజీవిగా రక్తపు మడుగులో పడిపోవటంతో బైక్‌పై ఉన్న అతని స్నేహితుడి శోకం అరణ్యరోదనగా మారింది. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



క్లుప్తంగా

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ గెజిటెడ్ అండ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్‌ను గురువారం ఆ శాఖ విజయవాడ నోడల్ డివిజన్ జాయింట్ కమిషనర్ ప్రశాంత్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందరూ కష్టపడి పనిచేసి వాణిజ్య పన్నుల శాఖకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. తప్పుచేస్తే ఉపేక్షించేది లేదని, అవినీతికి తావులేకుండా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి, గౌరవ అధ్యక్షుడు మురికిపూడి వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కెవీఎల్ఎస్‌వి ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి సీహెచ్ సువర్ణరాజు, ఉపాధ్యక్షుడు సాయికిరణ్, డి వెంకటేష్, లక్ష్మయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

400 మందికి అన్నదానం



లబ్బీపేట(విజయవాడతూర్పు): కుర్తాల శ్రీ సిద్దేశ్వరీ పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్దేశ్వరానందభారతి మహాస్వామి వారి 89వ జన్మదిన వేడుకలు గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా కృష్ణలంక పాత పోస్టాఫీసు రోడ్డులోని శ్రీ సిద్దేశ్వరీ పీఠ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి వారి శిష్య బృందం పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో శిక్షణ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిక్షణ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక బ్యాచ్‌లకు టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, మిషన్ ఎంబ్రాయిడరిలలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణలు ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. బ్యూటీషియన్ మూడు నెలలు, టైలరింగ్ నాలుగు నెలల పాటు జరిగే ఈ శిక్షణలకు ఆసక్తి గలవారు ఈ నెల 30వ తేదీ లోపు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73821 93413, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థినికి బహుమతి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహాకవి గురజాడ అప్పారావు 109వ వర్ధంతి సందర్భంగా గత ఏడాది అక్టోబర్‌లో కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, క్లస్టర్ విశ్వవిద్యాలయం, గురజాడ ఫౌండేషన్, ప్రకాశిక అంతర్జాల ప్రతిక సంయుక్తంగా గురజాడ భావ స్ఫూర్తి అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో తమ కళాశాలలో బీసీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న బి.దుర్గాభవానీ ప్రతిభ చూపిన నగదు బహుమతి గెలుపొందిందని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. పోటీల విజేతల వివరాలను బుధవారం ప్రకటించి, నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందచేశారన్నారు. ప్రతిభ చూపిన దుర్గాభవానిని కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాలతో పాటుగా అధ్యాపకులు కళాశాల ఆవరణలో గురువారం అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెనమలూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గొల్లమూడి శేఖర్‌బాబు అన్నారు. కానూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ ఆల్కహాల్, గంజాయి, పొగాకు సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. మానసిక వికాస కేంద్రం ప్రతినిధులు కె.ప్రియాంక, ఎస్.జాకబ్‌రాజు, షేక్.నజ్మా హెబ్బుల్లా, జె.జ్యోతి తదితరులున్నారు.

రైతు బజారుల్లో దళారుల దోపిడీ

- ప్రజాప్రతినిధులకు నెలవారీ మామూళ్లు
- ధర నిర్ణయించేది దళారులే
- కనిపించని రైతులు



సాంబమూర్తి రోడ్డులోని రైతు బజార్



రైతుబజారులో దుకాణాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'రైతు బజార్‌లో షాపు కేటాయిస్తే రూ. 10 లక్షలు ఇస్తా' ఇది రైతు బజారులో దళారి నగరంలోని ఓ ప్రజా ప్రతినిధికి ఇచ్చిన ఆఫర్. ఇంత పెద్ద ఆఫర్ ఇచ్చాడంటే రైతు బజారుల్లో దళారులు ఏ విధంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, రైతులు పండించిన కూరగాయలకు మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు ఉద్దేశించిన రైతు బజారుల్లో దళారులు రాజ్యమేలుతున్నారు. రైతులు మచ్చుకు కూడా కనిపించడం లేదు. అధికారపార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు రైతు బజారుల్లో తిష్టవేశారు. ఈఓ, సూపర్‌వైజర్లను చెప్పుచేతల్లో పెట్టుకుని పెత్తనం సాగిస్తున్నారు. షాపుల లాటరీ దగ్గర నుంచి కూరగాయల ధర నిర్ణయం వరకు వారిదే హవా. టమోటా, పచ్చిమిర్చి ఇలా కూరగాయలు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వారే రైతు బజారుల్లోని షాపులకు విక్రయిస్తున్నారు. ఇలా దోపిడీకి తెరతీశారు. దోచుకున్న దాన్లో కొంత భాగం నెల నెలా ప్రజా ప్రతినిధులకు ముట్ట జెబుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ఈ దందా కొనసాగుతోంది. ఈ దందాపై గతేడాది నవంబర్ చివర్లో జరిగిన డీఆర్‌సీ మీటింగ్‌లో పెద్ద చర్చ జరిగింది.

ఎన్టీఆర్ జిల్లాలో...

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 15 రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో రూరల్‌లో 6, విజయవాడ అర్బన్‌లో 9 రైతు బజార్లు ఉన్నాయి. మొత్తం 1113 స్టాల్స్ ఉండగా వీటిలో అద్దె షాపులు 439, రైతుల షాపులు 535 ఉన్నాయి. జిల్లా మొత్తం మీద 139 స్టాల్స్ ఇంకా ఖాళీగా ఉన్నాయి. నగరంలోని అజిత్‌సింగ్, పాయకాపురం, కేదారేశ్వరపేట, భవానీపురం, కృష్ణలంక, సాంబమూర్తి రోడ్డు, జీఎస్ రాజు రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ, పటమట ప్రాంతాల్లో రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో భవానీపురంలో 23, ఇబ్రహీంపట్నంలో 20, మైలవరంలో 6, నందిగామ, కంచికచర్ల లో రెండేసి చొప్పున , తిరువూరు, కృష్ణలంకలో 10 , జీఎల్ రాజు రోడ్డులో అత్యధికంగా 60 షాపులు, ఏపీఐఐసీ కాలనీలో 6 షాపులు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్లుగా షాపులు నిర్వహిస్తున్న వారిని బెదిరించి వారి వద్ద నుంచి లక్షల్లో వసూలు చేసినట్లు సమాచారం. అలాగే ఖాళీగా ఉన్న షాపుల కోసం పెద్ద ఎత్తున పైరవీలు సాగుతున్నాయి. ఇప్పటికే రైతు బజారుల్లో పెత్తనం చేస్తున్న దళారులు ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో ముట్టజెప్పి షాపులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఒక్కో రైతు బజారు నుంచి స్థానిక ప్రజాప్రతినిధులకు నెలకు రూ. 3 నుంచి 5 లక్షల వరకు మామూళ్లు వెళుతున్నట్లు సమాచారం. రైతు బజారుల్లో మామూళ్ల వ్యవహారంలో ఎంపీకి, ఓ మహిళా ప్రజా ప్రతినిధికి మధ్య వివాదం జరిగింది.

ఈఓ కార్యాలయాల్లోనే దళారులు తిష్ట

నందిగామ రైతు బజారులో బీజేపీ నాయకుడు పెత్తనం సాగిస్తున్నారు. షాపుల నిర్వాహకులు అతని వద్దే టమోట కొనుగోలు చేయాలని అనధికార ఆదేశాలు జారీ చేశారు. కంచికచర్ల రైతు బజారుల్లో అధికార టీడీపీ నేతలదే హవా. ఇక్కడ బోర్డు రేటు ఒకటుంటే మరో ధరకు విక్రయిస్తున్నారు. భవానీపురం రైతు బజారులో కూటమి నాయకుడు ఒకరు ఈవో కార్యాలయంలోనే ఉంటూ చక్రం తిప్పుతున్నాడు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని రైతు బజార్లలో ప్రజాప్రతినిధి అనుచరులు ఇద్దరు ఏకంగా ఈవో కార్యాలయంలోనే తిష్టవేసి దోపిడీకి తెరతీశారు. వీరు రైతుల నుంచి తక్కువ ధరకు కూరగాయలు కొనుగోలు చేసి షాపుల వాళ్లకు విక్రయిస్తుంటారు. ధర నిర్ణయంలోనూ చక్రం తిప్పుతున్నారు. రద్దీగా ఉండే రైతు బజారుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అద్దెల రూపంలో వచ్చే ఆదాయంతోనే సిబ్బందికి జీతాలు. దీంతో రైతు బజారుల్లో అవినీతి రాజ్యమేలుతోంది.

అధికంగా వసూలు చేస్తున్నారు



రైతు బజారులో బోర్డు రేటుకు షాపుల నిర్వాహకులు వసూలు చేసే రేటుకు పొంతన ఉండడం లేదు. ఇదేమిటని అడిగితే దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఇష్టమైతే కొనుగోలు చేయ్ లేకపోతే లేదంటూ మాట్లాడుతున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదు.

–జి.శ్రీనివాస్, వినియోగదారుడు

రైతు బజారుల్లో తనిఖీలు

రైతు బజారులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. రైతులు లేదా వాళ్ల ప్రతినిధులు షాపుల్లో ఉంటున్నారో లేదో పరిశీలిస్తున్నాం. నిబంధనల ప్రకారం పారదర్శకంగా షాపులకు లాటరీ తీస్తున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం.

–మంగమ్మ, ఏడీ

పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 17వ డివిజన్ కార్పోరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. గురువారం రాణిగారితోట, 17వ డివిజన్‌లో వార్డు సచివాలయాల సిబ్బంది పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పథకం ఉపయోగాలు తెలిసేలా ప్ల కార్డులు పట్టుకుని శాంపిల్ బిల్డింగ్ నుంచి పలు వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. రామిరెడ్డి మాట్లాడుతూ ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒక్కో ఇంటిపై గరిష్టంగా రూ.78 వేలు రాయితీ లభిస్తుందన్నారు. ఈ పథకం ప్రయోజనాలు తప్పకుండా అందరూ తెలుసుకుని ప్రతి ఇంటిపై సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ స్పెషల్ ఆఫీసర్ మోహన్‌బాబు, 78,79, 80, 81 వార్డు సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా ఆర్‌టీసీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ పుష్కర ఘాట్ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీసీపీడీసీఎల్ సిటీ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు రైల్వే వాటర్‌వర్క్స్, ఈఠ, స్వర్గపురి 1 నుంచి 6లైన్లు, ఆనంద్‌భవన్ రోడ్డు, మార్వాడీ శివాలయం రోడ్డు, పాత పోస్టాఫీస్ రోడ్డు, పీత బసవయ్య వారి వీధి, రజక వీధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రిజిస్ట్రేషన్ గడువు 31 వరకు పొడిగింపు



వీఎంసీ ప్రధాన కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని పాయకాపురం, కొత్త రాజరాజేశ్వరిపేటలోని వివిధ కాలనీల్లో దీర్ఘకాలికంగా నివాసం ఉంటున్న వారి నివాసాలకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను 31వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు. పాయకాపురం కాలనీలు, కొత్త రాజరాజేశ్వరి పేటలో 10 సంవత్సరాలు కంటే ఎక్కువగా నివసిస్తున్న వాళ్లు, విజయవాడ నగర పాలక సంస్థ వారు జారీ చేసిన పట్టా ఇంకా రిజిస్ట్రేషన్ కానీ వాళ్లు గజం కేవలం రూ.100 రూపాయలకే రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో పాయకాపురం కాలనీలు, కొత్త రాజరాజేశ్వరి పేట ప్రాంతాల వారికి విడివిడిగా రిజిస్ట్రేషన్ చేసేలా సౌకర్యాలు కల్పించామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు తమతో పాటు ఇంటి పట్టా, లింక్ డాక్యుమెంట్స్, యజమాని ఆధార్ కార్డ్, ఇంటి పన్ను రసీదు, ఇద్దరు సాక్షులు వారి ఆధార్ కార్డులతో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయగలరని సూచించారు.

26న హిందూ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్‌లో 1974–75 సంవత్సరం పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు సమ్మేళనం కన్వీనర్ చందోలు ఆంజనేయులు, కోకన్వీనర్ గోకవరపు మురళీకృష్ణ తెలిపారు. పాతబస్తీలోని ఆ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘ నేతలు, మాజీ కార్పొరేటర్లు సంపర రాంబాబు, ఆవాల మారుతి సమ్మేళనం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన నగరానికి సమీపంలో ఉన్న హాయ్‌లాండ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.1974–75బ్యాచ్ విద్యార్థులంతా తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

రహదారి ప్రమాదాలతో భయాందోళన

- నిత్యం సంభవిస్తున్న వైనం
- మితిమీరిన వేగం, మద్యం మత్తే కారణం
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



వేలాది వాహనాలతో కిక్కిరిసిన బందరు రోడ్డు (ఫైల్)

గుణదల(విజయవాడ తూర్పు): నగరంలో నిత్యం ఏదో ఒక చోట జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పెరిగిపోయిన వాహనాల రద్దీ కారణంగా ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు ఎన్ని తీసుకున్నప్పటికీ ప్రమాదాల నివారణ మాత్రం సాధ్యం కావడం లేదు. బైక్‌లపై మితిమీరిన వేగంతో యువకులు రాకపోకలు సాగించడం, మద్యం మత్తులో కార్లు, ద్విచక్రవాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది మృత్యువాత చెందుతుండగా అనేక మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మాచవరం పరిధిలో ఇటీవల జరిగిన ప్రమాదాలు పరిశీలిస్తే ఎంతో ఆందోళన కలుగుతుంది.

ఇటీవల జరిగిన ఘటనలు..

ఏలూరు జిల్లా చిన ఆగిరిపల్లి ప్రాంతానికి చెందిన బడుగు సోమయ్య (54) ఈ నెల 10వ తేదీన వ్యక్తిగత పనుల నిమిత్తమై బైక్ పై విజయవాడకు చేరుకున్నాడు. ఆయనతో పాటు తన కుమార్తె సైతం ఉన్నారు. ఏలూరు రోడ్డు పై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ బలంగా ఢీ కొనడంతో వారిద్దరూ రోడ్డు పై పడిపోయారు. ఈ ఘటనలో సోమయ్య పై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమార్తె తీవ్రంగా గాయాలపాలైంది. కేవలం ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మాచవరం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ నెల 21వ తేదీన జరిగిన మరో ఘటనలో పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో తండ్రీ కొడుకులు బైక్ పై ప్రయాణిస్తున్నారు. వెనుక నుంచి వచ్చిన మరో వాహనం ఢీ కొట్టడంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. కాగా యువకుడు నరసింహ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఈ ఘటన పై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

హెల్మెట్లకే పరిమితం....

మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో రోజు రోజుకూ ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ ఏ ప్రమాదం పొంచి ఉందోనని వణికిపోతున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు సతీసుకోవాల్సిన పోలీసులు హెల్మెట్ లేని వాహన చోదకులపై మాత్రమే దృష్టి సారించారు. హెల్మెట్ లేని ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో రుసుము వసూలు చేసినందుకు నగర పోలీస్ కమిషనర్ మాచవరం పోలీసులను అభినందించడం గమనార్హం. భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● శిరస్త్రాణం లేకుంటే జరిమానా చెల్లించాల్సిందే !



పటమట నిర్మల కాన్వెంట్ రోడ్డులో తనిఖీ చేస్తున్న పోలీసులు

నగరంలో ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించకపోతే జరిమానాలు చెల్లించాల్సిందే. హెల్మెట్ విషయంలో పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. ఇందులో భాగంగా నగరంలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కచ్చితంగా హెల్మెట్ ఉండాల్సిందేనని చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా నగరంలో ఎటు చూసినా పోలీసుల తనిఖీలే కన్పిస్తున్నాయి. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, నిర్మల కాన్వెంట్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న చిత్రాలివి. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనాలకు జరిమానా విధిస్తున్న పోలీసులు : గురునానక్ కాలనీ సమీపంలో తనిఖీ

సుధా మధురం గాన సమ్మోహనం



కచేరీ నిర్వహిస్తున్న మోదుమూడి సుధాకర్

విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పటమట దత్తపీఠంలోని మరకత రాజ రాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీత ఉత్సవాలు గురువారం ముగిసాయి. రాంపల్లి గోపీ కృష్ణ త్యాగరాజ స్వామి సంగీత సాహిత్యంలో భక్తి అంశంగా ప్రసంగించారు. చివరిగా టాప్ గ్రేడ్ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. నాదం శంకరం, భోఖిల్లు సప్తస్వర, త్యాగరాజ స్వామి రచించిన పలు కీర్తనలు మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, ఘటంపై హరిబాబు, మృదంగంపై ఎన్ఎస్ కల్యాణరామన్ సహకరించారు. హంసధ్వని చారిటబుల్ సంస్థ వ్యవస్థాపక సంఘం సభ్యుడు యనమండ్ర శ్రీనివాస శాస్త్రి, కళాకారులను సత్కరించారు. రామశాస్త్రి, గోపీ కృష్ణశర్మ, కీర్తి చంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

రోలర్ బాస్కెట్ బాల్‌లో విద్యార్థి ప్రతిభ



రామవరప్పాడు: రోలర్ బాస్కెట్ బాల్ క్రీడలో నగరానికి చెందిన విద్యార్థి ఆర్. సాయిశ్రీ గౌతమ్ ధీరజ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ జట్టులో స్థానం సాధించాడు. నగరంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గౌతమ్ ధీరజ్ ఇటీవల మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన నాలుగో జాతీయ స్థాయి రోలర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌తో పాటు గోల్డ్ మెడల్‌ను సాధించాడు. ఈ సందర్భంగా గౌతమ్ ధీరజ్ సొంత ఊరైన నందిగామ సమీప ముప్పాళ్ల గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు గురువారం అభినందనలు తెలిపారు. ఇండోనేషియా వేదికగా ఏప్రిల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ రోలర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో గౌతమ్ ధీరజ్ జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నట్లు కోచ్ పతివాడ ప్రసాద్ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో యువకుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. వణుకూరుకు చెందిన కోటా పోలమ్మ, భర్త, తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కలిసి ఉంటున్నారు. కుమారుడు కోటా లక్ష్మణ(20) గోసాల శ్రీచైతన్య కాలేజీలో పని చేస్తాడు. అతను సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కుమారుడి ఆచూకీ తెలియడం లేదని తల్లి పోలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా సబ్‌జోన్ ఆటల పోటీలు



కంకిపాడు: పెనమలూరు సబ్‌జోన్ ఆటల పోటీలు ఉత్సాహంగా ఆరంభమయ్యాయి. నియోజకవర్గ స్థాయి బాలుర ఆటల పోటీలను గురువారం ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో హెచ్ఎం పద్మావతి బాయ్ ప్రారంభించారు. వాలీబాల్‌లో విన్నర్స్ జెడ్పీ ఉయ్యూరు, రన్నర్స్‌గా జెడ్పీ ఈడుపుగల్లు నిలిచాయి. కబడ్డీలో విన్నర్స్‌గా జెడ్పీ ఉయ్యూరు, రన్నర్స్‌గా జెడ్పీ ఈడుపుగల్లు గెలిచాయి. ఖోఖో విన్నర్స్‌గా జెడ్పీ మంతెన, రన్నర్స్‌గా జెడ్పీ నెప్పల్లి గెలుపొందాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో విన్నర్స్‌గా జెడ్పీ ఈడుపుగల్లు, రన్నర్స్‌గా జెడ్పీ మంతెన నిలిచాయి. త్రోబాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ గొడవర్రు, రన్నర్స్‌గా జెడ్పీ ఆకునూరు, టెన్నికాయిట్‌లో విన్నర్స్‌గా జెడ్పీ గొడవర్రు, రన్నర్స్‌గా జెడ్పీ మంతెన నిలిచాయి. షటిల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ పెనమలూరు, రన్నర్స్‌గా జెడ్పీ కంకిపాడు, సాఫ్ట్‌బాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ కంకిపాడు, రన్నర్స్‌గా జెడ్పీ ఉయ్యూరు నిలిచాయి. సబ్‌జోన్ అధ్యక్షుడు ఎం.భవాని, కార్యదర్శి వై.మురళీ పోటీలను పర్యవేక్షించారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఇంగ్లీష్ ఇడియమ్స్



లెట్ ది డస్ట్ సెటిల్

ఒక సంక్షోభం తరువాత లేదా గందరగోళం తరువాత వచ్చే సమయం కోసం ఎదురుచూసే సందర్భంలో వాడే మాట...లెట్ ది డస్ట్ సెటిల్.

ఉదా: ది కంపెనీ ఈజ్ ఫేసింగ్ క్రిటిసిజమ్ నౌ, బట్ దే ఆర్ వెయిటింగ్ టు లెట్ ది డస్ట్ సెటిల్ బిఫోర్ మేకింగ్ ఏ స్టేట్‌మెంట్

● మ్యూజిక్ వరల్డ్

మదిని దోచేలా మైమరచి పోయేలా!



అమెరికన్ సింగర్-సాంగ్ రైటర్ గ్రేసీ అబ్రామ్స్ రాసిన పాట 'దట్ ఈజ్ సో ట్రూ' బిల్‌బోర్డ్ జాబితాలో అగ్ర స్థానంలో ఉంది. ఇది గ్రేసీ రెండవ ఆల్బమ్. అమెరికాకు వెలుపల ఆస్ట్రేలియా, బెల్జియం, న్యూజీలాండ్, నార్వే, యూనైటెడ్ కింగ్ డమ్, ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడన్, స్విట్జర్లాండ్‌లో మ్యూజిక్ చార్ట్‌లలో అగ్ర స్థానంలో నిలిచింది. 'ఐ కుడ్ గో అండ్ రీడ్ యువర్ మైండ్' అని హుషారెత్తిస్తోంది. ఆ సందడిలో మీరు భాగం కావాలంటే....'దట్ ఈజ్ సో ట్రూ' ఒక్కసారి వినేయండి. 'షీ ఈజ్ సో కూల్' అంటూ గ్రేసీతో గొంతు కలపండి.

● గేమింగ్

స్పైడర్-మ్యాన్ మరోసారి...

గ్రేట్ సూపర్ హీరోలా సాహసాలు ఎప్పుడూ సూపర్‌గానే ఉంటాయి. దీనికి ఉదాహరణ... స్పైడర్-మ్యాన్!

ఒక్క ముక్కలో చెప్పాలంటే స్పైడర్-మ్యాన్ గేమ్స్ ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్. 'మార్వెల్స్ స్పైడర్-మ్యాన్ 2' యాక్షన్ అడ్వెంచర్ గేమ్. మార్వెల్ కామిక్స్ క్యారెక్టర్ 'స్పైడర్-మ్యాన్' ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. థర్డ్ పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో పీటర్ పార్కర్, మైకేల్ మోరేల్స్ ప్రధాన పాత్రలు. న్యూయార్క్ కేంద్రంగా సాగే ఈ ఆటలో ప్లేయర్స్ రకరకాల స్పైడర్-మ్యాన్ సూట్‌లను సేకరించవచ్చు.

సమస్త సాహసాలతో గేమింగ్ కమ్యూనిటీని ఆకట్టుకునే 'మార్వెల్స్ స్పైడర్-మ్యాన్' ఈ నెల చివర రానుంది.



సిరీస్: మార్వెల్స్ స్పైడర్-మ్యాన్
ప్లాట్‌ఫామ్స్: విండోస్
జానర్: యాక్షన్-అడ్వెంచర్
మోడ్: సింగిల్-ప్లేయర్

● రికార్డ్



ప్రయాణ ప్రేమికుడు, ప్రఖ్యాత పర్వతారోహకుడు సర్ మార్టిన్ కాన్వే 'అధిరోహించిన ప్రతి శిఖరం ఏదో ఒకటి నేర్పుతుంది' అంటారు. అలా చిన్న వయసులోనే ఎన్నో శిఖరాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంది విశాఖపట్నానికి చెందిన కామ్య కార్తికేయన్. పదహారేళ్లకే ఎవరెస్ట్ అధిరోహించి రికార్డ్ సృష్టించింది. తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసిన యంగెస్ట్ ఫిమేల్‌గా రికార్డు సృష్టించింది....

కామ్య... అఖండ ఖ్యాతి

ఇలా మొదలైంది...

కార్తికేయన్, లావణ్య దంపతులకు సాహస యాత్రలు ఇష్టం. తమ చిన్నారి కామ్యను భుజాలపై మోసుకుంటూనే ట్రెక్కింగ్‌కు వెళుతుండేవారు. అలా పర్వత శిఖరాలతో చిన్నవయసులోనే కామ్యకు పరిచయం అయింది. మూడేళ్ల వయసులోనే ముంబైలోని లోనావాలాలో తండ్రితో పాటు ట్రెక్కింగ్‌లో పాల్గొని 'శభాష్' అనిపించుకుంది. మహారాష్ట్రలోని డ్యూక్స్ నోస్, రాజ్‌గడ్ పర్వతాల్ని నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అధిరోహించింది.

తల్లికి తగిన తనయ...

హిమాలయాల ట్రెక్కింగ్‌కు తల్లితో పాటు వెళ్లింది కామ్య. అప్పుడు ఆమె వయసు ఏడేళ్లు. తల్లీ కూతుళ్లు మొదటి ప్రయత్నంలోనే 12 వేల అడుగుల ఎత్తైన చంద్రశిల పర్వతారోహణ చేశారు. ఆ తర్వాత హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒకటైన 13,500 అడుగుల ఎత్తైన హర్‌కిదమ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. అది పూర్తి చేసిన కొద్ది రోజుల్లోనే 13,500 అడుగుల ఎత్తైన కేదార్‌కంఠ పర్వతారోహణ చేశారు.

తొమ్మిదేళ్ల వయసులో హిమాలయాల్లో రూప్‌కుండ్ ట్రెక్కింగ్ చేసి రికార్డు సృష్టించింది కామ్య.

ప్రధాని మన్ కీ బాత్‌లో కామ్య...

'అవరోధాల్ని అధిగమించి మన ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేయాలి అనుకునేవారికి విశాఖ నగరానికి చెందిన కామ్య కార్తికేయన్ అనే చిన్నారి స్ఫూర్తినిచ్చింది' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ కామ్యను ప్రశంసించారు. దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన సమయంలో మన్‌కీ బాత్‌లో కామ్య ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ.

– కరుకోల గోపీకిశోర్‌రాజా, సాక్షి, విశాఖపట్నం

ఆల్ రౌండర్

ముంబై నేవీ స్కూల్‌లో ప్లస్‌టు చదువుతున్న కామ్య కార్తికేయన్ పర్వతారోహణలోనే కాదు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్రతి పరీక్షలోనూ ఫస్ట్ గ్రేడ్ సాధిస్తోంది. సంగీతంలోనూ ప్రావీణ్యం పొందిన కామ్య పియానో వాయిద్యానికి సంబంధించి 3 గ్రేడులు పాసైంది. కర్ణాటక సంగీతం, భరతనాట్యంలోనూ 'ఆహా' అనిపించేలా ప్రతిభ చూపుతోంది.

ఏడు ఖండాల్లో ఎన్ని రికార్డ్‌లో!

● దక్షిణ అమెరికాలో 22,837 అడుగుల ఎత్తైన మౌంట్ అకాన్‌కాగువాని అధిరోహించి ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది ● ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన 18,652 అడుగుల మౌంట్ కిలిమంజారోపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి ఈ శిఖర యాత్ర పూర్తి చేయించడం ద్వారా ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డు ● యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్‌బ్రస్‌ని అధిరోహించి యంగెస్ట్ గర్ల్ ఇన్‌ది వరల్డ్‌గా రికార్డు ● ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు ● ఉత్తర అమెరికాలోని 20,308 అడుగుల మౌంట్ డెనలీని అధిరోహించిన యంగెస్ట్ నాన్ అమెరికన్‌గా రికార్డు ● ఆసియా ఖండంలో అత్యంత ఎత్తైన 29,031 అడుగుల మౌంట్ ఎవరెస్ట్‌ని అధిరోహించి నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్‌ని అధిరోహించి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి, ప్రపంచంలోనే అతి పిన్నవయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది.

ప్రతి అడుగూ సవాల్‌గా స్వీకరించాను

సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసి భారత త్రివర్ణపతాకాన్ని ఏడు ఖండాల్లోనూ రెపరెపలాడించాలన్నదే అమ్మా నాన్నల కల. వారి ఆకాంక్ష నెరవేర్చినందుకు గర్వంగా ఉంది. ఒకానొక సమయంలో మా పేరెంట్స్ తమ సంపాదనంతా నా మీదే ఖర్చు చేశారు. కొందరు దాతలు సహకారం అందించి నన్ను ముందుకు నడిపించారు. ఎంతటి కష్టాన్నైనా అవలీలగా ఎదుర్కోవాలన్నది నాన్న దగ్గర నేర్చుకున్నాను.

- కామ్య కార్తికేయన్

● టెక్.. టాక్

ఇన్‌స్టాలో ఎడిట్ యాప్



స్మార్ట్‌ఫోన్‌లలో షార్ట్ వీడియో క్రియేషన్ సరికొత్త స్థాయికి చేరుకుంది. క్రియేటర్స్‌కు దగ్గరైన ప్లాట్‌ఫామ్‌లలో ఇన్‌స్టాగ్రామ్ ఒకటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐఫోన్‌ల కోసం 'ఎడిట్' యాప్‌ను ప్రకటించింది ఇన్‌స్టా.

'అధిక నాణ్యతతో వీడియోను రికార్డ్ చేయడానికి, మీరు కోరుకునే అన్ని ఎడిటింగ్ సాధనాలు, ఫ్రెండ్స్‌తో పాటు ఇతర క్రియేటర్‌లతో డ్రాఫ్టును షేర్ చేసే సామర్థ్యం ఎడిట్‌లో ఉంటాయి. ఎడిట్ అనేది క్రియేటివ్ టూల్స్ సమాహారం' అని ప్రకటించాడు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మొస్సేరి.

'ఎడిట్స్' యాప్‌ను ఉపయోగించడం వల్ల యూజర్‌లు వాటర్ మార్క్ లేకుండా వీడియోలను ఎక్స్‌పోర్ట్ చేయడానికి, వీడియోల పనితీరును విశ్లేషించడానికి...మొదలైన వాటికి ఉపయోగపడుతుంది. ఈ యాప్ 2కె రిజల్యూషన్ నుంచి 60 ఎఫ్‌పిఎస్ వరకు హెచ్‌డీఆర్, ఎస్‌డీఆర్ ఫార్మట్‌లో ఎడిటింగ్ వీడియోలను సపోర్ట్ చేస్తుంది.

ఇక మూడు నిమిషాలు!



యూట్యూబ్ షార్ట్స్ మాదిరిగానే మూడు నిమిషాల నిడివి గల వీడియోలను ప్లాట్‌ఫామ్‌లో అప్లోడ్ చేయవచ్చని తెలియజేసింది ఇన్‌స్టాగ్రామ్. గతంలో 90 సెకన్‌ల వరకు వీడియోలను అప్లోడ్ చేసే అవకాశం కల్పించింది ఇన్‌స్టాగ్రామ్.

'ఇక నుంచి మీరు మూడు నిమిషాల నిడివి గల రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో లాంగ్-ఫామ్ వీడియోలపై కాకుండా షార్ట్-ఫామ్ వీడియోలపై దృష్టి పెట్టాలనుకున్నాం. కానీ 90 సెకనులు చాలా తక్కువ సమయం అని క్రియేటర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పెంచిన సమయం వల్ల మీరు మరిన్ని స్టోరీలను షేర్ చేయవచ్చు' అని ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది.



ఏసర్ స్విఫ్ట్ జో 14

స్క్రీన్ సైజ్: 14 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్: 2880×1800 పిక్సెల్స్
డైమెన్షన్స్: 312.9×217.9×14.9 ఎంఎం
బరువు: 1.25 కేజీ

ఓపెన్ ఏఐ టాస్క్స్



'టాస్క్స్' అనే న్యూ చాట్‌జీపీటి కేపబిలిటీతో ముందుకురానుంది ఓపెన్ ఏఐ. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. అలారం సెట్ చేయడం, ప్రజెంటేషన్ ఇవ్వడానికి అవసరమైన రాబోయే సమావేశాన్ని గుర్తు చేయడంలాంటి పనులను చేయగలదు. నీరు తాగడం నుంచి గ్రాసరీ షాపింగ్ వరకు ఎన్నో విషయాలలో 'టాస్క్స్' ద్వారా రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు.

హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్

- వెంకటేశ్



● భీమ్స్, వెంకటేశ్, అనిల్ రావిపూడి

''సంక్రాంతి పండగకి నిజాయతీగా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనుకున్నాం. ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని ఆదరించారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు. మా సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైంది. గురువారం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''అనిల్‌తో నేనో ఫ్రెండ్‌లానే ఉంటాను. మేము చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేస్తాం.. అందుకే రిజల్ట్ ఇంత పాజిటివ్‌గా ఉంటుంది. ఇక నా సినిమా ఇన్ని కోట్లు వసూలు చేయాలని నేనెప్పుడూ అడగను... వచ్చింది తీసుకోవాలి. ఇప్పటికే మా సినిమా రూ. 230 కోట్లు వసూలు చేయడం అనేది బోనస్.. ఇంతకంటే ఏం కావాలి'' అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ–''సినిమాకి కాస్త దూరమైన ప్రేక్షకులు కూడా మా 'సంక్రాంతికి వస్తున్నాం' కోసం థియేటర్‌కి రావడం ఆనందంగా ఉంది. రెవెన్యూ సైడ్ కూడా మేం ఊహించినదానికంటే అద్భుతంగా రావడం హ్యాపీ'' అని చెప్పారు. ''వెంకటేశ్‌గారి 'కలిసుందాం రా' సినిమా పాటలని ప్రేక్షకులు ఎంత గుండెల్లో పెట్టుకున్నారో... 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్‌ని కూడా అదే స్థాయిలో ఆస్వాదించడం సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు భీమ్స్ అన్నారు.



● సాయిపల్లవి, నాగచైతన్య

హైలెస్సో హైలెస్సా

'హైలెస్సో హైలెస్సా...' అంటూ ఆడి పాడేస్తున్నారు నాగచైతన్య, సాయిపల్లవి. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'హైలెస్సో హైలెస్సా... నీవైపే తెరచాపని తిప్పేసా...' అంటూ సాగే మూడో పాటని గురువారం రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని శ్రేయా ఘోషల్, నకాష్ అజీజ్ పాడారు. ''మోస్ట్ ఎవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'తండేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'బుజ్జి తల్లి..', 'నమో నమః శివాయ...' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. వండర్‌ఫుల్ మెలోడీస్‌ని కంపోజ్ చేయడంలో మాస్టర్ అయిన దేవిశ్రీ ప్రసాద్ తాజాగా 'హైలెస్సో హైలెస్సా..' అంటూ సాగే మరొక లవ్ మెలోడీని కంపోజ్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది

- విశ్వక్ సేన్



● సాహు గారపాటి, విశ్వక్ సేన్, రామ్ నారాయణ్

''నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో రూపొందిన ఔట్ అండ్ ఔట్ కామెడీ ఫ్యామిలీ ఫిల్మ్ 'లైలా'. చాలా క్లీన్‌గా ఉంటుంది. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా కోసం లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది. నిజంగా అమ్మాయిలకు హ్యాట్సాఫ్ చెప్పాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఇచ్చుకుందాం బేబీ...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటని ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసి ఆలపించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''లైలా'లో మోడల్ సోనూ, లైలా అనే రెండు పాత్రల్లో నటించా'' అన్నారు. ''లైలా' కథ ఇద్దరు ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి ఉంటేనే చేయగలరు. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ దొరికారు'' అని రామ్ నారాయణ్ చెప్పారు. ''ఈ పాత్ర విశ్వక్ కెరీర్‌లో నిలిచిపోతుంది'' అన్నారు సాహు గారపాటి. పాటల రచయిత పూర్ణాచారి మాట్లాడారు.




● కార్లా సోఫియా గ్లాస్కాన్

97వ ఆస్కార్ అవార్డ్ నామినేషన్స్ ప్రకటన

ఆస్కార్ సంబరం ఆరంభం





- 13 నామినేషన్లతో నాన్ ఇంగ్లీష్ మూవీ 'ఎమిలియా పెరెజ్' రికార్డ్
- 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు 10 నామినేషన్స్
- ట్రాన్స్‌జెండర్‌కి దక్కిన తొలి నామినేషన్ ● ఇండియన్ షార్ట్ ఫిల్మ్‌కి నామినేషన్

97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఈ ఏడాది మార్చి 2న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరగనుంది. కాగా ఈ అవార్డులకు సంబంధించిన నామినేషన్లను గురువారం రాత్రి (భారతీయ కాలమానం ప్రకారం) ప్రకటించారు. అమెరికన్ నటుడు బోవెన్ యాంగ్, నటి రాచెల్ సెన్నాట్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయితే ఈ నామినేషన్ల ప్రకటన ఈ నెల 17న జరగాల్సింది. కానీ అమెరికాలో చెలరేగిన కార్చిచ్చు కారణంగా 19కి వాయిదా వేశారు. ఫైనల్‌గా 23న ప్రకటించారు.

రికార్డ్ సాధించిన స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్

ఈసారి స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్ మూవీ 'ఎమిలియా పెరెజ్' నాన్-ఇంగ్లిష్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని రికార్డ్ సాధించింది. గతంలో చైనా మూవీ 'క్రౌచింగ్ టైగర్ హిడెన్ డ్రాగన్', మెక్సికన్-అమెరికన్ డ్రామా 'రోమా'... ఈ రెండు చిత్రాలు నాన్-ఇంగ్లిష్ విభాగంలో పది నామినేషన్లు దక్కించుకున్నాయి. ఇప్పుడు 13 నామినేషన్లతో 'ఎమిలియా పెరెజ్' వాటిని అధిగమించింది. అలాగే ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్‌లో నటించిన స్పానిష్ నటి కార్లా సోఫియా గాస్కాన్ (బెస్ట్ యాక్ట్రస్ లీడ్ రోల్ నామినేషన్) చరిత్ర సృష్టించారు. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన తొలి ట్రాన్స్‌జెండర్ నటిగా నిలిచారామె. ఇంకా 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు పది నామినేషన్ల చొప్పున దక్కాయి. అంతగా అంచనాలు లేని 'కాన్‌క్లేవ్' మూవీకి 8 నామినేషన్లు దక్కడం ఓ విశేషం.

ఒక్క నామినేషన్ తేడాతో... నాన్ ఇంగ్లిష్ ఫిల్మ్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని, రికార్డు సాధించిన 'ఎమిలియా పెరెజా'కి ఇంకో నామినేషన్ దక్కి ఉంటే... ఇంగ్లిష్ ఫిల్మ్‌ల రికార్డుని కూడా అధిగమించి ఉండేది. 'టైటానిక్, ఆల్ అబౌట్ ఈవ్, లా లా ల్యాండ్' వంటి ఇంగ్లిష్ చిత్రాలు 14 నామినేషన్లు దక్కించుకున్నాయి.



తల్లి హిస్టరీ రిపీట్: 'ఐయామ్ స్టిల్ హియర్' చిత్రానికి గాను ఫెర్నాండా టోర్రెస్ ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్నారు. ఇందులో విశేషం ఏంటంటే... ఆమె తల్లి ఫెర్నాండా మోంటెనెగ్రో 1991లో 'సెంట్రల్ స్టేషన్' చిత్రానికి గాను ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి బ్రెజిలియన్ నటిగా రికార్డుని సాధించారు. ఇప్పుడు ఇన్నేళ్లకు మలి బ్రెజిలియన్ నటిగా టోర్రెస్ నామినేషన్ దక్కించుకుని తల్లి హిస్టరీని రిపీట్ చేశారు.

బరిలో ఇండియన్ షార్ట్ ఫిల్మ్: ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించిన 'అనూజ' బెస్ట్ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఆల్రెడీ రెండు ఆస్కార్ అవార్డులు సాధించిన భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఈ చిత్రానికి ఓ నిర్మాత కావడం విశేషం. అలాగే నటి ప్రియాంకా చోప్రా ఓ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఢిల్లీలోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేసే తొమ్మిదేళ్ల అనూజ స్కూల్‌కు వెళ్లాలనుకుంటుంది. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని, అనూజ సోదరి పాలక్ భవిష్యత్‌ను ఏ విధంగా ప్రభావితం చేసింది? అనే కోణంలో ఈ చిత్రం సాగుతుంది. అనూజగా సజ్దా పఠాన్, పాలక్‌గా అనన్య షాన్‌భాగ్ నటించారు. ఇదిలా ఉంటే... గునీత్ మోంగా ఓ నిర్మాతగా వ్యవహరించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కి గాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 2023లో ఆస్కార్ దక్కింది. అంతకుముందు 2021లో గునీత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్'కిగాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డు దక్కింది. ఇప్పుడు ఆమె ఓ నిర్మాతగా వ్యవహరించిన 'అనూజ'కు కూడా ఆస్కార్ దక్కుతుందా? అనేది చూడాలి.

ఉత్తమ చిత్రం: అనోరా, ది బ్రూటలిస్ట్, ఎ కంప్లీట్ అన్‌నోన్, కాన్‌క్లేవ్, డ్యూన్: పార్ట్ 2, ఎమిలియా పెరెజ్, ఐయామ్ స్టిల్ హియర్, నికెల్ బాయ్స్, ది సబ్‌స్టాన్స్, విక్డ్ ● **ఉత్తమ దర్శకుడు:** సీన్ బేకర్ (అనోరా), బ్రాడీ కార్బెట్ (ది బ్రూటలిస్ట్), జేమ్స్ మ్యాన్‌గోల్డ్ (ది కంప్లీట్ అన్‌నోన్), జాక్వెస్ ఆడియార్డ్ (ఎమిలియా పెరెజ్), కోరలీ ఫార్గేట్ (ది సబ్‌స్టాన్స్) ● **ఉత్తమ నటుడు:** అడ్రియాన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్), తిమోతీ చాలమెట్ (ది కంప్లీట్ అన్‌నోన్), కోల్‌మెన్ డొమినింగో (సింగ్‌సింగ్), రే ఫియన్నెస్ (కాన్‌క్లేవ్), సెబస్టియన్ స్టాన్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ నటి:** సింథియా ఎరివో (విక్డ్), కార్లా సోఫియా గాస్కన్ (ఎమిలియా పెరెజ్), మికే మాడిసన్ (అనోరా), డెమి మూర్ (ది సబ్‌స్టాన్స్), ఫెర్నాండా టోర్రెస్ (ఐ యామ్ స్టిల్ హియర్) ● **ఉత్తమ సహాయ నటుడు:** యురా బోరిసోవ్ (అనోరా), కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), ఎడ్వర్డ్ నార్టన్ (ది కంప్లీట్ అన్‌నోన్), గాయ్ పియర్స్ (ది బ్రూటలిస్ట్), జెరిమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ సహాయ నటి:** మోనికా బార్బరో (ది కంప్లీట్ అన్‌నోన్), అరియానా గ్రాండే (విక్డ్), ఫెలిసిటీ జోన్స్ (ది బ్రూటలిస్ట్), ఇసబెల్లా రోస్సెల్లిని (కాన్‌క్లేవ్), జోయా సాల్దానా (ఎమిలియా పెరెజ్).

భారతీయ సినిమాకి నిరాశ

ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో నిలిచిన భారతీయ చిత్రాలు 'కంగువ, ఆడు జీవితం ('ది గోట్ లైఫ్), సంతోష్, స్వతంత్రవీర్ సవార్కర్, ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్, గర్ల్స్ విల్ బీ గర్ల్స్, పుతల్' ఆస్కార్ నామినేషన్‌ను దక్కించుకోలేకపోయాయి. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం ఈ ఏడాది ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పంపిన హిందీ చిత్రం 'లాపతా లేడీస్' ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లోనూ చోటు దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. ఇలా ఈసారి భారతీయ సినిమాకి నిరాశ ఎదురైంది.



మహనీయుడా..వందనం!

విప్లవ స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ జయంతి సందర్భంగా విశాఖలోని కొంతమంది విద్యార్థులు ఆర్కే బీచ్‌లోని ఆయన విగ్రహం వద్ద పూలు జల్లుతూ జోహార్..నేతాజీ..అంటూ నినదిస్తూ నివాళులర్పించారు.



వహ్..విశాఖ!

విశాల విశాఖ సాగరతీరం పచ్చ తోరణంతో సరికొత్త శోభను సంతరించుకుంది. లుంబినీ పార్క్ నుంచి భీమిలి మధ్య పరుచుకున్న పచ్చదనం పర్యాటకులకు విశేషంగా కనువిందు చేస్తోంది.



గణతంత్రానికి ఘన ఏర్పాట్లు

గణతంత్ర దినోత్సవ సంబరాలకు ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సిద్ధమవుతోంది. జాతీయ జెండాలతో స్టేడియం అంతా అత్యంత సుందరంగా ఇలా అలంకరించారు.

క్లుప్తంగా...

ఏప్రిల్‌లో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు



కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ మాసంలో కర్నూలు ఏఐవైఎఫ్ అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ తెలిపారు. గురువారం కర్నూలులో సీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ పాలనలో దేశంలో యేటా 40 లక్షల ఉద్యోగాలు పోతున్నాయని, వాటి వివరాలు అడిగితే మతం, కులంపేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తి అవుతోందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు చొప్పున బీజేపీ పాలనలోనే 22 కోట్ల ఉద్యోగాల్లో యువత ఉండాల్సి ఉందన్నారు. అయితే ఆ పరిస్థితులు కనిపించకపోగా ఉన్న ఉద్యోగాలు కూడా హుషకాకీ అయ్యాయని ఆరోపించారు. కేంద్రప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో భగత్‌సింగ్ నేషనల్ గ్యారంటీ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వైస్‌చాన్సులర్లను నియమించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

'మైనర్' పాఠశాలలను విలీనం చేయొద్దు

సాక్షి, అమరావతి: ఒరియా, తమిళం,కన్నడం, ఉర్దూ మైనర్ మీడియం పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కలపకుండా మినహాయింపు ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 45 మంది విద్యార్థులున్న మైనర్ మీడియం (ఒరియా) పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మార్చాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఓ ప్రకటనలో తెలిపారు. జీవో 117 ఉపసంహరణ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా మైనర్ మీడియం పాఠశాలలను ఇంగ్లిష్ మాధ్యమం పాఠశాలల్లో విలీనం చేస్తే మైనర్ మీడియం విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

బాబూ..ఎస్సీ విభజన జోలికి పోవద్దు

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

శ్రీకాకుళం అర్బన్: ఏపీలో ఎస్సీ విభజన జోలికి చంద్రబాబు పోకూడదని, ఎస్సీ విభజన కోసం చంద్రబాబు ముందుకు వెళితే దళితులను, ఓబీసీలను కలుపుకొనిపోయి పోరాటం చేస్తానని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. శ్రీకాకుళంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం ఎస్సీలను వాడుకోవద్దని చంద్రబాబుకు సూచించారు.

సకాలంలో పన్నులు చేసుకోవాలి

పంచాయతీ రాజ్ శాఖకు ఉప లోకాయుక్త ఆదేశం

కర్నూలు(సెంట్రల్): గ్రామ పంచాయతీలకు సకాలంలో ఆస్తి, ఇతర పన్నులు వసూలు చేసుకోవడానికి సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ఉప లోకాయుక్త పి.రజనీ పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు జిల్లాలోని విట్ విశ్వవిద్యాలయం వెలగపూడి పంచాయతీకి ఆస్తి పన్ను రూపంలో రూ. 25,89,957, ఐనవోలు పంచాయతీకి రూ. 61,71,237, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం నీరు కొండ పంచాయతీకి 83,06,304 ఆస్తి పన్ను బకాయి ఉండేది. మొత్తంగా ఈ వర్సిటీలు ఆయా పంచాయతీలకు రూ. 1,70,67,498 బకాయి ఉండడంతో గుంటూరు జిల్లా తక్కినపాడుకు చెందిన చంద్రశేఖర్ లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ క్రమంలో లోకాయుక్త పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆస్తి పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవాలని నోటీసులు ఇచ్చింది. లోకాయుక్త ఆదేశాలతో ఆయా సంస్థలు బకాయి ఉన్న ఆస్తి పన్ను చెల్లించినట్లు గురువారం లోకాయుక్తకు పీఆర్ కమిషనర్ నివేదిక సమర్పించారు.

భోగాపురం పనులు చకచకా

- శరవేగంగా అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు
- అడ్డంకులన్నీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పరిష్కారం
- 2023 మే 3న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన
- భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం పూర్తి
- భూమి స్వాధీనంతో నిర్మాణ పనులు ప్రారంభించిన జీఎంఆర్
- కీలక నిర్మాణాలన్నీ 56 శాతం పూర్తి
- 2026 డిసెంబర్‌కల్లా పూర్తి చేయాలనేది లక్ష్యం

నిర్మాణ పనుల ప్రగతి ఇలా...

ఏరియా	పని పూర్తి (శాతం)
ఎర్త్ వర్క్	99.58
రన్‌వే	78.07
టాక్సీ వే	55.10
పీటీబీ	46.11
ఏటీసీ	53.09
ఇతరత్రా కీలక భవనాలు	34.16

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విభజిత ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిస్థాయి గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు విజయనగరం జిల్లా భోగాపురం వద్ద శరవేగంగా జరుగుతున్నాయి. 2014–19 టీడీపీ హయాంలో అపరిష్కృతంగా వదిలేసిన సమస్యలను తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాకచక్యంగా పరిష్కరించిన సంగతి తెలిసిందే. భూసేకరణను పూర్తి చేయడమే గాక నిర్వాసితులకు పరిహారం, పునరావాసం విషయంలోనూ అడ్డంకులన్నీ తొలగించింది. కేంద్రం వద్ద పెండింగ్‌లోనున్న అనుమతులన్నీ తీసుకువచ్చింది. ఆ తర్వాత 2023 మే 3న నాటి సీఎం వైఎస్ జగన్ ఈ విమానాశ్రయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఏడాదిన్నరగా ఈ పనులన్నీ ఊపందుకున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 30% పనులు పూర్తయ్యాయి. గతేడాది డిసెంబర్ నాటికి ప్రధాన నిర్మాణ పనులన్నీ 56 శాతానికి చేరాయి. మిగతావన్నీ పూర్తి చేసి 2026 డిసెంబర్ నాటికల్లా తొలి దశ పూర్తిచేయడమే లక్ష్యంగా నిర్మాణ సంస్థ జీఎంఆర్ నిర్మాణాల వేగాన్ని మరింతగా పెంచింది. ఉత్తరాంధ్ర ప్రగతికి దిక్సూచి కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఎయిర్‌పోర్టు కంపెనీల్లో ఒకటైన జీఎంఆర్ గ్రూప్ పీపీపీ విధానంలో చేపట్టింది. వాస్తవానికి శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైఎస్ జగన్ ప్రసంగిస్తూ 2025 డిసెంబర్‌కి మొదటి దశ పూర్తి చేయాలని అభిలషించారు. ఇందుకు జీఎంఆర్ గ్రూప్ సంస్థల అధిపతి గ్రంధి మల్లికార్జునరావు (జీఎంఆర్) కూడా సానుకూలంగా స్పందించారు. అందుకనుగుణంగానే ల్యాండ్ ఫిల్లింగ్, రన్‌వే, టెర్మినల్ నిర్మాణ పనులను ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించింది. ఈ పనులన్నీ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. 56 శాతం పూర్తి అయ్యాయని అధికారులు చెబుతున్నారు.

పూర్తి అయితే ప్రగతికి దోహదం...

ఏటా 4 కోట్ల మంది విమాన ప్రయాణం చేసేలా ఈ విమానాశ్రయాన్ని తీర్చిదిద్దుతున్నారు. 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యంతో తొలి దశ నిర్మాణ పనులు చేపట్టారు. ఇవి 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేసిన తర్వాత తదుపరి దశ పనులు చేపడతారు. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్ర ప్రగతికి, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ఊతంగా నిలుస్తుంది. దేశీయ, విదేశీ విమానయానం మరింతగా ఊపందుకుంటుంది. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ కార్గో టెర్మినల్ కూడా అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్రలో ఫార్మా, ఆక్వా తదితర పరిశ్రమల విస్తరణకు, ఆయా ఉత్పత్తుల ఎగుమతులకు ఆధారమవుతుంది. మరోవైపు ఈ ప్రాంతంలో వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదం చేస్తుంది.



భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనుల చిత్రం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాగిన పనులు ఇలా....

- విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ ప్రక్రియను రూ.835.48 కోట్లతో పూర్తి చేసింది.
- 4 గ్రామాల్లోని 404 నిర్వాసిత కుటుంబాలకు రూ.67.04 కోట్లతో అన్ని మౌలిక వసతులతో ఈ పునరావాస కాలనీలను నిర్మించింది.
- ప్రతి కుటుంబానికి 240 చదరపు గజాల ఇంటిస్థలం, అక్కడ నిర్మాణం పూర్తి చేసుకోవడానికి రూ.9.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది.
- విమానాశ్రయానికి ఏటా 5 ఎంఎల్‌డీ నీటి సరఫరా చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. తక్షణమే 1.7 ఎంఎల్‌డీ నీటి సరఫరాకు సంబంధించిన పనులను పూర్తి చేయడానికి రూ.5.30 కోట్లు మంజూరు చేసింది.
- 2.5 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా ఏర్పాట్లకు రూ.2.62 కోట్ల నిధులు విడుదల చేసింది.
- విమానాశ్రయానికి సేకరించిన భూమిలోనున్న విద్యుత్తు లైన్లు, స్తంభాల స్థలామార్పిడికి రూ.2.30 కోట్ల వ్యయం చేసింది.
- స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి భోగాపురం మండలం బసవపాలెం వద్ద 24.30 ఎకరాల భూమి కేటాయించింది.
- 132/133 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భోగాపురం మండలం కొంగవానిపాలెం వద్ద 5.47 ఎకరాల భూమి ఇచ్చింది.



శరవేగంగా సాగుతున్న టెర్మినల్ నిర్మాణ పనులు



నిర్వాసితుల భవంతులు

కుమార్తెపై అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రి

తిరుపతి క్రైం: అన్న కూతురుపై ఓ తండ్రి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన తిరుపతిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న దంపతుల కుమార్తె (16) శ్రీకాళహస్తిలోని ఓ ప్రభుత్వ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతోంది. ఇటీవల సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. బాలిక నిద్రిస్తున్న సమయంలో ఆమె తండ్రి ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించి వారి అమ్మకు చెప్పొద్దు అంటూ ఆమెను తండ్రి బతిమాలాడు. సెలవులన్నీ ముగిశాక హాస్టల్లో వదిలే సమయంలో కూడా ఆమె తండ్రి ఎవరికీ చెప్పొద్దు అంటూ బాలికను నచ్చజెప్పి పంపాడు. అయితే అప్పటికే తల్లికి బాలిక జరిగిన విషయాన్ని చెప్పడంతో తల్లి కూడా ఏమీ తెలియనట్లుగా ఉండిపోయింది. బుధవారం తల్లి ఏం జరిగిందో తెలుసుకోవడానికి శ్రీకాళహస్తిలోని బాలిక వద్దకు వెళ్ళింది. అనంతరం అలిపిరి పోలీసులను సంప్రదించి తండ్రిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రజల మనోభావాల మేరకే 'ఉక్కు'కు నిధులు

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



భీమవరం: రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించి విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్థికపరమైన నష్టాలతో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌కు ప్రకటించిన ప్యాకేజీలో రూ.10,300 కోట్లు క్యాపిటల్ షేర్స్‌గా, రూ.1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా కేటాయించినట్లు వివరించారు. స్టీల్ ప్లాంట్‌కు సొంతంగా మైన్స్ లేకపోవడం వల్లనే నష్టాలొస్తున్నాయని కొంతమంది చేస్తున్న వాదనలో నిజం లేదన్నారు. గతంలో లాభాలొచ్చిన విషయం మర్చిపోకూడదని చెప్పారు. మేనేజ్‌మెంట్‌లో లోపాలను సరిచేసుకుని నడపాలని, కేంద్రం ఇచ్చిన ప్యాకేజీలో ఉద్యోగులు, కార్మికుల జీతాలు చెల్లించడానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

చలికి 'పట్టు' తప్పుతోంది

తళుక్కున మెరవాల్సిన 'పట్టు'..మార్కెట్‌లో వెలవెలబోతోంది. చలి తీవ్రతకు పట్టుగూళ్లకు సున్నపుకట్టు తెగులు సోకుతుండగా నాణ్యత తగ్గి ధరపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పట్టు గూళ్లు ఉత్పత్తి చేసిన రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు.

- ఉష్ణోగ్రతలు తగ్గడంతో పట్టుగూళ్లకు సున్నపుకట్టు తెగులు
- దిగుబడులు, నాణ్యతపై తీవ్ర ప్రభావం
- మార్కెట్‌లో ఆశించిన ధర లేక తీవ్రంగా నష్టపోతున్న రైతులు





సున్నపుకట్టు తెగులు సోకిన గూళ్లు (ఇన్‌సెట్‌లో) నాణ్యతగా ఉన్న గూళ్లలో పట్టుపురుగులు

హిందూపురం: పట్టుగూళ్ల మార్కెట్‌కు సత్యసాయి జిల్లా హిందూపురం ఆసియాలోనే పేరుగాంచింది. మిగతా మార్కెట్లతో పోలిస్తే అధిక ధరలు దక్కుతుండటంతో హిందూపురం, మడకశిర, గుడిబండ, సోమందేపల్లి, లేపాక్షితోపాటు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా వందలాది మంది రైతులు పట్టుగూళ్లను ఇక్కడి తీసుకువచ్చి విక్రయాలు చేస్తుంటారు. అందువల్లే హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు రోజూ 6 వేల క్వింటాళ్లకుపైగా పట్టుగూళ్లు వస్తుంటాయి. కానీ ప్రస్తుతం పట్టుగూళ్ల ఉత్పత్తిపై చలి ప్రభావం తీవ్రంగా చూపుతోంది. అంతేకాకుండా పట్టుగూళ్లకు సున్నపుకట్టు తెగులు సోకడంతో దిగుబడి తగ్గుతోంది. ప్రస్తుతం మార్కెట్‌కు 3 వేల క్వింటాళ్లలోపే పట్టుగూళ్లు వస్తున్నాయి.



హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన పట్టుగూళ్లు

ముందుకురాని రీలర్లు

దిగుబడి అంతంతమాత్రమే ఉండగా మార్కెట్‌లో మంచి ధర పలకాలి. కానీ పట్టుగూళ్ల కొనుగోళ్లకు రీలర్లు ముందుకురాకపోవడంతో ఆశించిన ధరలు రావడం లేదు. ఓ రీలర్ టెండర్ వేస్తే దాన్ని మించి కనీసం రూ.5 ఇచ్చేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. ఈనెల 15వ తేదీన కిలో బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు రూ.750 పలకగా, కనిష్టంగా రూ.552 మాత్రమే పలికాయి. అలాగే 19 తేదీన గరిష్టంగా రూ.744, కనిష్టంగా రూ.567, 20న గరిష్టంగా రూ.751, కనిష్టంగా రూ.620, 21వతేదీన కిలో గరిష్టంగా రూ.748, కనిష్టంగా రూ.544 మాత్రమే పలికాయి. దీంతో ఎంతో ఆశతో ఇక్కడివరకూ వస్తున్న రైతులు కనీసం రవాణా చార్జీలు దక్కక నష్టాలపాలవుతున్నారు.

ఉష్ణోగ్రత తగ్గకుండానే చూసుకోవాలి

పట్టుగూళ్ల షెడ్లలో ఉష్ణగ్రతలు తగ్గకుండా చూసుకోవాలని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. లేకపోతే పట్టుగూళ్లు సున్నపుకట్టు బారిన పడి దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరిస్తున్నారు. షెడ్లులో రాత్రిళ్లు కనీసం 20 డిగ్రీలు తగ్గకుండా ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు. కొందరు రైతులు షెడ్లలో వేడికోసం 200 వాల్టుల బల్బులు పెడుతున్నా, దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. షెడ్లలో బొగ్గుల కుంపటి పెట్టి వేడిని పెంచుకోవాలన్నారు. మార్కెట్‌కు గూళ్లు తెచ్చే ముందు కూడా ఆ రోజు చివరగా అల్లిన గుడ్డులో పురుగు ప్యూపా అయిందో లేదో చూసి పూర్తిగా ప్యూపా దశలో ఉంటేనే మార్కెట్‌కు తీసుకువస్తే ఆశించిన ధర లభిస్తుంది.

ధర పెరిగితేనే గిట్టుబాటు



చలి ప్రభావంతో పట్టుగూళ్ల ఉత్పత్తి చాలా ఇబ్బందికరంగా మారుతోంది. వ్యయప్రయాసల కోర్చి గూళ్లను మార్కెట్‌కు తీసుకువస్తే సరైన ధర దక్కక నష్టపోవాల్సి వస్తోంది. ప్రస్తుత 'పురం' మార్కెట్‌లో క్వింటా బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు రూ.700 వరకు పలుకుతున్నాయి. క్వింటా కనీసం రూ.800పైగా పలికితే నష్టాలు ఉండవు. లేకపోతే రైతుల రెక్కల కష్టం వృథా కావడం ఖాయం.

– వీరాంజినేయ, పావగడ

రీలర్లు ముందుకు రావడం లేదు



పట్టుగూళ్ల కొనుగోలుకు రీలర్లు ముందుకు రావడం లేదు. ఒక రీలర్ టెండరు వేస్తే దానిపైన రూ.5 పెంచేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. వ్యయ ప్రయాసల కోర్చి పట్టుగూళ్లను మార్కెట్‌కు తెస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. కనీసం క్వింటా పట్టుగూళ్లు రూ.750పైబడి పలికితే రైతులకు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం ఆ మేర ధర పలకడం లేదు.

– హర్షవర్ధన్‌రెడ్డి, వైబీ హళ్లి



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.


వైకుంఠపురం గుడి హుండీ లెక్కింపు



తెనాలి: వైకుంఠపురం లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవదాయ, 3 నెలల కాలపరిమితికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీల లెక్కింపు జరిపారు. రూ. 52,45,169 నగదు, అన్నదానం హుండీలో రూ.90,560 నగదు, 81.40 గ్రాముల బంగారం వచ్చాయి. వీటితోపాటు అమెరికన్ డాలర్లు 15, ఆస్ట్రేలియా డాలర్లు 20, యూకే పౌండ్లు ఐదు, ఖతార్‌కు చెందిన రియాల్స్ 5 భక్తులు సమర్పించారు.

నేడు కానుకమాత చర్చి జెండా ఆవిష్కరణ

రెంటచింతల: పురాతన కానుకమాత చర్చి 175వ వార్షికోత్సవాలకు సర్వం సిద్ధమైంది. క్రీస్తు శిలువ వేసే సమయంలో పడిన పాట్లను గుర్తుచేసే 14 స్థలాలు ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శాంతి, కరుణ, ప్రేమ, సహనం, దయ వంటి వాటిపై సమస్త మానవాళికి సూక్తులు బోధిస్తూ ఆధ్యాత్మిక కేంద్రంగా రాష్ట్రంలోనే ప్రత్యేకస్థానం కలిగిన ఈ చర్చిలో వేడుకలు ఫిబ్రవరి 2వ తేదీన జరగనున్నాయి. శుక్రవారం నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నవదిన ప్రార్థనలలో భాగంగా ప్రతి రోజు జపమాల, దివ్యపూజాబలి నిర్వహించనున్నట్లు విచారణ గురువు ఏరువ లూర్దుమర్రెడ్డి చెప్పారు.



సైన్స్ పోటీలతో శాస్త్రీయ ఆలోచనలు

భీమవరం: సైన్స్ ప్రయోగ పోటీల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సైన్స్‌పై అభిరుచి పెంపొందించవచ్చని పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ అన్నారు. గురువారం భీమవరంలోని తన కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగ పోటీల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

బాపట్ల: విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన ఉండాలని ఆర్టీఓ టి.కె.పరంధామరెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం పిట్టలవానిపాలెంలోగల కేర్ యోగ, నేచురోపతి మెడికల్ కాలేజ్ విద్యార్థులకు రహదరి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ విద్యార్థులు నిబంధనలు పాటిస్తూ మిగిలిన వారికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. యువత ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, నిబంధనలు పాటించకపోవడమే అందుకు కారణమని పేర్కొన్నారు. చట్టాలు ఉన్నది ప్రజల రక్షణ కోసమేనని వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ విడుదల



తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ, ఏబీఆర్ఎస్ఎమ్, భారతీయ భాషా సమతి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు ' భారతీయ భాషా సమ్మేళనం ' అనే అంశంపై జరిగే జాతీయ సదస్సుకు సంబంధిచి బ్రోచర్ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఏబీఆర్ఎస్ఎమ్ జాతీయ సహాయ కార్యదర్శి గుంటా లక్ష్మణ్ వర్సిటీ గురువారం ఆవిష్కరించారు. సదస్సుకు తిరుపతిలోని పలు వర్సిటీల నుంచి ప్రముఖులు, అధ్యాపకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సాక్షి ప్లస్
శుక్రవారం। 24-1-2025





1) బట్టిగూడెంలో భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్న మావోయిస్టు ఆర్మీ శిక్షణ కేంద్రంలో కటకం సుదర్శన్ స్తూపం 2) సుదర్శన్ స్మారక స్తూపం కూల్చివేత 3) మావోయిస్టు శిక్షణ కేంద్రంలో గది

జూన్.. నో మావోయిస్టు జోన్

ఆపరేషన్ కగార్... లక్ష్యం జూన్

- దండకారణ్యంపై భద్రతా దళాల పట్టు
- వేసవి ముగిసేనాటికే మావోయిస్టుల్ని తుడిచిపెట్టేలా వ్యూహాలు
- ఇప్పటికే భద్రతాదళాల వశమైన మావోయిస్టుల శిక్షణ కేంద్రం
- 2026 నాటికి మావోయిస్టులు ఉండరన్న అమిత్‌షా
- మావోయిస్టులకు కేంద్ర స్థానంగా బస్తర్


సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత ప్రక్రియ ముమ్మరమైంది. నిర్దేశించుకున్న గడువు 2026 మార్చి కంటే ముందే ఆపరేషన్‌ను ముగించేందుకు రంగం సిద్ధమైంది. మావోయిస్టులను తుదముట్టించేందుకు మరింత పట్టుదలతో భద్రతా దళాలు ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర అడవులను చుట్టుముడుతున్నాయి. ఒక వైపు దండకారణ్యం, అబూజ్‌మడ్, ఏవోబీ, గడ్చిరోలి అడవులను చుట్టేస్తూ.. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

అంత సురక్షితం కాదు..

బస్తర్ అడవుల్లోని నారాయణపూర్, దంతేవాడ, బీజాపూర్‌తో పాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సరిహద్దుగా ఉన్న అబూజ్‌మడ్ అటవీ ప్రాంతం రెండు దశాబ్దాలుగా మావోయిస్టుల అడ్డాగా నిలుస్తోంది. అయితే, 2014 అక్టోబర్ 4న అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌లో.. ఆ పార్టీ ఏకంగా 38 మందిని కోల్పోయింది. దీంతో అబూజ్‌మడ్ అంత రక్షిత ప్రాంతం కాదనే అభిప్రాయం నెలకొంది. ఆపై బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల్లో విస్తరించిన దండకారణ్యం.. మావోయిస్టుల కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉంటూ వచ్చింది. కానీ గతేడాది ఆరంభంలో గుండం, పువ్వర్తిలో సీఆర్‌పీఎఫ్ శిబిరాల ఏర్పాటుతో దండకారణ్యం కూడా సురక్షితం కాని పరిస్థితి నెలకొంది.

వేసవి ముగిసేలోగా..

ఆపరేషన్ కగార్ మొదలయ్యాక.. గతేడాది ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు చనిపోగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 53 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో మావోయిస్టులు గడ్డు కాలంగా భావించే వేసవి ముగిసే నాటికి.. మరింత ఉధృతంగా దాడులు చేసి దండకారణ్యం, అబూజ్‌మడ్ అడవులను మావోయిస్టు రహిత ప్రాంతంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వ బలగాలు ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమాన ఛత్తీస్‌గఢ్‌లోని ఇతర ప్రాంతాల్లోని (మైదాన ప్రాంతాలతో సహా) వివిధ భద్రతా దళాలు, మహారాష్ట్రలోని సీ–60 కమాండోలు, ఒడిశాలోని స్పెషల్ ఆపరేషన్ గ్రూపులను సైతం దండకారణ్యం, అబూజ్‌మడ్ ప్రాంతాలకు రప్పిస్తున్నారు. వేసవికల్లా ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తెచ్చుకుని ఇక్కడ మావోయిస్టులు అమర్చిన పేలుడు పదార్థాలు, బూబీట్రాప్స్, నేల మాళిగలు, శిక్షణ కేంద్రాలు, ఆయుధ తయారీ కేంద్రాలను ధ్వంసం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.



మావోయిస్టు ఆర్మీ శిక్షణ కేంద్రంలో షెడ్లు

భద్రతా దళాల చేతుల్లోకి మావోయిస్టుల శిక్షణ కేంద్రం

దండకారణ్యంలోని కొండపల్లి, జీడిపల్లి, కవరుగట్టు ప్రాంతాల్లో గత నెలలో భద్రతా దళాల శిబిరాలు ఏర్పాటయ్యాయి. అక్కడి నుంచి క్రమంగా అడవుల్లోకి చొచ్చుకెళ్తూ.. ఒక్కొక్క ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంటు న్నాయి. ఈ క్రమాన రెండు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామిడి పోలీస్‌స్టేషన్ పరిధి పెద్ద బట్టిగూడెం వద్ద మావోయిస్టుల ఆర్మీ శిక్షణ కేంద్రాన్ని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. అయితే, అప్పటికే మావోయిస్టులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. హెలీకాప్టర్లపై ఎలా దాడులు చేయాలనే అంశాలపై మావోయిస్టులు శిక్షణ పొందుతున్నట్టు.. గతంలో విడుదలైన వీడియోలు ఈ ప్రాంతానికి చెందినవని భావిస్తున్నారు.

కటకం సుదర్శన్ స్మారక స్తూపం

మావోయిస్టు శిక్షణ కేంద్రంలో మావోయిస్టు అగ్రనేత కటకం సుదర్శన్ పేరిట భారీ స్మారక స్తూపం ఉంది. ఇక్కడ శిక్షణకు వచ్చిన మావోయిస్టులు బస చేసేందుకు వీలుగా భారీ షెడ్లను సైతం నిర్మించారు. ఎత్తయిన చెట్లపై సెంట్రీ పాయింట్లను ఏర్పాటు చేసుకుని ఈ ప్రాంతాన్ని శత్రుదుర్భేద్యంగా మార్చుకున్నారు. అయితే ఇప్పుడదంతా గతం. ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తెచ్చుకున్న భద్రతా దళాలు అక్కడి స్తూపాలను కూల్చివేస్తున్నాయి. కటకం సుదర్శన్ స్తూపాన్ని కూడా కూల్చివేశారు. సమీపంలోని మందుపాతరలను నిర్వీర్యం చేస్తున్నారు.

విస్తృత తనిఖీలు


నలువైపులా జరుగుతున్న దాడుల కారణంగా అబూజ్‌మడ్, అటు దండకారణ్యం నుంచి మావోయిస్టులు, వారికి సంబంధించిన సామగ్రిని బయటి ప్రాంతాలకు తరలించకుండా పోలీసులు జాగ్రత్త పడుతున్నారు. జగదల్‌పూర్ – బీజాపూర్ – వరంగల్ – హైదరాబాద్, జగదల్‌పూర్ – సుక్మా – భద్రాచలం – విజయవాడ, మల్కన్‌గిరి – చింతూరు – భద్రాచలం జాతీయ రహదారుల గుండా వెళ్లే ప్రతీ వాహనాన్ని పలుమార్లు ఆపి తనిఖీ చేస్తున్నారు. వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తుల ఫొటోలు తీసుకుని.. వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. ఆఖరికి బస్సులు, లారీల్లో వెళ్లే లగేజీలను కూడా వదలడం లేదు. బిల్లు లేకుండా కనిపిస్తే చాలు.. సీల్ తొలగించి మరీ లగేజీలను తనిఖీ చేస్తున్నారు. వారం రోజులుగా ఈ తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగుతున్నాయి.

నేతాజీకి భారతరత్న ప్రకటించాలి



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు భారతరత్న ప్రకటించాలని, నేతాజీ జయంతిని బానిసత్వ విముక్తి దినంగా ప్రకటించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలో బుధవారం బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని.. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారు పద్మావతి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దాసు సురేష్ మాట్లాడుతూ నేతాజీ చూపిన బాటలో.. భారత దేశం ప్రపంచంలో కెల్లా అత్యంత బలమైన దేశంగా రూపాందేవరకు అలుపెరగకుండా ముందుకు సాగుతామన్నారు.

పుడమి పరవశం



జోడెడ్లతో రైతన్న దుక్కిదున్ని చదును చేస్తుంటే.. అలసట తెలియకుండా మహిళలు పాటలు పాడుతూ నాట్లు వేస్తుంటే.. పుడమి తల్లి మురిసిపోయింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ చెరువు ఆయకట్టు భూముల్లో రైతుల వ్యవసాయ పనులు పల్లె అందాన్ని ద్విగుణీకృతం చేశాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



పెరుగుతున్న గుండెపోటు మరణాలు

- కోవిడ్ మహమ్మారి అనంతరం యువజనులు, పిల్లల్లోనూ హార్ట్‌ఎటాక్‌లు
- పరీక్షలపై నిర్లక్ష్యం.. జబ్బు ముదిరాకే బయటపడుతున్న కేసులు
- సీటీ స్కాన్, కార్డియాక్ ఎవాల్యూవేషన్ లేకనే ఇబ్బందులు...
- ఆరోగ్యకరమైన గుండె కోసం రెగ్యులర్ చెకప్‌లు, హార్ట్‌కేర్‌లో టెక్నాలజీని ఉపయోగించుకోవడం ముఖ్యమంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: ఈ మధ్యకాలంలో గుండెపోటుతో హఠాత్ మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్నా–పెద్దా, పురుషులు–మహిళలు, ధనవంతుడు–పేదవాడు అనే తారతమ్యాలు, వయసు తేడాలు లేకుండా ఏడెనిమిదేళ్ల లోపు చిన్న పిల్లలు మొదలు 18–25 ఏళ్ల మధ్య యువజనులు, శారీరకంగా ధృడంగా ఉండే రాజకీయవేత్తలు, కసరత్తులు చేసి ఫిట్‌గా ఉండే క్రీడాకారులు, అప్పటిదాకా ఎలాంటి గుండెజబ్బు ఆనవాళ్లు లేనివారు కూడా అకస్మాత్తుగా వచ్చే హార్ట్ ఎటాక్, కార్డియక్ ఫెయిల్యూర్లతో నేలకొరుగుతున్నారు. ఇటీవలే కొన్నిరోజుల క్రితం...గుజరాత్‌లో ఓ ఎనిమిదేళ్ల బాలిక తరగతి గది కారిడార్‌లో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో విగతజీవిలా కిందకు వాలిపోవడం స్కూల్ సీసీటీవీలో రికార్డయింది. ఈ వీడియో వివిధ సామాజిక మాధ్యమాల్లో బాగా ప్రచారం పొందడంతో...దీనిని చూసిన వారంతా కూడా ఎంతో ఆవేదనకు గురయ్యారు. ఇటీవల చిన్నపిల్లల్లో గుండెజబ్బుల ముప్పు పెరుగుతున్నట్లుగా గత మూడు, నాలుగు నెలల్లో చోటుచేసుకున్న వివిధ సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. వీరే కాకుండా కొన్ని రోజుల వ్యవధిలోనే వయసుతో తేడా లేకుండా కొందరు హఠాత్తుగా వస్తున్న గుండెపోటుతో మరణించారు.

ముందే గుర్తించవచ్చు...

లోకం తెలియని చిన్నవయసులోనే గుండెపోటుతో మరణించడం తల్లిదండ్రులు, బంధువులకు తీరని శోకాన్ని మిగిలిస్తోంది. అయితే హఠాత్తుగా గుండె జబ్బుతో చనిపోవడం అంటూ ఉండదని, పుట్టినప్పటి నుంచే అంటే.. గర్భస్థ స్థితి నుంచే గుండెజబ్బులకు సంబంధించిన లక్షణాలతో ఈ ప్రాణాంతక ముప్పును గుర్తించవచ్చునని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. చిన్న పిల్లల్లో గుండెజబ్బుకు సంబంధించి కొన్ని లక్షణాలను ముందునుంచే గుర్తించవచ్చునని, వారి శరీరరంగు ముఖ్యంగా పెదాలు, చేతులు నీలం రంగులోకి మారడం వంటివి గమనించాలని చెబుతున్నారు. సాధారణంగా పసిపిల్లలుగా చిన్నవయసులో ఉన్నప్పుడే 3, 4 పర్యాయాలు శ్వాససంబంధిత ఇన్ఫెక్షన్లు సోకుతాయని, అంతకు మించిన సంఖ్యలో, తరచూ ఇన్ఫెక్షన్లు వస్తున్నాయంటే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. వారి వయసుకు తగ్గట్టుగా తగినంతగా బరువు పెరగకపోవడం, నాలుగు మాసాల వయసప్పుడు మందహాసం (నార్మల్ స్మైల్), ఏడాది వయసు పూర్తయ్యేలోగా తొలి అడుగు వేయకపోవడం వంటివి బాగా ఆలస్యమైతే ఏదైనా సమస్య ఉండొచ్చునని, ముందస్తుగా జాగ్రత్త పడాలని చెబుతున్నారు. చిన్నపిల్లలు పుట్టినప్పటి నుంచే వారి గుండె పనితీరుకు సంబంధించి ఏవైనా లోపాలుంటే '2 డీ ఎకో', ఈసీజీ ఇతర రూపాల్లోని పరీక్షల ద్వారా సమస్యలను గుర్తించి తగిన చికిత్స అందిస్తే, సడన్ హార్ట్‌అటాక్ వంటి వాటిని చాలా మటుకు నివారించవచ్చునని సూచిస్తున్నారు.

ఇక పెద్ద వయసులోని (యువకులతో సహా) వారి విషయానికొస్తే...



గుండెనొప్పా లేక ఎసిడిటీనా అని సొంతంగా తేల్చుకునే ప్రయత్నంతోనే ప్రాణాపాయ పరిస్థితి పెరుగుతోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఎవరికైనా నా గుండెలో నొప్పిగా అనిపిస్తే దానిని ఎసిడిటీగా కొట్టిపారేసి నిర్లక్ష్యం చేయడం అధికశాతం మందిలో పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. ఇలా గుండెనొప్పికి, అసౌకర్యానికి గురయ్యాక వెంటనే సమీపంలోని ఆసుపత్రిలో ఈసీజీ, రక్తపరీక్షలు, సీటీ స్కాన్ చేయించుకుంటే ప్రమాదం నుంచి బయటపడొచ్చునని సూచిస్తున్నారు. గుండెపోటు వచ్చాక 4 నుంచి 6 గంటలు గోల్డెన్ పీరియడ్ వంటివని, ఈ సమయంలోగా ఆసుపత్రికి చేరుకుంటే ప్రమాదంనుంచి తప్పించుకోవచ్చునని చెబుతున్నారు. అదే ఆరుగంటల తర్వాత ఆస్పత్రికి వెళితే లక్షలాది రూపాయలు వెచ్చించినా ఒకసారి గాయపడిన గుండె మళ్లీ పూర్తిస్థాయిలో కోలుకోవడం అరుదేనని హెచ్చరిస్తున్నారు. నిద్రించే సమయాల్లోనే అధికంగా హార్ట్‌అటాక్‌లకు అవకాశం ఉందని, ఆరోగ్యమైన గుండె కలవారు హఠాత్ గుండెపోటుతో మరణించడం అనేది అత్యంత అరుదని చెబుతున్నారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మరణించే ప్రమాదాన్ని అరికట్టేందుకు రెగ్యులర్ పరీక్షలతో పాటు, హెల్త్‌కేర్ విషయంలో అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతికను అధికంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. 40, 50 ఏళ్ల వయసుల్లోని వారిలో వేలాది మంది గుండె జబ్బు ఉన్న వారిని డయాగ్నైజ్ చేసిన దాఖలాలు లేవంటున్నారు. మధ్యవయస్కుల్లోనూ శారీరకంగా దృఢంగా ఉన్న వారు, ఫిట్‌గా కనిపించే వారు, కసరత్తులు చేసేవారు సైతం హార్ట్ అటాక్‌కు గురి కావడం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. అయితే అధికశాతం కేసుల్లో వీరికి గతం నుంచే గుండెజబ్బులు ఉండి అవి తీవ్రస్థాయికి చేరుకోవడం వల్లనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. ఆరోగ్యవంతులైనా సరే ఒక్కసారైనా సీటీ స్కాన్, కార్డియక్ ఎవాల్యువేషన్ చేయించుకుంటే ముందుగానే ఆరోగ్య సమస్య బయటపడి మరణానికి గురయ్యే ప్రమాదం ఉండదని అంటున్నారు.

ఆరోగ్యమైన గుండెకు పంచసూత్రాలు... వైద్యనిపుణుల సూచనల ప్రకారం...

రెగ్యులర్ చెకప్‌లు...
రక్తపరీక్షలు, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, సీటీ యాంజియో, అల్ట్రాసౌండ్. మహిళలకు మామ్మొగ్రామ్స్ ఇంకా పాప్ స్మియర్ టెస్ట్‌లు

ఎక్సర్‌సైజ్...
ప్రతీరోజు రెగ్యులర్ కసరత్తులు, స్వల్ప ఎక్సర్‌సైజులు, వేగంగా నడక (బ్రిస్క్ వాకింగ్), యోగా వంటివి ఎంతో ఉపయోగం

డైట్...
బియ్యం, చపాతీ, చక్కెర వంటి కార్బోహైడ్రేట్లను పరిమితంగా తీసుకోవాలి. రెడ్ మీట్‌ను దూరం పెట్టాలి

స్లీప్‌ఎర్లీ...
రాత్రి సమయాల్లో త్వరగా నిద్రపోవడం, ఉదయం త్వరగా నిద్రలేవడం వంటి అలవాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది

స్పిరిచ్యువాలిటీ...
ఆధ్యాత్మికతను అలవరుచుకోవడం ద్వారా ఒత్తిళ్లను తగ్గించుకుని గుండె ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవచ్చు.



కాయలు కాసిన రామాఫలం చెట్టు

సేంద్రియ బృందావని

ఉద్యానవనాన్ని తలపిస్తున్న ఇల్లు

- సేంద్రియ ఎరువులతో రైతు అద్భుతాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన రైతు కరుటూరి పాపారావు సేంద్రియ విధానంలో వ్యవసాయం చేస్తూనే.. ఇంటిని సైతం సేంద్రియ ఉద్యానవనంగా రూపొందించారు. ఇందులో మొక్కలకు వేప కషాయం, గోకృపామృతం, జీవామృతం పిచికారీ చేస్తున్నారు. రసాయన ఎరువులను వినియోగించకపోవడం విశేషం. 1972లో తన తండ్రి నిర్మించిన ఇంటి చుట్టూ పాపారావు అనేక రకాల పూల మొక్కలను పెంచుతున్నారు. నందనవనాన్ని తలపించే ఈ ఇంట్లో ముసంటా, ఏవీస్కస్, ఫీకస్, ఇడీనం, దురంటా, మినీ ఎగ్జోరా, డబుల్ ఎగ్జోరా, సైకస్, ఎర్రికాపం, పులిమరియా, అల్మండా, లంబానా, జరబరా, క్రోటన్స్, మందార, గులాబీ, చామంతి, లాన్‌గ్రాస్ తదితర పూలమొక్కలను పూర్తి సేంద్రియ విధానంలో పెంచుతున్నారు. ఇంటి ప్రాంగణంలో ఇంకుడుగుంతను నిర్మించి.. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. భారీ గిరక తాటిచెట్టును కూడా ఇంట్లో పెంచుతుండటం విశేషం. ఇక అరుదైన రామాఫలం.. పూలమొక్కల పెంపకం విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



పాపారావు ఇంట్లో పూల మొక్కలు



సినిమా

కోలీవుడ్‌లో సీక్వెల్ హవా బాగా వీస్తోంది. కోలీవుడ్ హీరోలందరూ సీక్వెల్ జపం చేస్తున్నారు. ప్రస్తుతం తమిళంలో పదికి పైగా సీక్వెల్స్ సినిమాలు ఉండటమే ఇందుకు ఓ నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మరి... ఈ సీక్వెల్స్, ఫ్రాంచైజీ చిత్రాలతో బిజీగా ఉన్న తమిళ హీరోలు ఎవరో తెలుసుకుందాం...

కోలీవుడ్‌లో సీక్వెల్ సందడి



• రజనీకాంత్
• కమల్‌హాసన్
• కార్తీ
• రవికృష్ణ
• నయనతార

● పదికి పైగా సీక్వెల్స్

● సీక్వెల్ మూవీస్ చేస్తున్న కమల్‌హాసన్, రజనీకాంత్

జైలర్ తిరిగి వస్తున్నాడు

రజనీకాంత్ హీరోగా చేసిన 'జైలర్' (2023) మూవీ బ్లాక్‌బస్టర్ హిట్. నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్షన్‌లో కళానిధి మారన్ నిర్మించిన ఈ మూవీలో రజనీ కొత్త తరహా స్టైల్, స్వాగ్, మేనరిజమ్స్ ఆడియన్స్‌ను ఆకట్టుకున్నాయి. వీటికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, ఆర్ఆర్ ప్లస్ అయ్యాయి. దీంతో 'జైలర్' మూవీ రజనీ ఖాతాలో ఓ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిపోయింది. ఈ సినిమా మూవీ రిలీజ్ తర్వాత 'జైలర్ 2' ఉంటుందనే ఊహాగానాలు వినిపించాయి. ఆ ఊహాలను నిజం చేస్తూ నెల్సన్ దిలీప్ కుమార్ ఇటీవలే 'జైలర్ 2' సినిమాను ప్రకటించారు. రజనీకాంత్ హీరోగా చేయనున్న 'జైలర్ 2' చిత్రీకరణ ఈ ఏడాది మార్చిలో ప్రారంభం కానుందని తెలిసింది. కాగా 'జైలర్'లో రమ్యకృష్ణ, మీర్నా మీనన్ కీ రోల్స్‌లో, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ గెస్ట్ రోల్స్‌లో నటించారు. వీరందరి పాత్రలు 'జైలర్ 2'లోనూ కొనసాగుతాయని కోలీవుడ్ టాక్. అంతే కాదు... బాలకృష్ణ, 'కేజీఎఫ్' బ్యూటీ శ్రీనిధి శెట్టి 'జైలర్ 2'లో యాడ్ అవుతారట. ఈ సీక్వెల్ 2026 ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

వీర శేఖరన్ పోరాటం

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') మూవీ 1996లో విడుదలై, బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. 28 సంవత్సరాల తర్వాత కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే 2024లో విడుదలైన 'ఇండియన్ 2' సినిమా మాత్రం ఆడియన్స్‌ను అంతగా మెప్పించలేకపోయింది. అయితే 'ఇండియన్ 2' సినిమా తీస్తున్న సమయంలోనే 'ఇండియన్ 3' చిత్రీకరణను కూడా దాదాపు పూర్తి చేశారు దర్శకుడు శంకర్. ఈ ఏడాదే 'ఇండియన్ 3'ని విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లుగా ఇటీవల ఆయన దర్శకత్వంలో వచ్చిన 'గేమ్ చేంజర్' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో శంకర్ పేర్కొన్నారు. 'ఇండియన్, ఇండియన్ 2' చిత్రాల్లో సేనాపతిగా కనిపించారు కమల్‌హాసన్. కానీ 'ఇండియన్ 3' మాత్రం సేనాపతి తండ్రి వీరశేఖరన్ పాయింట్ ఆఫ్ వ్యూలో కథనం ఉంటుంది. స్వాతంత్ర్యం కోసం బ్రిటీషర్లతో వీరశేఖరన్ ఏ విధంగా పోరాడారు? అన్నది 'ఇండియన్ 3' స్టోరీ అని కోలీవుడ్ సమాచారం. ఈ ఫ్లాష్‌బ్యాక్‌లో వీరశేఖరన్ భార్యగా కాజల్ అగర్వాల్ కనిపిస్తారు. రెడ్ జెయింట్ మూవీస్, లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన 'ఇండియన్ 3'కి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు.

ఇటు సర్దార్... అటు ఖైదీ

తండ్రీకొడుకులుగా కార్తీ ద్విపాత్రాభినయం చేసిన స్పై యాక్షన్ మూవీ 'సర్దార్'. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించిన ఈ మూవీ 2022లో విడుదలై, బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. అయితే 'సర్దార్' సినిమా క్లైమాక్స్‌లో 'మిషన్ కంబోడియా' అంటూ ఈ సినిమాకు సీక్వెల్‌గా 'సర్దార్ 2'ను కన్ఫార్మ్ చేశారు పీఎస్ మిత్రన్. అలాగే జూలైలో 'సర్దార్'కు సీక్వెల్‌గా పీఎస్ మిత్రన్ డైరెక్షన్‌లోనే 'సర్దార్ 2' ప్రారంభమైంది. కార్తీ హీరోగా ఎస్‌జే సూర్య, మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్ ప్రధాన తారాగణంగా నటిస్తారని ఆల్రెడీ మేకర్స్ వెల్లడించారు. ఇక ఈ సినిమా షూటింగ్ ఆల్రెడీ మొదలైంది కాబట్టి ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో థియేటర్స్‌లో చూడొచ్చు. అప్పుడు మిషన్ కంబోడియా వివరాలు కూడా తెరపైన కనిపిస్తాయి. ఇక 'ఖైదీ'లో కార్తీ చేసిన దిల్లీ రోల్‌ను మర్చిపోరు ఆడియన్స్. లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్‌లో కార్తీ హీరోగా నటించిన 'ఖైదీ' చిత్రం 2019లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీంతో వెంటనే కార్తీతో 'ఖైదీ 2' చేయాలని లోకేశ్ ప్లాన్ చేశారు. కానీ లోకేశ్‌కు కమల్‌హాసన్‌తో 'విక్రమ్', రజనీకాంత్‌తో 'కూలీ' సినిమాల ఆఫర్స్ రావడంతో 'ఖైదీ' సీక్వెల్ షూటింగ్‌ను కాస్త ఆలస్యం చేశారు. రజనీకాంత్ 'కూలీ' సినిమా చిత్రీకరణ పూర్తి కావొచ్చింది. దీంతో లోకేశ్ నెక్ట్స్ మూవీ కార్తీ 'ఖైదీ 2'నే ఉండొచ్చు. ఇలా రెండు సీక్వెల్స్‌తో ఆడియన్స్‌ను అలరించేందుకు రెడీ అవుతున్నారు కార్తీ.

రెండు దశాబ్దాల తర్వాత..!

'7 / జీ రెయిన్‌బో కాలనీ' అంటే తెలుగు ప్రేక్షకులకు తెలియకపోవచ్చు. కానీ '7/జీ బృందావన కాలనీ' అంటే మాత్రం చాలామంది తెలుగు ఆడియన్స్‌కు ఈ సినిమా గుర్తొస్తుంది. 2004లో సెల్వ రాఘవన్ డైరెక్షన్‌లో రూపొందిన '7/జీ రెయిన్‌బో కాలనీ' తెలుగులో '7/జీ బృందావన కాలనీ'గా అనువాదమై, సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ మూవీలో హీరో హీరోయిన్లుగా రవికృష్ణ, సోనియా అగర్వాల్ నటించారు. ఏఎమ్ రత్నం నిర్మించారు. ఇప్పుడు 28 ఏళ్ల తర్వాత '7/జీ బృందావన కాలనీ' సినిమాకు సీక్వెల్‌గా '7/జీ బృందావన కాలనీ 2' సినిమా తీస్తున్నారు దర్శకుడు సెల్వ రాఘవన్. తొలి భాగంలో నటించిన రవికృష్ణనే మలి భాగంలోనూ హీరోగా చేస్తుండగా, అనశ్వర రాజన్ హీరోయిన్‌గా చేస్తున్నారు. ఏఎమ్ రత్నం నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. జయరామ్, సుమన్ శెట్టి, సుధ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న '7/జీ బృందావన కాలనీ 2' సినిమా రిలీజ్‌పై త్వరలోనే ఓ ప్రకటన రానుంది. ఇక సెల్వ రాఘవన్ డైరెక్షన్‌లో వచ్చిన 'ఆయిరత్తిల్ ఒరువన్' (తెలుగులో 'యుగానికి ఒక్కడు') సినిమా గుర్తుండే ఉంటుంది. కార్తీ, రీమా సేన్, పార్తీబన్, ఆండ్రియా లీడ్ రోల్స్‌లో నటించిన ఈ మూవీ 2010లో విడుదలై, బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఆయిరత్తిల్ ఒరువన్ 2' సినిమాను 2021 జనవరి 1న ప్రకటించారు సెల్వ రాఘవన్. ఈ సీక్వెల్‌లో ధనుష్‌ను హీరోగా ప్రకటించారు. ఈ చిత్రం 2024లో రిలీజ్ అవుతుందని, అప్పట్లో ధనుష్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కానీ ఈ సినిమా చిత్రీకరణ ఇంకా ఆరంభం కాలేదు. ఇక 'ఆయిరత్తిల్ ఒరువన్' సీక్వెల్ గురించి మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

అమ్మోరు తల్లి

నయనతార నటించిన 'ముకుత్తి అమ్మన్' (తెలుగులో అమ్మోరు తల్లి) 2020 నవంబరులో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలై, వీక్షకుల మెప్పు పొందింది. దీంతో ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ముక్కుత్తి అమ్మన్ 2'ను ప్రకటించింది వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ సంస్థ. 'ముక్కుత్తి అమ్మన్'లో నటించిన నయనతారనే సీక్వెల్‌లోనూ లీడ్ రోల్ చేస్తున్నారు. అయితే 'ముక్కుత్తి అమ్మన్'కు నటుడు ఆర్జే బాలాజీ–ఎన్‌జే శరవణన్ దర్శకత్వం వహించగా, 'ముకుత్తి అమ్మన్ 2'ను మాత్రం నటుడు–దర్శకుడు సుందర్ .సి తెరకెక్కించనున్నారు. సుందర్.సి నేతృత్వంలోని మరో ఫ్రాంచైజీ 'కలగలప్పు'లోని 'కలగలప్పు 3'ని కూడా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారట. కామెడీ డ్రామాగా 'కలగలప్పు'కు తమిళ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంది.

ఇవే కాదు... కమల్‌హాసన్ 'విక్రమ్ 2', ధనుష్ 'వడ చెన్నై 2' వంటి చిత్రాలతో పాటు మరికొన్ని తమిళ చిత్రాల సీక్వెల్స్ వచ్చే అవకాశం ఉంది.

హారర్ ఎఫెక్ట్!

ఈసారి హారర్ జానర్ సీక్వెల్స్ కోలీవుడ్‌లో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలవనున్నాయి. రాఘవా లారెన్స్ ఆధ్వర్యంలో ఆడియన్స్‌ను అలరిస్తున్న 'కాంచన' సిరీస్‌కు మంచి ఆదరణ ఉంది. ఈ సిరీస్‌లో మరో చిత్రంగా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు 'కాంచన 4' రానుందని కోలీవుడ్ సమాచారం. రాఘవా లారెన్స్ నటించి, దర్శకత్వం వహించనున్న 'కాంచన 4'లో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. మరి... 'కాంచన 4'లో ఎవరు నటిస్తారనే విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. ఇక సుందర్ .సి సారథ్యంలో నడుస్తున్న హారర్ ఫ్రాంచైజీ 'అరణ్మణై' గురించి చెప్పుకోవాలి. తమన్నా, రాశీ ఖన్నా లీడ్ రోల్స్‌లో నటించిన 'అరణ్మణై 4' (తెలుగులో 'బాకు') ఆడియన్స్‌ను మెప్పించింది. దీంతో ఈ ఏడాదిలోనే 'అరణ్మణై 5'ను కూడా తీయాలని సుందర్ .సి ప్లాన్ చేస్తున్నారని కోలీవుడ్ టాక్. అలాగే హారర్ జానర్‌లో సంతానం చేస్తున్న హారర్ కామెడీ ఫ్రాంచైజీ 'డీడీ' నుంచి నాలుగో మూవీగా 'డీడీ నెక్ట్స్ లెవల్' చిత్రం రానుంది. ఎస్. ప్రేమ్ ఆనంద్ డైరెక్షన్‌లోని ఈ మూవీలో సెల్వ రాఘవన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఇతర లీడ్ రోల్స్ చేశారు. ఈ మూవీ మేలో రిలీజ్ కానుంది. ఇక 2014లో మిస్కిన్ డైరెక్షన్‌లో వచ్చిన 'పిశాసు' (తెలుగులో 'పిశాచి') చిత్రం ఆడియన్స్‌ను ఆకట్టుకోగలిగింది. దాదాపు పదేళ్ల తర్వాత 'పిశాసు' సినిమాకు సీక్వెల్‌గా 'పిశాసు 2' తీస్తున్నారు మిస్కిన్. సీక్వెల్‌లో ఆండ్రియా మెయిన్ లీడ్ రోల్ చేశారు. మార్చిలో ఈ మూవీ రిలీజ్ కానుంది. 'డీమాంటి కాలనీ' ఫ్రాంచైజీ గురించి హారర్ చిత్రాలను ఇష్టపడేవారికి తెలిసే ఉంటుంది. గత ఏడాది ఆగస్టులో విడుదలైన 'డీమాంటి కాలనీ 2' తెలుగు ప్రేక్షకుల మెప్పు పొందే ప్రయత్నం చేసింది. కాగా 'డీమాంటీ కాలనీ' ఫ్రాంచైజీ దర్శకుడు అజయ్.ఆర్ జ్ఞానముత్తు 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా 'డీమాంటీ కాలనీ 3'ని ఆల్రెడీ ప్రకటించారు. ఈ చిత్రం ఈ ఏడాదే సెట్స్‌పైకి వెళ్లనున్నట్లుగా తెలిసింది. రిలీజ్ మాత్రం 2026లో ఉండొచ్చు.

– ముసిమి శివాంజనేయులు

కోలీవుడ్‌లో కొన్ని హిట్ ఫిల్మ్స్‌కు సీక్వెల్స్ ప్రకటించారు మేకర్స్. కానీ ఈ సినిమాలు ఇంకా పూర్తి స్థాయిలో సెట్స్‌పైకి వెళ్లలేదు. ఆ సినిమాలేవో చదవండి.

ప్రకటించారు... కానీ..!

విదేశాల్లో డిటెక్టివ్

విశాల్ కెరీర్‌లోని వన్నాఫ్ ది బెస్ట్ హిట్స్‌లో 'తుప్పరివాలన్' ఒకటి. మిస్కిన్ డైరెక్షన్‌లోని ఈ మూవీ తెలుగులో 'డిటెక్టివ్'గా విడుదలై, ప్రేక్షకులను మెప్పించింది. అప్పట్నుంచే ఈ మూవీకి సీక్వెల్ తీయానులనుకున్నారు విశాల్. మిస్కిన్ డైరెక్షన్‌లోనే 'డిటెక్టివ్ 2'ను ప్రకటించారు విశాల్. అయితే కథ విషయంలో మిస్కిన్‌కు, విశాల్‌కు మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ వచ్చాయి. దీంతో ఈ ప్రాజెక్ట్ నుంచి మిస్కిన్ తప్పుకున్నారు. ఆ తర్వాత 'డిటెక్టివ్ 2'కి తానే దర్శకత్వం వహించాలనుకున్నారు విశాల్. తన స్టైల్ ఆఫ్ 'డిటెక్టివ్ 2'తో తాను దర్శకుడిగా పరిచయం కాబోతున్నానని, ఇది తన పాతికేళ్ల కల అని, ఇందుకోసం లండన్, అజర్ బైజాన్, మాల్టా వంటి లొకేషన్స్‌ను పరిశీలిస్తున్నానని గత ఏడాది మార్చిలో విశాల్ పేర్కొన్నారు. కానీ 'డిటెక్టివ్ 2' చిత్రం ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదని తెలుస్తోంది. ఇలా విశాల్ నుంచి 'డిటెక్టివ్ 2' అప్‌డేట్ రావాల్సి ఉంది. అలాగే విశాల్ హీరోగా పీఎస్ మిత్రన్ డైరెక్షన్‌లో వచ్చిన 'ఇరంబుదురై' మూవీ 2018లో రిలీజై, హిట్ సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్ రానుందనే టాక్ వినిపిస్తోంది.

బాక్సింగ్ రౌండ్ 2

నాలుగు సంవత్సరాల క్రితం కరోనా సమయంలో 'సార్పట్టై పరంబర' చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైంది. పా. రంజిత్ డైరెక్షన్‌లోని ఈ మూవీకి వీక్షకుల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. దీంతో 'సార్పట్టై పరంబర' సినిమా సీక్వెల్‌ను థియేటర్స్‌లో రిలీజ్ చేయాలని పా. రంజిత్ భావించారు. 2023 మార్చిలో 'సార్పట్టై పరంబర' సినిమాకు సీక్వెల్‌గా 'సార్పట్టై రౌండ్ 2' ప్రకటించారు. అయితే ఈ మూవీపై మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

తని ఒరువన్ 2

రవి మోహన్ ('జయం' రవి తన పేరును ఇటీవల రవి మోహన్‌గా మార్చుకున్నారు) హీరోగా మోహన్ రాజా డైరెక్షన్‌లో వచ్చిన 'తని ఒరువన్' మూవీ గుర్తుండే ఉంటుంది. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ నిర్మించిన ఈ మూవీ 2015లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'తని ఒరువన్ 2'ని ప్రకటించారు మోహన్ రాజా. అయితే మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్'తో రవి మోహన్ బిజీగా ఉండటం వల్ల 'తని ఒరువన్ 2' చేయడానికి వీలు పడలేదు. ఈ ఏడాది ఈ సినిమాను సెట్స్‌కు తీసుకువెళ్లే సాధ్యాసాధ్యాలను రవి మోహన్ పరిశీలిస్తున్నారని కోలీవుడ్ సమాచారం. ఈ సినిమాని కూడా ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ నిర్మించనుంది. ఇక 'తని ఒరువన్' మూవీ తెలుగులో 'ధృవ' (రామ్ చరణ్ హీరోగా నటించారు)గా రీమేక్ అయి, విజయం సాధించిన సంగతి తెలిసిందే.

హీరోల వయసు గురించి ఎందుకు మాట్లాడరో?

చిత్ర పరిశ్రమలో వయసనేది పెద్ద సమస్యే కాదని నటి మనీషా కొయిరాలా అంటున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ– ''చిత్ర పరిశ్రమలోని సీనియర్ నటీమణులకు ముఖ్యమైన పాత్రలు చేసే అవకాశం ఇవ్వాలి. వయసు, వృద్ధాప్యం అనేది సినిమా ఇండస్ట్రీలో పెద్ద సమస్య కాదు. కానీ, ఇది పరిష్కరించాల్సిన సామాజిక సమస్య. ఎందుకంటే చిత్ర పరిశ్రమలో హీరోల వయసు గురించి ఎవరూ మాట్లాడరు. హీరోల ఏజ్‌పై కామెంట్స్ చేయడం నేనిప్పటి వరకూ వినలేదు. ఏజ్ విషయంలో కేవలం నటీమణులను మాత్రమే ఎందుకు ట్రోల్ చేస్తారో అర్థం కావడం లేదు. సీనియర్‌లకు తల్లి పాత్రలో లేక సోదరి పాత్రలో ఇద్దామనుకుంటున్నారు. మహిళలు ఎలాంటి పాత్రలైనా చేయగలరు. యాక్షన్ పాత్రలని కూడా సులభంగా చేయగలరు. గతంలో ఎంతో మంది సీనియర్ నటీమణులు ఈ విషయాన్ని నిరూపించారు. నేను కూడా ఇప్పటికీ ఎలాంటి పాత్ర అయినా సవాల్‌గా స్వీకరిస్తాను. కొత్త పాత్రలు చేసి నన్ను నేను నిరూపించుకోవాలనుకుంటున్నాను. ఏజ్ అనేది జస్ట్ నంబర్ మాత్రమే. యాభై సంవత్సరాలు దాటినా మంచి జీవితాన్ని గడపగలం. అసలు వయసనేది సమస్య కాదని ప్రపంచానికి చాటి చెప్పాలి. ఈ విషయంలో భవిష్యత్ తరాలకు మార్గదర్శిగా నిలవాలి. నేను జీవించి ఉన్నంత వరకు ఆరోగ్యంగా, సంతోషంగా, సంతృప్తిగా ఉండాలనుకుంటున్నా.. ఇదే ఆశయంతో జీవిస్తున్నాను'' అన్నారు.



• మనీషా కొయిరాలా

రాయడం గేమ్ చేంజర్‌లా మారింది – సమంత

''నేను గత రెండేళ్లుగా డైరీ రాస్తున్నాను. నా జీవితంలో డైరీ రాయడం ఓ గేమ్ చేంజర్‌లా మారింది. మీరూ రాయడానికి ప్రయత్నించండి'' అంటున్నారు హీరోయిన్ సమంత. కాగా విజయ్ దేవరకొండ, సమంత నటించిన 'ఖుషి' సినిమా 2023 సెప్టెంబరు 1న విడుదలైంది. ఈ మూవీ తర్వాత మరో చిత్రంలో నటించలేదు సమంత. అయితే గతేడాది 'సిటాడెల్ హన్నీ బన్నీ' అనే బాలీవుడ్ వెబ్ సిరీస్ ద్వారా బుల్లితెర ప్రేక్షకులను పలకరించారు సమంత. ఇక సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటారామె. ఎప్పటికప్పుడు ఏదో ఒక విషయాన్ని షేర్ చేస్తూ తన అభిమానులతో టచ్‌లో ఉంటారు సమంత. ఇందులో భాగంగా తాజాగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె చేసిన ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. ''డైరీ రాయడం అనేది పాత పద్ధతే. కానీ, రాస్తే మాత్రం మనకు ఓ తీయని జ్ఞాపకంగా ఉంటుంది. నేను గత రెండేళ్లుగా డైరీ రాసే ఆచారాన్ని పాటిస్తున్నాను. ప్రారంభంలో కాస్త ఇబ్బందిగా ఉంటుంది. ఏం రాయాలో అర్థం కాదు. కానీ, ఎంత చిన్న విషయమైనా సరే అందులో రాస్తే... మెల్లిగా అదొక అలవాటుగా మారుతుంది. మనలో చాలా మార్పులు వస్తాయి. నేను కూడా నాకు కష్టమైన, కష్టం అనిపించిన క్షణాల్లో కొన్నింటిని డైరీలో రాశాను. డైరీ రాయడం అనేది నా కష్టతరమైన క్షణాల నుంచి ఉపశమనం కలగడానికి చాలా ఉపయోగపడింది. చెప్పాలంటే డైరీ రాయడం నాకో గేమ్ చేంజర్‌లా మారింది. అందరూ రాయడం ప్రయత్నించండి... ఎవరి జీవితంలో ఎలాంటి మార్పులు వస్తాయో చూద్దాం'' అంటూ పోస్ట్ చేశారు సమంత. ఇదిలా ఉంటే సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు.



• సమంత

బిజినెస్ రీల్

పసిడి రికార్డుల పరుగు

ఢిల్లీలో రూ.170 పెరిగి రూ.82,900కు చేరిక



న్యూఢిల్లీ: బంగారం ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో వరుసగా రెండవరోజు కొత్త రికార్డుల వైపునకు పరుగుపెట్టింది. పూర్తి స్వచ్ఛత (99.9) పది గ్రాముల ధర రూ.170 పెరిగి రూ.82,900కు ఎగసింది. ట్రంప్ వాణిజ్య విధానాలపై అస్పష్టత, దీనితో అంతర్జాతీయ పటిష్ట దోరణి, దేశీయంగా ఆభరణ వర్తకుల డిమాండ్, రూపాయి బలహీనత వంటి అంశాలు పసిడికి కొత్త మెరుపులు తీసుకువస్తున్నాయి. బంగారం మెరుపులు వరుసగా ఇది ఏడవరోజు. ఈ ఏడు ట్రేడింగ్ సెషన్‌లలో ధర రూ.2,320 ఎగసింది. గడచిన ఏడాదిగా ఎల్లో మెటల్ 32.17% పెరిగి రూ.20,180కి ఎగసింది. 2024 ఫిబ్రవరి 23వ తేదీన 10 గ్రాముల ధర రూ.62,720 కావడం గమనార్హం.

కాల్స్ కోసమే ప్రీపెయిడ్ ప్యాక్స్



న్యూఢిల్లీ: కాల్స్, ఎస్ఎంఎస్‌ల కోసం ప్రత్యేక ప్రీపెయిడ్ ప్యాక్స్‌ను టెలికం కంపెనీలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ పరిచయం చేశాయి. 84 రోజుల కాల పరిమితితో రూ.499 ధరలో కొత్త ప్లాన్‌ను ఎయిర్‌టెల్ అందుబాటులోకి తెచ్చింది. అపరిమిత కాల్స్, 900 ఎస్ఎంఎస్‌లు ఆఫర్ చేస్తారు. అలాగే రూ.1,959 ధరలో 365 రోజుల వ్యాలిడిటీ గల ప్యాక్ కింద అపరిమిత కాల్స్, 3,600 ఎస్ఎంఎస్‌లు అందుకోవచ్చు. రిలయన్స్ జియో రూ.458 ధరలో 84 రోజుల కాల పరిమితితో అపరిమిత వాయిస్‌కాల్స్, 1,000 ఎస్ఎంఎస్‌లను అందిస్తోంది. ఏడాది కాల పరిమితితో రూ.1,958 ధరలో అపరిమిత కాల్స్, 3,600 ఎస్ఎంఎస్‌లను పొందవచ్చు. డేటా అవసరం లేకపోయినా బండిల్ ప్యాక్స్ వల్ల కస్టమర్లకు చార్జీల భారం పడుతోందన్న ఫిర్యాదుల పెద్ద ఎత్తున రావడంతో టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ గత నెలలో టారిఫ్ నిబంధనలను సవరించింది. దీనికి అనుగుణంగా డేటా అవసరం లేని కస్టమర్ల కోసం వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల కోసం టెలికం కంపెనీలు ప్రత్యేక ప్లాన్స్‌ను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది.

బోర్డు సమావేశాలు



బ్యాంక్ ఆఫ్ ఇండియా, డీసీబీ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, శ్రీరాం ఫైనాన్స్, ఇండిగో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, డీఎల్ఎఫ్, ఓరియంట్ సిమెంట్, సాగర్ సిమెంట్స్, ఆంధ్రా సిమెంట్స్, శక్తి పంప్స్, గ్రాన్యూల్స్ ఇండియా, అతుల్ ఇండస్ట్రీస్, భారత్ గేర్స్, సువెన్ లైఫ్ సైన్సెస్, టొరెంట్ ఫార్మా, లారస్ ల్యాబ్స్
ఆల్కైల్ అమైన్స్ కెమికల్స్, టీటీకే హెల్త్‌కేర్, ట్రెంట్, గోద్రేజ్ కన్జూమర్, ఎన్ఐఐటీ

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)



24-1-2025	
విశాఖ	485-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	490-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460-00
వరంగల్	462-00
రిటైల్ ధర	5.20

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ULTRACEMCO	11,406.95	6.67
GRASIM	2,458.95	2.96
WIPRO	317.7	2.78
SHRIRAMFIN	531	2.38
SUNPHARMA	1,839.00	2.23

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BPCL	271.65	-2.14
KOTAKBANK	1,893.00	-1.28
HCLTECH	1,806.95	-1.14
SBIN	746.25	-0.96
RELIANCE	1,264.90	-0.96

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,939
ఎన్ఎస్ఈ	94,927
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,91,972
ఎఫ్ఐఐ	- 5,463
డీఐఐ	+ 3,712

ముడిచమురు... (బ్యారల్)



నైమెక్స్ లైట్ స్వీట్	74.56 (రాత్రి 11.30కు)	$ 75.44 (క్రితం ముగింపు)
బ్రెంట్	78.28 (రాత్రి 11.30కు)	$ 79.00 (క్రితం ముగింపు)

కొత్త ఉద్యోగానికి సై

- 2025లో వృత్తి నిపుణుల ఉద్యోగ వేట
- మెజారిటీ అభిప్రాయం ఇదే
- లింక్డెన్ ఇండియా అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ: వృత్తి నిపుణుల్లో ఎక్కువ మంది ఈ ఏడాది కొత్త ఉద్యోగం కోసం అన్వేషించనున్నారు. ఈ అన్వేషణ ఇంతకుముందెన్నడూ లేనంత కఠినంగా ఉండనున్నట్టు ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్ లింక్డెన్ ఇండియా నిర్వహించిన అధ్యయనంలో తెలిపింది. అర్హతలు ఉన్న నిపుణులను గుర్తించడం సవాలుగా 69 శాతం మంది హెచ్‌ఆర్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వచ్చిన దరఖాస్తుల పరిశీలన కోసం హెచ్‌ఆర్ నిపుణులు రోజులో 3-5 గంటల సమయాన్ని వెచ్చిస్తున్నారు. 49 శాతం మంది గతంలో కంటే ఎక్కువ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. అన్ని అర్హత ప్రమాణాలు సరితూగే దరఖాస్తుదారులు సగం కంటే తక్కువే ఉంటున్నట్టు 55 శాతం హెచ్‌ఆర్ నిపుణులు చెబుతున్నారు. ''ఉద్యోగ మార్కెట్ కఠినంగా మారుతోంది. ఉద్యోగాన్వేషణ మరింత ఆలోచనాత్మకంగా ఉండాలని ఇది సంకేతమిస్తోంది. మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించడం ద్వారా సవాళ్లతో కూడిన ఉద్యోగ మార్కెట్‌లోనూ కొత్త అవకాశాలను సొంతం చేసుకోవడమే కాకుండా, కెరీర్‌లో మంచి వృద్ధిని చూడొచ్చు''అని లింక్డెన్ ఇండియా సీనియర్ మేనేజింగ్ ఎడిటర్, కెరీర్ ఎక్స్‌పర్ట్ నిరజిత బెనర్జీ అన్నారు. గతేడాది నవంబర్ 27 నుంచి, డిసెంబర్ 16 మధ్య ఈ అధ్యయనం జరిగింది. ఇందులో 22,010 మంది నిపుణులు పాల్గొన్నారు. భారత్‌తోపాటు, స్పెయిన్, ఐర్లాండ్, బ్రెజిల్, యూఎస్, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, యూఏఈ, ఆస్ట్రేలియా, జపాన్, స్వీడన్, సింగపూర్, నెదర్లాండ్స్ తదితర దేశాల్లో అధ్యయనం కొనసాగింది.

ఈ ఉద్యోగాల్లో వృద్ధి ఎక్కువ..

ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్, రోబోటిక్స్ టెక్నీషియన్, క్లోజింగ్ మేనేజర్ ఈ ఏడాది భారత్‌లో ఎక్కువ వృద్ధి చెందే ఉద్యోగాలుగా లింక్డెన్ తెలిపింది. భారత్‌లో ప్రతి ఐదుగురు వృత్తి నిపుణుల్లో ముగ్గురు కొత్త రంగంలో, కొత్త విభాగంలో ఉద్యోగానికి సంసిద్ధంగా ఉండగా.. కొత్త అవకాశాలను సొంతం చేసుకునేందుకు వీలుగా నైపుణ్యాలను నేర్చుకోనున్నట్టు 39 శాతం మంది చెప్పారు. భవిష్యత్తులో ప్రతి ఉద్యోగానికి సంబంధించిన విలువను కృత్రిమ మేథ (ఏఐ) పెంచనున్నట్టు ఈ అధ్యయనం తెలిపింది. మహిళలు మరిన్ని ఉద్యోగ పాత్రల్లోకి అడుగుపెట్టనున్నట్టు పేర్కొంది.



నవంబర్‌లో పెరిగిన ఉపాధి

ఈపీఎఫ్ఓ సభ్యత్వంలో 4.88 శాతం పెరుగుదల



ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్ఓ)లో సభ్యత్వం నవంబర్‌లో 4.88 శాతం (2023 నవంబర్‌తో పోల్చి) పెరిగింది. ఉపాధి పెరుగుదలను సూచిస్తూ సమీక్షా నెల్లో ఈపీఎఫ్ఓలో 14.63 లక్షల నికర సభ్యత్వం నమోదయినట్లు తాజా పేరోల్ గణాంకాలు పేర్కొన్నాయి. ఇక 2024 అక్టోబర్‌తో పోల్చితే నికర సభ్యత్వం నెలవారీగా 9.07 శాతం పెరగడం గమనార్హం. నవంబర్‌లో నికర మహిళా సభ్యుల చేరిక 3.13 లక్షలు. అక్టోబర్‌తో పోల్చితే ఇది 12.16 శాతం అధికం. వార్షిక పెరుగుదల 11.75 శాతం. నెలలో 20.86 శాతం నికర సభ్యుల చేరికతో మహారాష్ట్ర ముందుంది. మహారాష్ట్ర తర్వాత ఐదు శాతానికిపైగా సభ్యత్వ నమోదులతో కర్ణాటక, తమిళనాడు, హర్యానా, గుజరాత్, ఢిల్లీ, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌లు నిలిచాయి.

రియల్టీలో మహిళలకు ఉపాధి తక్కువే

- ఈ రంగంలో 7.1 కోట్ల మంది కార్మికులు
- ఇందులో మహిళలు 71 లక్షలే
- మ్యాక్స్ ఎస్టేట్స్ నివేదిక వెల్లడి



రియల్ ఎస్టేట్ రంగంలో ఉపాధి పరంగా మహిళలకు తగినన్న అవకాశాలు దక్కడం లేదని రియల్టీ సంస్థ మ్యాక్స్ ఎస్టేట్స్, ఇన్ టాండెమ్ గ్లోబల్ కన్సల్టింగ్‌తో కలసి నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. భారత రియల్ ఎస్టేట్ పరిశ్రమ 7.1 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తుంటే, అందులో మహిళలు 70 లక్షలుగానే (10 శాతం) ఉన్నట్టు తెలిపింది. ఈ రంగంలో సమానత్వం సాధనకు ఎంతో సమయం పడుతుందని పేర్కొంది. ''భారత రియల్ ఎస్టేట్ రంగం కూడలి వద్ద ఉంది. అసాధారణ వృద్ధికి సిద్ధంగానే ఉన్నా, సవాళ్ల కారణంగా పూర్తి సామర్థ్యాలను చూడలేకుంది. భారత జనాభాలో మహిళలు 48.5 శాతంగా ఉంటే, ఇందులో కేవలం 1.2 శాతం మందికే రియల్ ఎస్టేట్ రంగంలో ఉపాధి లభిస్తోంది''అని ఈ నివేదిక వెల్లడించింది. ఒకవైపు మహిళలకు తగినంత ప్రాతినిధ్యం లేకపోగా, మరోవైపు వారికి వేతన చెల్లింపుల్లో అసమానత్వం ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లలో ఒకటిగా పేర్కొంది. ''ఉపాధి కల్పనలో రియల్ ఎస్టేట్ రంగానికి గణనీయమైన పాత్ర ఉంది. అయినప్పటికీ మహిళలకు సమాన అవకాశాల కల్పన పరంగా ఎంతో దిగువన ఉంది. లింగ అసమానతను పరిష్కరించడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలను, ఉత్పాదకతను, ఆవిష్కరణలను, లాభదాయకతను గణనీయంగా పెంచొచ్చు''అని ఈ నివేదిక సూచించింది. బ్లూకాలర్, వైట్ కాలర్ మహిళా కార్మికుల సాధికారత పెంచేందుకు నైపుణ్య శిక్షణ అందించాలని పేర్కొంది. మరింత మంది మహిళలకు భాగస్వామ్యం కల్పించడం వల్ల ఈ రంగం ముఖచిత్రం మారిపోతుందని ఇన్‌టాండెమ్ గ్లోబల్ కన్సల్టింగ్ ఎండీ శర్మిష్ఠ ఘోష్ అభిప్రాయపడ్డారు.

డిసెంబర్‌లో నియామకాల జోరు

- 31 శాతం వృద్ధి నమోదు
- కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, తయారీలో సానుకూలం
- ఫౌండిట్ ఇన్‌సైట్స్ ట్రాకర్ నివేదిక వెల్లడి
- ఏఐ నైపుణ్యాలకు డిమాండ్



హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా నియామకాలు డిసెంబర్‌లో జోరందుకున్నాయి. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 31 శాతం పెరిగినట్టు ఫౌండిట్ ఇన్‌సైట్స్ ట్రాకర్ నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం గడిచిన ఆరు నెలల్లో నియామకాలు 12 శాతం పెరిగాయి. ఆన్‌లైన్ జాబ్ పోస్టింగ్‌ల ద్వారా ఈ వివరాలను ఫౌండిట్ వెల్లడించింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో డిసెంబర్ నెలలో నియామకాలు 36 శాతం పెరిగాయి.

- ✔ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, తయారీ, నిర్మాణం, ఇంజనీరింగ్ రంగాల్లో ఎక్కువ మందికి ఉపాధి లభించింది. 57 శాతం నుంచి 60 శాతం వరకు ఈ రంగాల్లో నియామకాలు డిసెంబర్‌లో పెరిగాయి.
- ✔ ఏఐ ఉద్యోగాలు గడిచిన రెండేళ్లలో 42 శాతం వృద్ధితో 2,53,000కు చేరాయి. పైథాన్, ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, డీప్ లెర్నింగ్, ఎస్‌క్యూఎల్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలకు ఎక్కువ డిమాండ్ నెలకొంది. టెన్సార్‌ఫ్లో, పైటార్చ్ తదితర ఏఐ ఫ్రేమ్‌వర్క్‌ల్లో నైపుణ్యాలున్న వారికి సైతం అధిక డిమాండ్ కనిపించింది.
- ✔ హెచ్‌ఆర్ అడ్మిన్ ఉద్యోగ నియామకాలు గత మూడు నెలల్లో 21 శాతం పెరిగాయి.
- ✔ మెడికల్ ఉద్యోగాలు సైతం 44 శాతం అధికంగా నమోదయ్యాయి. టెలీ మెడిసిన్, డయాగ్నోస్టిక్స్, నర్సింగ్, హెల్త్‌కేర్ అనలిస్ట్ తదితర హెల్త్‌టెక్ ఉద్యోగాలకు డిమాండ్ నెలకొంది.
- ✔ డిసెంబర్‌లో కోయింబత్తూరులో అత్యధికంగా 58 శాతం మేర నియామకాలు పెరిగాయి. బెంగళూరులో 41 శాతం, చెన్నైలో 37 శాతం చొప్పున అధిక నియామకాలు జరిగాయి. ముంబైలో 23 శాతం, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 33 శాతం చొప్పున అధిక నియామకాలు చోటుచేసుకున్నాయి.
- ✔ టైర్-2, 3 నగరాలు హెల్త్‌కేర్ కేంద్రాలకు నిలయాలుగా మారుతున్నాయి. వీటికి సంబంధించి నియామకాలు 30 శాతం పెరిగాయి.
- ✔ బెంగళూరులో 26 శాతం, పుణెలో 17 శాతం, ఢిల్లీలో 14 శాతం చొప్పున ఏఐ నియామకాలు వృద్ధి చెందాయి.

ఏఐ కీలకం..

''అన్ని రంగాల్లోనూ నియామకాలు పెరగడం ఉద్యోగ మార్కెట్ చురుకుదనాన్ని, బలాన్ని తెలియజేస్తోంది. ముఖ్యంగా గత రెండేళ్లలో ఏఐ ఉద్యోగాల్లో 42 శాతం పెరగడం గమనార్హం. 2025లోనూ ఏఐ ఉద్యోగ నియామకాల్లో 14 శాతం మేర వృద్ధి ఉండొచ్చు. ఏఐ ఇకపై ప్రస్తుత, భవిష్యత్ మానవ వనరులకు కీలకంగా కొనసాగుతుంది''అని ఫౌండిట్ సీఈవో వి.సురేష్ అన్నారు.

జడ్చర్లలో అక్షయకల్ప ప్రాసెసింగ్ ప్లాంటు

రూ. 20 కోట్లతో ఏర్పాటు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రసాయనరహిత, సేంద్రియ ఆహారానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో డెయిరీ ఉత్పత్తుల సంస్థ అక్షయకల్ప ఆర్గానిక్ హైదరాబాద్ మార్కెట్‌పై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని జడ్చర్లలో రూ. 20 కోట్లతో ప్రాసెసింగ్ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈవో శశికుమార్ తెలిపారు. ప్రాథమికంగా రోజుకు 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఈ ప్లాంటు ఆరేడు నెలల్లో అందుబాటులోకి రాగలదని ఆయన చెప్పారు. షాద్‌నగర్ ఫార్మ్‌లో ప్రస్తుతం 65 మంది రైతులతో కలిసి పని చేస్తుండగా, వచ్చే మూడేళ్లలో దీన్ని 380మందికి పెంచుకోనున్నట్లు, అక్కడ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని కూడా నెలకొల్పినట్లు వివరించారు. ఇప్పుడు మూడు క్లస్టర్లు ఉండగా పుణెలో మరొకటి ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు శశికుమార్ చెప్పారు. ఇప్పటివరకు సుమారు రూ. 250 కోట్ల పైగా నిధులు సమీకరించగా .. రూ. 200 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 285 కోట్ల ఆదాయం నమోదు చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ. 400 కోట్ల పైగా అంచనా వేస్తున్నట్లు వివరించారు.

మౌలిక వసతులకు భారీ నిధులు

- ఏటా రూ.15 లక్షల కోట్లు అవసరం
- కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



న్యూఢిల్లీ: వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు, అందరికీ సామాజిక భద్రత కోసం మౌలిక వసతులకు ఏటా రూ.15 లక్షల కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయింపులు అవసరమని కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. ఇలా 25 ఏళ్లపాటు నిధులు వెచ్చించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత కేటాయింపులు రూ.11.5 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. ఐఎస్ఎస్ఏ-ఈఎస్ఐసీ అంతర్జాతీయ సదస్సు సందర్భంగా మంత్రి ప్రసంగించారు. 2012లో మౌలిక వసతుల కోసం చేసిన బడ్జెట్ కేటాయింపులు రూ.1.2 లక్షల కోట్లుగానే ఉండేవని, 2014లో నరేంద్ర మోదీ సర్కారు రూ.2.4 లక్షల కోట్లకు పెంచినట్టు గుర్తు చేశారు. ''2024కు వచ్చే సరికి బడ్జెట్ కేటాయింపులు రూ.11.5 లక్షల కోట్లకు పెరిగాయి. దీన్ని రూ.15 లక్షల కోట్లకు తీసుకెళ్లాలి. వచ్చే 25 ఏళ్ల పాటు ఏటా రూ.15 లక్షల కోట్ల చొప్పున ఖర్చు చేస్తే భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది''అని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండడంతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతున్నట్టు అభిప్రాయపడ్డారు. ఫలితంగా కొత్త రంగాల్లో ఉద్యోగాల కల్పన ఇనుమడిస్తున్నట్టు చెప్పారు. ఈ కొత్త రంగాల్లో (క్విక్ కామర్స్ తదితర) కార్మికులకు సామాజిక భద్రతను ప్రభుత్వం కల్పించాల్సి ఉందన్నారు.

ఎన్‌సీఎల్ఏటీలో వాట్సాప్‌కి ఊరట



న్యూఢిల్లీ: నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో (ఎన్‌సీఎల్ఏటీ) వాట్సాప్‌కు ఊరట లభించింది. మాతృ సంస్థ మెటాతో వాట్సాప్ అయిదేళ్ల పాటు యూజర్ల డేటాను షేర్ చేసుకోరాదంటూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిషేధంపై ఎన్‌సీఎల్ఏటీ స్టే విధించింది. తదుపరి విచారణను మార్చి 17కు వాయిదా వేసింది. ప్రకటనల అవసరాలరీత్యా యూజర్ల డేటాను మెటాతో పాటు గ్రూప్ కంపెనీలకు అందించేలా 2021లో వాట్సాప్ గోప్యతా పాలసీని అప్‌డేట్ చేసింది. అయితే, ఇలాంటివి అనుచిత వ్యాపార విధానాల కిందికి వస్తాయంటూ నవంబర్‌లో సీసీఐ అయిదేళ్ల నిషేధంతో పాటు మెటాపై రూ. 213 కోట్ల జరిమానా విధించింది. దీన్ని సవాలు చేస్తూ మెటా, వాట్సాప్ సంస్థలు ఎన్‌సీఎల్ఏటీని ఆశ్రయించాయి.

బ్యాటరీ రంగంలో పెట్టుబడులు



న్యూఢిల్లీ: బ్యాటరీ, మొబిలిటీ స్టార్టప్ వ్యవస్థలో భారత్‌లో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులు ఏడాదిలో రావొచ్చని ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్ (ఐఈఎస్ఏ) అంచనా వేసింది. పెట్టుబడులు నూతన ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిని నడిపించడంతోపాటు ఈ స్టార్టప్‌లు తయారు చేసే ఉత్పత్తుల పురోగతికి దోహదం చేస్తుందని ఐఈఎస్ఏ తెలిపింది. అంతేగాక బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, సేఫ్టీ మేనేజ్‌మెంట్, విడిభాగాల తయారీ కంపెనీలకు కూడా ప్రయోజనం చేకూరుస్తుందని వివ రించింది. స్టార్టప్, ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ ద్వా రా అంకుర కంపెనీలను ప్రోత్సహించడానికి ఐఈఎస్ఏ చురుకుగా పని చేస్తోంది. ఇప్పటికే 400 స్టార్టప్‌లు, యూనిడో, ఐక్రియేట్, ఇండి యా యాక్సిలరేటర్, ఇతర ప్రముఖ సంస్థల తో చేతులు కలిపింది. స్టార్టప్‌లకు పెట్టుబడి మద్దతు, మార్గదర్శకత్వం, సాంకేతిక ధ్రువీకరణ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యానికి సాయపడుతోంది.

కోటక్ మహీంద్రా బ్యాంక్ చేతికి స్టాన్‌చార్ట్ రుణాలు



న్యూఢిల్లీ: స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఇండియా వ్యక్తిగత రుణాల పోర్ట్‌ఫోలియో కొనుగోలు ప్రక్రియ పూర్తయినట్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. ఇందుకు సంబంధించి నియంత్రణ సంస్థల నుంచి అనుమతులన్నీ లభించడంతో గురువారం నాడు ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించింది. స్టాన్‌చార్ట్ బ్యాంక్ వ్యక్తిగత రుణాల పోర్ట్‌ఫోలియో పరిమాణం రూ. 3,300 కోట్లుగా ఉంటుంది. ఈ డీల్‌ను గతేడాది అక్టోబర్‌లో ప్రకటించారు.

ఏఐకి కీలక మార్కెట్ భారత్

- ఆర్అండ్‌డీ కేంద్రాలపై మరింతగా పెట్టుబడులు
- శాంసంగ్ ప్రెసిడెంట్ టీఎం రోహ్



కాలిఫోర్నియా: కృత్రిమ మేథ (ఏఐ) విషయంలో భారత్ తమకు కీలక మార్కెట్‌గా ఉందని దక్షిణ కొరియా టెక్ దిగ్గజం శాంసంగ్ ప్రెసిడెంట్ టీఎం రోహ్ తెలిపారు. తమ లేటెస్ట్ స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఎస్25లో ఏఐ ఫీచర్లను పొందుపర్చడంలో బెంగళూరు, నోయిడాలోని పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కేంద్రాలు ముఖ్యపాత్ర పోషించినట్లు చెప్పారు. ఎస్25లోని గూగుల్ వాయిస్ అసిస్టెంట్ జెమినీ లైవ్ ఫీచర్‌లో కొరియన్, ఇంగ్లీష్ భాషలతో పాటు హిందీని కూడా చేర్చినట్లు పేర్కొన్నారు. త్వరలో మరిన్ని భాషలను కూడా చేర్చనున్నామని, ఈ ప్రక్రియలోను భారత ఆర్అండ్‌డీ కేంద్రాలు కీలకంగా వ్యవహరించనున్నాయని చెప్పారు. ఇవి ఇతర గెలాక్సీ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంపై కూడా పని చేస్తున్నట్లు రోహ్ వివరించారు. ఈ నేపథ్యంలో పరిశోధన కేంద్రాలపై మరింతగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఆయన వివరించారు. దక్షిణ కొరియా వెలుపల తమకు అతి పెద్ద ఆర్అండ్‌డీ కేంద్రాలు భారత్‌లోనే ఉన్నట్లు రోహ్ చెప్పారు. పరిశ్రమ ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ల నుంచి ఏఐ ఫోన్ల వైపు మళ్లుతోందన్నారు. ఎస్25 మోడల్స్‌కి శాటిలైట్ కనెక్టివిటీ ఫీచర్‌ను జోడించేందుకు కొన్ని దేశాల్లోని టెలికం సంస్థలతో కలిసి పని చేస్తున్నట్లు వివరించారు.

క్యూ3 ఫలితాలు

హెచ్‌పీసీఎల్ లాభం 3 రెట్లు ప్లస్

రూ. 2,544 కోట్లు




న్యూఢిల్లీ: చమురు రంగ పీఎస్‌యూ దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం మూడు రెట్లు ఎగసి రూ. 2,544 కోట్లకు చేరింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 713 కోట్లు ఆర్జించింది. ఈ ఏడాది క్యూ2(జులై-సెప్టెంబర్)లో సాధించిన రూ. 143 కోట్లతో పోల్చినా లాభాలు భారీగా బలపడ్డాయి. ఇంధన రిటైలింగ్ బిజినెస్ పన్నుకుముందు లాభం రూ. 981 కోట్ల నుంచి రూ. 4,566 కోట్లకు జంప్ చేసింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను యథాతథంగా కొనసాగించడం ఇందుకు తోడ్పాటునిచ్చింది. మరోవైపు దేశీ వంటగ్యాస్(ఎల్‌పీజీ) విక్రయాలలో రూ. 3,100 కోట్లమేర అండర్ రికవరీ(ఉత్పత్తికంటే తక్కువధరకు అమ్మడం)లను నమోదు చేసింది. తాజా సమీక్షా కాలంలో హెచ్‌పీసీఎల్ 6.47 మిలియన్ టన్నుల చమురును ప్రాసెస్ చేసింది. గతేడాది క్యూ3లో 5.34 ఎంటీ చమురును శుద్ధి చేసింది. అమ్మకాలు 11.36 ఎంటీ నుంచి 12.32 ఎంటీకి పెరిగాయి.

ఎన్ఎస్ఈలో హెచ్‌పీసీఎల్ షేరు 2.3 శాతం నష్టంతో రూ. 361 వద్ద ముగిసింది.

అదానీ ఎనర్జీ లాభం దూకుడు

క్యూ3లో రూ. 625 కోట్లు




న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ విద్యుత్ ప్రసార దిగ్గజం అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 80 శాతం దూసుకెళ్లి రూ. 625 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 348 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,824 కోట్ల నుంచి రూ. 6,000 కోట్లకు ఎగసింది. విద్యుత్ ప్రసార విభాగంలో రూ. 54,761 కోట్ల భారీ ఆర్డర్‌బుక్‌ను కలిగి ఉన్నట్లు కంపెనీ సీఈవో కందర్ప్ పటేల్ పేర్కొన్నారు. స్మార్ట్ మీటరింగ్‌లో రూ. 13,600 కోట్ల విలువైన ఆర్డర్లు పొందినట్లు వెల్లడించారు.

అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు ఎన్ఎస్ఈలో స్వల్ప లాభంతో రూ. 805 వద్ద ముగిసింది.

జీల్ లాభం హైజంప్

క్యూ3లో రూ. 164 కోట్లు



న్యూఢిల్లీ: మీడియా రంగ కంపెనీ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్(జీల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం మూడు రెట్లుపైగా దూసుకెళ్లి దాదాపు రూ. 164 కోట్లకు చేరింది. ప్రధానంగా నిర్వహణ వ్యయాలు తగ్గడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 59 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,027 కోట్ల నుంచి రూ. 941 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,931 కోట్ల నుంచి రూ. 1,735 కోట్లకు తగ్గాయి. వీటిలో నిర్వహణ వ్యయాలు రూ. 1,188 కోట్ల నుంచి రూ. 997 కోట్లకు వెనకడుగు వేశాయి.

జీల్ షేరు ఎన్ఎస్ఈలో 1.6 శాతం లాభంతో రూ. 120 వద్ద ముగిసింది.

సైయంట్ లాభం రూ. 122 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్, టెక్నాలజీ సేవల సంస్థ సైయంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 122 కోట్ల నికర లాభం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) ప్రకటించింది. గత క్యూ3లో ఇది రూ. 147 కోట్లుగా నమోదైంది. మరోవైపు, ఆదాయం రూ. 1,821 కోట్ల నుంచి రూ. 1,926 కోట్లకు చేరింది. కీలకమైన డీఈటీ (డిజిటల్, ఇంజినీరింగ్, టెక్నాలజీ) విభాగం ఆదాయం స్వల్పంగా 0.8 శాతం క్షీణించి రూ. 1,480 కోట్లకు పరిమితమైనట్లు కంపెనీ తెలిపింది. ఈడీ, సీఈవోగా కార్తికేయన్ నటరాజన్ తప్పుకున్నట్లు పేర్కొంది. పవర్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ ఉత్పత్తులు, ఎలక్ట్రిక్ వాహనాల్లో ముఖ్యమైన విడిభాగాల అభివృద్ధిలో తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ కృష్ణ బోదనపు తెలిపారు.

జడేజా మినహా...

రంజీ మ్యాచ్‌లో విఫలమైన ఇతర భారత క్రికెటర్లు

సింగిల్ డిజిట్‌కే పరిమితమైన రోహిత్, పంత్, యశస్వి, గిల్
120 పరుగులకు ముంబై... 55 పరుగులకు పంజాబ్ ఆలౌట్


గిల్


పంత్


జడేజా


రోహిత్

ముంబై: చాన్నాళ్ల తర్వాత రంజీ ట్రోఫీ బరిలోకి దిగిన భారత స్టార్ ఆటగాళ్లు ఆకట్టుకోలేకపోయారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్, శివమ్ దూబే, అజింక్య రహానే నిరాశ పరిచారు. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అటు బంతితో ఇటు బ్యాట్‌తో ఆకట్టుకోగా... ముంబై పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ అర్ధ సెంచరీతో రాణించాడు. ఆ్రస్టేలియాతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో పేలవ ఆటతీరుతో విమర్శలు ఎదుర్కొన్న రోహిత్ శర్మ... మరోసారి పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో పెవిలియన్ చేరి నిరాశ పరిచాడు. వచ్చే నెలలో జరగనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు రంజీ ట్రోఫీలో భారీగా పరుగులు చేసి ఆత్మవిశ్వాసం పెంచుకుంటాడనుకుంటే... అది సాధ్య పడలేదు. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా జమ్ముకశ్మీర్‌తో గురువారం ప్రారంభమైన పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 33.2 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (3), యశస్వి జైస్వాల్ (4)తో పాటు కెప్టెన్ రహానే (12), శ్రేయస్ అయ్యర్ (11), శివమ్ దూబే (0) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. దీంతో ముంబై జట్టు ఒక దశలో 47 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడగా... చివర్లో శార్దుల్ ఠాకూర్ (57 బంతుల్లో 51; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడి పరువు నిలబెట్టాడు. తనుశ్ కొటియాన్ (26) ఫర్వాలేదనిపించాడు. జమ్ము కశ్మీర్ బౌలర్లలో ఉమర్ నజీర్, యుద్వీర్ సింగ్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. ముఖ్యంగా నజీర్ తన పదునైన పేస్‌తో ముంబై బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. రోహిత్, రహానే, శివమ్ దూబేను అతడే అవుట్ చేశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన జమ్మూ కశ్మీర్ జట్టు ఆట ముగిసే సమయానికి 42 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. శుభమ్ ఖజూరియా (53; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆబిద్ ముస్తాక్ (44; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ముంబై బౌలర్లలో మోహిత్ అవస్థి 3, షమ్స్ ములానీ రెండు వికెట్లు తీశారు. చేతిలో 3 వికెట్లు ఉన్న జమ్ము కశ్మీర్ జట్టు ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 54 పరుగుల ఆధిక్యంలో ఉంది. కెప్టెన్ పారస్ డోగ్రా (19 బ్యాటింగ్), యుద్ధ్‌వీర్ సింగ్ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

జడేజా... 5 వికెట్లు, 38 పరుగులు

ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా ఢిల్లీ, సౌరాష్ట్ర మధ్య జరిగిన పోరులో రవీంద్ర జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకోగా... పంత్ తేలిపోయాడు. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 49.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. 10 బంతులు ఆడిన పంత్ ఒక పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు. యువ ఆటగాళ్లు ఆయుశ్ బదోనీ (60; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), యశ్ ధుల్ (44) రాణించారు. సౌరాష్ట్ర బౌలర్లలో జడేజా 5 వికెట్లతో అదరగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర గురువారం ఆట ముగిసే సమయానికి 38.5 ఓవర్లలో 5 వికెట్లనష్టానికి 163 పరుగులు చేసింది. హార్విక్ దేశాయ్ (93; 8 ఫోర్లు), రవీంద్ర జడేజా (38; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. గ్రూప్ 'సి'లో భాగంగా కర్ణాటకతో పోరులో పంజాబ్ జట్టు 29 ఓవర్లలో 55 పరుగులకే ఆలౌటైంది. యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ (4), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (6), రమణ్‌దీప్ సింగ్ (16) విఫలమయ్యారు. అనంతరం కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. రవిచంద్రన్ స్మరణ్ (83 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు.

సహజ సంచలనం

ప్రపంచ 134వ ర్యాంకర్‌పై విజయం



బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ100 మహిళల టోర్నమెంట్‌లో భారత రెండో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి సంచలనం సృష్టించింది. గురువారం జరిగిన సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 315వ ర్యాంకర్ సహజ 6–1, 3–6, 6–1తో ప్రపంచ 134వ ర్యాంకర్, నాలుగో సీడ్ మరియా తిమోఫీవా (రష్యా)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. రెండు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసి, తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ సారా బెజ్లెక్ (చెక్ రిపబ్లిక్)తో సహజ తలపడుతుంది. మరోవైపు భారత నంబర్‌వన్ అంకిత రైనా పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో అంకిత 1–6, 3–6తో తాత్యానా మరియా (జర్మనీ) చేతిలో ఓడిపోయింది.

షేక్ రషీద్ శతకం

శశికాంత్ అజేయ అర్ధ సెంచరీ ● ఆంధ్ర 245/7 ● పుదుచ్చేరితో రంజీ మ్యాచ్


షేక్ రషీద్

పుదుచ్చేరి: రైజింగ్ స్టార్ షేక్ రషీద్ (248 బంతుల్లో 105; 7 ఫోర్లు) బాధ్యతాయుత ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. జట్టు కష్టాల్లో ఉన్నపుడు సంయమనంతో ఆడి సెంచరీతో మెరిపించాడు. ఫలితంగా పుదుచ్చేరితో జరుగుతున్న గ్రూప్ 'బి' రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు మెరుగైన స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లకు 245 పరుగులు చేసింది. కెప్టెన్ హనుమ విహారి (6), రికీ భుయ్ (4), శ్రీకర్ భరత్ (19) విఫలమవడంతో ఆంధ్ర జట్టు 110 పరుగులకు 6 వికెట్లు కోల్పోగా... రషీద్ నింపాదిగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. శశికాంత్ (134 బంతుల్లో 57 బ్యాటింగ్; 8 ఫోర్లు)తో కలిసి రషీద్ ఏడో వికెట్‌కు 128 పరుగులు జోడించడంతో ఆంధ్ర జట్టు కోలుకోగలిగింది. రషీద్, శశికాంత్ ఏమాత్రం తొందరపాటుకు పోకుండా ఆచితూచి ఆడారు. అభిషేక్ రెడ్డి (15), కరణ్ షిండే (25), విజయ్ (1) కూడా విఫలమయ్యారు. పుదుచ్చేరి బౌలర్లలో అంకిత్ శర్మ, అబిన్ మాథ్యూ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. శశికాంత్‌తో పాటు పృథ్వీ రాజ్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

స్కోరు వివరాలు

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: అభిషేక్ రెడ్డి (సి) జయ్ పాండే (బి) సాగర్ 15; షేక్ రషీద్ (సి) జయ్ పాండే (బి) అబిన్ మాథ్యూ 105; హనుమ విహారి (సి) జయ్ పాండే (బి) అబిన్ మాథ్యూ 6; కరణ్ షిండే (సి) అరుణ్ కార్తీక్ (బి) అంకిత్ శర్మ 25; రికీ భుయ్ (సి) జయ్ పాండే (బి) అబిన్ మాథ్యూ 4; శ్రీకర్ భరత్ (బి) అంకిత్ శర్మ 19; విజయ్ (స్టంప్డ్) అరుణ్ కార్తీక్ (బి) అంకిత్ శర్మ 1; శశికాంత్ (బ్యాటింగ్) 57; పృథ్వీ రాజ్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (90 ఓవర్లలో 7 వికెట్లకు) 245. వికెట్ల పతనం**: 1–21, 2–28, 3–74, 4–87, 5–106, 6–110, 7–238, **బౌలింగ్:** గౌరవ్ యాదవ్ 16–2–61–0; అబిన్ మాథ్యూ 20–7–37–3; సాగర్ 27–6–52–1; అమన్ ఖాన్ 5–1–25–0; అంకిత్ శర్మ 20–2–58–3; ఆకాశ్ 2–0–6–0.


శశికాంత్

తన్మయ్ అజేయ సెంచరీ

- హైదరాబాద్ 291/2
- అభిరత్, రాహుల్ రాధేశ్ అర్ధ సెంచరీలు
- హిమాచల్ ప్రదేశ్‌తో రంజీ మ్యాచ్



సాక్షి, హైదరాబాద్: ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (272 బంతుల్లో 137 బ్యాటింగ్; 14 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. దాంతో హిమాచల్ ప్రదేశ్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా హిమాచల్‌తో గురువారం ఉప్పల్ స్టేడియంలో ప్రారంభమైన పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 291 పరుగులు చేసింది. మరో ఓపెనర్ అభిరత్ రెడ్డి (132 బంతుల్లో 73; 7 ఫోర్లు, 1 సిక్స్), వికెట్ కీపర్ రాహుల్ రాధేశ్ (111 బంతుల్లో 52; 7 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. తొలి వికెట్‌కు అభిరత్‌తో కలిసి 147 పరుగులు జోడించిన తన్మయ్... రెండో వికెట్‌కు రాహుల్ రాధేశ్‌తో కలిసి 111 పరుగులు జత చేశాడు. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న ఉప్పల్ పిచ్‌పై తన్మయ్ స్వేచ్ఛగా ఆడటంతో హైదరాబాద్ జట్టు భారీ స్కోరుపై కన్నేసింది. తిలక్ వర్మ జాతీయ జట్టు తరఫున ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ ఆడుతుండటంతో... ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుకు ఆల్‌రౌండర్ చామా మిలింద్ సారథ్యం వహిస్తున్నాడు. హిమాచల్ బౌలర్లలో ఆకాశ్ వశిష్ట్, అపూర్వ్ వాలియా చెరో వికెట్ పడగొట్టారు. తన్మయ్‌తో పాటు ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న వరుణ్ గౌడ్ (26 బంతుల్లో 21 బ్యాటింగ్; 4 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (బ్యాటింగ్) 137; అభిరత్ రెడ్డి (బి) ఆకాశ్ వశిష్ట్ 73; రాహుల్ రాధేశ్ (సి) మహాజన్ (బి) అపూర్వ 52; వరుణ్ గౌడ్ (బ్యాటింగ్) 21; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (90 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి) 291. వికెట్ల పతనం:** 1–147, 2–258; **బౌలింగ్:** వైభవ్ అరోరా 16–0–60–0; రిషి ధావన్ 5–2–9–0; మయాంక్ డాగర్ 16–2–39–0; దివేశ్ శర్మ 18–3–59–0; ముకుల్ నేగి 17–3–40–0; ఆకాశ్ వశిష్ట్ 11–0–35–1; అపూర్వ్ వాలియా7–0–44–1.

జంషెడ్‌పూర్‌పై హైదరాబాద్ గెలుపు

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు తొమ్మిది మ్యాచ్‌ల అనంతరం గెలుపు రుచి చూసింది. లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు 3–2 గోల్స్ తేడాతో జంషెడ్‌పూర్ ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. హైదరాబాద్ తరఫున మొహమ్మద్ రఫీ (12వ నిమిషంలో), జోసెఫ్ సన్నీ (69వ ని.లో), ఆంద్రియా అల్బా (74వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. జంషెడ్‌పూర్ తరఫున జవీ హెమన్‌డెజ్ (24వ, 28వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో చెలరేగాడు. తొలి అర్ధ భాగంలో వెనుకబడిన హైదరాబాద్... ద్వితీయార్ధంలో రెండు గోల్స్ చేసి విజయం సాధించింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 54 శాతం బంతిని తమ నియంత్రణలో పెట్టుకోవడంతో పాటు 14 షాట్లు ఆడింది. వీటిలో 4 ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై సంధించగా... వాటిలో మూడు గోల్స్‌గా మలచగలిగింది. తాజా సీజన్‌లో 17 మ్యాచ్‌లాడిన హైదరాబాద్ 3 విజయాలు, 10 పరాజయాలు, 4 'డ్రా'లతో 13 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 12వ స్థానంలో ఉంది. మరోవైపు 16 మ్యాచ్‌లాడిన జంషెడ్‌పూర్ 9 విజయాలు, 6 పరాజయాలు, ఒక 'డ్రా'తో 28 పాయింట్లు సాధించి పట్టిక నాలుగో స్థానంలో ఉంది.

14,505 బంతులతో...



'గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో ముంబై క్రికెట్ సంఘం

ముంబై: సాధారణంగా క్రికెట్‌లో భారీ స్కోర్లు, భాగస్వామ్యాలు, పరుగులు, శతకాల మోత, వికెట్ల కూతతో అంతర్జాతీయ రికార్డులు నమోదు కావడం సహజం. కానీ వీటన్నింటికి భిన్నంగా ఆట (మ్యాచ్)తో సంబంధం లేకుండా ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) విన్యూత్నమైన రికార్డులోకి ఎక్కడం... అది కూడా ప్రపంచ రికార్డులకే జేజమ్మలాంటి 'గిన్నిస్ బుక్'లో ఎక్కితే పెద్ద విశేషం కదా! ఇక అసలు సంగతికి వచ్చేద్దాం... ఎంసీఏకు చెందిన వాంఖెడే స్టేడియంలో అత్యధిక బంతులతో 50 వసంతాలకు సంబంధించిన ఆంగ్ల అక్షర తోరణాన్ని వేదికపై పరిచింది. రెడ్ (ఎరుపు టెస్టులకు వాడే బంతి), వైట్ (తెలుపు వన్డే, టి20లకు వాడే బంతి) ఈ రెండు కలిపి మొత్తం 14, 505 బంతులతో 'ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ వాంఖెడే స్టేడియం' అని గోల్డెన్ జూబ్లీకి సంబంధించిన అక్షరమాలను రాశారు. గావస్కర్, సచిన్‌లాంటి ఎందరో దిగ్గజాలకు పుట్టిల్లు (సొంతగడ్డ)లాంటి వేదిక 50 వసంతాల వేడుకకు ముస్తాబైంది. ఇక్కడ 1975వ ఏడాది జనవరి 23 నుంచి 29 వరకు తొలి మ్యాచ్ జరిగింది. గురువారం (2025, జనవరి 23)తో 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎంసీఏ సిబ్బంది వేల సంఖ్యలో ఎరుపు, తెలుపు క్రికెట్ బంతులతో వాంఖెడే మైదానాన్ని తీర్చిదిద్దింది. ఈ వేదికపైనే 2011లో ధోని సారథ్యంలో టీమిండియా రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను గెలిచింది. తొలి ప్రపంచకప్‌ను కపిల్ సేన 1983లో లార్డ్స్ (ఇంగ్లండ్)లో నెగ్గింది. అత్యధిక బంతుల వినియోగంతో తాజాగా 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో ఎక్కడంపై ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ హర్షం వ్యక్తం చేశారు. భారత్ టి20ల్లో కూడా రెండు ప్రపంచకప్‌లను గెలుచుకుంది. సఫారీలో 2007లో మొదలైన ఆరంభ టి20 ప్రపంచకప్‌ను ధోని నేతృత్వంలో గెలిస్తే... గతేడాది కరీబియన్‌లో జరిగిన టి20 ప్రపంచకప్‌ను రోహిత్ శర్మ బృందం నెగ్గుకొచ్చింది.

నేను డోపీని కాదు

భారత షట్లర్ కృష్ణ ప్రసాద్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: తెలుగు షట్లర్ గరగ కృష్ణప్రసాద్ డోపీగా తేలడంతో నాలుగేళ్ల నిషేధానికి గురయ్యాడు. అయితే తను మాత్రం డోపీని కానే కాదని, తన ఒంట్లో ఎలాంటి నిషేధిత ఉత్ప్రేరకాలకు చోటే లేదని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. 2022లో థామస్ కప్‌లో టైటిల్ గెలిచిన భారత జట్టులో కృష్ణ ప్రసాద్ సభ్యుడిగా ఉన్నాడు. అతను సాయిప్రతీక్‌తో జోడీగా పురుషుల డబుల్స్‌లో పోటీపడ్డాడు. అయితే గతేడాది అతని రక్త,మూత్ర నమూనాలను పరిశీలించగా అందులో నిషిద్ధ ఉత్ప్రేరకం ×హ్యూమన్ క్రొనిక్ గొనడొట్రొపిన్ (హెచ్‌సీజీ) ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాజాగా అతనిపై నాలుగేళ్ల నిషేధం విధించింది. నిజానికి గత సెప్టెంబర్‌లోనే 'నాడా' చర్యలు తీసుకోవాల్సి ఉండగా... తెలుగు షట్లర్ అప్పీలుకు వెళ్లాడు. ఇటీవలే అప్పీలును తిరస్కరించడంతో కృష్ణ ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. 2019లో జరిగిన దక్షిణాసియా క్రీడల్లో కృష్ణ ప్రసాద్ డబుల్స్ టైటిల్ సాధించాడు. అతనితో పాటు శ్వేతపర్ణ పండాపై కూడా ×నాడా৷ వేటు పడింది. కోవిడ్ సమయంలో వాడిన దగ్గు టానిక్‌లో నిషిద్ధ ఉత్ప్రేరకాలు ఉండటంతో అప్పట్లో కూడా ఇలాంటి ఆరోపణల్నే కృష్ణ ప్రసాద్ ఎదుర్కొన్నాడు. అయితే నేరుగా కావాలని తీసుకోకపోవడంతో అప్పుడు తేలిగ్గానే బయటపడ్డాడు. ఈసారి మాత్రం నిషేధానికి గురయ్యాడు. 'నాపై విధించిన నిషేధంపై భారత బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు హిమంత బిశ్వ శర్మ సార్‌ను సంప్రదించాలని అనుకుంటున్నాను. ఈ కేసు, సమస్యపై ఆయనకే వివరిస్తాను' అని కృష్ణప్రసాద్ అన్నాడు. సాధారణంగా హార్మోన్ల సమతూకం లోపించినపుడు కూడా హెచ్‌సీజీ నివేదికలో తేడాలొస్తాయని అతను వాదిస్తున్నాడు. మరోవైపు శ్వేతపర్ణ తన సస్పెన్షన్‌పై స్పందించేందుకు తిరస్కరించింది. ఆమె సోదరి రుతుపర్ణ కూడా షట్లరే! ఇద్దరు ఇంటా బయటా జరిగిన పలు టోర్నీల్లో రాణించారు.

జాతీయ స్కూల్ చెస్ విజేత సంహిత



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి సంహిత పుంగవనం విజేతగా నిలిచింది. కాకినాడలోని పెద్దాపురంలో జరిగిన ఈ టోర్నీలో సంహిత అండర్–11 బాలికల విభాగంలో చాంపియన్‌గా అవతరించి స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత సంహిత, రిషిత (ఆంధ్రప్రదేశ్) 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా సంహితకు టైటిల్ దక్కగా... రిషిత రన్నరప్‌గా నిలిచింది. ఏడు గేముల్లో నెగ్గిన సంహిత... ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయింది. అండర్–11 బాలుర విభాగంలో తెలంగాణకే చెందిన శ్యామల్ నిధిశ్ (7.5 పాయింట్లు) రన్నరప్‌గా నిలిచాడు. అండర్–7 బాలుర విభాగంలో తెలంగాణకు చెందిన శ్రేయాంశ్ (7.5 పాయింట్లు) రజతం సాధించగా... ఓం ఈశ్ (7 పాయింట్లు) కాంస్యం కైవసం చేసుకున్నాడు. అండర్–9 బాలికల విభాగంలో అరవ విశ్వాణి (ఆంధ్రప్రదేశ్; 7 పాయింట్లు) రజతం సాధించింది. అండర్–9 బాలుర విభాగంలో తెలంగాణకు చెందిన తిప్పర్తి శ్రేయాన్ (8.5 పాయింట్లు) చాంపియన్‌గా నిలువగా...తిమ్మరాజు వెంకట సాత్విక్ (7.5 పాయింట్లు) కాంస్యం గెలిచాడు. అండర్–13 బాలికల విభాగంలో తెలంగాణకు చెందిన మోదిపల్లి దీక్షిత (8 పాయింట్లు) స్వర్ణ పతకం నెగ్గగా, వి.త్రిపురాంబిక (ఆంధ్రప్రదేశ్; 7.5 పాయింట్లు) రజతం సొంతం చేసుకుంది. అండర్–13 బాలుర విభాగంలో సామ్యూల్ స్టీఫెన్ నోబుల్ (ఆంధ్రప్రదేశ్; 8 పాయింట్లు) చాంపియన్‌గా నిలిచాడు. అండర్–15 బాలికల విభాగంలో గోర్లి నైనా (ఆంధ్రప్రదేశ్; 7 పాయింట్లు) రజతం... అండర్–17 బాలికల విభాగంలో చీదెళ్ల శర్వాణి (ఆంధ్రప్రదేశ్; 6.5 పాయింట్లు) రజతం... అండర్–17 బాలుర విభాగంలో జ్ఞాన సాయి సంతోష్ (ఆంధ్రప్రదేశ్; 7.5 పాయింట్లు) స్వర్ణం... మజ్జి రాంచరణ్ తేజ (ఆంధ్రప్రదేశ్; 6.5 పాయింట్లు) కాంస్యం గెలిచారు.



ఈ ఫొటో చూస్తే రిపబ్లిక్ డే పరేడ్ ముందుగానే జరిగినట్లనిపిస్తుంది కదూ..! 75 ఏళ్ల రాజ్యాంగాన్ని స్ఫురింపజేస్తూ గురువారం కర్తవ్యపథ్‌లో జరిగిన గణతంత్ర పరేడ్ ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ సందర్భంగా తీసిందీ చిత్రం



జమ్మూకశ్మీర్‌లో ప్రమాదంలో ఉన్న వృక్ష జాతుల్ని పరిరక్షించేందుకు 'డిజిటల్ ట్రీ ఆధార్'ను ప్రభుత్వం అమలు చేస్తోంది. గురువారం అటవీ సిబ్బంది చినార్‌లోని చెట్టుకు ఇలా క్యూఆర్ కోడ్ ఉన్న ఫలకాన్ని తగిలించారు.



దట్టంగా మంచు కురుస్తున్న వేళ జనం సంచరిస్తున్న ఈ ప్రాంతం స్విట్జర్లాండ్‌లోనిది. దావోస్ నగరంలోని ప్రపంచ ఆర్థిక సదస్సు జరిగే వేదికైన కాంగ్రెస్ సెంటర్ వెలుపల గురువారం కనిపించిందిలా

బడికి పంపాలన్నా భయపడుతున్నారు

బహిష్కరణ ప్రకటన నేపథ్యంలో అమెరికాలో అక్రమ వలసదారుల్లో పెరిగిన ఆందోళన • చర్చిలు, పాఠశాలలనూ క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్న హోమ్‌ల్యాండ్ అధికారులు

శాన్‌ఫ్రాన్సిస్కో: అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన వలసదారులపై ఉక్కుపాదం మోపుతానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో అక్రమవలసదారుల్లో భయందోళనలు ఎక్కువయ్యాయి. తమ పిల్లలను బడికి పంపడానికి కూడా అక్రమ వలసదారుల కుటుంబాలు భయపడుతున్నాయి. పాఠశాలలు పిల్లలకు సురక్షితమైన ప్రదేశాలు అని అక్కడి విద్యావేత్తలు వలస తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అయితే ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ ఏజెన్సీ అధికారులు పాఠశాలలు, చర్చిలు, ఆసుపత్రులనూ క్షుణ్ణంగా తనిఖీచేసి అక్రమవలసదారులుంటే అక్కడే అరెస్ట్‌చేసే అధికారం ఇస్తామని ట్రంప్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన నేపథ్యంలో వీరిలో ఆందోళనలు మరింత పెరిగాయి. సున్నితమైన ప్రదేశాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టరాదన్న మార్గదర్శకాలను అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న చర్యలు తుడిచిపెట్టేశాయి. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు నేరగాళ్లు ఇకపై అమెరికాలోని పాఠశాలలు, చర్చిల్లో తలదాచుకోలేరని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఒక ప్రకటనలో తెలిపింది. తాజా విధానం ప్రకారం.. ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఏజెన్సీలు పాఠశాలల్లోకి ప్రవేశించొచ్చు. మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ గణాంకాల ప్రకారం 7,33,000 మంది పాఠశాల వయస్సు పిల్లలు అమెరికాలో అక్రమంగా ఉన్నారు. ఇన్నాళ్లూ జన్మతః పౌరసత్వం నిబంధనతో వీరిలో చాలా మందికి అమెరికా పౌరసత్వం ఉన్నప్పటికీ వీళ్ల తల్లిదండ్రులకు పౌరసత్వం లేదు. తల్లిదండ్రులు చట్టవిరుద్ధంగా అమెరికాకు వచ్చి స్థిరపడ్డారు. ఇలాంటి లక్షలాది మందిని బహిష్కరిస్తామని ట్రంప్ ప్రకటించారు. అనేక వలస కుటుంబాలు బహిరంగంగా తిరిగేందుకు భయపడుతున్నాయి. పిల్లల్ని స్కూళ్లకు పంపించకపోవడంతో విద్యార్థుల హాజరుపై ప్రభావం చూపుతుందంటున్నారు విద్యావేత్తలు.

తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్న పాఠశాలలు

కొన్ని రాష్ట్రాలు, జిల్లాల్లోని విద్యాశాఖాధికారులు అక్రమవలసదారుల పిల్లలకు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కాలిఫోర్నియాలో ఇమ్మిగ్రేషన్ చట్టాన్ని అమలు చేయడంలో పాఠశాలలు ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సహాయం చేయవని చికాగో పబ్లిక్ స్కూల్స్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నవంబర్‌లో తీర్మానాన్ని ఆమోదించింది. క్రిమినల్ వారెంట్ లేకుండా అధికారులను పాఠశాలల్లోకి అడుగుపెట్టనివ్వమని స్పష్టం చేసింది. విద్యార్థి ఇమ్మిగ్రేషన్ స్థితిపై సమాచారం సేకరించకూడదనే విధానాలను గత నెలలో న్యూయార్క్ నగర ప్రధానోపాధ్యాయులకు గుర్తు చేసింది. అయితే కొన్ని చోట్లా కుటుంబాలకు ఇలాంటి భరోసా దక్కట్లేదు. ట్రంప్ చర్యతో విద్యార్థులు, కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయని జార్జియా రెఫ్యూజీస్ అకాడమీ చార్టర్ స్కూల్ అధ్యాపకులు చెప్పారు. చాలా మంది విద్యార్థులు పాఠశాలకు దూరమవుతారని భావించి, వారు ముఖ్యమైన పరీక్షలను కోల్పోకుండా ఉండటానికి పరీక్ష షెడ్యూల్‌ను ముందుకు జరిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి పరిమితం చేస్తున్నారని అమెరికా సెంటర్ ఫర్ ఇమ్మిగ్రెంట్ రైట్స్ అధికారి మైఖేల్ ల్యూకెన్స్ తెలిపారు. వలసదారులు తమంతట తాముగా అమెరికాను వీడేలా ప్రభుత్వం భయపెడుతోందని ఆయన ఆరోపించారు.

కంటి మీద కునుకు లేదు

''ఇప్పుడు మా పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 14 ఏళ్ల క్రితం గ్వాటెమాల నుంచి వచ్చి బోస్టన్‌లో ఉంటున్నాం. మా పిల్లలు బోస్టన్ స్కూళ్లలో చదువుతున్నారు. అక్రమవలసదారులని ముద్రవేసి ఇప్పుడు మమ్మల్ని పనిచేసుకోనివ్వకపోతే ఏం చేయాలి. న్యాయం కోసం కోర్టుకెళ్లలేను. లైసెన్స్ ఉన్నాసరే కారులో బయటకు కూడా వెళ్లలేని పరిస్థితి. తలచుకుంటే నిద్రకూడా పట్టట్లేదు. చట్టబద్ధత రుజువు కోసం స్కూళ్లో మా పిల్లలను అధికారులను నిలదీస్తే ఏం చేయాలో పాలుపోవట్లేదు''అని ఐరిస్ గొంజాలెజ్ అని మహిళ వాపోయారు.

ఇలా చేస్తారని ఊహించలేదు : కార్మెన్

''వాళ్లు ఇలా చేస్తారని నేను ఊహించలేదు''అని మెక్సికో నుంచి వలస వచ్చిన కార్మెన్ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తంచేశారు. ''శాన్‌ఫ్రాన్సిస్కో బే పాఠశాలకు నా ఇద్దరు మనవరాళ్లను ఇప్పుడెలా తీసుకెళ్లాలి?. అండగా ఉంటామని పాఠశాల హామీ ఇచ్చింది. అయినా భయంగానే ఉంది. తరిమేస్తే సొంతదేశం అస్సలు వెళ్లలేం. డ్రగ్స్ ముఠాలు రాజ్యమేల మెక్సికోలోని మిచోకాన్ రాష్ట్రం నుంచి వచ్చాం. రెండేళ్ల క్రితం అక్కడ మా అల్లుడిని కిడ్నాప్ చేశారు. బెదిరింపులు పెరగడంతో అమెరికాకు వలసవచ్చాం. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉండటానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఇక్కడ ఉండలేం. ఎక్కడికీ వెళ్లలేం. దేవుడా మా ప్రాణాల్ని, మా పిల్లల్ని కాపాడు''అని ఆమె ఏడుస్తూ చెప్పారు. ఇలా పేద అక్రమవలసదారుల వ్యథలు ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా వినపడుతున్నాయి.

చందమామపై చైనా జెండా రెపరెపలు!

బీజింగ్: అంతరిక్ష ప్రయోగాల్లో డ్రాగన్ దేశం చైనా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'తో పోటీ పడుతోంది. 1961లో నాసా ప్రయోగించిన అపోలో వ్యోమనౌక ఒక జెండాను కూడా మోసుకెళ్లింది. అమెరికా వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్ ఈ జెండాను చంద్రుడి ఉపరితలంపై నాటారు. జెండా రెపరెపలాడుతున్న ఫొటోలు బయటకు వచ్చాయి. ఎలాంటి వాతావరణం లేని చందమామపై జెండా ఎగరడం ఎలా సాధ్యమని చాలామంది అప్పట్లో ప్రశ్నించారు. ఇప్పటికీ ఆ అనుమానాలు ఉన్నాయి. అమెరికా జెండా గురించి నమ్మినవాళ్లు ఎందమంది ఉంటారో నమ్మనివాళ్లు కూడా అంతేమంది ఉంటారు. ఇదిలా ఉండగా, చందమామపై తమ జెండాను రెపరెపలాడించాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వాడుకుంటోంది. 2026లో చాంగి-7 మిషన్‌ను చంద్రుడిపైకి పంపించబోతోంది. ఇది చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగుతుంది. అక్కడి నీటి జాడలపై అన్వేషణ సాగిస్తుంది. చాంగి-7 స్పేస్‌క్రాఫ్ట్‌లో ఒక జెండాను కూడా పంపించబోతున్నారు. వాతావరణం లేని చోట ఈ జెండా చక్కగా ఎగిరేలా చైనా సైంటిస్టులు డిజైన్ చేస్తున్నారు. ఇందుకోసం ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సాంకేతికతను వాడుతున్నారు. జెండా అంతర్భాగంలో క్లోజ్డ్-లూప్ వైర్లు అమర్చుతున్నారు. విద్యుత్ ప్రసారమైప్పుడు ఈ వైర్లు కదులుతాయి, అయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది. దాంతో జెండా రెపరెపలాడినట్లుగా కనిపిస్తుంది. అంతరిక్ష ప్రయోగాలపై యువతలో ఆసక్తి పెంచడానికి ఈ వినూత్నమైన జెండాకు రూపకల్పన చేస్తున్నట్లు సైంటిస్టులు చెబుతున్నారు. చాంగి-7 స్పేస్‌క్రాఫ్ట్‌లో ఒక ఆర్బిటార్, ల్యాండర్, రోవర్, మినీ-ఫ్లైయింగ్ ప్రోబ్ ఉంటాయి.

అష్ట దిగ్బంధనంలో ఢిల్లీ

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డేగ కళ్లతో పహారా కాస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి నేరస్తులు, అనుమానిత వ్యక్తులు ప్రవేశించకుండా, అక్రమ మద్యం, మత్తు పదార్థాల రవాణాను అడ్డుకునేందుకు ఢిల్లీలోని 150 సరిహద్దులను మూసివేశారు. 162 ప్రాంతాలను దిగ్బంధించారు. 175 కంపెనీల ప్రత్యేక బలగాలను మోహరించారు. పారామిలటరీ దళాలతో పాటు ఢిల్లీ పోలీసులు 24గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఢిల్లీలోకి అనుమతిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ర్యాలీల విషయంలో ఆరోపణలకు తావులేకుండా 'ముందుగా వచ్చిన వారికి'ప్రాతిపదికన పోలీసులు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ర్యాలీలు, బహిరంగ సభల కోసం ఢిల్లీలోని 11 రెవెన్యూ జిల్లాల్లో ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన 11 మంది అసిస్టెంట్ కమిషనర్(ఏసీపీ) స్థాయి అధికారులను మోహరించినట్లు అధికారులు తెలిపారు.

ఇజ్రాయెల్ నౌక సిబ్బంది విడుదల

2023 నవంబర్ 19న నిర్బంధించిన హౌతీలు

సనా(యెమెన్): ఏడాదికి పైగా తమ నిర్బంధంలో ఉన్న ఇజ్రాయెల్ వ్యాపారికి చెందిన 'గెలాక్సీ లీడర్'వాణిజ్య నౌక సిబ్బందిని హౌతీ తిరుగుబాటుదారులు 14 నెలల తర్వాత ఎట్టకేలకు విడుదల చేశారు. ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా వీరిని విడుదల చేసి మస్కట్‌కు తరలించారు. గాజా స్ట్రిప్‌పై యుద్ధం ప్రారంభమైన కొన్ని వారాల తర్వాత, ఇరాన్ మద్దతు కలిగిన హౌతీలు హమాస్‌కు మద్దతుగా ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఈడెన్‌లో పశ్చిమదేశాలకు చెందిన వాణిజ్యనౌకలపై దాడులు చేస్తుండటం తెల్సిందే. ఈ క్రమంలో హెలికాప్టర్ ద్వారా వచ్చిన తిరుగుబాటుదారులు వాణిజ్య నౌక గెలాక్సీ లీడర్‌పై దాడి చేసి, అందులోని 25 మంది అంతర్జాతీయ సిబ్బందిని 2023 నవంబర్ 19న అదుపులోకి తీసుకున్నారు. ఇన్నాళ్లూ వారిని నిర్బంధించారు. గాజాకు సంఘీభావంగా గెలాక్సీ లీడర్ సిబ్బందిని విడుదల చేస్తున్నట్లు హౌతీ అత్యున్నత మండలి బుధవారం ప్రకటించింది. పాలస్తీనా భూభాగంలో ఆదివారం కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినందుకు సంతోషిస్తూ వీళ్లను వదిలేస్తున్నట్లు హౌతీ అత్యున్నత మండలి పేర్కొంది. బల్గేరియాకు చెందిన కెప్టెన్, ఫిలిప్పీన్స్‌కు చెందిన 17 మందితోపాటు ఉక్రేయిన్, రొమేనియా, మెక్సికో దేశాలకు చెందిన మరికొందరు నావికులతో కూడిన బందీలను యెమెన్ రాజధాని నగరం సనా నుంచి మస్కట్‌కు ఒమన్ వాయుసేన విమానంలో పంపినట్లు ఒమన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. తమ ఇద్దరు పౌరులను స్వదేశానికి తీసుకురావడానికి ప్రధాని రోసెన్ జెల్యాజ్కోవ్ ప్రభుత్వ విమానాన్ని పంపారని బల్గేరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. ''గెలాక్సీ లీడర్ సిబ్బందిని విడుదల చేయడం సంతోషకరం. 14 నెలలుగా బందీల కుటుంబాలు అనుభవించిన వేదనకు ముగింపు పలికారు''అని యెమెన్‌లో ఐక్యరాజ్య సమితి ప్రత్యేక రాయబారి హాన్స్ గ్రాండ్‌బర్గ్ అన్నారు. ''సిబ్బంది, వారి కుటుంబాలకే కాదు ఇది మనందరికీ చాలా ఉపశమనం కలిగించిన క్షణం''అని అంతర్జాతీయ మారిటైమ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఆర్సెనియో డొమింగెజ్ ఒక ప్రకటనలో తెలిపారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల్లో నావికులు పరోక్షంగా బాధితులుగా మారకూడదన్నారు. బహమాస్‌కు చెందిన బ్రిటిష్ యాజమాన్యంలోని గెలాక్సీ లీడర్‌ను జపాన్ సంస్థ నిర్వహిస్తోంది. దీనికి ఇజ్రాయెల్ వ్యాపారవేత్త అబ్రహాం 'రామి'ఉంగార్‌తో సంబంధాలున్నాయి.

సైఫ్‌పై దాడి నిజంగా జరిగిందా?

మహారాష్ట్ర మంత్రి ఆశ్చర్యం

పుణే: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై కత్తితో ఆగంతకుడు చేసిన దాడిపై మహారాష్ట్ర మంత్రి నితేశ్ రాణా ఆశ్చర్యం వ్యక్తం చేయడం వివాదం రేపుతోంది. సైఫ్ దాడి నిజంగానే జరిగిందా? లేక ఆయన నటిస్తున్నారా? అంటూ వ్యాఖ్యానించడంతోపాటు ఏ 'ఖాన్'పై దాడి అయినా ఎంతో మంది స్పందిస్తుంటారు, అదే హిందూ నటులపై ఇలాంటివి జరిగితే ఎవరూ మాట్లాడరెందుకని? అంటూ ఆయన పక్షపాత ధోరణితో మాట్లాడటం గమనార్హం. సైఫ్ ఆ ఘటన నుంచి వేగంగా కోలుకోవడంతో అసలా దాడి జరిగిందా? లేక నటనా అనే అనుమానాలు వస్తున్నాయన్నారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ చనిపోతే మాట్లాడని ప్రతిపక్ష నేతలు జితేంద్ర ఔహాద్, సుప్రియా సూలే.. సైఫ్‌పై దాడి జరిగిందంటూ ఆందోళన చెందారన్నారు. మంత్రి రాణే మాటలపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మతాన్ని, రాజకీయాలతో ముడిపెట్టి మాట్లాడటం సరికాదని పేర్కొంది. ప్రజల్ని సమస్యల నుంచి పక్కదోవ పట్టించేందుకే బీజేపీ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలె అన్నారు. రాజ్యసభ సభ్యుడు, శివసేన ఎంపీ సంజయ్ నిరుపమ్ కూడా సైఫ్‌పై దాడి ఘటన గురించి బుధవారం అనుమానం వ్యక్తం చేయడం గమనార్హం.

చాయ్‌వాలానే కొంపముంచాడు!

మంటలని అరవడంతో ప్రయాణికులు భయంతో దూకేశారు

- జల్గావ్ రైలు విషాదంపై డిప్యూటీ సీఎం అజిత్ పవార్
- ప్రమాదంలో చనిపోయింది 12 మంది: అధికారుల వెల్లడి

పుణే: రైలులో మంటలు వ్యాపించాయంటూ వచ్చిన పుకార్లే పుష్పక్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు ప్రమాదానికి గురవడానికి కారణమని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చెప్పారు. ప్యాంట్రీలో టీ విక్రయించే వ్యక్తి ఒకరు చెప్పిన మాటలను నిజమేననుకుని భయపడ్డ ప్రయాణికులు వేగంగా వెళ్తున్న రైలులోంచి దూకేసి, మరో రైలు కింద పడి ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. గురువారం ఆయన పుణేలో మీడియాతో మాట్లాడారు. 'ఓ కోచ్‌కు మంటలంటుకున్నాయంటూ టీ విక్రేత వేసిన కేకల్ని పక్క బోగీలో యూపీలోని శ్రావస్తికి చెందిన ఇద్దరు ప్రయాణికులు విని, మిగతా ప్రయాణికులకు తెలిపారు. జనరల్ బోగీతోపాటు ఇతర బోగీల్లోని జనం ఈ విషయం తెలిసి భయాందోళనలకు గురయ్యారు. బోగీకి రెండు వైపుల నుంచి కిందికి దూకేశారు. రైలు ఆగాక, హడావుడిగా కిందికి దిగి పక్క పట్టాలపైకి వెళ్లిన ప్రయాణికులు కొందరు కర్ణాటక ఎక్స్‌ప్రెస్ కింద ఛిద్రమయ్యారు. మంటలంటూ వచ్చిన వదంతులే ఈ ఘోరానికి దారి తీశాయి'అని పవార్ వివరించారు. క్షతగాత్రుల్లో వదంతులకు కారణమైన ఇద్దరు ప్రయాణికులు కూడా ఉన్నారని డిప్యూటీ సీఎం వెల్లడించారు.

మరణాలు పన్నెండు

జల్గావ్ ఘటనలో మొత్తం 12 మంది ప్రాణాలు కోల్పోయారని రైల్వే అధికారులు గురువారం వివరించారు. ప్రమాద స్థలిలో లభ్యమైన తల, మొండెం వేర్వేరు వ్యక్తులకు చెందినదిగా బుధవారం భావించి, 12 మంది చనిపోయినట్లు నిర్ధారించామన్నారు. అయితే, గురువారం మృతురాలి కుమారుడు వచ్చి, ఆ రెండు శరీర భాగాలు కూడా తన తల్లివేనని ధ్రువీకరించారన్నారు. దీంతో, గురువారం ఆస్పత్రిలో కన్నుమూసిన మరో క్షతగాత్రుడితో కలిపి జల్గావ్ ఘటనలో మొత్తం చనిపోయింది 12 మందేనని తెలిపారు. వీరందరినీ గుర్తించామన్నారు. మృతుల్లో ముంబైలో ఉంటున్న ఏడుగురు నేపాలీలున్నారన్నారు. క్షతగాత్రుల్లో స్వల్పంగా గాయపడిన ఐదుగురిని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి చేశారని తెలిపారు. మిగతా 10 మందిలో 9 మంది పచోరా ప్రభుత్వ ఆస్పత్రిలో, ఒకరు జల్గావ్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ప్రమాదం జరిగిన పుష్పక్ ఎక్స్‌ప్రెస్ గురువారం మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో గమ్య స్థానమైన ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌కు చేరుకుందని రైల్వే శాఖ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. అదేవిధంగా, పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఏ కోచ్‌లోనూ నిప్పురవ్వలు, పొగలు చెలరేగలేదనికూడా స్పష్టం చేశారు. కేవలం పుకార్లే ఘటనకు కారణమని తేలిందన్నారు. దర్యాప్తునకు సెంట్రల్ రైల్వే జోన్‌కు చెందిన ఐదుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు.

ఐదేళ్లలో నిరుద్యోగాన్ని రూపుమాపుతాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో వచ్చే ఐదేళ్లలో నిరుద్యోగమన్నదే లేకుండా చేస్తామని ఆప్ చీఫ్, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 'మన యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడమే మా ప్రధాన ధ్యేయం. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే మా బృందం ఒక సవివర ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేసింది'అని అందులో పేర్కొన్నారు. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం కేవలం రెండేళ్ల వ్యవధిలోని రాష్ట్రంలోని 48 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. మరో మూడు లక్షల మంది యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించిందని చెప్పారు. ఉద్యోగావకాశాలను సృష్టించడం ఎలాగో మాకు తెలుసు. ఈ విషయంలో మేం చిత్తశుద్ధితో కృషి చేస్తాం. ప్రజల సహకారంతో ఢిల్లీలో వచ్చే ఐదేళ్లలో నిరుద్యోగాన్ని రూపుమాపుతాం'అని కేజ్రీవాల్ ప్రకటించారు. అదేవిధంగా, ఢిల్లీలో విద్యుత్ కోతలున్నాయంటూ యూపీ సీఎం యోగి చేసిన వ్యాఖ్యలపై కేజ్రీవాల్ స్పందించారు. ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలోనే రోజంతా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్తరప్రదేశ్‌లో పదేళ్లుగా ఉన్న బీజేపీ ప్రభుత్వం రోజుకు ఎన్ని గంటలు కరెంటు కోత విధిస్తోందో చెప్పాలని సీఎం యోగిని డిమాండ్ చేశారు.

ఆప్ ఢిల్లీని చెత్తకుప్పగా మార్చేసింది: యోగి

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వం కనీస సదుపాయాల కల్పనను సైతం పట్టించుకోకుండా ఢిల్లీని చెత్తకుప్పలా మార్చేసిందని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మండిపడ్డారు. నగరంలోని ఓఖ్లా ప్రాంతంలో తిష్టవేసిన బంగ్లాదేశీలు, రోహింగ్యా అక్రమ వలసదారులకు అండగా నిలుస్తోందని ఆరోపించారు. గురువారం మొదటిసారిగా ఆయన కిరారీ ప్రాంతంలో జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. యమునా నదిని మురుగు కాల్వగా మార్చిన పాపం కేజ్రీవాల్‌దేనన్నారు. 'బుధవారం నా మంత్రివర్గ సహచరులతో కలిసి మహా కుంభమేళా జరిగే ప్రయాగ్‌రాజ్‌లోని సంగంలో పవిత్ర స్నానం చేశాను. ఢిల్లీలోని యమునలో కూడా కేజ్రీవాల్ మంత్రులతో కలిసి స్నానం చేయగలరా అని అడుగుతున్నా. నిజాయతీపరుడైతే కేజ్రీవాల్ నా ప్రశ్నకు బదులివ్వాలి'అని యోగి దుయ్యబట్టారు. ఢిల్లీలో గుంతల రోడ్లు, అపరిశుభ్రత, తాగు నీటి సమస్యలు, మురుగు పారుదల వ్యవస్థలో లోపాలకు ఆప్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఢిల్లీలో కంటే యూపీ పరిధిలోని నోయిడా-ఘజియాబాద్ రోడ్లే మెరుగ్గా ఉన్నాయని చెప్పారు. వినియోగదారుల నుంచి మూడు రెట్ల బిల్లులు వసూలు చేస్తున్న ఆప్ ప్రభుత్వం నిరంతరాయంగా కరెంటును అందించలేకపోతోందని విమర్శించారు.

బాల్ ఠాక్రేకి 'భారత రత్న' ప్రకటించాలి

శివసేన (యూబీటీ) డిమాండ్

ముంబై: శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రేకి భారత రత్న ప్రకటించాలని గురువారం శివసేన(యూబీటీ) డిమాండ్ చేసింది. బాల్ ఠాక్రే 99వ జయంతిని పురస్కరించుకుని ముంబైలో జరిగిన కార్యక్రమంల శివసేన 'యూబీటీ) నేత సంజయ్ రౌత్ మాట్లాడారు. 'బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను గత పదేళ్లలో కొందరు అర్హత లేని వారికి సైతం ప్రకటించింది. వాస్తవంగా దేశంలో హిందుత్వ బీజాలు నాటిన బాల్ ఠాక్రేకు తప్పనిసరిగా భారత రత్న ఇవ్వాలి. హిందూ హృదయ సమ్రాట్ అయిన బాల్ ఠాక్రేను ఈ పురస్కారంతో గౌరవించాలన్నది మా శివసేన(యూబీటీ) డిమాండ్'అని రౌత్ పేర్కొన్నారు. బాల్ ఠాక్రే శత జయంతికి ఇంకో ఏడాది మాత్రమే ఉందన్నారు. ఆ కార్యక్రమాలు ప్రారంభం కాకమునుపే దివంగత నేతకు భారత రత్న ప్రకటించాలని కోరారు. బాల్ ఠాక్రేకు భారత రత్న ఇస్తే హిందుత్వ వాది వీర సావర్కర్‌కు ఇచ్చినట్లేనన్నారు. ప్రత్యర్థి శివసేన(షిండే) నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేపైన ఆయన ఈ సందర్భంగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. షిండేను పేలని చైనా బాణాసంచాగా అభివర్ణించారు. 'అసలైన శివసేన బాంద్రాలోని ఠాక్రే నివాసం మాతోశ్రీలోనే ఉంది. అక్కడే ఉద్ధవ్ ఠాక్రే కుటుంబం ఉంటోంది. నకిలీ మందులు, దుస్తులు మార్కెట్‌లో చాలానే ఉన్నాయి. అటువంటివే చైనా క్రాకర్స్ కూడా. మెరుపులే తప్ప అవి పేలవు. అలాంటి ఉత్పత్తుల్ని బీజేపీ తెస్తోంది'అంటూ చురకలు అంటించారు.

షీలా దీక్షిత్ అభివృద్ధి నమూనా అవసరం

- ఢిల్లీ రాష్ట్రానికి మోదీ తప్పుడు ప్రచార అజెండా అక్కర్లేదు
- రాహుల్ గాంధీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్రాన్ని పాలించిన నాటి దివంగత మహిళా ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ అవలంభించిన వాస్తవిక అభివృద్ధి నమూనా ఇప్పుడు అత్యావశ్యకమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, ప్రధాని మోదీల తప్పుడు ప్రచార అజెండాలు అవసరం లేదని రాహుల్ అన్నారు. ఢిల్లీ సమస్యలపై రాహుల్ గురువారం ఫేస్‌బుక్‌లో ఒక వీడియోను షేర్‌చేశారు. కేజ్రీవాల్ పాలనలో ఢిల్లీ అధ్వాన్నంగా తయారైందంటూ వ్యాఖ్యలుచేశారు. ''ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలు, చెత్తాచెదారాలు, పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వాయు కాలుష్యం, అవినీతితో నేటి ఢిల్లీ వాస్తవదృశ్యం ఇప్పుడు ప్రజల ముందు కదలాడుతోంది. మోదీ, కేజ్రీవాల్‌ల అబద్ధపు ప్రచారాలకంటే షీలాదీక్షిత్ ఆచరించి చూపిన నిజమైన అభివృద్ధి నమూనా మళ్లీ ఇప్పుడు ఢిల్లీకి అవసరం''అని రాహుల్ అన్నారు. వాస్తవానికి ఢిల్లీ శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సదర్‌బజార్ నియోజకవర్గంలో బుధవారం రాహుల్ ప్రసంగించాల్సి ఉంది. ఢిల్లీలో కేజ్రీవాల్, దేశంలో మోదీ.. వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీలకు ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు, అభివృద్ధిలో వాటా దక్కకుండా చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. ఢిల్లీ రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న విపరీతమైన వాయు కాలుష్యం, అవినీతి, ద్రవ్యోల్బణాన్ని వదిలేసి మోదీలాగా కేజ్రీవాల్ తప్పుడు ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని రాహుల్ విమర్శించారు. ఢిల్లీ రాష్ట్రంలో గెలిస్తే కులగణన చేయిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. షీలాదీక్షిత్ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ సాధించిన ఘనతతో కేజ్రీవాల్‌గానీ మోదీగానీ సాటిరారని వ్యాఖ్యానించారు.

భారతదేశంలో నైపుణ్యమున్న ఉద్యోగుల కొరత

80 శాతం సంస్థల్లో ఇదే పరిస్థితి • మ్యాన్‌పవర్ గ్రూప్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: 2025 తొలి త్రైమాసికంలో ఉద్యోగాల భర్తీకి ఉద్యోగుల కొరత అడ్డంకిగా మారే అవకాశం ఉంది. మ్యాన్‌పవర్‌గ్రూప్ సంస్థ నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దేశంలోని సంస్థల్లో ఈ మేరకు నైపుణ్య సిబ్బంది కొరత ఉందనే వివరాలను తెల్సుకునేందుకు దేశవ్యాప్తంగా 3,000కు పైగా పరిశ్రమల్లో సంస్థ 'టాలెంట్ షార్టేజ్'సర్వేను చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల కంటే ఉద్యోగావకాశాలు 53 శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ఆ మేరకు నైపుణ్యమున్న ఉద్యోగులు భారత్‌లో లేరని సర్వేలో తేలింది. దేశంలోని 80 శాతం సంస్థలు తమ ఉద్యోగానికి సరైన నైపుణ్య అర్హత లున్న ఉద్యోగుల కోసం వెతుకుతున్నాయని సర్వేలో తేలింది. మెరుగైన అర్హతలున్న వ్యక్తులు లభించకపోవడంతో ప్రస్తుతమున్న ఉద్యోగులకే నైపుణ్యాలను మెరుగుపరిచే కార్యక్రమాలను 39 శాతం సంస్థలు చేపడుతున్నాయి. నియామక ఖర్చులను తగ్గిస్తున్నాయి.

మా కార్యాచరణ పూర్తయినట్లే: అమిత్ షా

అహ్మదాబాద్: తమ సైద్ధాంతికపరమైన కార్యాచరణ గత పదేళ్లలో దాదాపు పూర్తయ్యిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. పెండింగ్‌లు ఉన్న పనులన్నీ చాలావరకు పూర్తి చేశామని అన్నారు. కీలకమైన ఆర్టికల్ 370ని నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిందని, ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేశామని వివరించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం 'హిందూ ఆధ్యాత్మిక సేవ మేళా'లో అమిత్ షా ప్రసంగించారు.

మౌని అమావాస్యకు 10 కోట్ల మంది

యూపీ ప్రభుత్వం అంచనా

సాక్షి న్యూఢిల్లీ: మహాకుంభ మేళాలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గత 11 రోజుల్లో వచ్చిన భక్తుల 10 కోట్లు దాటింది. 29వ తేదీన మౌని అమావాస్య సందర్భంగా ఆ ఒక్క రోజే 10 కోట్ల మంది దాకా వస్తారని ఉత్తరప్రదేశ్ సర్కార్ అంచనా వేస్తోంది. రద్దీని దృష్టిలో పెట్టుకొని రైల్వే శాఖ దేశ నలుమూలల నుంచి 150 ప్రత్యేక రైళ్లను ప్రయాగ్‌రాజ్‌కు నడపనుంది. కాగా, 45 రోజుల పాటుసాగే ఈ మహా వేడుకకు 45 కోట్ల మందికి పైగా తరలివస్తారనే అంచనాలున్నాయి.

చంపేస్తామంటూ కపిల్ శర్మకు బెదిరింపు మెయిల్

ముంబై: చంపేస్తామంటూ ప్రముఖ కమేడియన్ కపిల్ శర్మకు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఇప్పటికే కొరియోగ్రాఫర్ రెమో డిసౌజా, రాజ్‌పాల్ యాదవ్, సుగంధ మిశ్రాలకు బెదిరింపు మెయిల్స్ రాగా తాజాగా కపిల్‌శర్మకూ ఈ తరహా మెయిల్ పాకిస్తాన్ నుంచి వచ్చింది. దీంతో తనకు ప్రాణహాని ఉందంటూ కపిల్ ముంబైలోని అంబోలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో భారతీయన్యాయసంహిత చట్టంలోని 351(3) సెక్షన్ కింద గుర్తు తెలియని వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ''మేం నీ ప్రతి చర్యలను గమనిస్తున్నాం. నీకో ముఖ్య విషయం గుర్తుచేద్దామని మెయిల్ చేశాం. ఇది ప్రచారం కోసమో, వేధించడం కోసమో చేసింది కాదు. మెయిల్‌ను సీరియస్‌గా తీసుకుని ఆలోచించు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు''అని బిష్ణు పేరిట ఒక మెయిల్ కపిల్‌శర్మకు వచ్చింది. ఎనిమిది గంటల్లోగా సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మెయిల్‌లో హెచ్చరించారు. ఇదే తరహా మెయిల్ ఇటీవలే మిశ్రా, రెమోలకూ వచ్చింది. దీంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత డిసెంబర్ 14న రాజ్‌పాల్ యాదవ్‌కు మెయిల్ వచ్చింది. సెలబ్రిటీలకు ఒకరి తర్వాత మరొకరికి బెదిరింపు మెయిల్స్ రావడంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. ముమ్మరంగా దర్యాప్తు మొదలెట్టారు. గత ఏడాది అక్టోబర్‌లో ముంబైలోనే రాజకీయనేత బాబా సిద్ధిఖీని కాల్చి చంపడం తెల్సిందే. ఈ హత్య తామేచేశామని జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది.

సమానత్వ హక్కు గురించి తెలిపే ప్రకరణ ఏది?

ప్రభుత్వ గొప్పదనం అనేది అది ప్రజలకు కల్పించే హక్కులపై ఆధారపడి ఉంటుందని ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు హెచ్.జె. లాస్కీ వ్యాఖ్యానించారు. హక్కు అనేది రాజనీతిశాస్త్ర అధ్యయనంలో ఒక ప్రాథమిక రాజకీయ భావన. ప్రజలు కోరుకునే, ప్రభుత్వం గుర్తించిన అధికారాన్నే హక్కుగా పేర్కొనవచ్చు. హక్కు అంటే అవకాశం, అధికారం కలిగి ఉండటం అని కూడా చెప్పవచ్చు. హక్కులు.. ప్రభుత్వ నిరపేక్ష అధికారాలపై పరిమితులు. ఒక వ్యక్తి తన శక్తి, తెలివితేటల ఆధారంగా ఔన్నత్యం, సంపూర్ణ వికాసం పొందడానికి దోహదపడే పరిస్థితులనే హక్కులుగా అభివర్ణించవచ్చు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రకరణలు 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతాయి. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని అత్యంత ముఖ్యమైన లక్షణంగా పేర్కొంటారు. వీటిని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం నుంచి గ్రహించారు. అమెరికా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను 'బిల్ ఆఫ్ రైట్స్' రూపంలో పొందుపరిచారు. చట్టబద్ధమైన హక్కులకు రాజ్యాంగంలో స్థానం కల్పించి, ప్రత్యేక ప్రతిపత్తితో గుర్తిస్తే వాటిని 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొంటారు. వ్యక్తి వికాసానికి ఇవి కనీస అవసరాలు. దేశ ప్రాథమిక శాసనమైన రాజ్యాంగంలో గుర్తించడం వల్ల వీటిని 'ప్రాథమిక హక్కులు' అని అంటారు.

ప్రాథమిక హక్కుల నేపథ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ 1895లో 'స్వరాజ్య బిల్లు'లో మొదటిసారిగా ఈ హక్కులను ప్రతిపాదించారు. ఆ తర్వాత..

- 1911లో కలకత్తాలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై తీర్మానాన్ని ఆమోదించారు.
- 1922లో మహాత్మా గాంధీ సాధారణ ప్రజల హక్కుల గురించి 'యంగ్ ఇండియా'లో ప్రస్తావించారు.
- 1925లో అనిబీసెంట్.. కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో, ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకూ ప్రాథమిక హక్కులు ఉండాలని ప్రతిపాదించారు.
- 1927లో మద్రాసులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో భావి రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదిక కావాలనే తీర్మానాన్ని ఆమోదించారు.
- 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ వెల్లడించిన నివేదికలో 'ప్రాథమిక హక్కులకు ఆమోదం పొందడం పౌరుల అవసరం'గా పేర్కొన్నారు.
- 1931లో కరాచీలో వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన కొంతమంది ప్రముఖులు ప్రాథమిక హక్కుల గురించి డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చడానికి వీరి నివేదికే ప్రాతిపదిక అయింది.
- 1931లో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీ భావి భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చాలని కోరారు.
- 1945లో తేజ్ బహదూర్ సప్రూ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ రహిత మేధావుల సంఘం కూడా ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగ పరిషత్తు - ప్రాథమిక హక్కులు

హక్కులను రాజ్యాంగంలో చేర్చి, వాటికి ఒక నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 24న సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన 54 మంది సభ్యులతో ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఈ సలహా సంఘం ప్రాథమిక హక్కుల పరిశీలన కోసం 1947 ఫిబ్రవరి 12న ఆచార్య జె.బి. కృపలాని అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది. ఉప సంఘం సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు హక్కులపై ఒక ముసాయిదా తయారు చేశారు. ఈ ముసాయిదాలో హక్కులను.. న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు, న్యాయ సంరక్షణ లేని హక్కులుగా వర్గీకరించారు.

ప్రాథమిక హక్కులు - లక్షణాలు

- ప్రవేశికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే తాత్విక ఆదర్శాలకు వాస్తవికతను చేకూర్చే విధంగా ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.
- ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ (Justiciable) ఉంది. ఇది అత్యంత ముఖ్యమైన లక్షణం. వీటి రక్షణ, అమలుకు రాజ్యాంగంలో న్యాయపరమైన ఏర్పాట్లు ఉన్నాయి.
- ప్రాథమిక హక్కులు ప్రభుత్వ నిరపేక్ష అధికారాల (Absolute Authority)పై పరిమితులు. ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగానికి లోబడి, ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా వినియోగించాలి.
- కొన్ని ప్రాథమిక హక్కులు నకారాత్మకమైనవి (Negative). అంటే ఇవి ప్రభుత్వ అధికారితపై పరిమితులు.

ఉదా: నిబంధనలు 14, 15, 16, 20, 21 మొదలైనవి. ఇవి ప్రభుత్వం ఏయే అంశాలను చేయకూడదో సూచిస్తాయి.

- మరికొన్ని హక్కులు సకారాత్మకమైనవి (Positive). ఇవి ప్రభుత్వ బాధ్యతలను సూచిస్తాయి.

ఉదా: నిబంధన 17లోని అస్పృశ్యత నిషేధం, నిబంధన 24లోని బాల కార్మిక వ్యవస్థ నిషేధం.

- ప్రాథమిక హక్కులన్నింటినీ జాతీయ అత్యవసర పరిస్థితుల్లో రద్దు చేయవచ్చు. నిబంధనలు 20, 21 మాత్రం రద్దుకావు.
- ప్రాథమిక హక్కులన్నీ స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, నిబంధనలు 17, 23, 24లో ప్రస్తావించిన అంశాలు స్వతహాగా అమల్లోకి రావు (Non self-executory). వీటి అమలు కోసం పార్లమెంటు ప్రత్యేక చట్టాలు చేయాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని కోసం రాజ్యాంగ సవరణ అవసరం. కానీ, సవరణ పేరుతో వీటి స్ఫూర్తికి భంగం కలిగించకూడదు.
- కొన్ని ప్రాథమిక హక్కులు కొన్ని వర్గాలు, సాయుధ బలగాలు, పోలీసులు, ఖైదీలు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్నవారికి పరిమితంగా వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక హక్కులు పౌరుల చర్యలకు వ్యతిరేకంగా కూడా లభిస్తాయి.

ఉదా: ప్రకరణ 17 - అస్పృశ్యత నివారణ, ప్రకరణ 23 - వెట్టిచాకిరి రద్దు, ప్రకరణ 24 - బాలకార్మిక వ్యవస్థ రద్దు.

- కొన్ని హక్కులను అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడి, జాతీయ సమగ్రత నిలపడానికి ఉద్దేశించారు.

ఉదా: మతస్వేచ్ఛ హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు.

- ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న నిషేధాలు/ వివక్షలు.. ప్రభుత్వాలు, పౌరులకు సమానంగా వర్తిస్తాయి.

ఉదా: జాతి, మత, కుల, లింగ, జన్మ సంబంధ వివక్షలను ఎవరూ పాటించకూడదు.



ప్రాథమిక హక్కుల వర్గీకరణ

భారత రాజ్యాంగంలో 7 రకాల ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు.

1. సమానత్వ హక్కు (Right to Equality): ప్రకరణలు 14–18.
2. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కు (Personal Freedoms): ప్రకరణలు 19–22.
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation): ప్రకరణలు 23, 24.
4. మత స్వాతంత్ర్య హక్కు (Right to Religion): ప్రకరణలు 25–28.
5. సాంస్కృతిక, విద్యా హక్కులు (Cultural & Educational rights): ప్రకరణలు 29, 30.
6. ఆస్తి హక్కు (Right to Property): ప్రకరణ 31.
7. రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies): ప్రకరణ 32.

ప్రత్యేక వివరణ

పైన పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆస్తి హక్కు (ప్రకరణ 31)ను, ఆస్తి సంపాదన విషయంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 19(1)(f)ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. వీటిని 12వ భాగంలోని 300(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధ హక్కు (Constitutional Right) మాత్రమే. దీన్ని ఒక చట్టబద్ధమైన హక్కుగానూ పరిగణిస్తున్నారు.

ప్రకరణ 12 - రాజ్యం నిర్వచనం

ప్రాథమిక హక్కులను మౌలికంగా రాజ్యం నిరపేక్ష అధికారాలకు వ్యతిరేకంగా పొందుపరిచారు. రాజ్యాంగంలో రాజ్యం అనే పదాన్ని చాలా చోట్ల ప్రయోగించారు. అయితే రాజ్యం నిర్వచనాన్ని మాత్రం ప్రకరణ 12లో పేర్కొన్నారు. రాజ్యం అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ప్రాథమిక హక్కులను రాజ్యం లేదా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గుర్తించారు. కాబట్టి ఏయే సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయి? అనే అంశాన్ని స్పష్టంగా నిర్వచించకపోతే కొన్ని సంస్థలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా వాటిపై న్యాయస్థానంలో ప్రశ్నించే అవకాశం ఉండదు. అందువల్ల దీనికి విస్తృతమైన నిర్వచనం అవసరం. దీని ప్రకారం రాజ్యం అంటే..

ఎ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; కేంద్ర, రాష్ట్ర శాసనసభలు

బి. స్థానిక ప్రభుత్వాలు (మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లా బోర్డులు, ట్రస్టులు)

సి. ప్రభుత్వ ఆదేశాల ద్వారా ఏర్పాటైన చట్టబద్ధ, చట్టేతర సంస్థలు (ఎల్.ఐ.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.టి.పి.సి. మొదలైనవి)

డి. న్యాయవ్యవస్థ కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పుల్లో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రైవేట్ సంస్థలు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఎలాంటి ఇతర సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయనే అంశాన్ని సుప్రీంకోర్టు వివిధ కేసుల తీర్పుల సందర్భంగా స్పష్టపరిచింది. అవి:

అజయ్ సహాయ్ వర్సెస్ ఖలీద్ ముజీద్ (1981): సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పులో ఒక సంస్థను రాజ్యం అనే నిర్వచనంలోకి చేర్చడానికి కింది ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

- మూలధనంలో ప్రభుత్వ వాటా ఉండాలి.
- ఆ సంస్థ మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.
- ఆ సంస్థపై సంపూర్ణ పరిపాలనా నియంత్రణ ఉండాలి.
- ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి.

న్యాయస్థానాలు రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయి - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.ఆర్. అంతులే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ కేసు (1988): న్యాయస్థానాల కొన్ని చర్యలు రాజ్య నిర్వచనంలోకి వస్తాయని ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనికి రాజ్యాంగంలో స్పష్టమైన ఆధారాలున్నాయి. ప్రకరణ 145, 146 ప్రకారం సుప్రీంకోర్టు సొంత నియమ, నిబంధనలను రూపొందించుకోవచ్చు. అదేవిధంగా తన సిబ్బందిని నియమించుకునే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది. ఈ చర్యలు కార్యనిర్వాహకపరమైనవి. వీటివల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చు.

కాబట్టి న్యాయశాఖ కార్యనిర్వాహక విధులను నిర్వర్తిస్తున్నప్పుడు మాత్రమే రాజ్యమనే పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాజ్యం నిర్వచనం- మినహాయింపులు

సహకార సంఘాలు; బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా; ప్రభుత్వ ధన సహాయం పొందని ప్రైవేట్ విద్యాసంస్థలు; ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక నియంత్రణ లేని ఇతర సంస్థలు రాజ్యం నిర్వచనం పరిధిలోకి రావు.

ప్రకరణ 13–చట్టం నిర్వచనం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు–న్యాయ సమీక్షాధికారం

ప్రకరణ 13(1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే అంతవరకు అమల్లో ఉన్న చట్టాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైతే.. అవి చెల్లకుండా పోతాయి. ప్రకరణ 13(2) ప్రకారం ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే చట్టాలు, ఆదేశాలు చెల్లవు.

ప్రకరణ 13(3)లో పేర్కొన్న చట్టం నిర్వచనం కిందకి వచ్చే అంశాలు:

- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.
- రాష్ట్రపతి, గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, ఆర్డినెన్స్‌లు.
- ప్రభుత్వ రూల్స్, రెగ్యులేషన్స్, నోటిఫికేషన్స్, ప్రకటనలు.
- ప్రభుత్వం గుర్తించిన, చట్టబద్ధత ఉన్న ఆచార వ్యవహారాలు.

ప్రత్యేక వివరణ

1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా.. నిబంధన 368 ప్రకారం రాజ్యాంగానికి చేసిన సవరణలను నిబంధన 13లో పేర్కొన్న 'చట్టం' నిర్వచన పరిధి నుంచి మినహాయించారు. ఈ అంశాన్ని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు తీర్పును అధిగమించడానికి చేర్చారు. కానీ, సుప్రీంకోర్టు 1973లో కేశవానందభారతి కేసులో ఈ సవరణ చెల్లదని తీర్పు చెప్పింది. కాబట్టి రాజ్యాంగ సవరణ కూడా చట్టం నిర్వచన పరిధిలోకి వస్తుంది.

బయోగ్యాస్‌లోని ప్రధానాంశం ఏమిటి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

జనరల్‌సైన్స్ విభాగం నుంచి గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మానవ శరీరంలో ఎన్ని ఎముకలుంటాయి? (ఏఈఈ-2007)
1) 330 2) 280
3) 206 4) 220

2. మానవ శరీరంలో అతి కఠిన భాగం? (ఏఎస్ఓ-2008)
1) గోర్లు 2) ఎముకలు
3) కొమ్ములు 4) ఎనామిల్

3. చెవుల్లోని మొత్తం ఎముకల సంఖ్య? (ఏఎస్ఓ-2008)
1) రెండు 2) నాలుగు
3) ఆరు 4) ఎనిమిది

4. దంతక్షయాన్ని అరికట్టడానికి నీటి సరఫరాలో కలిపే రసాయన పదార్థం? (గ్రూప్-2, 2000)
1) క్లోరైడ్ 2) ఫ్లోరైడ్
3) బ్రోమైడ్ 4) సల్ఫైడ్

5. పాలలోని చక్కెర? (జె.ఎల్.-2007)
1) ఫ్రక్టోజ్ 2) గ్లూకోజ్
3) సుక్రోజ్ 4) లాక్టోజ్

6. పాలు అంటే ఏమిటి? (గ్రూప్-1, 2002)
1) కొవ్వు విస్తరించి ఉన్న రక్తం
2) కొవ్వు విస్తరించి ఉన్న నీరు
3) నీరు విస్తరించి ఉన్న కొవ్వు
4) నీరు విస్తరించి ఉన్న చమురు

7. పాలలో కొవ్వు శాతం ఏ సమయంలో తగ్గుతుంది? (ఏఈఈ-2009)
1) చలికాలం 2) వేసవికాలం
3) వర్షాకాలం 4) ఏదీకాదు

8. ఆవు పాలు పసుపు రంగులో ఉండటానికి కారణం? (గ్రూప్-2, 2012)
1) జాంతోఫిల్ 2) మాల్టోజ్
3) రైబోఫ్లావిన్ 4) కెరాటిన్

9. కండరాలకు వచ్చే కేన్సర్ ఏది? (గ్రూప్-1, 2003)
1) లింఫోమా 2) ల్యూకేమియా
3) సార్కోమా 4) అనీమియా

10. నేత్రదానంలో దాత తన కంటిలోని ఏ భాగాన్ని దానం చేస్తాడు? (గ్రూప్-1, 2003)
1) కార్నియా 2) లెన్స్
3) రెటీనా 4) పూర్తి కన్ను

11. పాలిష్ చేసిన బియ్యాన్ని ఎక్కువగా తీసుకుంటే ఏ విటమిన్ లోపిస్తుంది? (డిప్యూటీ ఈఓ-2008)
1) A 2) B_2
3) D 4) B_1

12. ఏ విటమిన్ లోపం వల్ల చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుంది?
1) A 2) D 3) K 4) C

13. తాడు రక్తం (Cord Blood) అంటే ఏమిటి? (గ్రూప్-2, 2005)
1) కూతుళ్లకు తండ్రి దానం చేసే రక్తం
2) కృత్రిమ రక్తం
3) గుండె కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
4) మాయ కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం

14. హిమోగ్లోబిన్‌లో ఉండే లోహం? (గ్రూప్-1, 1987-88)
1) మెగ్నీషియం 2) ఇనుము
3) కోబాల్ట్ 4) మాంగనీస్

15. పేస్‌మేకర్ దేనికి సంబంధించింది? (గ్రూప్-1, 2010)
1) గుండె 2) ఊపిరితిత్తులు
3) కాలేయం 4) కిడ్నీ

16. రక్తం ఒక..? (గ్రూప్-1, 2010)
1) ద్రావణం 2) కొల్లాయిడ్
3) తరల పదార్థం 4) జెల్

17. శిశువు పితృత్వాన్ని నిర్ధారించేందుకు ఏ పరీక్ష నిర్వహిస్తారు? (సివిల్స్-2010)
1) ఆమ్నియో సెంటాసిస్
2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
3) జన్యు సైక్లింగ్
4) ఏదీకాదు

18. AB రక్త గ్రూపునకు చెందిన ఒక వ్యక్తిని విశ్వగ్రహీత అని ఎందుకంటారు? (గ్రూప్-1, 2007)
1) ప్రతిరక్షక జనకాలు లేనందువల్ల
2) ప్రతిరక్షకాలు ఉన్నందువల్ల
3) ప్రతిరక్షకాలు లేనందువల్ల
4) ప్రతిరక్షకాలు - ప్రతి రక్షక జనకాలు లేనందువల్ల

19. సిరా రక్తాన్ని ఆక్సిజన్ కోసం ఊపిరితిత్తులకు చేరవేసేది? (గ్రూప్-2, 2008)
1) పుపుస సిరలు 2) పుపుస ధమనులు
3) కుడి జఠరిక 4) మహాధమని

20. చాలా కీటకాలు గాలిని సంగ్రహించే పద్ధతి?
1) చర్మం ద్వారా 2) మొప్పల ద్వారా
3) ట్రాకియల్ వ్యవస్థ ద్వారా
4) లంగ్స్ ద్వారా

21. బయోగ్యాస్‌లోని ప్రధానాంశం? (గ్రూప్-1, 1987)
1) ఈథేన్ 2) మీథేన్
3) బ్యూటేన్ 4) ఎసిటలిన్

22. ఆక్సిజన్ లేకుండా ఒక జైవిక పదార్థాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా ఏ వాయువును ఉత్పత్తి చేయొచ్చు? (గ్రూప్-2, 2001)
1) బొగ్గుపులుసు వాయువు
2) నత్రజని 3) SO_2 4) మీథేన్

23. ఆల్కహాల్‌ను తయారు చేయడానికి ఏది అవసరం? (గ్రూప్-2, 2001)
1) ప్రోటోజోవా 2) శిలీంద్రాలు - ఈస్ట్
3) బ్యాక్టీరియా 4) వైరస్

24. పురుషుడి గొంతు కంటే స్త్రీ గొంతు కీచుగా ఉంటుంది. ఎందుకంటే? (గ్రూప్-2, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్- 2009)
1) అధిక పీడన వ్యాప్తి 2) అల్ప పీడన వ్యాప్తి
3) అధిక కంపన పరిమితి
4) అల్ప కంపన పరిమితి

25. సిలికోసిస్ వ్యాధి ఏ అవయవానికి సంక్రమిస్తుంది?
1) మూత్రపిండాలు 2) కాలేయం
3) నరాలు 4) ఊపిరితిత్తులు

26. మొదటిసారిగా కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం? (గ్రూప్-2, 2008)
1) మీథేన్ 2) బెంజీన్
3) గ్లూకోజ్ 4) యూరియా

27. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం? (గ్రూప్-2, 2003)
1) పంచదార 2) గ్లూకోజ్
3) క్రియాటిన్ 4) ప్రోటీన్

28. మానవ కిడ్నీలో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండేది?
1) కాల్షియం ఆక్జలేట్
2) సోడియం ఎసిటేట్
3) మెగ్నీషియం సల్ఫేట్
4) సోడియం సిట్రేట్

29. మూత్రపిండాల్లోని ఏ భాగంలో మూత్రం వడపోత అవుతుంది? (డీఎల్-2012)
1) వృక్కం 2) మూత్ర కోశం
3) ప్రసేకం 4) వృక్క సిర

30. మానవ మూత్రంలోని యూరియా తయారయ్యే భాగం? (గ్రూప్-2, 2000)
1) మూత్రపిండాలు 2) పెద్దపేగు
3) కాలేయం 4) మూత్రాశయం

31. కృత్రిమంగా మూత్రపిండాలు వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడాన్ని ఏమంటారు? (గ్రూప్-2బి,1984)
1) పనోరిసిస్ 2) మానోమీటర్
3) డయాలసిస్ 4) డయామెంటేషన్

32. చక్కెర వ్యాధిగ్రస్థుని మూత్ర నమూనాలో ఉండేది? (ఏఈఈ-2009)
1) లాక్టోజ్ 2) మాల్టోజ్
3) గ్లూకోజ్ 4) సుక్రోజ్

33. క్లోమం ఒక ..? (గ్రూప్-1, 1999)
1) అంతస్స్రావ గ్రంథి
2) బహిస్స్రావ గ్రంథి
3) అంతస్స్రావ - బహిస్స్రావ గ్రంథి
4) ఏదీకాదు

34. శరీరంలో తాప నియంత్రణను కలిగి ఉన్న గ్రంథి? (గ్రూప్-1, 2007)
1) పీనియల్ గ్రంథి
2) పిట్యూటరీ గ్రంథి/ హైపోథలమస్
3) థైరాయిడ్ 4) అడ్రినలిన్

35. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని పిలిచే గ్రంథి? (గ్రూప్-1, 2007)
1) అడ్రినల్ గ్రంథి 2) లివర్/కాలేయం
3) థైరాయిడ్-బాలగ్రంథి
4) థైమస్-బాలగ్రంథి

36. తన జాతి జీవులపై ప్రభావం చూపే, జీవి శరీరం నుంచి బాహ్యంగా స్రవించే సమ్మేళనాన్ని ఏమంటారు? (గ్రూప్-1, 1995)
1) సబ్ హార్మోన్ 2) న్యూరో హార్మోన్
3) ఫిరామోన్స్
4) న్యూరో ట్రాన్స్‌మీటర్

37. పాల పొదుగు నుంచి - చూషణ ద్వారా పాలను స్రవించేందుకు తోడ్పడే హార్మోన్? (సివిల్స్-1989)
1) ప్రోలాక్టిన్ 2) ఆక్సిటోసిన్
3) అడ్రినలిన్ 4) థైమోసిన్

38. రక్తపోటు(బ్లడ్ ప్రెజర్)కు కారణమైన హార్మోన్? (అసిస్టెంట్ తెలుగు ట్రాన్స్‌లేటర్-2010)
1) కాలేయం 2) థైమోసిన్
3) అడ్రినలిన్ 4) సెక్రిటిన్

39. కణం శక్తి గృహం (కణ శక్తి భాండాగారం) అని పిలిచే కణాంగం? (గ్రూప్-1, 1994, ఎ.ఎం.వి. ఇన్‌స్పెక్టర్- 2009)
1) క్లోరోప్లాస్ట్ 2) మైటోకాండ్రియా
3) గ్రానా 4) ప్రోటోప్లాజమ్

40. తుమ్ములు, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్-1, 1990)
1) మజ్జాముఖం 2) మస్తిష్కం
3) అనుమస్తిష్కం 4) హైపోథాలమస్

41. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (టౌన్ ప్లానింగ్ - 2010)
1) కండరాల కదలిక సమన్వయం
2) గ్రాహకాంగం
3) జ్ఞాపక శక్తి 4) దృష్టి

42. జంతు రాజ్యంలో అతిపొడవైన కణం? (గ్రూప్-1, 2010)
1) ఆస్ట్రిచ్ అండం 2) శుక్రకణం
3) నాడీకణం 4) మైకోప్లాస్మా

43. మెదడును కప్పి ఉంచే లోపలి పొర? (డీఎల్-2012)
1) ప్లూరా 2) డ్యూరామ్యాటర్
3) పియామ్యాటర్
4) అరాకినాయిడ్ మెంబ్రేన్

44. పార్కిన్సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ-2006)
1) గుండె 2) కాలేయం
3) మెదడు 4) చర్మం

45. శరీరంలో వార్తలను గ్రహించి సమన్వయ పరిచే కేంద్రం? (జె.ఎల్.-2007)
1) గుండె 2) మెదడు
3) మూత్రపిండాలు 4) పీయూషగ్రంథి

46. మెదడులో ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జె.ఎల్.-2004)
1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
3) దవ్వ 4) అథోపర్యంకం

47. కిందివాటిలో జీర్ణక్రియా ఎంజైమ్ కానిది? (సివిల్స్-2007)
1) ట్రిప్సిన్ 2) పెప్సిన్
3) టయలిన్ 4) గ్యాస్ట్రిన్

48. హెపటైటిస్ వ్యాధి దేనికి సంబంధించింది? (గ్రూప్-2, 2000)
1) కాలేయంలో మంట
2) గుండెలో మంట
3) మూత్రపిండాల్లో మంట
4) పేగులో మంట

49. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి? (గ్రూప్-1, 2004)
1) గుండె బైపాస్ శస్త్ర చికిత్స
2) పొట్ట బైపాస్ శస్త్ర చికిత్స
3) మెదడు సర్జరీ
4) సియామీ కవలలను విడదీసే సర్జరీ

50. కోసిన తర్వాత 2-3 వారాల్లోనే తన పూర్వ స్థితిని తిరిగి దాదాపు 85 శాతం వరకు పెంచుకునే సామర్థ్యం ఉన్న మానవ శరీర అవయం ఏది? (గ్రూప్-1, 2004, ఏఈఈ-2008)
1) మెదడు 2) మూత్రపిండాలు
3) కాలేయం 4) ఊపిరితిత్తులు

51. మానవుని సొల్లు (సెలైవా)లో ఉండే ఎంజైమ్? (గ్రూప్-2, 2003)
1) రెనిన్ 2) అమైలేజ్
3) లైపేజ్ 4) టయలిన్

52. 'రూట్ కెనాల్ థెరపీ' వేటికి సంబంధించిన చికిత్స? (గ్రూప్-2, 2000)
1) దెబ్బతిన్న పళ్లు
2) దెబ్బతిన్న మూత్రనాళం
3) రక్తనాళాలు 4) గోర్లు

53. మానవుడిలో అతిపెద్ద గ్రంథి? (ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్-2012)
1) కాలేయం 2) ఊపిరితిత్తులు
3) ప్లీహం 4) క్లోమం

54. మానవ ఉదరంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం? (గ్రూప్-1, 2012)
1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
3) ఫార్మికామ్లం 4) నైట్రికామ్లం

55. కిందివాటిలో సరైన వరస క్రమం ఏది?
1) గడ్డి-తోడేలు-జింక-గేదె
2) గడ్డి-కీటకం-పక్షి-పాము
3) బ్యాక్టీరియా-కీటకం-పాము-జింక
4) బ్యాక్టీరియా-గడ్డి-కుందేలు-తోడేలు

56. అండోత్పత్తి స్థానం నుంచి అండాలు గర్భాశయంలోకి ప్రవేశించడానికి ఏ భాగం సహాయపడుతుంది? (గ్రూప్-1, 2004)
1) సెర్విక్స్ 2) యోని
3) జరాయువు 4) ఫెల్లోపియన్ నాళాలు

సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 2; 5) 4;
6) 2; 7) 2; 8) 3; 9) 3; 10) 1;
11) 4; 12) 4; 13) 4; 14) 2; 15) 1;
16) 2; 17) 2; 18) 3; 19) 2; 20) 3;
21) 2; 22) 1; 23) 2; 24) 4; 25) 4;
26) 4; 27) 3; 28) 1; 29) 1; 30) 3;
31) 3; 32) 3; 33) 3; 34) 2; 35) 3;
36) 3; 37) 2; 38) 3; 39) 2; 40) 1;
41) 1; 42) 3; 43) 3; 44) 3; 45) 2;
46) 1; 47) 4; 48) 1; 49) 2; 50) 3;
51) 4; 52) 1; 53) 1; 54) 2; 55) 2;
56) 4;

తెలంగాణలో రైతులకు పట్టాలు ఇచ్చిన తొలి సంస్థానం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

స్వాతంత్ర్యం రాక ముందు భారతదేశంలో 562 సంస్థానాలు ఉండేవి. తెలంగాణ ప్రాంతంలోనూ అనేక సంస్థానాలున్నాయి. కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల కాలంలో ఇవి ఆవిర్భవించాయి. వీటిలో ఆత్మకూరు, బోరవెల్లి, సీర్నవెల్లి, దుబ్బాక, దొంతి, దోమకొండ, గద్వాల, జటప్రోలు, పాల్వంచ, పాపన్నపేట, నారాయణపురం సంస్థానాలు ప్రధానమైనవి. సైనిక చర్య అనంతరం నిజాం రాష్ట్రంతో పాటు ఇవి భారత దేశంలో విలీనమయ్యాయి.

తెలంగాణలో ముఖ్యమైన సంస్థానాలు

తెలంగాణ సంస్కృతి నిర్మాణంలో, సాహిత్య వికాసంలో సంస్థానాల పాత్ర మరువలేనిది. ఆంధ్ర ప్రాంతంలో నాయక రాజులు పోషించిన పాత్రను తెలంగాణలో సంస్థానాలు పోషించాయి.

ఆత్మకూరు సంస్థానం

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆత్మకూరు సంస్థానం వైశాల్యం 190 చ.కి.మీ. దీని తొలి రాజధాని తివుడంపల్లి. వర్ధమానపురం పాలకుడైన గోన బుద్ధారెడ్డి తిరుపతి వెళ్లినప్పుడు చంద్రగిరికి చెందిన గోపాలరెడ్డి అతడికి సకల సౌకర్యాలు కల్పించాడు. గోపాలరెడ్డి ఆతిథ్యానికి ముగ్ధుడైన బుద్ధారెడ్డి అతణ్ని మగతలనాడు గౌడ పదవిలో నియమించాడు. ఇతణ్నే ఈ సంస్థాన స్థాపకుడిగా చెప్పవచ్చు.

ఇతడి చిన్న కుమారుడు చినగోపిరెడ్డి యుద్ధాల్లో బహమనీ సుల్తాన్లకు సహకరించాడు. ఇందుకు ప్రతిఫలంగా ముజఫర్ పరగణాలో నాడగౌడ, సర్‌నాడ గౌడ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండ్య, దేశాయిగిరి పదవులను పొందాడు.చినగోపిరెడ్డి మనవడు రెండో గోపిరెడ్డి. ఇతడు అబ్దుల్లా కుతుబ్‌షా సమకాలీనుడు. రెండో గోపిరెడ్డి కుతుబ్‌షా దగ్గర నుంచి అల్లిపురం జాగీర్‌ను పొందాడు. గోపిరెడ్డి సోదరుడు సాహెబ్ రెడ్డి. కడేచూరు, మగతల సీమలను పాలించేందుకు సాహెబ్‌రెడ్డికి కుతుబ్‌షా అనుమతిచ్చాడు. గోపిరెడ్డి తర్వాత సర్వారెడ్డి ఈ సంస్థానాన్ని పాలించాడు. సర్వారెడ్డి మనవడు రెండో సర్వారెడ్డి. ఇతడు యుద్ధాల్లో ఔరంగజేబుకు సహకరించి దుప్పల్లి జాగీర్‌ను పొందాడు. ఇతడి కుమారుడైన మొదటి తిమ్మారెడ్డి తర్వాతి కాలంలో రాజ్యాన్ని పాలించాడు. తిమ్మారెడ్డి మనవడు రెండో సాహెబ్‌రెడ్డి. ఇతడు కర్ణాటక దండయాత్రల్లో అసఫ్‌జాహీలకు సహకరించి 'సవైరాజా' బిరుదును పొందాడు. ఈ వంశంలో రెండో సాహెబ్‌రెడ్డి తర్వాత ఏడో తరానికి చెందినవాడు పెద వెంకటరెడ్డి. ఇతడు నిజాం రాజైన సికిందర్ జాకు యుద్ధాల్లో సహకరించాడు. ప్రతిఫలంగా అమరచింత, వడ్డెమాను పరగణాల పట్టా పొందాడు. ఇతడు రాజధానిని తివుడంపల్లి నుంచి ఆత్మకూరుకు మార్చాడు. పెద వెంకటరెడ్డి తర్వాత అతడి కుమారుడు బాలకృష్ణారెడ్డి, మనవడు సోమభూపాలరావు సంస్థానాన్ని పరిపాలించారు. సోమభూపాలరావు అమరచింత, వడ్డెమాను పరగణాలను శాశ్వతంగా బిల్‌మఖ్తాగా పొందాడు. సోమభూపాలుడి కుమారుడు రాజా సీతారామభూపాలరావు. ఇతడి కుమారుడైన సవైరాజా రామభూపాలరావు బల్వంత్ బహద్దూర్ సంస్థానాన్ని పరిపాలించాడు. ఇతడు ప్రజలకు ఉపయోగపడే అనేక నిర్మాణాలను చేపట్టాడు. ఇతడి మరణానంతరం భార్య భాగ్యలక్ష్మమ్మ నిజాం నుంచి పరిపాలనా అనుమతి పొందింది. ఈమె కాలంలోనే ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

నారాయణపురం, రాజాపేట

ఇవి నల్లగొండ జిల్లాకు చెందిన చిన్న సంస్థానాలు. వీటికి సొంత అధికారాలు ఉండేవి కావు. నిజాం ఉల్‌ముల్క్ కాలంలో నల్లగొండ జిల్లా గట్టుప్పల్ ప్రాంతంలో ఒక గజదొంగ దురాగతాలకు పాల్పడేవాడు. మంచల్‌రెడ్డి అనే వ్యక్తి ఆ దొంగను చంపి, నారాయణపురం ప్రాంతాన్ని ఇనామ్‌గా పొందాడు. ఇతడి సోదరుడు సోమిరెడ్డి నారాయణపురం పటేల్‌గా నియమితుడయ్యాడు. తర్వాత మంచల్‌రెడ్డి కుమారుడైన రాయన్‌రెడ్డి పాలకుడయ్యాడు. నిజాంను ధిక్కరించిన ఒక సామంతరాజును ఇతడు బంధించి తెచ్చాడు. ఈ చర్యకు మెచ్చిన నిజాం ఇతడికి సర్‌మన్నెవార్, సర్దేశ్‌ముఖ్, సర్దేశ్‌పాండే, సర్‌నాడగౌడ బిరుదులు ఇచ్చి గౌరవించాడు. తర్వాత ఇతడిని రాచకొండ, భువనగిరి, అడవిమర్రి, షాద్‌నగర్, నర్సికొండ, ఇందుర్తి, ఇంద్రియాల, ఇబ్రహీంపట్నం పరగణాల మీద అధికారం కల్పించాడు. రాయన్‌రెడ్డి 1775లో రాజాపేట కోటను నిర్మించాడు. 1782లో ఇతడి కుమారుడు వెదిరె వెంకట నారాయణరావు పాలకుడయ్యాడు. ఇతడే నారాయణపురం సంస్థానాన్ని స్థాపించాడు. ఇతడి కుమారుడైన రాయన్న మీర్ లాయక్ అలీ, సాలార్జంగ్ లాంటి గొప్ప వారితో కలిసి చదువుకున్నాడు. ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. ఇతడికి ఆరుగురు భార్యలు. చివరి భార్య హుస్సేన్ బేగంకు మాత్రమే ఒక కూతురు జన్మించింది. ఆమె పేరు జహీరున్నీసా బేగం. ఆమే ఈ సంస్థాన చివరి పాలకురాలు. రాజాపేట సంస్థానం పరిధిలో కుర్రారం, నమిలె, మాసాయిపేట, కోరుకొండ, పెదపాడు, సాదువెల్లి, చల్లూరు, వెంకిర్యాల, రాజాపేట గ్రామాలుండేవి.

పాపన్నపేట సంస్థానం

పాపన్నపేట అతి ప్రాచీన సంస్థానం. ఇది ఒకప్పుడు అన్ని సంస్థానాల కంటే పెద్దది. మెదక్ జిల్లా మొత్తం ఈ సంస్థాన పరిధిలో ఉండేది. రాణి శంకరమ్మ పాలనా కాలం నుంచి సంస్థాన చరిత్ర తెలుస్తోందని బి.ఎస్.శాస్త్రి తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి కూడా గోల్కొండ పత్రికలో ఈ సంస్థాన చరిత్రను రాశారు. అందులో రాణి శంకరమ్మ, సదాశివ రెడ్డి గురించి మాత్రమే పేర్కొన్నారు. తర్వాతి కాలంలో కొన్ని గ్రంథాల ద్వారా ఈ సంస్థాన చరిత్ర కొంత వెలుగులోకి వచ్చింది.

చిదిరె వంశీయులు ఈ సంస్థాన రాజపురోహితులు. ఈ వంశానికి చెందిన చిదిరె లక్ష్మణశాస్త్రి 1928-29లో సంస్థాన చరిత్రను రచించాడు. ఇందుకోసం రాణి లింగాయమ్మ రాసిన మా పూర్వ వంశావళి, రాజా వెంకట నరసింహారెడ్డి ఉర్దూలో రాసిన మా వంశ చరిత్ర, వెంకటాద్వరి రచించిన మా సంస్థాన చరిత్ర, లింగాయమ్మ చరిత్ర; తిరుమలాచార్యుల శౌర్యరాజ్య వంశావళి, ముదిగొండ రామకృష్ణ కవి శ్రీమజ్జోగినాథ చరిత్ర అనే గ్రంథాలను ఆధారంగా చేసుకున్నాడు. వీటితోపాటు తమ పూర్వీకులు చెప్పిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాడు. లక్ష్మణశాస్త్రి సంస్థాన చరిత్ర రాతప్రతిని సురవరం, బిరుదురాజు రామరాజుకు ఇచ్చాడు. కానీ కొన్ని కారణాల వల్ల దాన్ని తిరిగి పొందలేదు. దీంతో తన వద్దనున్న చిత్తుప్రతి ఆధారంగా 1979-80లో మెదక్ రాజుల చరిత్రను ముద్రించాడు. ముడుంగ రంగ కృష్ణమాచార్యులు 2006-07లో 'ఆందోల్-జోగిపేట', 2012లో 'శౌర్యవీర్యరెడ్డి త్రయం' అనే పుస్తకాలు రాశాడు.

ఆందోల్ రాజుల చరిత్ర, మెదక్ రాజుల చరిత్ర, రంగంపేట చరిత్ర అనే వివిధ పేర్లతో పాపన్నపేట సంస్థాన రాజుల చరిత్ర వ్యవహారంలో ఉంది. కాకతీయుల సేనానుల్లో అనంతరెడ్డి ఒకరు. కాకతీయ రాజ్య పతనం తర్వాత ఇతడు సంగారెడ్డి సమీపంలోని కల్పగూరు వచ్చి స్థిరపడ్డాడు. ఇతడు నాటి పాలకులకు సాయం చేసి, వారి నుంచి కల్పగూరు పరగణాను పొందాడు. ఇతడే ఈ వంశ స్థాపకుడు. తర్వాత ఇతడి మనవడైన రామినేడు 1398లో పట్టాభిషిక్తుడయ్యాడని ఆందోల్ తహశీల్దార్ రాసిన మెదక్ చరిత్రలో ఉంది. రామినేడు ఆందోల్ కోటను నిర్మించాడు. 1418లో ఆందోల్‌ను రాజధానిగా చేసుకున్నాడు. కొండాపూర్, ఓంకారపురం, పాటన్ చెర్వు (పటాన్ చెరువు), తెలంగాణాపురం, రుద్రారం, మెతుకు, కాపాల, అతినగరం, డాకూరు మొదలైనవి ఇతడి సంస్థానంలో భాగంగా ఉండేవి. తర్వాత భువనగిరి, నిజాంపేట, చందంపేట, దేవరకొండ, నర్సాపూర్, దౌల్తాబాద్ తదితర ప్రాంతాలు కూడా ఇతడి సంస్థానంలో భాగమయ్యాయి.

రామినేడు తర్వాత ముసలారెడ్డి, పెద్దరెడ్డి, అల్లమయ్య చౌదరి, రామిరెడ్డి, మొదటి సదాశివరెడ్డి, పెద్దనరసింహారెడ్డి, లింగాయమ్మ, లింగారెడ్డి తదితరులు ఈ సంస్థానాన్ని పరిపాలించారు. రామదుర్గా వెంకట నరసింహారెడ్డి (1720-60) కాలంలో ఈ సంస్థాన పరిధి తగ్గి చిన్న సంస్థానంగా మారింది. శంకరమ్మ పరాక్రమం చూసిన నరసింహారెడ్డి ఆమెను వివాహమాడాడు. నరసింహారెడ్డి మరణం తర్వాత శంకరమ్మ సంస్థాన పాలన బాధ్యతలను చేపట్టాల్సింది. కానీ ఒక కుట్ర వల్ల రెండో లింగాయమ్మ రాణి అయింది. ఈమె 1760-64 వరకు సంస్థానాన్ని పాలించింది. మహారాష్ట్ర పీష్వాలు నిజాం రాజ్యంపై దండెత్తారు. కానీ శంకరమ్మ తన శక్తియుక్తులతో వారిని ఓడించింది. దీంతో నిజాం ఆమెకు రాయ్‌భాగన్ (ఆడ సింహం లాంటి రాణి) అనే బిరుదునిచ్చి రాణిగా నియమించాడు. 1764లో అధికారంలోకి వచ్చిన శంకరమ్మ రాజ్యాన్ని పునర్ నిర్మించింది. తన తండ్రి పేరు మీద సంగారెడ్డిని, తల్లి పేరు మీద రాజంపేటను నిర్మించింది. తన పేరు మీద శంకరంపేటను, మీరెల్లి పాపన్న పేరు మీద పాపన్నపేటను నిర్మించింది. ఈమె గొప్ప పరాక్రమవంతురాలు, పరిపాలనాదక్షురాలు. శంకరమ్మ పేరు మీద అనేక జానపదులు, వీరగాథలు ప్రచారంలో ఉన్నాయి. అందుకే చరిత్రకారులు ఈమెను రుద్రమదేవి, అహల్యాబాయితో పోల్చారు. వ్యవసాయాభివృద్ధికి శంకరమ్మ అనేక చెరువులు నిర్మించింది. ఈమె గొప్ప సంస్కరణ శీలి. దళితుడైన నీరుడి పాపన్నను దళపతి చేసింది.

శంకరమ్మకు సంతానం లేదు. అందువల్ల పేద బాలుడైన సదాశివరెడ్డిని దత్తత తీసుకుంది. 1774లో ఈమె మరణించింది. దీంతో సదాశివరెడ్డి రాజ్యానికి వచ్చాడు. గద్వాల సంస్థానాధీశుడైన సోమనాథ భూపాలుడు ఇతడి ధైర్య సాహసాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇతడికి తన కుమార్తె అయిన పార్వతీదేవినిచ్చి వివాహం చేశాడు. సదాశివరెడ్డి కూడా మరాఠా పీష్వాలను ఓడించి నిజాం అలీఖాన్ (రెండో అసఫ్‌జా)కు సహాయం చేశాడు. నిజాం అలీఖాన్ పెద్ద కుమారుడు అక్బర్ అలీ. ఇతడు తండ్రి మీద తిరుగుబాటు చేసి సదాశివరెడ్డి, గాలీబ్ జంగ్ సహాయం కోరాడు. ఈ సందర్భంగా జరిగిన మూడు యుద్ధాల్లో సదాశివరెడ్డి గెలుపొందాడు. కానీ చివరి యుద్ధంలో ఓటమిపాలై హత్యకు గురయ్యాడు. తర్వాత ఇతడి భార్య పార్వతీదేవి అధికారంలోకి వచ్చింది. రాజా రామచంద్రారెడ్డి బహద్దూర్ ఈ సంస్థాన చివరి పాలకుడు. ఇతడి కాలంలోనే పాపన్నపేట సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

వనపర్తి సంస్థానం

తెలంగాణలోని పెద్ద సంస్థానాల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి సంస్థానం ఒకటి. ఈ సంస్థానం సాహిత్యంలో మేటి. దీని పరిధిలో 124 గ్రామాలుండేవి. సూగూరు రాజధానిగా పాలించారు కాబట్టి వీరిని సూగూరు సంస్థానాధీశులని పిలిచేవారు. వీరి పూర్వీకులు నంద్యాలకు చెందినవారు. ఈ సంస్థాన స్థాపకుడు జనుంపల్లి వీరకృష్ణారెడ్డి. ఈ వంశంలో నాలుగో తరం వాడు వేమడి వెంకటరెడ్డి(1625-53). నెల్లూరు, ఉదయగిరి దుర్గాలను జయించడంలో అబ్దుల్లా కుతుబ్‌షాకు ఇతడు సహాయపడ్డాడు. ఈ వంశంలో అష్టభాషా గోపాలరావు ప్రసిద్ధుడు. ఇతడు రెండో వెంకటరెడ్డి కుమారుడు. ఈ వంశంలో బహరి బిరుదును పొందిన తొలి వ్యక్తి గోపాలరావు. ఇతడు 8 భాషల్లో ప్రసిద్ధుడు. ఇతడు రామచంద్రోదయం అనే కావ్యాన్ని, బాణం అనే సంస్కృత గ్రంథాన్ని రచించాడు. మిన్‌జానీబ్ సర్కారు తరఫున గోపాలరావు రెండేళ్లపాటు జటప్రోలు సంస్థానాన్ని పాలించాడు. ఇతడి దత్తపుత్రుడు మూడో వెంకటరెడ్డి. ఢిల్లీ సుల్తాన్ ఇతడికి సవై బిరుదును ఇచ్చాడు. వెంకటరెడ్డి తన తండ్రి పేరుమీద గోపాలపేట సంస్థానాన్ని స్థాపించాడు.

సూగూరు సంస్థానంలోని 12 గ్రామాలను అందులో చేర్చి, దానికి తన సోదరుడైన రంగారెడ్డిని పాలకుడిగా నియమించాడు. ఈ కాలంలో మొగలుల పరిస్థితి దిగజారింది. ఇదే అదనుగా వెంకటరెడ్డి పన్ను ఎగ్గొట్టాడు. దీంతో సుల్తాన్ సైన్యం ఇతడిపై దండెత్తింది. ఈ దాడిలో ఓడిపోయిన వెంకటరెడ్డి 1711లో ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాలరావు కాలంలో ముద్రించిన సూగూరు సిక్కాలు (నాణేలు) సంస్థానానికి ఎంతో పేరు తెచ్చాయి. కానీ 'సూగూరు వెట్టి' వల్ల ఈ సంస్థానం అప్రతిష్ఠ పాలైంది. తర్వాతి కాలంలో ఈ వంశంలో చెప్పుకోదగిన వ్యక్తి మొదటి రామకృష్ణారావు (1807-1822). ఇతడు సంస్థానాన్ని వనపర్తికి మార్చాడు. నిజాం ఇతడికి 1817లో రాజబహద్దూర్ బిరుదునిచ్చాడు. ఇతడు మంచి పండితుడు. చాలా మంది ఫకీర్లు ఇతడి స్నేహితులుగా ఉండేవారు.

ఈ సంస్థానంలో అందరిలోకెల్లా ప్రసిద్ధి చెందినవాడు రాజా రామేశ్వరరావు. ఇతడిలో ఆధునిక భావాలు మెండు. ఆంగ్ల విద్య ఆవశ్యకతను గుర్తించిన రామేశ్వరరావు మద్రాస్ వెళ్లి ఆంగ్లం నేర్చుకున్నాడు. 1802లో రెవెన్యూ సెటిల్‌మెంట్ భూమిని కొలిచి సర్వే నంబర్లు వేశాడు. రైతులకు పట్టాలు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాడు. తెలంగాణలో రైతులకు పట్టాలు ఇచ్చిన తొలి సంస్థానం ఇదే. సాలార్జంగ్ కంటే ముందే ఇక్కడ సంస్కరణలు చేపట్టారు. అందుకే సాయుధ పోరాటం ఇక్కడ ప్రభావం చూపలేదు. రాజా రామేశ్వరరావు కులాంతర ప్రేమ వివాహం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. సంస్థానంలో ఆధునిక సిద్ధాంతాలను ప్రవేశపెట్టి నిజాం సర్వసైన్యాధ్యక్ష పదవి పొందాడు. బ్రిటిషర్లు ఇతడికి 'హిస్ హైనెస్' అనే బిరుదును ప్రకటించారు. మూడో రామేశ్వరరావు కాలంలో ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

Common nouns followed by 'of'..

BANK EXAMS
GENERAL ENGLISH

NOUNS

We use nouns to refer to animals, people, places and things.

Kinds and uses

- **Proper nouns:** The specific names by which we know an individual animal, a person, a place, such as an institution, a building or a town, or something such as a month, a day of the week, a season or a festival.

E.g. Smith; Delhi; India Gate; January; Sankranthi.. etc.

Note: that all proper nouns begin with a capital letter.

- **Common nouns:** words that name people, animals, places and things of the same kind Dog (as in my dog, Goldie), doctor (as in Satish, a doctor), library (as in central library), spoon(as in a plastic spoon)

Note: that all common nouns begin with a lower-case letter.

- **Common nouns are countable when:**
  - We use a / an in front of them.

  A bag, an orange, a shirt, an engineer
  - We can talk about many of them using their plural forms, with or without numbers in front of them.

  Ships, two books, seven women, many sheep, a few lemons.
  - We can use them in questions that begin with 'how many'.

  How many pens do you need? How many children are present today?
- **Common nouns are uncountable when:**
  - We do not use a/an in front of them.

  Not a slat, but salt; not an oil, but oil.
  - We do not use their plural forms, with or without numbers in front of them, to specify what quantity we are talking about.

  Not a sugar, two sugars, many milks, but a grain of/two spoons of/four bags of/ ten kilograms of / many packets of / a lot of sugar, a little milk.
- We do not use them in questions that begin with 'how many', but only in those that begin with 'how much'.

Not How money do you owe him? but How much money do you owe him? not A How many plastic is manufactured in a day?, but How much plastic is manufactured in a day?

- **Note:** that some nouns can be used both as countables, when they refer to a thing, and as uncountables, when they refer to the substance or material it is made up of.

There are three glasses on the tray. ('glasses', countable noun).

The tray is made of glass. ('glass', uncountable noun).

Some countable nouns are concrete and represent people, things or activities that can be seen, touched or heard, for example rose, table, basket. Other countable nouns are abstract and represent states, feelings or qualities, which can only be felt or imagined, for example hop, ambition, joy. Similarly, some uncountable nouns are concrete, for example cotton, clothing, bread, while others are abstract, for example peace, pain, anger.

- **Collective nouns:** common nouns followed by 'of' and referring to groups of people or things.

A team of players, an army of soldiers, a bouquet of flowers.

- **Note:** that when using collective nouns, you will usually have to use the complete expression in order to make sense. For example, the collective noun 'bunch' by itself would not tell people what you are talking about because it could be used for grapes, roses or letters. Exceptions to this are, for example, 'an army', 'a bouquet' and 'a gang', which are usually used for soldiers, flowers and thieves respectively.

Plural forms of nouns

We use plural forms of nouns to talk about people, places and things that are more than one in number, for example 'two trolleys', 'a box of brushes', 'a few monkeys'.

Regular forms: You can follow the patterns below to form the plural forms of most nouns.

1. **Add-s in the case of most nouns:** mugs, pets, beds, cups, tubs, chiefs, cans, sums, teachers, dolls, months, smiles, tongues, days, windows.
2. **Add-es after nouns ending in:**
   -s: glasses, classes, passes, masses.
   -x: boxes, taxes, faxes.
   -ch: matches, clutches, stitches.
   -sh: wishes, bushes, dishes.
3. **Add-s after nouns ending in -ay, -ey,-oy, -uy:** rays, keys, toys, guys.
4. **In nouns ending in a consonant letter+-y, replace the final-y with 'ies':** countries, cities, ladies, babies.
5. **In nouns ending in-fe, replace the letters with-ves:** knives, lives, wives.

Irregular forms: There are some nouns for which you cannot find the plural forms by following the patterns above. You will have to learn the plurals of these nouns through reading or by looking them up in a standard dictionary Look at some plurals that do not follow the usual pattern.

1. **Nouns ending in-f forms plurals:**
   - **With a final -f :** roof/ roofs, chief/ chiefs, proof/ proofs.
   - **With a final -ves in place of the -f :** calf/calves, loaf/loaves, leaf/ leaves.
   - **With either a final-s or a final -ves:** dwarf/ dwarfs or dwarves, hoof / hoofs or hooves, scarf/ scarfs or scarves.
2. **Nouns ending in -o form plurals:**
   - **Always with a final-oes:** potatoes, tomatoes, echoes.
   - **With either a final-oes or-os:** buffaloes/ buffalos.
   - **Always with a final-os:** kilos, radios, videos, photos.
3. **Nouns whose plural forms are formed by adding-en/-ren:** oxen, children
4. **Nouns whose plural forms are formed by changes in letters within the singular form:** foot/feet, mouse/mice, man/men.

TIPS TO REMEMBER

- The following words are countable and are normally used in singular form only. The indefinite article a/an should not be used with them.
- The words such as measles, mumps, ethics, maths, politics, phonetics, rickets, billiards and innings look like plural nouns but give singular meaning. So, they take singular form of verbs.
- Some nouns have the same form whether singular or plural.

Sheep, deer, service, series, species, apparatus.
- The following nouns are always used in the plural form only.

Cattle, scissors, spectacles, electorate, binoculars, crackers, clergy. These are used with plural form of verbs.
- Add's' to the main word in compound noun to make it plural.

Sister-in-law, sister's- in-law
- The possessive case of a compound noun is formed by adding**'s'** to the last word.

Father-in-law's property.
- After the phrases ***one of, some of, each of, either of, neither of, any of, none of,*** a plural form of a noun is used.
- Nouns indicating numerals should be used in singular form.

A dozen eggs/ two dozen oranges.
- After collective noun either a singular or plural form of verb is used.
- An apostrophe and 's' is used with living beings only to show possession.
- When two nouns are connected by **'and'** and are closely related add an apostrophe and **s** to the last noun.
- Collective nouns, such as ***family, majority, audience,*** and ***committee*** are singular when they act in a collective fashion or represent one group. They are plural when the members of the collective body act as individuals. Collective nouns will usually be singular in Sentence Correction sentences.

A majority of the shareholders wants the merger.

This sentence is grammatically correct - but confusing. To determine whether a confusing noun requires a singular or plural verb, it might be helpful to visualize what's actually going on in the sentence. Is the sentence talking about something that acts as a ***singular entity***? Or is it talking about the individual elements ***within*** that entity?

In the sentence here, there is no indication that the sentence is referring to the ***individuals within*** the majority. The "majority" acts as one - as a singular entity - and therefore requires a singular verb, "wants."

Again, the "flock of birds" is referred to as a singular group - we're not talking about ***each bird's*** direction of flight, but the direction of the flock as a whole - thus it requires the singular verb "is" not the plural verb "are".

The team are always fighting amongst themselves.

This is an example of a collective noun that requires a ***plural*** verb. While 'team' is often used as a singular collective noun, in this case, the sentence describes the fighting that occurs ***between the individual members of the team.*** "Team" therefore refers to several ***individual members***, and requires a plural verb, "are," as a result.

The key to these questions is simplicity: recognize the collective noun, visualize what's going on in the sentence, and proceed.

Directions (Q. 1-15): Each question below has a blank, indicating that something has been omitted. Choose the word from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.

1. The work increases our ___ about how the body fights disease.
   1) knowledge 2) knowledges
   3) knowledgably 4) acknowledge
   5) knowledgeable
2. They are doing some fascinating _________ into the language of dolphins.
   1) Researches 2) researcher
   3) research 4) re searches
   5) re search
3. In our family, we share the ______ between us.
   1) Houseworks 2) housework
   3) houses works 4) house works
   5) house working
4. The first task is to clean up the _____ left behind by the factories.
   1) Pollutions 2) pollution
   3) polluting 4) pollute
   5) polite
5. They are suffering from _____ lack of medical supplies.
   1) a serious 2) serious
   3) seriously 4) seriousness
   5) series
6. He's starting to get a few grey _____ now.
   1) Hair 2) heirs 3) heir
   4) hairs 5) hairy
7. Would you like some more ___ on your plate?
   1) Cauliflower 2) cauliflowers
   3) the cauliflowers
   4) a cauliflowers
   5) an cauliflowers
8. The doctor said that she was making _____ and she would probably be out of hospital by next week.
   1) a good progress
   2) good progress
   3) good progresses
   4) better progress
   5) good progressing
9. The book has ______ at the end of every chapter.
   1) Exercises 2) exercise
   3) excess 4) exceed
   5) execute
10. Do you want any help in bringing your ______ from the van?
    1) stuffs 2) stuff 3) stuffing
    4) stuffy 5) stuffed
11. _____ was the ideal punishment for her.
    1) A prison 2) Prison 3) prisons
    4) the prisons 5) an prison
12. Emily ate six _____ and two eggs for breakfast.
    1) bacons 2) rashers of bacon
    3) bacon 4) rash of bacon 5) bake
13. Is there _____ for all of us to fit in?
    1) a room 2) rooms 3) room
    4) the room 5) room's
14. They think she put _____ on their family.
    1) a curse 2) curse 3) cursory
    4) curses 5) an curse
15. Their offices have small upholstered _____ and comfortable chairs.
    1) sofa 2) sofa's 3) sofas
    4) an sofa 5) the sofas

Key

1) 1	2) 3	3) 2	4) 2
5) 1	6) 4	7) 1	8) 2
9) 1	10) 2	11) 2	12) 1
13) 3	14) 1	15) 3	